


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 306

శుక్రవారం 27-1-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

యువర్స్

● టెక్..టాక్

ఇన్‌స్టాలో క్వైట్‌మోడ్



ఇన్‌స్టాగ్రామ్ 'క్వైట్‌మోడ్' పేరుతో కొత్త ఫీచర్‌ను తీసుకువచ్చింది. నోటిఫికేషన్స్ ఆపి, ప్రొఫైల్ యాక్టివిటీని క్వైట్ మోడ్‌లో పెట్టే ఫీచర్ ఇది. క్వైట్ మోడ్‌లో ఉన్నప్పుడు ఎవరైనా మెసేజ్ పంపితే 'క్వైట్ మోడ్' అంటూ ఆటోమెటిక్‌గా రిప్లై ఇస్తుంది. టీనేజర్‌లను దృష్టిలో పెట్టుకొని తీసుకు వచ్చిన ఫీచర్ ఇది. చదువుకునేటప్పుడు, డిస్ట్రెన్స్ లేకుండా ఉండడానికి, సోషల్ మీడియా నుంచి కాస్త బ్రేక్ తీసుకోవడానికి ఉపకరించే ఫీచర్ ఇది.

వాట్సాప్‌లో గ్రూప్ అడ్మిన్స్ కోసం...



ఇన్‌స్టంట్ మెసేజింగ్ యాప్ వాట్సాప్ గ్రూప్ అడ్మిన్స్ కోసం న్యూ షార్ట్‌కట్స్ ఫీచర్(ఫర్ ఐవోఎస్) తీసుకువచ్చింది. టైమ్ వృథా కాకుండా గ్రూప్ సభ్యులతో సింపుల్‌గా ఇంటరాక్ట్ కావడానికి అడ్మిన్స్‌కు ఉపయోగపడే ఫీచర్ ఇది. దీని కోసం...

1. వాట్సాప్‌లో చాట్ సెలెక్ట్ చేసుకోవాలి 2. వ్యక్తి పేరు-క్లిక్
3. ఆడియో, వీడియో అండ్ పేమెంట్ ఆప్షన్‌లతో కొత్త 'సెర్చ్' ఆప్షన్ కనిపిస్తుంది.
4. సెర్చ్ ఆప్షన్-క్లిక్ 5. కీబోర్డ్‌కు పైన ఉన్న ఐకాన్‌ను క్లిక్ చేసి నిర్దిష్టమైన తేదీ, నెల, సంవత్సరం సెర్చ్ చేయండి.

నూబియ రెడ్ మ్యాజిక్ 8 ప్రో



డిస్‌ప్లే: 6.80 అంగుళాలు
రిజల్యూషన్: 1116×2480 పిక్సెల్స్
మోమోరీ: 128జీబి 8జీబి
ర్యామ్: 256జీబి 8జీబి
256జీబి 12జీబి ర్యామ్
వోఎస్: ఆండ్రాయిడ్ 13
బ్యాటరీ: 6000 ఎంఏహెచ్
● ఫింగర్ ప్రింట్ రీడర్ ● స్టీరియో స్పీకర్స్

పవర్ బ్యాంక్



డ్యూయల్ యుఎస్‌బీ 20000 ఎంఏహెచ్‌తో కూడిన పవర్‌బ్యాంక్ ఇది.
బ్రాండ్: సిస్క మోడల్: సిస్క పి2066
● డిజిటల్ ఎల్‌ఈడి డిస్‌ప్లే
● ట్రాన్స్‌పరెంట్ డిజైన్
● కనెక్టర్: యుఎస్‌బీ కలర్: బ్లూ ధర: ₹ 2,799

● సక్సెస్ స్టోరీ



ప్రణీత్ షిలిమ్కర్

తెలిసో తెలియకో చెడు అలవాట్ల బారిన పడతారు కొందరు. పని ఒత్తిడిలాంటి కారణాలతో ఆరోగ్యకరమైన జీవనశైలికి దూరమై అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటారు మరికొందరు. అనారోగ్యకరమైన జీవనశైలి నుంచి బయటికి రావడానికి, చెడు అలవాట్ల కబంధ హస్తాల్లో బందీలుగా ఉన్నవారిని బయటికి తీసుకురావడానికి '37 డేస్ ఛాలెంజ్'తో నడుం కట్టి విజయం సాధించాడు ప్రణీత్ షిలిమ్కర్.

ట్రబుల్ షూటర్



మహారాష్ట్రలోని పుణెకు చెందిన ప్రణీత్ షిమిల్కర్ కాలేజీ రోజుల్లో బాగా బరువు పెరిగాడు. దీంతో రకరకాల వ్యాయామాలు చేసి బరువు తగ్గాడు. ఈ విజయం తనకు కిక్ ఇవ్వడమే కాదు ఫిట్‌నెస్ ప్రేమికుడిగా మార్చేసింది. ఫిట్‌నెస్ క్లాస్‌లకు హాజరు కావడం మొదలుపెట్టాడు. రకరకాల ఫిట్‌నెస్ కోర్సులు చేశాడు. పర్సనల్ ట్రైనర్, న్యూట్రీషనిస్ట్‌గా పట్టా పొందాడు.

24 సంవత్సరాల వయసులో పుణెలో సొంతంగా జిమ్ ఏర్పాటు చేయడంతో పాటు 'ఫిట్‌నెస్ టాక్స్' పేరుతో ఆన్‌లైన్-కన్సల్టెన్సీ సంస్థను ప్రారంభించాడు. '37 డేస్ ఛాలెంజ్'తో ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నాడు.

చెడు అలవాట్ల బారిన పడి ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్న వారిని, అధిక బరువుతో బాధపడుతున్న వారిని 'ఒక్కసారి ట్రై చేసి చూడండి' అని పిలుపు ఇచ్చాడు.

పెద్దగా నమ్మకం లేకపోయినా 'ప్రయత్నించి చూద్దాం' అంటూ చాలామంది ఈ ఛాలెంజ్‌లో భాగం అయ్యారు. సక్సెస్ కూడా అయ్యారు. ఒక దీక్షలాగా 37 రోజులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, తగిన వ్యాయామాలు చేస్తూ, సరియైన పోషకాహారం తీసుకోవాల్సి ఉంటుంది.

'రకరకాల చెడు అలవాట్లకు దూరంగా ఉండడం లేదా అనారోగ్యకరమైన జీవనశైలిని రోజుల వ్యవధిలో మార్చుకోవడం అనేది అంత తేలికైన విషయం కాదు. సహనం, సంకల్పబలం ఉంటే అదేమీ అసాధ్యం కాదని 37 డేస్ ఛాలెంజ్ నిరూపించింది. బాడీట్రాన్స్‌ఫర్మేషన్ జరగాలంటే లైఫ్‌స్టైల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ముఖ్యం' అంటున్నాడు ప్రణీత్.

కోవిడ్ సంక్షోభసమయంలో ప్రణీత్ అతని బృందం ఎంతోమందిని ఆరోగ్యకరమైన జీవనశైలి వైపు నడిపించారు. రోగనిరోధకశక్తి పెరగడానికి ఏంచేయాలో 'ఫిట్‌నెస్ టాక్స్' ద్వారా ప్రచారం చేశాడు.

జిమ్‌లో పొరపాటున కూడా ఎప్పుడూ అడుగుపెట్టని వారిలో, జిమ్‌కు వెళ్లాలనుకొని వెళ్లకుండా బద్ధకించేవారిలో మార్పు తీసురావడంలో సక్సెస్ అయ్యాడు ప్రణీత్.

పుణె, ముంబైలతో సహా ఎన్నో నగరాలలో ఫిట్‌నెస్‌కు సంబంధించి స్ఫూర్తిదాయకమైన ఉపన్యాసాలు ఇచ్చాడు. ప్రణీత్ ఇన్‌స్టాగ్రామ్ పేజీలో ఫిట్‌నెస్ ప్రాముఖ్యత గురించి చెప్పే ఎన్నో రీల్స్ కనిపిస్తాయి.

'నా కెరీర్ విషయంలో ఎలాంటి గందరగోళం లేకుండా స్పష్టంగా ఉన్నాను. ఫిట్‌నెస్ రంగానికి మంచి భవిష్యత్ ఉందనేది కాదనలేని వాస్తవం. చాలామంది ఆరోగ్యకరమైన జీవనశైలికి దూరంగా ఉంటున్నారు. దీని వల్ల భవిష్యత్‌లో అనేక అనారోగ్య సమస్యలు ఎదుర్కోవలసి ఉంటుంది. మన ఆరోగ్యంపై ఎంత టైమ్ వెచ్చిస్తున్నామనేదానిపైనే మంచి భవిష్యత్ ఆధారపడి ఉంటుంది' అంటున్న ప్రణీత్ హెల్త్ అండ్ ఫిట్‌నెస్ ఎంటర్‌ప్రెన్యూర్, డిజిటల్ కంటెంట్ క్రియేటర్, ఆన్‌లైన్ కన్సల్టెంట్ ప్లాట్‌ఫామ్ 'ఫిట్‌నెస్ టాక్స్' ఫౌండర్, సెలబ్రిటీ ఫిట్‌నెస్ కోచ్‌గా చిన్న వయసులోనే పెద్ద పేరు సొంతం చేసుకున్నాడు.

నిరంతర శక్తి కోసం...

ఫిట్‌నెస్ ప్రేమికులతో మాట్లాడడం. వారి నుంచి నేర్చుకోవడం, నాకు తెలిసింది వారితో పంచుకోవడం అంటే ఇష్టం. ఫిట్‌నెస్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి. ప్రతి ఒక్కరూ ఫిట్‌నెస్ ప్రేమికులుగా మారాలి. ఆరోగ్యం బాగుంటేనే, ఆలోచనలు బాగుంటాయి. జీవితం పట్ల సానుకూలత మనకు నిరంతర శక్తిని అందించి ఎన్నో విజయాలు సాధించడానికి కారణం అవుతుంది.
- ప్రణీత్ షిలిమ్కర్




● ఇంగ్లిష్ ఇడియమ్స్

అహో గ్రేట్ స్కాట్!

ఆశ్చర్యం, అద్భుతం, అమోఘం అనిపించే సందర్భాలలో ఉపయోగించే ఎక్స్‌ప్రెషన్ గ్రేట్‌స్కాట్.
ఉదా: సైంటిస్ట్స్ హ్యావ్ డిస్కవర్డ్ వాటర్ ఆన్ మార్స్. గ్రేట్ స్కాట్!
గ్రేట్ స్కాట్‌కు మూలం... 'గ్రేట్ గాడ్' అనే మాట.
స్కాట్ పేరుతో చాలామంది ప్రసిద్ధులు ఉన్నారు. **ఉదా:** స్కాటిష్ రచయిత సర్‌వాల్టర్ స్కాట్, యూఎస్ ఆర్మీకి కమాండింగ్ జనరల్‌గా పనిచేసిన విన్‌ఫీల్డ్ స్కాట్... ఇలాంటి వారి పేర్లకు ముడిపెడుతూ 'గ్రేట్ స్కాట్' అనే వారు. అయితే ఆ తరువాత కాలంలో పేరుతో నిమిత్తం లేకుండా 'ఆహా' అనిపించే సందర్భంలో 'గ్రేట్ స్కాట్'ను ఉపయోగించడం మామూలైపోయింది.

● బ్రెయిన్ జిమ్

ఫటాఫట్ ధనాధన్



వృత్తాలలో 1–9 మధ్య అంకెలను మాత్రమే పూరించాలి. ఈ త్రిభుజంలో ఏ వైపు కూడిన '20' రావాలి.



● గేమింగ్: నేడే విడుదల



26వ శతాబ్దంలో ఏం జరిగిందో తెలుసా!

ఈరోజు విడుదల అవుతున్న సర్వైవల్ హారర్ గేమ్...డెత్‌స్పేస్. డెత్‌స్పేస్ సిరీస్(2013)లో భాగంగా వస్తున్న రీమేక్ గేమ్ ఇది. కొత్త గేమ్‌లో కూడా బేసిక్ ప్లాట్ ఒకటే. 26వ శతాబ్దంలో జరిగే ఈ కథలో ఐజాక్ క్లార్కె కథానాయకుడు. గత ఆటలతో పోల్చితే ఈ ఆటలో 'అడిషనల్ బ్యూటీ' ఆకట్టుకుంటుంది అంటున్నారు మేకర్స్. ఈసారి విశేషం ఏమిటంటే ఐజాక్ క్లార్కెకు వాయిస్ ఉండడం. ఒరిజినల్ గేమ్‌లో వాయిస్ ఉండదు. లీడ్ క్యారెక్టర్ ఐజాక్ క్లార్కెతో జర్నీ రీస్టార్ట్ చేయాలంటే ఈ గేమ్‌ను ఎంచుకోవచ్చు.
జానర్: సర్వైవల్ హారర్
మోడ్స్: సింగిల్ మోడ్
ప్లేస్టేషన్ 5, విండోస్,
ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్

పూబాల 'వర్ణ'మాల

● యంగ్ టాలెంట్

పశ్చిమబెంగాల్‌లోని చిన్న పట్టణానికి చెందిన శ్రేయసి రక దాస్ ఫ్యాషన్ డిజైనర్‌గా అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకుంటోంది. శ్రేయసి ఫ్యాషన్ ఇనిస్టిట్యూట్‌లో చదువుకోలేదు. శాంతి నికేతన్‌లో పెరిగిన శ్రేయసి ప్రకృతి నుంచే పాఠాలు, 'వర్ణ'మాల నేర్చుకుంది. ఫ్యాషన్ బ్లాగర్‌గా తన ప్రయాణాన్ని మొదలుపెట్టిన శ్రేయసి ఆ ప్రయాణంలో ఎన్నో విషయాలను నేర్చుకుంది. తన ప్రతిభను మెరుగుపరుచుకుంది. శ్రేయసి క్రియేటివ్ ఐడియాలు పెద్ద బ్రాండ్‌లకు నచ్చి అవకాశం ఇచ్చాయి. ఇక వెనక్కి తిరిగిచూసుకోలేదు.

'ఎస్ఆర్‌డీ' లేబుల్‌తో తానే ఒక బ్రాండ్‌గా ఎదిగింది. కొరియన్ యూట్యూబర్ లునా యోగినితో కలిసి చేసిన ప్రాజెక్ట్‌కు మంచి పేరు వచ్చింది. 'ఎస్ఆర్‌డీ' వింటర్ కలెక్షన్‌కు మార్కెట్‌లో మంచి ఆదరణ దక్కింది.

ఇప్పుడు తన దగ్గర ప్రతిభావంతులైన యువబృందం ఉంది. అందరూ కలిసి కొత్తరకం డిజైన్‌ల గురించి ఎప్పటికప్పుడు చర్చిస్తారు. 'సమ్‌థింగ్ ఫర్ ఎవ్రీ వన్' అనేది ఎస్ఆర్‌డీ అందమైన నినాదం.

'మనల్ని మనం ప్రేమించుకోగలిగినప్పుడు, ఇతరులలోని ప్రతిభను అభినందించగలిగినప్పుడు అసలుసిసలైన అందం మన కంటికి కనిపిస్తుంది. అప్పుడే అందమైన ఐడియాలు వస్తాయి' అంటున్న శ్రేయసికి వ్యాపార ప్రయోజనాలు మాత్రమే ప్రాధాన్యత కాదు. 26 సంవత్సరాల శ్రేయసికి సామాజిక స్పృహతో పాటు పర్యావరణ స్పృహ కూడా ఉంది.



శ్రేయసి



● సందర్భం

సాహస రాణి

సాహసగాథలు వింటే సాహసాలు చేయాలనిపిస్తుంది. సాహసం చేస్తే మరిన్ని సాహసాలు చేయాలనిపిస్తుంది. సాహసం ఏం ఇస్తుంది? 'అంతులేని ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని ఇవ్వడమే కాదు మనమేమిటో మనకు తెలియజేస్తుంది' అంటుంది తులికారాణి. ఎన్నో ప్రసిద్ధ పర్వతాలు అధిరోహించిన ఈ సాహసి సామాజిక స్పృహకు సంబంధించిన కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొంటుంది.



తులికారాణి

జీ-20 బ్రాండ్ అంబాసిడర్‌గా నన్ను నియమించడం గర్వంగా ఉంది. నా బాధ్యతను మరింత పెంచింది. నిర్మాణాత్మక విషయాల గురించి యువతలో ఆసక్తి, అవగాహన కలిగించడానికి ప్రయత్నిస్తాను.
- తులికారాణి

ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం నుంచి మౌంట్ ఎవరెస్ట్ అధిరోహించిన తొలి మహిళగా, ఇరాన్‌లోని మౌంట్ డమవండ్‌ను అధిరోహించిన తొలి భారతీయ మహిళగా గుర్తింపు పొందింది తులికారాణి. మీరట్‌లో చదువుకున్న రాణికి చిన్నప్పటి నుంచి సాహసగాథలు అంటే ఇష్టం. ఆ ఇష్టమే తనకు ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌పై ఆసక్తి కలిగేలా చేసింది.

2005లో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో చేరిన రాణి ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలింగ్ విభాగంలో, ఔట్‌డోర్ ట్రైనింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా పదిసంవత్సరాల పాటు పనిచేసింది.

ఎయిర్‌ఫోర్స్ టీమ్‌లో భాగంగా పర్వతారోహణకు శ్రీకారం చుట్టింది. అప్పుడు మొదలైన ఆసక్తి ఆమెతో ఎన్నో సాహసాలు చేయించింది.

వృత్తం దాటి బయటికి రావాలి

ఎప్పుడూ గిరిగీసుకొని ఉండకూడదు. ఈ విశాల ప్రపంచంలో మనం చేయడానికి ఎంతో ఉంది. చుట్టూ గీసుకున్న వృతాన్ని దాటి బయటి వస్తే అద్భుతప్రపంచం మనకు కనిపిస్తుంది. మనం ఇప్పటి వరకు ఏం చేయలేదు? ఇకముందు ఏం చేయాలి? అనేది అవగాహనకు వస్తుంది. కొత్త శక్తి మనకు చేరువ అవుతుంది.
– తులికారాణి



భారతదేశం, నేపాల్. భూటాన్, ఇరాన్, రష్యా... మొదలైన దేశాల్లో ఇరవైనాలుగు ప్రసిద్ధ పర్వతాలను అధిరోహించింది.

ఝాన్సీ లక్ష్మీభాయి పురస్కారంతో పాటు పదిహేడు అవార్డులు అందుకుంది. వాటిలో 'గ్లోబల్ ఉమెన్' అవార్డ్ కూడా ఒకటి.

'సవాలును స్వీకరించడానికి ధైర్యం మాత్రమే కాదు అంకితభావం, కష్టపడే తత్వం ఉండాలి. ప్రయాణంలో అవహేళనలు ఎదురు కావచ్చు. అయితే ఒక్క విజయం చాలు వాటికి సమాధానం చెప్పడానికి' అంటుంది రాణి.

తొలిసారిగా పర్వతారోహణకు ఉపక్రమించినప్పుడు ప్రోత్సహించే వారి కంటే 'ఎందుకొచ్చిన రిస్క్' అన్నవాళ్లే ఎక్కువ.

కొందరైతే 'అమ్మాయిలు పర్వతారోహణ చేయడం కష్టం' అన్నారు.

విమర్శలకు, అనుమానాలకు, అవహేళనలకు తన విజయాలతోనే గట్టి సమాధానం చెప్పింది రాణి.

పుస్తకాలు చదవడం, తన సాహసయాత్రల గురించి ఆర్టికల్స్ రాయడం, ప్రకృతిని చూస్తూ పరవశిస్తూ భావుకతతో కవిత్వం రాయడం రాణికి ఇష్టం.

వివిధ ప్రాంతాలకు చెందిన, వివిధ సాంస్కృతిక నేపథ్యాలు ఉన్న వ్యక్తులతో మాట్లాడడం అంటే ఇష్టం.

తాజా విషయానికి వస్తే...

తులికారాణిని ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం జీ-20 బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించింది. వారణాసిలో ఆరు, ఆగ్రాలో మూడు, లక్నోలో ఒకటి, గ్రేటర్ నోడియాలో ఒకటి...జీ-20కి సంబంధించిన రకరకాల సమావేశాలు జరుగుతాయి. వీటిలో నలభై దేశాలకు చెందిన సంస్థల ప్రతినిధులు పాల్గొంటారు.

కాలేజీ, యూనివర్శిటీలలో జరిగే కార్యక్రమాల్లో అంబాసిడర్ హోదాలో పాల్గొనది రాణి.

'జీ-20 బ్రాండ్ అంబాసిడర్‌గా నన్ను నియమించడం గర్వంగా ఉంది. నా బాధ్యతను మరింత పెంచింది. నిర్మాణాత్మక విషయాల గురించి యువతలో ఆసక్తి, అవగాహన కలిగించడానికి ప్రయత్నిస్తాను' అంటుంది రాణి.

రాణిలో మంచి వక్త, లోతైన విశ్లేషకురాలు కూడా ఉన్నారు.

అడ్వెంచర్ స్పోర్ట్స్‌లో జెండర్ గ్యాప్, ఇన్ఫర్మేషన్ గ్యాప్ ఎందుకు ఉంది? ఔట్‌డోర్ అడ్వెంచర్ స్పోర్ట్స్‌లో స్త్రీలు అడుగు పెట్టడానికి ఎలాంటి అవరోధాలు ఎదురవుతున్నాయి? వాటికి పరిష్కారం ఏమిటి? పర్వతారోహణకు ఆర్థికబలం అనేది ఎంత ముఖ్యం... మొదలైన విషయాల గురించి రాణి అద్భుతంగా విశ్లేషిస్తుంది.

'సాహసాలే కాదు సమాజసేవ కూడా' అంటున్న తులికారాణికి అభినందనలు తెలియజేద్దాం.

సైబర్ టాక్

డీప్ ఫేక్స్‌తో ఇమేజ్ డ్యామేజ్..

సుధ (పేరుమార్చబడినది) నిద్రలేస్తూనే తన ఫోన్ డేటా ఆన్ చేసింది. వచ్చిన నోటిఫికేషన్స్‌లో ఓ వీడియో పోస్ట్ చేసి షాక్ అయ్యింది. అది తనకు సంబంధించిన వీడియోనే. తన క్లాస్‌మేట్ ఐడీ లో 'నా క్లాస్‌మేట్ సుధ నాకు ప్రపోజ్ చేసిందోచ్' అని ఉన్న ట్యాగ్ లైన్ ఉంది. ఆ వీడియో కింద ఎన్నో కామెంట్స్. తను చెప్పని విషయాన్ని ఇలా ఎలా సృష్టించారో తెలియక, అమ్మానాన్నలకు, ఇతరులకు సమాధానం చెప్పలేక తీవ్ర మానసిక క్షోభను అనుభవించింది సుధ. ఆ తర్వాత జరిగిన పరిణామాలతో ఆమె కొన్నాళ్ల వరకు కోలుకోలేకపోయింది. నిజమేంటో తెలిసినా తన ఇమేజ్ దెబ్బతినడంతో చాలా బాధను అనుభవించింది.

డిజిటల్ మీడియాలో పోస్ట్ చేసిన మన ఫొటోని, వాయిస్ క్లిప్పింగ్‌ను దొంగిలించి వాటిని కన్వర్ట్ చేయడం, చిన్న చిన్న వీడియో క్లిప్పింగ్‌లను తయారు చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడమనేది ఇటీవల జరుగుతోంది. 'ఇది నా వీడియో కాదు' అని ఎంత మొత్తుకున్నా ఎవరూ నమ్మరు. నమ్మలేని విధంగా ఉంటుంది అది. ఒకవేళ ఎలాగోలా తిప్పలుపడి అది తప్పుడుది అని రుజువు చేసుకున్నా, అప్పటికి జరగవలసిన డ్యామేజీ ఎలాగూ జరిగిపోతుంది. ఈ సమస్య రాజకీయ రంగంలో ఉన్నవారికి ఎక్కువగా ఎదురవుతుంటే, సెలబ్రిటీ స్థాయి వ్యక్తులనుంచి సామాన్యుల వరకు ఎదుర్కొంటున్నారు.

నకిలీలతో జాగ్రత్త..

డీప్ ఫేక్ అనేది ఒక రకమైన కృత్రిమ మేధస్సు ఆధారిత సాంకేతికత. ఇది అత్యంత వాస్తవిక డిజిటల్ ఫోర్జరీలను రూపొందిస్తుంది. దీనిలో ఒక వ్యక్తి ముఖం లేదా వాయిస్ మరొకరితో భర్తీ చేయబడుతుంది. ఈ సాంకేతికత నిజమైన వ్యక్తులు చేస్తున్న లేదా వారు ఎప్పుడూ చేయని విషయాలను చెప్పే వీడియోలను రూపొందించడానికి ఉపయోగించవచ్చు. డీప్‌ఫేక్‌ల వల్ల ఆందోళన ఎందుకంటే అవి తప్పుడు సమాచారం, ప్రచారాన్ని వ్యాప్తి చేయడానికి, వ్యక్తులను వేధించడానికి లేదా బ్లాక్‌మెయిల్ చేయడానికి ఉపయోగించబడతాయి. ఆన్‌లైన్ మీమ్స్, సోషల్ మీడియాలోని ఇతర డీప్‌ఫేక్ అప్లికేషన్‌లు మంచికీ, చెడుకు ఉపయోగించవచ్చు. మన డేటా అంతా తీసుకొని, తమ ఇష్టానుసారం వాడచ్చు.

మోసాలివి...

సోషల్ ఇంజినీరింగ్ నేరాలలో డీప్‌ఫేక్‌లను ఒక సాధనంగా ఉపయోగించవచ్చు. దీనిలో దాడి చేసేవారు వ్యక్తులను తారుమారు చేయడం, మోసం చేయడం ద్వారా సున్నితమైన సమాచారాన్ని బహిర్గతం చేస్తారు.

- సోషల్ ఇంజినీరింగ్‌లో డీప్‌ఫేక్‌లను ఎలా ఉపయోగించ వచ్చనేదానికి ఒక ఉదాహరణ .. ఓ ఉన్నత స్థాయి ఎగ్జిక్యూటివ్ లేదా అధికారి వీడియోని సృష్టించి, ఆఫీసుకు సంబంధించిన సమాచారం కోసం అడగడం లేదా నిధుల బదిలీని అభ్యర్థించడం వంటివి చేయచ్చు. అదే వీడియోని ఇతర వ్యక్తులకు పంపవచ్చు. దీంతో వారు ఆ వీడియో నకిలీదని కనుక్కోలేరు.
- మరొక ఉదాహరణ .. ఒక స్నేహితుడు లేదా కుటుంబ సభ్యుడు డబ్బు లేదా ఇతర ఆర్థిక సహాయం కోసం అడిగే నకిలీ వీడియోను సృష్టించవచ్చు.
- దాడులకు పాల్పడే వ్యక్తులు కూడా ఈ తరహా వీడియోలను సృష్టించవచ్చు. దాడి చేసే వ్యక్తి ఒక ప్రముఖ వ్యక్తి లేదా పబ్లిక్ ఫిగర్ నకిలీ వీడియో లేదా ఆడియోను సృష్టించి, ఆ వ్యక్తి వలె నటించి, సున్నితమైన సమాచారం పొందేందుకు ఉపయోగించవచ్చు.

నకిలీని తనిఖీ చేసే విధానం..

డీప్‌ఫేక్‌లను తనిఖీ చేయడం సవాలుగా ఉంటుంది. ఎందుకంటే వాటిని రూపొందించడానికి ఉపయోగించే సాంకేతికత నిరంతరం అభివృద్ధి చెందుతోంది. అయితే, వీడియో ప్రామాణికతను ధ్రువీకరించడంలో సహాయపడటానికి అనేక దశలు ఉన్నాయి.

- మూలాన్ని తనిఖీ చేయడం
- అదే వీడియో లేదా కథనంపై చెప్పే ఇతర మూలాధారాల కోసం వెతికి, సమాచారాన్ని సరిపోల్చుకోండి.
- వీడియోలో అసహజ కదలికలు లేదా వ్యక్తీకరణలు, సరిపోలని ఆడియో లేదా లైటింగ్ లేదా షాడోలలో తేడాలు వంటి ఏవైనా లోపాలు ఉన్నాయా అని చెక్ చేయండి.
- డీప్‌ఫేక్‌లను గుర్తించగల ప్రత్యేక సాఫ్ట్‌వేర్ 'డీప్‌ఫేక్ డిటెక్షన్ మోడల్' వంటి వీడియోలను విశ్లేషించే సంకేతాలను గుర్తించగల సాధనాలు అందుబాటులో ఉన్నాయి.
- వీడియో తీసిన సందర్భాన్ని, అది సృష్టించిన పరిస్థితులను పరిగణించండి. వీడియోలోని సంఘటనలు నమ్మదగినవేనా అనేది తెలుసుకోండి.
- వీలయితే వీడియోలో ఉన్న ఆ వ్యక్తిని సంప్రదించి, అది నిజమో కాదో ధ్రువీకరించడానికి ప్రయత్నించండి.

డీప్‌ఫేక్‌లను ఇటీవల గుర్తించడం కష్టమవుతోందని గమనించాలి. ఏదైనా వీడియో నిజమని అంగీకరించే ముందు సందేహాలను నివృత్తి చేసుకోవడం ఉత్తమం. ఈ డీప్‌ఫేక్ టెక్నాలజీ సామాన్యులకు అందుబాటులో ఉండకూడదు. చట్ట, న్యాయ పరిధిలో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. అలాగే, డిజిటల్ సిగ్నేచర్ ఉంటేనే నమ్మాలి.




ప్రతీకాత్మక చిత్రం

రక్షణ చర్యలివి..

ఈ సోషల్ ఇంజినీరింగ్ దాడుల నుంచి మిమ్మల్ని మీరు లేదా మీ సంస్థను రక్షించుకోవడానికి చర్యలు తీసుకోవడం చాలా ముఖ్యం. సమాచారం లేదా డబ్బు కోసం అపరిచిత ఫ్రెండ్ రిక్వెస్ట్‌లను అనుమానించడం, రిక్వెస్ట్ చేస్తున్న వ్యక్తి గుర్తింపును సంబంధిత అధికారులకు చేరవేయడం ముందస్తుగా తీసుకోదగిన జాగ్రత్తలు.



ఇన్‌పుట్స్: అనిల్ రాచమల్ల,
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్


'ప్రాజెక్టులు పూర్తి చేసి శాశ్వత వనరుల ద్వారా రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 306

శుక్రవారం 27-1-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



టి20ల్లో అమీతుమీకి 'సై'!

రాంచీలో నేడు భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య తొలి మ్యాచ్. -12లో



'హల్వా'తో బడ్జెట్ ముద్రణ షురూ

2022లో 'కరోనా' బ్రేక్ తర్వాత తిరిగి ప్రారంభం - 13లో



అప్పట్లో రోజుకు 19 గంటలే!

అప్పట్లో భూ భ్రమణానికి, అంటే తన చుట్టు తాను ఒకసారి తిరిగేందుకు 19 గంటలు మాత్రమే పట్టేదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

- వివరాలు 6లో▶



నాసికా టీకా 'ఇన్‌కొవాక్' విడుదల

కోవిడ్-19 నియంత్రణ కోసం భారత్ బయోటెక్ అభివృద్ధి చేసిన నాసికా టీకా 'ఇన్‌కొవాక్'ను కేంద్రం విడుదల చేసింది.

- వివరాలు 6లో▶



మానవసహిత గగన్‌యాన్..

2024 చివరికల్లా మానవసహిత గగన్‌యాన్ ప్రయోగం నిర్వహిస్తామని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ ప్రకటించారు.

- వివరాలు 6లో▶



ట్రంప్ ఖాతా పునరుద్ధరిస్తాం..

అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్ ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలను పునరుద్ధరించనున్నట్లు మెటా సంస్థ ప్రకటించింది.

- వివరాలు 6లో▶

న్యూస్‌రీల్

సీఎం కేసీఆర్‌కు దేశంలో ఉండే అర్హత లేదు



రాజ్యాంగాన్ని, కోర్టులను అవమానిస్తున్న సీఎం కేసీఆర్‌కు దేశంలో ఉండే అర్హత లేదని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. కోర్టు ఆదేశాలిచ్చినా పరేడ్‌గ్రౌండ్స్‌లో గణతంత్ర దినోత్సవాన్ని నిర్వహించకపోవడం శోచనీయమన్నారు.

- వివరాలు 2లో▶


బాసరలో ఘనంగా వసంత పంచమి వేడుకలు



నిర్మల్ జిల్లా బాసరలో జ్ఞాన సరస్వతి అమ్మవారి జన్మదిన వేడుకలను వైభవంగా నిర్వహించారు. మాఘశుద్ధ పంచమి రోజున సరస్వతీక్షేత్రంలో వసంత పంచమి జరుపుకున్నారు.

- వివరాలు 14లో▶

మెప్పించి.. ఒప్పించేలా!



మాస్టర్‌ప్లాన్‌ల విషయంలో ప్రజలకు ఆమోదయోగ్యమైన ప్రతిపాదనలతో ముందుకు వెళ్లాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తోంది. వేగంగా విస్తరిస్తున్న నగరాలు, పట్టణాలకు అనుగుణంగా వాటి అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్‌లు కీలకంగా మారాయి.

- వివరాలు 2లో▶

మనిషిలాంటి మాటకారి



తెరపైకి సరికొత్త కృత్రిమ మేధ సాఫ్ట్‌వేర్ వచ్చింది.. కథల నుంచి కంప్యూటర్ ప్రోగ్రాముల దాకా రాసే సామర్థ్యం దీని సొంతం. ప్రశ్నకు తగినట్టుగా అవసరమైన డేటా మాత్రమే ఇచ్చేలా రూపకల్పన చేసిన 'మాటకారి'పై ప్రత్యేక కథనం.

- వివరాలు 14లో▶

ఇదండీ సంగతి



మనం అధికారంలోకి రావడానికి మద్దతిచ్చే పార్టీల్లో ఒక పార్టీ చేయిచ్చింది సార్!

గురువారం ఢిల్లీ కర్తవ్యపథ్‌లో జరిగిన గణతంత్ర వేడుకల పరేడ్‌లో భారత ఆయుధ సంపత్తిని ప్రదర్శిస్తున్న దృశ్యం



మన ఘన శక్తి



గురువారం ఢిల్లీలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ

ఘనంగా 74వ గణతంత్ర వేడుకలు

'ఆత్మనిర్భరత' చాటిన ఆయుధ పాటవం

- దేశీ శతఘ్నులతో 21 గన్ సెల్యూట్
- తొలిసారిగా మహిళా దళాల పరేడ్
- జాతీయ పతాకం ఎగురవేసిన రాష్ట్రపతి
- ఈజిప్ట్ సైనిక దళాలకు అవకాశం
- ముఖ్యఅతిథిగా ఈజిప్ట్ అధ్యక్షుడు

- వివరాలు 6లో▶




గురువారం రాజ్‌భవన్‌లో పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న గవర్నర్ తమిళిసై

కేవలం భవనాల నిర్మాణమే అభివృద్ధి కాదు...

ముఖ్యమంత్రి కేసీఆర్‌పై గవర్నర్ తమిళిసై పరోక్ష విమర్శలు

- జాతి నిర్మాణమే నిజమైన అభివృద్ధి
- కొందరే ఫామ్‌హౌస్‌లు కలిగి ఉండరాదు!
- రైతులు, అణగారిన ప్రజలందరూ పొలాలు, గృహాలు (ఫామ్ అండ్ హౌసెస్) కలిగి ఉండాలి
- కేవలం నా పిల్లల్ని చదువుల కోసం విదేశాలకు పంపిస్తామనుకోవడం అభివృద్ధి కాదు
- రాష్ట్రంలో ఆందోళనకర పరిస్థితులు.. రోజుకు 22 ఆత్మహత్యలు జరుగుతున్నాయి
- కొంతమందికి నేను నచ్చకపోయినా ప్రజల కోసం కష్టపడి పనిచేస్తున్నా..
- గణతంత్ర దినోత్సవ ప్రసంగంలో గవర్నర్

సాక్షి, హైదరాబాద్: 'కొత్త భవనాల నిర్మాణం అభివృద్ధి కాదు. జాతి నిర్మాణమే నిజమైన అభివృద్ధి. రైతులు, అణగారిన వర్గాల ప్రజలందరూ పొలాలు, గృహాలు (ఫామ్ అండ్ హౌసెస్) కలిగి ఉండాలి. కొందరే ఫామ్ హౌస్‌లను కలిగి ఉండరాదు. అది అభివృద్ధి కాదు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ సమాన వాటాను కలిగి ఉండాలి. ప్రపంచస్థాయి సదుపాయాలు కలిగిన యూనివర్సిటీలో నా పిల్లలు చదువుకోవాలి అనుకోవడం అభివృద్ధి. నా పిల్లలను మాత్రమే చదువుల కోసం విదేశాలకు పంపాలనుకోవడం అభివృద్ధి కాదు..' అని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్.. ముఖ్యమంత్రి కేసీఆర్, మిగతా 2వ పేజీలో ▶

ప్రభుత్వంపై ప్రధానికి ఫిర్యాదు చేశా: తమిళిసై 2లో



గురువారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్స్‌లో అమరవీరుల స్మారక స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం..

- గవర్నర్ వ్యాఖ్యలపై బీఆర్‌ఎస్ నేతల ఆగ్రహం
- వ్యవసాయం తెలియని వారికి ఫామ్‌హౌస్‌ల ప్రాముఖ్యత ఎలా తెలుస్తుంది?
- కొందరు కళ్లుండీ చూడలేని కబోదుల్లా మాట్లాడుతున్నారు మండలి చైర్మన్ గుత్తా మండిపాటు

రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తాం
మంత్రి తలసాని

- 2లో

టీచర్ల బదిలీలకు రేపట్నుంచి దరఖాస్తులు

నేడు ఖాళీలు, సీనియారిటీ జాబితా



- టీచర్ల ఎదురుచూపులకు ఎట్టకేలకు తెరపడనుంది. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ శనివారం నుంచి మొదలుకానుంది.

ఈ ప్రక్రియ మార్చి 4 వరకు కొనసాగనుంది. అధికారులు శుక్రవారం ఖాళీలు, సీనియారిటీ జాబితాను విడుదల చేయనున్నారు. ఈ మేరకు గురువారం పాఠశాల విద్య డైరెక్టర్ దేవసేన ఉత్తర్వులు జారీచేశారు.

- వివరాలు 14లో▶

స్పౌజ్ టీచర్లకు ఓకే..

- జీవో 317 అమలులో భాగంగా వేర్వేరు ప్రాంతాలకు బదిలీ అయిన భార్యాభర్తల(స్పౌజ్)ను ఒకేచోటుకు చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

- వివరాలు 14లో▶

ఈటలకు ఆ విషయం ఆలస్యంగా అర్థమైంది



- బీజేపీలో కూడా కేసీఆర్ కోవర్టులు ఉన్నారనే విషయం తెలిసి వచ్చింది
- పొంగులేటితో భట్టి మాట్లాడుతున్నారు
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎన్నికల్లో పోటీ వయసును తగ్గిస్తాం
- మీడియాతో చిట్‌చాట్‌లో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

10లో

కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం: రేవంత్

- వికారాబాద్ జిల్లాలో హాథ్ సే హాథ్ జోడో ప్రారంభం

నిద్రకూ ఒక లెక్కుంది!

- 18-60 ఏళ్ల మధ్యవారికి కనీసం 7 గంటల నిద్ర అవసరం - 5లో

క్లుప్తంగా...

ఎమ్మెల్సీపై చర్యకు డిమాండ్



సాక్షి, హైదరాబాద్: గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్‌పై బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ చేసిన అనుచిత వ్యాఖ్యలను బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఖండించారు. రాజకీయాల్లో ఓనమాలు తెలియని ఎమ్మెల్సీ గవర్నర్‌పై నోటికొచ్చిన కూతలు కూయడం.. బీఆర్‌ఎస్ నేతల అహంకారానికి నిదర్శనమని ఒక ప్రకటనలో మండిపడ్డారు. మహిళ అనే గౌరవం లేకుండా అవమానకర వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీని వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

సీఎం కేసీఆర్‌కు దేశంలో ఉండే అర్హత లేదు: సంజయ్



సాక్షి, హైదరాబాద్: రాజ్యాంగాన్ని, కోర్టులను అవమానిస్తున్న ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు దేశంలో ఉండే అర్హత లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ మండిపడ్డారు. బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతి, వర్ధంతులకు కూడా సీఎం కేసీఆర్ ఏనాడూ హాజరైంది లేదని, కోర్టు ఆదేశాలిచ్చినా పరేడ్ గ్రౌండ్స్‌లో గణతంత్ర దినోత్సవాన్ని నిర్వహించకపోవడం ముమ్మాటికీ అంబేడ్కర్‌ను తీవ్రంగా అవమానించడమేనని విమర్శించారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పార్టీ కార్యాలయంలో జాతీయపతాకాన్ని సంజయ్ ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గవర్నర్ తమిళి సైను బీఆర్‌ఎస్ పార్టీ అడుగడుగునా అవమానిస్తోందని, మహిళలకు ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. దేశంలో సగర్వంగా తలెత్తుకునేలా రూపొందించిన అంబేడ్కర్ రాజ్యాంగం కావాలో తలదించుకుని బానిసల్లా బతికే కల్వకుంట్ల రాజ్యాంగం కావాలో ప్రజలు ఆలోచించుకోవాలని కోరారు. భారత్‌ను ప్రపంచంలోనే నంబర్‌వన్‌గా చేసేందుకు ప్రధాని మోదీ కృషి చేస్తుంటే తెలంగాణలో మాత్రం రాజ్యాంగ విరుద్ధ పాలన సాగుతోందని మండిపడ్డారు. ఈ వేడుకల్లో పార్టీనేతలు ఎస్.ఇంద్రసేనారెడ్డి, పొంగులేటి సుధాకర్ రెడ్డి, విజయశాంతి, గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, జి.మనోహర్ రెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, రవీంద్రనాయక్ పాల్గొన్నారు.

గవర్నర్‌కు, ప్రజలకు కేసీఆర్ క్షమాపణ చెప్పాలి: షర్మిల



సాక్షి, హైదరాబాద్: గణతంత్ర వేడుకలను జరపకుండా రాజ్యాంగాన్ని అవమానపరిచిన ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు గవర్నర్‌కు, రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. గురువారం లోటస్‌పాండ్‌లోని పార్టీ కార్యాలయంలో ఆమె జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..రాజ్యాంగాన్ని రూపొందించిన అంబేడ్కర్‌కి, ఆయన నేతృత్వంలో పని చేసిన మేధావులను వైఎస్సార్‌టీపీ స్మరించుకుంటోందన్నారు. రాజ్యాంగాన్ని మార్చాలని అవమానించిన వ్యక్తి సీఎం కేసీఆర్ అని అదే రాజ్యాంగాన్ని అడ్డుపెట్టుకుని తెలంగాణ వాదంతో గద్దెనెక్కి రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. ప్రజలు, ప్రతిపక్షాలు గొంతెత్తితే దాడులు చేయడం, అరెస్టులు చేయడం, అక్రమం కేసులు పెట్టడం వంటి నిరంకుశ చర్యలకు బీఆర్‌ఎస్ సర్కార్ పాల్పడుతోందని మండిపడ్డారు. రిపబ్లిక్ డేను విస్మరించి గవర్నర్‌ని ఇంతగా అవమానపరిచినందుకు తమిళిసైకి షర్మిల సానుభూతిని తెలిపారు.

మెప్పించి.. ఒప్పించేలా!

మాస్టర్‌ప్లాన్‌లపై మళ్లీ అధ్యయనం

- ప్రత్యామ్నాయ ప్రణాళికలతో ముందుకెళ్లేందుకు సర్కారు యోచన
- నగరాలు, పట్టణాలు వేగంగా విస్తరిస్తున్నా ఇంకా కాలం చెల్లిన 'ప్లాన్'లే
- రాష్ట్రవ్యాప్తంగా 91 నగరాలు, పట్టణాలకు కొత్త మాస్టర్‌ప్లాన్‌లు అనివార్యం
- ఈ నేపథ్యంలోనే బృహత్తర ప్రణాళికలపై సర్కారు దృష్టి



కామారెడ్డి ఫైనల్ మాస్టర్‌ప్లాన్

సాక్షిప్రతినిధి, వరంగల్

మాస్టర్ ప్లాన్‌ల విషయంలో ప్రజలకు ఆమోదయోగ్యమైన ప్రతిపాదనలతో ముందుకు వెళ్లాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తోంది. వేగంగా విస్తరిస్తున్న నగరాలు, పట్టణాలకు అనుగుణంగా వాటి అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్‌లు కీలకంగా మారాయి. రాష్ట్రంలోని సుమారు 91 నగరాలు, పట్టణాలకు బృహత్తర ప్రణాళికల రూపకల్పన తక్షణ కర్తవ్యంగా మారింది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న మాస్టర్‌ప్లాన్‌లను కొలిక్కి తేవడంతోపాటు కొత్త మున్సిపాలిటీలలో అమలు చేసే దిశగా చర్యలు చేపడుతోంది. పలు కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీలకు మాస్టర్‌ప్లాన్ -2041 రూపకల్పన జరుగుతుంటే కొన్నిచోట్ల వీటిపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది. భూములు, పంట స్థలాలు కోల్పోతున్నవారు ఆందోళనలకు దిగుతున్నారు. కామారెడ్డి, జగిత్యాలలో పెల్లుబుకిన నిరసనలతో ఆయా మున్సిపాలిటీల పాలకవర్గాలు మాస్టర్‌ప్లాన్‌లను వ్యతిరేకిస్తూ ఏకగ్రీవ తీర్మానాలు చేసి పంపడంతో అవి రద్దయ్యాయి. నిర్మల్‌లో కూడా ఉపసంహరించుకున్నట్లు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మంగళవారం పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఆమోదయోగ్యమైన ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించినట్లు సమాచారం.

ఇప్పటికీ పాతవే.. కొత్తవాటికి కలగని మోక్షం..

రాజధాని హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలోని అతిపెద్ద నగరమైన వరంగల్‌లో 1972 నాటి మాస్టర్‌ప్లానే ఇప్పటికీ అమల్లో ఉండగా, నిజామాబాద్‌కు 1974 నాటి ప్రణాళికే ఉంది. పదికిపైగా మున్సిపాలిటీల్లో 1990 కంటే ముందునాటి మాస్టర్‌ప్లాన్‌లే అమల్లో ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది మార్చి ఆఖరు నాటికి రాష్ట్రంలోని అన్ని కార్పొరేషన్, మున్సిపాలిటీలకు కొత్త మాస్టర్‌ప్లాన్ రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలోని 142 నగర పాలక సంస్థలు, పురపాలక సంస్థలకు గాను 97 తెలంగాణ రాష్ట్ర టౌన్ ప్లానింగ్ విభాగం పరిధిలో ఉన్నాయి. వీటిలో 32 పురపాలికలకు బృహత్తర ప్రణాళిక (మాస్టర్‌ప్లాన్)ల రూపకల్పనకు అనుమతి లభించగా.. ఇందులో ఎనిమిదింటికి ముసాయిదాలను రూపొందించి ప్రభుత్వ ఆమోదానికి పంపించగా పెద్దపల్లి మాస్టర్‌ప్లాన్‌ను మాత్రం ఆమోదించారు. అలాగే పట్టణాభివృద్ధి శాఖ పరిధిలో మరో 45 పురపాలికలు ఉండగా.. మాస్టర్‌ప్లాన్ల రూపకల్పన చేపట్టినా ఆ ప్రక్రియ పూర్తికాలేదు. మొత్తం మీద వీటిల్లో కొత్తగా ఏర్పాటైన 59 మున్సిపాలిటీలకు నాలుగేళ్లు పూర్తయినా అసలు మాస్టర్‌ప్లాన్ రూపకల్పన దిశగా అడుగులే పడలేదు.

ప్రత్యామ్నాయాల పరిశీలన..

మొత్తం మీద మాస్టర్‌ప్లాన్‌లు అవసరమైన 91 నగరాలు, పట్టణాలలో 68 కొత్తవాటికి మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేశారు. మహబూబాబాద్, ఆంథోల్–జోగిపేట, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, సత్తుపల్లి, భూపాలపల్లి, దేవరకొండ మాస్టర్‌ప్లాన్లు ఆమోదం కోసం సిద్ధంగా ఉండగా, మరో 15 ప్రభుత్వ ఆమోదం కోసం పంపించేందుకు కసరత్తు పూర్తయింది. తాజాగా రద్దయిన కామారెడ్డి, జగిత్యాల, నిర్మల్ పట్టణాలకు ప్రత్యామ్నాయ మాస్టర్ ప్లాన్లు రూపొందించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఈ మూడు పట్టణాలతో పాటు, మిగతా వాటికి కొత్తగా రూపొందించే మాస్టర్‌ప్లాన్‌లలో నివాస ప్రాంతం, వాణిజ్య ప్రాంతం, పారిశ్రామిక ప్రాంతం, మిశ్రమ వినియోగం వంటి వాటితో పాటు ప్రభుత్వ వినియోగం, గ్రీన్ కవర్‌లో భాగంగా అడవులు, బఫర్‌జోన్, పర్యావరణ/ప్రత్యేక భూ వినియోగ జోన్, రోడ్లు, రవాణా వ్యవస్థలు.. వాటికి ప్రతిపాదించిన భూమి విస్తీర్ణం, భూ వినియోగ విధానం తదితర అంశాలపై మరోసారి అధ్యయనం నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిసింది.

సీఎం పేషీలో వరంగల్ ఫైల్.. 34 నెలలుగా పెండింగ్..

వరంగల్ మాస్టర్‌ప్లాన్–2041 సర్కారు ఆమోదం కోసం ఎదురుచూస్తోంది. 34 నెలలుగా ముఖ్యమంత్రి పేషీ నుంచి కదలడం లేదని అధికారులే చెబుతున్నారు. ఫలితంగా ఇంకా 50 ఏళ్ల కిందటి ప్లాన్‌నే అమలు చేస్తున్నారు. వాస్తవానికి 2041 వరకు సిటీ అవసరాలకు సరిపోయేలా 2013 లోనే అధికారులు మాస్టర్ ప్లాన్ తయారు చేశారు. దాన్ని 2020 మార్చిలో ఆమోదించిన మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్.. సీఎం ఆమోదం కోసం పంపారు. 10.50 లక్షలకు మించిన జనాభా ఉన్న వరంగల్ స్మార్ట్ సిటీ కావాలన్నా.. కేటీఆర్ హామీ ఇచ్చినట్లు ఫ్యూచర్ సిటీగా డెవలప్ చేయాలన్నా కొత్త మాస్టర్ ప్లాన్ అమలు చేయాల్సిన అవసరం ఉంది.



వరంగల్ 'కుడా' మాస్టర్‌ప్లాన్ నమూనా

సీఎం ఆమోదమే తరువాయి

ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల పర్యవేక్షణలో అన్ని వర్గాలకు ఆమోదయోగ్యంగా ఉండేలా వరంగల్ మాస్టర్‌ప్లాన్‌కు రూపకల్పన జరిగింది. దానికి అనుగుణంగా నగరాభివృద్ధిని దృష్టిలో పెట్టుకునే అనుమతులు ఇస్తారు. మాస్టర్ ప్లాన్ సీఎం పేషీలో పెండింగ్‌లో వుంది. ఆమోదం పొందితేనే పూర్తి స్థాయిలో అమల్లోకి వస్తుంది.

– ఎ.అజిత్‌రెడ్డి, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్, కుడా, వరంగల్



ఓఆర్‌ఆర్‌కు అవతల ఇండస్ట్రియల్ జోన్ ఉండాలి

వరంగల్ మాస్టర్‌ప్లాన్‌లో ఔటర్ రింగ్ రోడ్డు అవతల ఇండస్ట్రియల్ జోన్ నిర్ణయించాలి. రహదారుల కనెక్టివిటీకి అనుగుణంగా అభివృద్ధి ఉండాలి. రెండో పెద్ద నగరం చుట్టూరా భవిష్యత్‌లో ఐటీ, వ్యాపార, వాణిజ్య, ఉపాధి అవకాశాలను మెరుగుపర్చాలి. మాస్టర్‌ప్లాన్‌పై అభ్యంతరాలను ప్రభుత్వం పరిశీలించి, సవరించి వెంటనే ఆమోదించాలి.

– బొమ్మినేని రవీందర్ రెడ్డి, అధ్యక్షుడు, చాంబర్ ఆఫ్ కామర్స్, వరంగల్



మిశ్రమ వినియోగం కింద తీసుకోవాలి

మాస్టర్‌ప్లాన్‌లు ఎక్కడ అమలు చేసినా అన్ని వర్గాలకు ఆమోదయోగ్యంగా ఉండాలి. చాలాచోట్ల రాజకీయ జోక్యంతో విలీన గ్రామాల్లోని వ్యవసాయ భూములను ఇండస్ట్రియల్, గ్రీన్ జోన్‌లోకి తీసుకుంటున్నారు. ప్రతిపాదిత వరంగల్ మాస్టర్ ప్లాన్‌లో రైతులు, ఇతరుల నుంచి 3 వేల ఫిర్యాదులు అందాయి. పంట భూములను మిక్స్‌డ్ ల్యాండ్ యూజ్ (మిశ్రమ భూ వినియోగం)గా తీసుకుంటే వ్యతిరేకత రాదు.

– పుల్లూరి సుధాకర్, అధ్యక్షులు, ఫోరం ఫర్ బెటర్ తెలంగాణ

ప్రధానమంత్రికి ఫిర్యాదు చేశా...

గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వెల్లడి

- ప్రభుత్వం రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతోంది
- కేంద్రాన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణ ప్రభుత్వం అనాగరికంగా వ్యవహరిస్తోంది

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి, హైదరాబాద్: రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి. గణతంత్ర వేడుకల సందర్భంగా గవర్నర్ తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తే.. అందుకు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు కౌంటర్ ఇచ్చారు. గురువారం రాజ్‌భవన్‌లో గణతంత్ర దినోత్సవం సందర్భంగా సీఎం కేసీఆర్‌పై పరోక్షంగా తీవ్ర విమర్శలు చేసిన గవర్నర్... పుదుచ్చేరిలో ఎట్ హోం సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలోనూ మరోసారి తెలంగాణ ప్రభుత్వంపై ఫైర్ అయ్యారు. 'గణతంత్ర దినోత్సవాల నిర్వహణకు కరోనా కారణం అంటూ లేఖ పంపారు. వారు ఖమ్మంలో ఐదు లక్షల మందితో సభ నిర్వహించారు. అప్పుడు కరోనా లేదా..? తెలంగాణలో రాజ్యాంగ, న్యాయ, చట్ట ఉల్లంఘనలు జరుగుతున్నాయి. దీనిపై ప్రధానమంత్రి మోదీకి ఫిర్యాదు చేశాను. రాష్ట్రంలో ఏవిధంగా గవర్నర్‌ను, రాజ్‌భవన్‌ను అవమానిస్తున్నారు.. ప్రొటోకాల్‌ను ఎలా ఉల్లంఘిస్తున్నారు.. కేంద్రాన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఏవిధంగా అనాగరికంగా వ్యవహరిస్తోంది అన్న వివరాలతో కూడిన నివేదికను కేంద్రానికి పంపాను. ప్రతినెలా రాష్ట్రంలో జరిగే కార్యకలాపాలకు సంబంధించి నివేదిక ఇస్తున్నా' అని గవర్నర్ వ్యాఖ్యానించారు. 'గణతంత్ర వేడుకలను అడ్డుకుని భారత చట్టాలను, అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అవమానపరిచేలా తెలంగాణ ప్రభుత్వం వ్యవహరిస్తోంది. చట్టాలను, రాజ్యాంగాన్ని, న్యాయస్థానాలను గౌరవించడం లేదు. రాజ్యాంగ పదవిలో ఉన్న గవర్నర్‌ను అడ్డుకోవడమేంటి? కేంద్రానికి ఇచ్చే నివేదికలో గవర్నర్‌కు ఎవరెవరు (ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు) గౌరవాన్ని ఇవ్వడంలేదనే వివరాలతో పాటు గవర్నర్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న పరిణామాలనూ పేర్కొన్నాను. ఆ అధికారులపై చర్యలు తీసుకునే అధికారం నాకున్నప్పటికీ, వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కేంద్రానికి నివేదిక రూపంలో ఫిర్యాదు చేస్తున్నా. తెలంగాణ ప్రజలు నాపై ఎంతో అభిమానం చూపిస్తున్నారు. వారికి మంచి చేయాలన్న సంకల్పంతో అక్కడి పాలకులు అడ్డుకుంటున్నప్పటికీ ముందుకు సాగుతున్నా. పలు రాష్ట్రాల్లో గవర్నర్ల తీరును విమర్శిస్తున్నారు. తెలంగాణలో గవర్నర్‌కు అవమానం జరుగుతుంటే ఆ ప్రభుత్వ తీరును ఎందుకు ప్రశ్నించడం లేదు. గవర్నర్‌కు ఎందుకు విలువ, గౌరవం ఇవ్వడం లేదో మీరు (విలేకరులు) సీఎం అపాయింట్‌మెంట్ తీసుకుని అడగండి' అని గవర్నర్ వ్యాఖ్యానించారు. తెలంగాణకు, పుదుచ్చేరి ప్రజలకు న్యాయం చేసేలా తన పనితీరు ఉంటుందని అన్నారు.

ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం..

గవర్నర్ వ్యాఖ్యలపై బీఆర్‌ఎస్ నేతల ఆగ్రహం

- వ్యవసాయం తెలియని వారికి ఫామ్‌హౌస్‌ల ప్రాధాన్యం ఎలా తెలుస్తుంది?
- కొందరు కళ్లుండీ చూడలేని కబోదుల్లా మాట్లాడుతున్నారు
- మండలి చైర్మన్ గుత్తా మండిపాటు

గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై చేసిన వ్యాఖ్యలపై పలువురు బీఆర్‌ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గవర్నర్ ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీసేలా మాట్లాడుతున్నారని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు విమర్శించారు. సోషల్ మీడియా వేదికగా కూడా గవర్నర్ తీరును తప్పుపడుతూ బీఆర్‌ఎస్ శ్రేణులు విమర్శనాస్త్రాలు సంధించాయి.

సాక్షి, హైదరాబాద్

రాజ్యాంగబద్ధ పదవిలో ఉండి విమర్శలా?: గుత్తా



రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్న వారు రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడమేంటని గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రశ్నించారు. 'కొందరికి తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు కనపడుతున్నా కళ్లుండీ చూడలేని కబోదుల్లా మాట్లాడుతున్నారు. తెలంగాణ నాయకులు వ్యవసాయ కుటుంబాల నుంచి వచ్చిన వారే. వ్యవసాయం కోసం బావుల వద్ద ఇళ్లు కట్టుకోవడం సహజం. వ్యవసాయం గురించి తెలియని వారికి ఫామ్‌హౌస్‌ల ప్రాముఖ్యత ఎలా తెలుస్తుంది? రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించే ముందు రాష్ట్రానికి మీరేం చేశారో ఆత్మ విమర్శ చేసుకోవాలి. ఒక్క మంచి పని చేశాం అని చెప్పుకునే దమ్ము కేంద్ర ప్రభుత్వానికి లేదు. కేసీఆర్‌కు వస్తున్న జనాదరణ ఓర్వలేని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ఆనంద పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టాలని కొందరు కేంద్ర ప్రముఖులు ప్రయత్నిస్తున్నారు.

రాజ్యాంగం పరిధిలోనే పదవులు వస్తాయి: పోచారం



రాజ్యాంగం, సమాఖ్య స్ఫూర్తితో ప్రభుత్వాలు పనిచేసినప్పుడే అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు సమంగా అందుతాయని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రధాని మొదలుకుని అసెంబ్లీ స్పీకర్ వరకు రాజ్యాంగం పరిధిలోనే పదవులు వస్తాయని పేర్కొన్నారు. 'కొందరి కోసం పనిచేయడం రాజ్యాంగ విరుద్ధం. పాలనలో తన, పర భేదం ఉండకూడదు. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు విమర్శలు మానుకుని పోటీ పడి పనిచేయాలి. ఇటీవలి పరిణామాలు బాధ కలిగిస్తున్నాయి. పేదలు, ధనికుల నడుమ అంతరాలు తగ్గాలి. అందరూ ఆనందంగా ఉంటేనే రాజ్యాంగం నిజంగా అమలైనట్టు..' అని అన్నారు.

అందరి కోసమే మా పోరాటం: ఎమ్మెల్సీ కవిత



కేవలం కొందరి సంపద పెంపుపై మాత్రమే దృష్టి పెట్టకుండా, రైతులు, కూలీలు, నిరుద్యోగులను పట్టించుకోవడం కోసమే పోరాడుతున్నామని ఎమ్మెల్సీ కె.కవిత చెప్పారు. గవర్నర్ వ్యాఖ్యల పట్ల ఆమె ట్విట్టర్ వేదికగా స్పందించారు. ''కరోనా లాంటి క్లిష్ట సమయంలో సెంట్రల్ విస్టా మీద కంటే, దేశ మౌలిక సదుపాయాల మీద దృష్టి పెట్టాలని బీఆర్‌ఎస్ పార్టీ గతంలో కేంద్రాన్ని డిమాండ్ చేసింది. సీఎం కేసీఆర్ ప్రశ్నిస్తున్న వాటినే మళ్లీ అడిగినందుకు గవర్నర్‌కు ధన్యవాదాలు' అని కవిత పేర్కొన్నారు.

రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తాం: తలసాని



రాంగోపాల్‌పేట్: ''బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న గవర్నర్ గణతంత్ర దినోత్సవం రోజు ప్రభుత్వంపై విమర్శలు చేయడం తగదు, ఈ మేరకు గవర్నర్ తమిళిసై పై రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తాం'' మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. గురువారం సికింద్రాబాద్‌లో అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ''రాజ్యాంగం అమలులోకి వచ్చిన రిపబ్లిక్ డే నాడు రాష్ట్ర డీజీపీ, సీఎస్‌ను పక్కన పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శలు చేయడం, ఆమె హోదాను మరచిపోయి మాట్లాడటం బాధాకరం. గవర్నర్ పదవికి డ్యామేజ్ చేసే విధంగా, హోదాను దిగజార్చే విధంగా మాట్లాడారు.. గవర్నర్ ఒక పార్టీ కింద పనిచేసే వారిలా ఉంటే మేం ఊరుకోం '' అని తలసాని వ్యాఖ్యానించారు.

కార్పొరేషన్ల చైర్మన్ల మండిపాటు

రాజ్యాంగం అమల్లోకి వచ్చిన రోజునే గవర్నర్ రాజ్యాంగ విరుద్ధంగా ప్రజాస్వామ్య విలువలను కాలరాసేలా మాట్లాడారని రెడ్కో చైర్మన్ వై.సతీష్‌రెడ్డి విమర్శించారు. 'కొత్త భవనాలు అభివృద్ధి కాదంటూ మాట్లాడుతున్న గవర్నర్ తమిళనాడులో జరుగుతున్న అభివృద్ధిని కూడా వ్యతిరేకిస్తున్నారా? మెడికల్ కాలేజీలు, సెక్రటేరియట్, కలెక్టరేట్ భవనాలు, యాదాద్రి ఆలయం, కాళేశ్వరం ప్రాజెక్టులను గవర్నర్ కోరుకోవడం లేదా?' అని నిలదీశారు. ఫామ్ హౌస్ కలిగి ఉండటమే నేరమైతే 2019లో మంగాడు గ్రామంలో గవర్నర్ ఎందుకు ఫామ్ హౌస్ కొనుగోలు చేశారని టీఎస్‌ఎండీసీ చైర్మన్ మన్నె క్రిశాంక్ ప్రశ్నించారు. సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టడం గవర్నర్‌కు ఇష్టం లేదని తెలంగాణ ఫుడ్స్ కార్పొరేషన్ చైర్మన్ మేడే రాజీవ్‌సాగర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

గవర్నర్ వ్యవస్థ ప్రజాస్వామ్యానికి పట్టిన చీడ

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



సాక్షి, హైదరాబాద్: తమకు ఇష్టం లేని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలను రద్దు చేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి గవర్నర్ వ్యవస్థ ఒక సాధనంగా ఉపయోగపడుతోందని, ఆ వ్యవస్థ ప్రజాస్వామ్య వ్యవస్థకు పట్టిన చీడ పురుగులాంటిదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. గురువారం మగ్దూంభవన్‌లో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పశ్య పద్మతో కలిసి కూనంనేని విలేకరులతో మాట్లాడారు. గవర్నర్ ఆహ్వానించిన 'ఎట్ హోమ్' కార్యక్రమాన్ని తాము బహిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను వామపక్ష పార్టీలు భరించాలని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన తప్పుపట్టారు. తమిళనాడు, కేరళ, పంజాబ్, మహారాష్ట్ర, ఢిల్లీలో ప్రధాన సమస్యలను పక్కదారి పట్టించి గవర్నర్ వ్యవస్థ ద్వారా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చేందుకు కేంద్రంలోని బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు.

కేవలం భవనాల నిర్మాణమే అభివృద్ధి కాదు..

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర ప్రభుత్వంపై పరోక్ష విమర్శలు చేశారు. భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా గురువారం రాజ్‌భవన్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం ఆమె రాష్ట్ర ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్, ప్రగతిభవన్, కొత్త సచివాలయ భవనాల నిర్మాణాలను.. పేదల గృహ, పొలం అవసరాలతో; మంత్రి కేటీఆర్ విదేశీ చదువులను.. రాష్ట్రంలోని విద్యాసంస్థల దుస్థితితో ముడిపెడుతూ గవర్నర్ తన ప్రసంగంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రాథమ్యాలపై పరోక్ష విమర్శలు సంధించారు. 'ఏదైనా ఒక వర్గానికి అన్ని రకాల ప్రయోజనాలు అందడం గానీ, లేక ఏదో ఒక వర్గం పైనే అన్ని రకాల భారాలు పడటం గానీ సరికాదు..'' అని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా గవర్నర్ తమిళిసై తన ప్రసంగంలో ప్రస్తావించడం గమనార్హం. గవర్నర్ ప్రసంగంలోని ముఖ్యాంశాలు ఆమె మాటల్లోనే..

రాష్ట్రంలో సగటున గంటకు ఓ ఆత్మహత్య

భారత దేశాన్ని యంగ్ ఇండియా అంటాం. 2011 జనాభా లెక్కల ప్రకారం 60 శాతానికి పైగా జనాభా యువతే. మన గొప్పలను చెప్పుకునే సమయంలో తెలంగాణలో ఆందోళనకర పరిస్థితులపై సైతం మననం చేసుకోవాలి. జాతీయ గణాంకాల ప్రకారం తెలంగాణలో ప్రతి రోజూ 22 ఆత్మహత్యలు జరుగుతున్నాయి. సగటున ప్రతీ గంటకు ఒక ఆత్మహత్య జరుగుతోంది. ఈ పరిస్థితుల్లో యువత ధైర్యంగా ఉండాలి. సవాళ్లను దృఢంగా ఎదుర్కోవాలి. మీ ఆత్మవిశ్వాసమే మిమ్మల్ని దేశ అత్యున్నత పౌరులుగా తీర్చిదిద్దుతుంది.

కొంతమందికి నేను నచ్చకపోవచ్చు...

లక్షలాది మంది త్యాగధనుల బలిదానాలు, కృషితో దేశం ప్రపంచశక్తిగా ఉద్భవిస్తోంది. జీ–20 సదస్సుకు ఆతిథ్యం ఇచ్చే స్థాయికి ఎదిగింది. తెలంగాణలో సైతం ఈ సదస్సుకు సంబంధించిన ఈవెంట్లు జరగనున్నాయి. రాష్ట్రంలోని విద్యార్థులు వీటిలో పాల్గొనాలి. తెలంగాణ గౌరవాన్ని, ప్రజాస్వామ్యాన్ని, హక్కులను కాపాడుకుందాం. తెలంగాణతో నాకున్న అనుబంధం మూడేళ్లది కాదు. పుట్టుకతో వచ్చింది. తెలంగాణ అభివృద్ధిలో నా పాత్ర తప్పకుండా ఉంటుంది. కొంతమందికి నేను నచ్చకపోవచ్చు. కానీ నాకు తెలంగాణ వాళ్లంటే ఇష్టం. అందుకే ఎంత కష్టమైనా కూడా పనిచేస్తున్నాను.

రాష్ట్ర అభివృద్ధిలో నేను సైతం...

రాష్ట్ర సర్వోన్నత అభివృద్ధికి రాజ్‌భవన్ ఆధ్వర్యంలో పలు చర్యలు చేపట్టాం. గిరిజనుల్లో పౌష్టికాహార



జాతీయ జెండాకు వందనం చేస్తున్న గవర్నర్ తమిళిసై. చిత్రంలో డీజీపీ, సీఎస్

లోపం, గిరిజన మహిళలు, బాలికల్లో రక్తహీనతను నివారించడానికి రాజశ్రీ కోళ్లు, పౌష్టికాహార లడ్డూలు పంపిణీ చేస్తున్నాం. మారుమూల గిరిజన ఆవాసాల్లో వైద్య శిబిరాల నిర్వహణతోపాటు అంబులెన్స్‌ల పంపిణీ చేపట్టాం. గిరిజన ఆవాసాల్లో జీవనోపాధి కల్పన, ఆరోగ్య పరిస్థితుల మెరుగుదలే ప్రధాన లక్ష్యం. నాణ్యమైన విద్య, పరిశోధనలు, అభివృద్ధి, ఆవిష్కరణల్లో మంచి ఫలితాలు సాధించేలా ఉన్నత విద్యాసంస్థలను ప్రోత్సహించడానికి కనెక్టింగ్ చాన్సలర్ అల్యూమ్నీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. రాష్ట్రాభివృద్ధి, దేశ నిర్మాణంలో భాగస్వామ్యమయ్యేలా విద్యార్థులతో నిరంతరం అనుసంధానమవుతున్నా. పవిత్ర తెలంగాణ గడ్డపై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించినందుకు గర్వపడుతున్నా.

రాజ్యాంగం వల్లే తెలంగాణ సాధ్యమైంది

రాజ్యాంగ స్ఫూర్తితోనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్–3తోనే సాధ్యమైంది. తెలంగాణ ప్రజల ఆరు దశాబ్దాల నిర్విరామ ఉద్యమాల తర్వాత సాధ్యమైంది. మేడారం యోధులు, సమ్మక్క–సారక్క, చాకలి ఐలమ్మ, కుమురం భీం వంటి యోధులు అందించిన నిజమైన పోరాట స్ఫూర్తితోనే తెలంగాణ ఉద్యమం సఫలమైంది. విశిష్ట చారిత్రక, సాంస్కృతిక ప్రాముఖ్యత కలిగిన హైదరాబాద్ నగరం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దేశాభివృద్ధికి సూచికగా మారింది. సుస్థిర వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తుండటంతో సాగు లాభాదయకంగా మారి ఆహార భద్రత లభించింది. ఇందుకు తెలంగాణ రైతులకు వందనం.

ప్రధానికి కృతజ్ఞతలు

తెలంగాణలో జాతీయ రహదారుల విస్తరణ భారీ ఎత్తున జరుగుతోంది. అత్యుత్తమ రహదారులు కలిగిన రాష్ట్రాల్లో ఒకటిగా తెలంగాణ నిలిచింది. రహదారుల నిర్మాణంలో రాష్ట్రానికి సింహభాగం కేటాయింపులు చేసినందుకు ప్రధాని మోదీకి కృతజ్ఞతలు. ఏ రాష్ట్రమైనా సుస్థిర, సమ్మిళిత, ప్రగతిశీలంగా మారడానికి నాణ్యమైన విద్య, పరిశోధనలు, అభివృద్ధితో పాటు అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యం అవసరం. రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టడానికి ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికైన ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు, పాలనా యంత్రాంగం తమ బాధ్యతలకు కట్టుబడిఉండాలి. రాజ్యాంగ ఔన్నత్యాన్ని గణతంత్ర దినోత్సవం చాటిచెబుతుంది. అంతిమ నిర్ణేతలు ప్రజలే అని చెబుతుంది.

హాజరైన సీఎస్, డీజీపీ

హైకోర్టు మధ్యంతర ఆదేశాల మేరకు గణతంత్ర దినోత్సవంలో పోలీసు పరేడ్‌ను నిర్వహించగా, పోలీసు బలగాల నుంచి గవర్నర్ తమిళిసై గౌరవ వందనం స్వీకరించారు. రాజ్‌భవన్‌లో ఉత్సవాల ఏర్పాట్లు సైతం రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ఆధ్వర్యంలో జరిగాయి. ఉత్సవాల్లో సీఎస్ శాంతికుమారి, డీజీపీ అంజనీ కుమార్‌తోపాటు పలువురు సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు పాల్గొన్నారు. సీఎం కేసీఆర్, రాష్ట్ర మంత్రులు, ఇతర పార్టీల నేతలెవరూ ఈ వేడుకలకు హాజరుకాలేదు. పతాకావిష్కరణకు ముందు గవర్నర్ పరేడ్ గ్రౌండ్‌లో అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు.

పలువురికి సత్కారం..

వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన పలువురిని గవర్నర్ తమిళిసై ఘనంగా సన్మానించారు. 'నాటు నాటు' పాటకు గోల్డెన్ గ్లోబ్ పురస్కారాన్ని అందుకున్న సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణితోపాటు సినీ గేయ రచయిత సుభాష్ చంద్రబోస్, సామాజిక సేవ విభాగంలో భగవాన్ మహవీర్ వికల్ప్ సహాయక సమితి, విద్యా, యువజనాభివృద్ధి విభాగంలో ఎం.బాలలత, పారా అథ్లెటిక్స్ విభాగంలో కుడుముల లోకేశ్వరిని సత్కరించి జ్ఞాపికను అందజేశారు. క్రీడల్లో ఆకుల శ్రీజకు బదులు తల్లిదండ్రులు సత్కారాన్ని అందుకున్నారు.

క్లుప్తంగా...



ప్రగతిభవన్‌లో ఘనంగా గణతంత్ర దినోత్సవం

జాతీయ జెండాను ఆవిష్కరించిన సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు గురువారం ప్రగతిభవన్‌లో జాతీయ పతాకావిష్కరణ చేశారు. జాతిపిత మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం పరేడ్ గ్రౌండ్‌లోని అమర జవానుల స్మారక స్తూపాన్ని సందర్శించి జ్యోతి ప్రజ్వలన చేయడంతో పాటు అమర జవాన్లకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశం కోసం అమర జవానుల త్యాగాలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, మల్లా రెడ్డి, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నవీన్ రావు, శంభీపూర్ రాజు, మధుసూదనా చారి, సీఎస్ శాంతికుమారి, డీజీపీ అంజనీకుమార్, సీఎంవో ఉన్నతాధికారులు, సిబ్బంది, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

వీరజవాన్ల స్ఫూర్తితో ప్రగతికి పునరంకితం

పీసీసీఎఫ్ డోబ్రియాల్ పిలుపు

సాక్షి, హైదరాబాద్: సరిహద్దుల్లో వీర జవాన్ల త్యాగాల స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ అభివృద్ధికి పునరంకితం కావాలని పీసీసీఎఫ్ ఆర్.ఎం. డోబ్రియాల్ కోరారు. గురువారం అరణ్య భవన్‌లో 74వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆయన జాతీయ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం కేసీఆర్ మానస పుత్రిక హరితహారానికి దేశవ్యాప్తంగా వస్తున్న ప్రశంసల్లో, పథకం విజయవంతం కావడంలో అటవీ శాఖలో పని చేస్తున్న ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఉందని ఆయన స్పష్టం చేశారు. గత యేడాది కాలంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి ప్రోత్సాహకాలను పీసీసీఎఫ్ అందజేశారు.

వచ్చే ఏడాది యాదాద్రి విద్యుత్ ప్లాంట్ పూర్తి

ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్ రావు



సాక్షి, హైదరాబాద్: నల్లగొండ జిల్లా దామరచర్లలో చేపట్టిన 4 వేల మెగావాట్ల యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మాణం వచ్చే ఏడాది చివరిలోగా పూర్తి కానుందని తెలంగాణ జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ డి.ప్రభాకర్ రావు తెలిపారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆయన గురువారం జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో మొత్తం 8085 మెగావాట్ల సామర్థ్యంతో పలు విద్యుదుత్పత్తి కేంద్రాల నిర్మాణం జరుగుతోందని వివరించారు. ఇవి పూర్తయితే పెరుగుతున్న సాగునీటి, పరిశ్రమల విద్యుత్ అవసరాలు తీరుతాయని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడినప్పుడు 7778 మెగావాట్లు ఉన్న రాష్ట్ర విద్యుత్ సరఫరా సామర్థ్యం 18453 మెగావాట్లకు పెరిగిందని సీఎండీ వెల్లడించారు.

నూతన ఉత్తేజంతో ముందుకు వెళ్లాలి

తెలంగాణ డీజీపీ అంజనీకుమార్



సాక్షి, హైదరాబాద్: పోలీస్‌శాఖలో కొత్తగా నియమితులైన యువ ఐపీఎస్ అధికారులంతా నూతనోత్తేజంతో పనిచేస్తున్నారని, అదే ఉత్సాహంతో ముందుకు వెళ్లాలని రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ సూచించారు. శాంతిభద్రతల నిర్వహణలో డీఐజీ నుంచి జోనల్ ఐజీలు, అదనపు డీజీలకు ఉన్న అనుభవం సైతం కీలక పాత్ర పోషిస్తుందని, కొత్త, పాత అధికారుల సమన్వయం బాగుందని డీజీపీ అభిప్రాయపడ్డారు. నేరాల సమీక్షల్లో భాగంగా డీజీపీ అన్ని పోలీస్ యూనిట్ల ఉన్నతాధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. పోలీస్ యూనిట్ల మధ్య పోటీతత్వం కాకుండా ఐక్యత ఉండాలని సూచించారు. శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం వాటిల్లకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఐజీలు తమ పరిధిలోని యూనిట్లను నిత్యం పర్యవేక్షిస్తూ ముందుకు సాగేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఖమ్మంలో ఇటీవల నిర్వహించిన భారీ బహిరంగ సభ బందోబస్తు ఏర్పాట్లలో అద్భుత పనితీరును కనబరిచిన ఖమ్మంకు చెందిన పోలీస్ అధికారులను ఆయన ప్రశంసించారు.

గూడు చెదిరి.. గుండె పగిలె..

బస్వాపూర్ రిజర్వాయర్ కింద ఊరంతా మునక

- పూర్తి పరిహారం అందక గ్రామస్తుల ఇబ్బందులు
- మనోవేదనతో మంచంపడుతున్న నిర్వాసితులు
- ఇప్పటికే 50 మందికిపైగా మృతి
- దిక్కుతోచని స్థితిలో బీఎస్ తిమ్మాపూర్ వాసులు



బీఎస్ తిమ్మాపూర్ గ్రామం

సాక్షి, యాదాద్రి: బస్వాపూర్ రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా ముంపునకు గురవుతున్న భూములు, ఇళ్లకు పూర్తి పరిహారం ఇవ్వకుండానే అధికార యంత్రాంగం అక్కడి ప్రజలను ఖాళీ చేయిస్తోంది. దీంతో ఎటు వెళ్లాలో తెలియని అయోమయం, ఆందోళన కారణంగా మనస్తాపం చెందిన నిర్వాసితుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా బీఎస్ తిమ్మాపూర్ గ్రామంలో నెలకొన్న దయనీయపరిస్థితి ఇది.

వ్యవసాయ భూములు, ఇళ్లు పోయి.. పరిహారం రాక భవిష్యత్తుపై భయంతో పాటు రకరకాల కారణాలతో దాదాపు ఐదేళ్లలో గ్రామంలో 50 మందికి పైగా చనిపోయారు. ఆడపిల్లల పెళ్లిళ్లు చేయలేకపోతున్నామని తల్లిదండ్రులు.., తమకు పిల్లను ఇవ్వడంలేదని మనోవేదనతో కొందరు యువకులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. మరి కొందరు అనారోగ్యంతో మంచంపట్టారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోవడంతో గత 57 రోజులుగా బస్వాపూర్ ప్రాజెక్టు కట్టపై నిర్వాసితులు వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్నారు. బుధవారం కూడా ఓ నిర్వాసితుడు బెంగతో చనిపోయాడు.

ఇళ్లు ఖాళీ చేయాలని నోటీసులు..

కాళేశ్వరం ప్రాజెక్టులో చివరిదైన నృసింహసాగర్ రిజర్వాయర్ (బస్వాపూర్ రిజర్వాయర్)ను 11.39 టీఎంసీల సామర్థ్యంతో ప్రతిపాదించారు. ఈ ప్రాజెక్టుకు 1,724 ఎకరాల భూసేకరణ కోసం నోటిఫికేషన్ జారీచేశారు. ఇందులో 700 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉంది. కాగా ఈ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా బీఎస్ తిమ్మాపూర్, లక్ష్మీనాయకుని తండా, చోకల్‌నాయకుని తండాలు పూర్తిగా మునిగిపోతున్నాయి. ప్రభుత్వం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద ముంపు గ్రామాల వాసులకు ఇళ్లు నిర్మించి ఇవ్వడంలో జాప్యం అవుతోంది. బీఎస్ తిమ్మాపూర్ గ్రామస్తుల వ్యవసాయ భూములకు పరిహారం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలు అందరికీ ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో ఈ నెల 23న గ్రామంలోని 655 నివాస గృహాలను ఖాళీ చేయాలని రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. అయితే ముంపు భూములకు పరిహారం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ డబ్బులను మరింత పెంచి ఇవ్వాలని గ్రామస్తులు తీర్మానం చేసి నోటీసులు తీసుకోకుండా అధికారులను తిప్పి పంపారు.

గ్రామస్తుల ప్రధాన డిమాండ్లు..

- 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలి.
- 2019లో ప్రకటించిన అవార్డును రద్దు చేసి కొత్తగా భూసేకరణ అవార్డును ప్రకటించాలి.
- ప్రాజెక్టు ముంపులో కోల్పోతున్న వ్యవసాయ భూములు, ఇళ్లకు పరిహారం ఒకేసారి చెల్లించాలి.
- గ్రామంలో 18 సంవత్సరాలు నిండిన వారికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని ప్రకటించాలి,
- భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని హుస్నాబాద్ వద్ద 107 సర్వే నంబర్‌లో చేపట్టిన లేఅవుట్ ప్లాట్లను వెంటనే బీఎస్ తిమ్మాపూర్ గ్రామస్తులకు కేటాయించాలి. ఒక్కో ఇంటినిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేయాలి.

655 మందికే పరిహారం..

బీఎస్ తిమ్మాపూర్‌లో గ్రామకంఠంతోపాటు పరిసరాల్లోని 36.11 ఎకరాల భూమి మునుగుతోంది.



గుండెపోటుతో చనిపోయిన నర్సింహ మృతదేహంతో భువనగిరిలో ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

పరిహారం డబ్బులన్నీ పప్పు పుట్నాలకే..

ప్రభుత్వం తీసుకున్న భూములకు పరిహారం డబ్బులన్నీ ఒకేసారి ఇవ్వకపోవడంతో నిర్వాసితులకు ఇంతవరకు ఇచ్చిన డబ్బులన్నీ ఇతర అవసరాలకే ఖర్చయ్యాయి. అప్పుడప్పుడు ఇచ్చిన పరిహారం డబ్బులు ఇలా ఖర్చు కావడంతో రైతుల చేతులు ఖాళీ అయ్యాయి. ప్రాజెక్టు నిర్మాణం చేపట్టినప్పుడు తొలుత ఎకరానికి రూ.6 లక్షల చొప్పున పరిహారం ఇచ్చారు. ఆ తర్వాత రిజర్వాయర్ సామర్థ్యాన్ని 0.87 టీఎంసీలనుంచి 11.39 టీఎంసీలకు పెంచిన ప్రభుత్వం.. నిర్వాసితులకు 123 జీవో ప్రకారం పరస్పర అంగీకారం ద్వారా ఎకరానికి రూ.15.60 లక్షల చొప్పున 400 ఎకరాలకు పరిహారం ఇచ్చింది. కానీ, ఆ తర్వాత 2019 డిసెంబర్ 11న జారీచేసిన అవార్డు ప్రకారం దానిని సవరించి ఎకరానికి రూ.15.30 లక్షలు నిర్ణయించింది. అయితే, పరిహారం మరింత ఎక్కువగా ఇవ్వాలని రైతులు కోరుతూ వస్తుండగా.. రూ.30 వేలు తగ్గడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు. ఎక్కువ పరిహారం వస్తుందని భావించిన రైతులకు పరిహారం ఇలా తక్కువగా రావడంతో తీవ్ర మనో వేదన చెందుతున్నారు.



బస్వాపూర్ రిజర్వాయర్ ప్రాజెక్టు

ఇంతవరకు ఈ భూమికి సంబంధించి అవార్డు ప్రక్రియ మొదలుకాలేదు. దీంతో ఎంత పరిహారం వస్తుందో తెలియని పరిస్థితి. అలాగే భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో 90 ఎకరాల్లో లేఅవుట్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద గ్రామంలో 1,086 మంది నిర్వాసితులు తేలారు. వీరిలో 655 మందికి పరిహారం చెల్లించారు. ఒక్కొక్కరికి రూ.7.61 లక్షల చొప్పున రూ.50 కోట్లు పంపిణీ చేశారు. మిగతా వారికి రూ.34 కోట్లు రావాల్సి ఉంది. డబ్బులు ఒకేసారి ఇవ్వకపోవడంతో విడతలుగా వచ్చిన డబ్బులు వృథాగా ఖర్చవుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. డబ్బులు చేతికి వచ్చిన వారిలో సగం మందికిపైగా చేతిలో చిల్లిగవ్వకూడా లేకుండా ఖర్చు అయ్యాయని చెపుతున్నారు. పరిహారం రాని వారు ఎప్పుడిస్తారో.. అని ఎదురుచూస్తున్నారు.

మా భూమికి డబ్బులు రాలేదు



“బస్వాపురం రిజర్వాయర్‌లో మా భూమి 12 ఎకరాలు పోయింది. ఇందులో 5 గుంటల భూమి పైసలు మాత్రమే పడ్డాయి. మిగతా డబ్బులు నేటికీ ఇవ్వలేదు. పునరావాసం కల్పిస్తామని అధికారులు చెబుతున్నారు కానీ నేటికీ లేదు. రెవెన్యూ అధికారులు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో భాగంగా గ్రామంలో ఉన్న ఇళ్లకు నోటీసులు ఇవ్వడానికి వచ్చారు. ముంపు భూములు, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ డబ్బులు మొత్తం అందరికీ ఇస్తే తప్ప నోటీసులు తీసుకోబోమని చెప్పాం.

– ఎండీ సాబేర్, బీఎస్ తిమ్మాపురం

అనారోగ్యం పాలవుతున్నాం



ప్రభుత్వం ఇచ్చే పరిహారం కోసం ఎదురుచూస్తూ, ఎంత వస్తుందో.. ఎప్పుడు ఇస్తారో అని ఆలోచిస్తూ అనారోగ్యం పాలు అవుతున్నాం. గ్రామంలో ఇలా ఆలోచించి కొందరు చనిపోగా, మరికొందరు ఆస్పత్రుల పాలయ్యారు. నాకున్న అర ఎకరం వ్యవసాయ భూమి బస్వాపురం రిజర్వాయర్ కట్ట కోసం పోయింది. అప్పుడు ఎకరానికి రూ.6 లక్షలు మాత్రమే ఇచ్చారు. ఆ డబ్బులతో ఎక్కడా భూమి కొనుగోలు చేయలేక పోయాం. ఇంటి కోసం ఇచ్చే ఆర్‌అండ్‌ఆర్ ప్యాకెజీ కోసం ఎదురు చూస్తున్నాం.

– జంగిటి సుగుణ, బీఎస్ తిమ్మాపూర్

రూ. 46.35 కోట్లు విడుదల



బస్వాపూర్ ప్రాజెక్టు ముంపు బాధిత కుటుంబాల పరిహారం, లే అవుట్ అభివృద్ధికి ప్రభుత్వం బుధవారం రూ.46.35 కోట్లను విడుదల చేసింది. ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలసి బాధితులకు పరిహారం ఇవ్వాలని కోరడంతో వెంటనే స్పందించి నిధులు విడుదల చేయాలని ఆర్థిక శాఖకు ఆదేశాలు ఇచ్చారు. ఇందులో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కోసం రూ.33.45 కోట్లు, పునరావాస లేఅవుట్ అభివృద్ధికి రూ.12.90 కోట్లు ఉన్నాయి. రెండురోజుల్లో బాధితులకు పరిహారం అందుతుంది.

– పైళ్ల శేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యే, భువనగిరి

గవర్నర్ ఎట్ హోంకు సీఎం గైర్హాజరు

బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలూ దూరంగానే



ఎట్‌హోం కార్యక్రమంలో గవర్నర్ తమిళిసైతో హైకోర్టు సీజే జస్టిస్ ఉజ్జల్ భూయాన్ దంపతులు, మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు, తమిళనాడు మాజీ గవర్నర్ రామ్మోహన్‌రావు

- పెద్ద సంఖ్యలో హాజరైన బీజేపీ నేతలు
- వేడుకల్లో ఎస్‌ఓపీ పాటించలేదని కేంద్రానికి నివేదిక
- మీడియాతో ధ్రువీకరించిన గవర్నర్ తమిళిసై

సాక్షి, హైదరాబాద్: దేశ గణతంత్ర దినోత్సవం నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వం స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్(ఎస్‌ఓపీ) పాటించలేదని కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపించినట్టు రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వెల్లడించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా గురువారం సాయంత్రం ఆమె రాజ్‌భవన్ ప్రాంగణంలో ఎట్ హోం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మీడియాతో క్లుప్తంగా మాట్లాడారు. ఎస్‌ఓపీ పాటించలేదన్న అంశంపై కేంద్రానికి నివేదిక పంపించారా? అని విలేకరులు ప్రశ్నించగా, పంపించినట్టు ఆమె ధ్రువీకరించారు. తేనీటి విందుకు సీఎం కేసీఆర్, రాష్ట్ర మంత్రులు, అధికార బీఆర్ఎస్ పార్టీ నేతలెవరూ హాజరు కాలేదు. గతేడాది రాజ్‌భవన్ తేనీటి విందుకు హాజరైన రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ఈసారి పూర్తిగా దూరంగా ఉన్నారు. రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ అంజనీ కుమార్, మాజీ గవర్నర్ సీహెచ్.విద్యాసాగర్ రావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్, ఆ పార్టీ నేతలు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ఎన్. రామచంద్రరావు, వివేక్, కపిలవాయి దిలీప్‌కుమార్, బాబు మోహన్, పొంగులేటి సుధాకర్ రెడ్డి, యెండల లక్ష్మీనారాయణతో పాటు వివిధ రంగాల ప్రముఖులు, తెలంగాణ సాయుధ పోరాట యోధులు పాల్గొన్నారు. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అతిథులందరి వద్దకు వెళ్లి పేరుపేరునా పలకరించారు. కాగా, ఎట్ హోమ్ కార్యక్రమంపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ట్విట్టర్‌లో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 'ఎట్ హోమ్ కార్యక్రమం బీజేపీ కార్యాలయంలా అయింది. తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షురాలు తమిళిసైతోపాటు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్, బీజేపీ నాయకులు హాజరయ్యారు' అని ఎద్దేవా చేశారు.

దేశంలోనే తెలంగాణ నం.1

- గణతంత్ర వేడుకల్లో మండలి చైర్మన్ గుత్తా, శాసనసభ స్పీకర్ పోచారం
- తెలంగాణ భవన్ వేడుకల్లో ఎంపీ కేకే

సాక్షి, హైదరాబాద్: గణతంత్ర దినోత్సవ వేడుకలు గురువారం రాష్ట్ర అసెంబ్లీ ప్రాంగణంలో ఘనంగా జరిగాయి. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అసెంబ్లీ ప్రాంగణంలోని జాతిపిత మహాత్మాగాంధీ, బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శాసన మండలి ఆవరణలో గుత్తా, శాసనసభ ఆవరణలో పోచారం జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. దేశంలోనే అన్ని రంగాల్లో తెలంగాణ రాష్ట్రం నంబర్ వన్ స్థానంలో నిలిచిందని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు.

కుల మతాలకు అతీతంగా జరుపుకునే పండుగ: స్పీకర్

కులమతాలకు అతీతంగా దేశంలోని అన్ని వర్గాల ప్రజలందరూ కలిసి జరుపుకునే పండుగ గణతంత్ర దినోత్సవమని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శాంతియుతంగా తెచ్చిన స్వాతంత్య్ర ఫలాలను పరిపాలన ద్వారా అమలు చేసే విధులు, బాధ్యతలను పవిత్రమైన రాజ్యాంగం తెలియజేసిందన్నారు.

తెలంగాణ భవన్‌లో..

గణతంత్ర దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో పార్టీ సెక్రటరీ జనరల్, ఎంపీ కే.కేశవరావు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

బీఆర్‌కేఆర్ భవన్‌లో జెండా ఆవిష్కరించిన సీఎస్

సాక్షి, హైదరాబాద్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గురువారం బీఆర్‌కేఆర్ భవన్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శులు, అదనపు కార్యదర్శులు, జాయింట్ సెక్రటరీలు, ఉప కార్యదర్శులు, సచివాలయ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

టీటీడీపీ కార్యాలయంలో పతాకావిష్కరణ

భారత 74వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో గురువారం తెలంగాణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు అట్లూరి సుబ్బారావు, ఆజ్మీరా రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆప్ కార్యాలయంలో జెండా వందనం

ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) రాష్ట్ర కార్యాలయంలో గురువారం గణతంత్ర దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆప్ కోర్ కమిటీ సభ్యురాలు ఇందిరా శోభన్ ఎగురవేశారు.

పురోగతిపై ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం

గణతంత్ర దినోత్సవంలో హైకోర్టు సీజే జస్టిస్ ఉజ్జల్ భూయాన్



హైకోర్టులో జాతీయ జెండాకు వందనం చేస్తున్న జస్టిస్ ఉజ్జల్ భూయాన్

సాక్షి, హైదరాబాద్: గణతంత్ర దినోత్సవం మనం వేడుకలు జరుపుకోవాల్సిన రోజు మాత్రమే కాదు.. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన నాటి నుంచి సాధించిన పురోగతిని ఆత్మపరిశీలన చేసుకునే సమయమని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ వ్యాఖ్యానించారు. 74వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా హైకోర్టు ప్రాంగణంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి.. వందనం చేశారు. అనంతరం జస్టిస్ భూయాన్ మాట్లాడుతూ 'రాజ్యాంగం ఆమోదం పొందిన నాటి నుంచి ఎంతో కాలం ప్రయాణించాం. మనం సాధించిన లక్ష్యాలను గమనం చేసుకోవాల్సిన అవసరం ఉంది. మనమందరం సమానమేనని రాజ్యాంగం చెబుతోంది. ఎక్కడా కులం, మతం, లింగం లాంటి భేదాలు ఉండకూడదు. దేశంలోని ప్రతి పేదవాడికీ న్యాయం అందేలా చూడాలి. పెండింగ్ కేసులను ఎంత వేగంగా పరిష్కరిస్తున్నామనేది కోర్టుల పనితీరుకు కొలమానం. దీనికి న్యాయవాదులు, రిజిస్ట్రీ సహకారం ఎంతో అవసరం'అని పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజులు.. పదమూడు వేదికలు

నేటి నుంచి హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ సాహిత్యోత్సవానికి నగరం సన్నద్ధమైంది. సెక్రెటేరియట్ ఎదురుగా ఉన్న విద్యారణ్య స్కూల్‌లో శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు ఈ వేడుకలు జరుగనున్నాయి. కోవిడ్ కారణంగా రెండేళ్ల పాటు నిలిచిపోయిన హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్‌ను ఈ సారి ఘనంగా నిర్వహించేందుకు హెచ్‌ఎల్‌ఎఫ్ నిర్వహణ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈశాన్యరాష్ట్రాల నుంచి దక్షిణాది కేరళ, తమిళనాడు, ఒడిశా, తదితర అన్ని రాష్ట్రాలకు చెందిన సాహితీ ప్రియులు, కవులు, రచయితలు, మేధావులు, కళాకారులు ఈ వేడుకలలో పాల్గొననున్నారు. అమెరికా, బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్,తదితర దేశాలకు చెందిన రచయితలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు తరలిరానున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు వేడుకలు ప్రారంభమవుతాయి. ప్రముఖ రచయిత, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత రచయిత దామోదర్ మౌజో ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. జర్మనీ రాయబార కార్యాలయం ప్రతినిధి స్టీఫెన్ గ్రాబర్ విశిష్ట అతిథిగా పాల్గొంటారు. మూడు రోజుల పాటు జరుగనున్న ఈ సాహిత్యోత్సవం కోసం 13 వేదికలను ఏర్పాటు చేశారు. ఈ మూడు రోజుల పాటు సాహిత్యం, కళలు, జాతీయ, అంతర్జాతీయ అంశాలపైన సుమారు 150 కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు హెచ్‌ఎల్‌ఎఫ్ డైరెక్టర్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్ 'సాక్షి'తో చెప్పారు. వివిధ రంగాలకు చెందిన 250 మంది ప్రతినిధులు ఈ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

హెచ్‌సీయూలో పోటాపోటీగా నిరసనలు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పోటాపోటీగా నిరసన కార్యక్రమాలు జరిగాయి. గురువారం రాత్రి వరకు క్యాంపస్‌లోని నార్త్ షాపింగ్ కాంప్లెక్స్ సమీపంలో ఈ నిరసనలు కొనసాగాయి. అధికార యంత్రాంగం పోటాపోటీగా నిర్వహించతలపెట్టిన చిత్రప్రదర్శనను అడ్డుకోవడానికి యత్నించడంతో నిరసనలకు దిగి నినాదాలు చేశారు.

హెచ్‌సీయూలో ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఏబీవీపీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి నిరసన కార్యక్రమం నిర్వహించారు.బీబీసీ డాక్యుమెంటరీ ప్రదర్శనను నిరసిస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్‌సీయూ వీసీ ముర్దాబాద్, రిజిస్ట్రార్ ముర్దాబాద్, భారత్ మాతాకీ జై అంటూ క్యాంపస్‌లోని మేయిన్ గేట్ వద్ద పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో హెచ్‌సీయూ క్యాంపస్‌లోని నార్త్ షాపింగ్ కాంప్లెక్స్ లోని అంబేద్కర్ చౌక్‌లో 'ది కాశ్మీరీ ఫైల్స్' చిత్రాన్ని ప్రదర్శించేందుకు ఏబీవీపీ ఏర్పాట్లు చేసింది. ఇది గమనించిన వర్సిటీ అడ్మినిస్ట్రేషన్ ఈ ప్రదర్శనను నిలిపివేయాలని ఆదేశించింది. ఏబీవీపీ నాయకులు, సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ..

హెచ్‌సీయూలోని నార్త్‌ఎల్‌హెచ్ నుంచి నార్త్ షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంతంలో 'సేవ్ కాన్స్టిట్యూషన్' పేరుతో ర్యాలీని ఎస్ఎఫ్ఐ హెచ్‌సీయూ శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి బీబీసీ డాక్యుమెంటరీ 'ఇండియా ది మోడీ క్వశ్చన్ పార్ట్ 1 అండ్ 2'ను ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేయగా కూడా అధికార యంత్రాంగం అడ్డుకోవడానికి యత్నించారు. అనంతరం భారీ ఎత్తున విద్యార్థులతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కాళ్లు మొక్కుతా.. వదిలేయండి

బాలిక ప్రాధేయపడినా ముగ్గురు యువకుల అఘాయిత్యం

- తొలుత ప్రేమ పేరిట గాలం వేసిన ఓ యువకుడు
- పెళ్లి చేసుకుంటానని నమ్మించి కొంతకాలంగా లైంగిక దాడి
- మంగళవారం ఇద్దరు స్నేహితులతో కలిసి దారుణం
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన



ఖిలా వరంగల్: ఇంటర్ ఫస్టియర్ బాలిక.. క్లాస్‌మేట్ ద్వారా ఓ యువకుడు పరిచయమయ్యాడు.. ప్రేమ, పెళ్లి పేరిట శారీరకంగా లొంగదీసుకున్నాడు.. మాట్లాడుకుందామని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లాడు. తన ఇద్దరు స్నేహితులతో కలిసి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డాడు. 'కాళ్లు మొక్కుతా వదిలేయండి'అని ప్రాధేయపడ్డా వదలలేదు. చివరికి ఈ విషయం బయటికి చెప్పొద్దని బెదిరించి ఇంటి వద్ద వదిలిపెట్టారు. ఆవేదన భరించలేని బాలిక తల్లికి చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వరంగల్ కాశీబుగ్గ ప్రాంతంలో మంగళవారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

తండ్రి లేని బాలిక..

పోలీసులు, బాధితురాలి కథనం ప్రకారం.. నిరుపేద కుటుంబానికి చెందిన మహిళ.. భర్తను కోల్పోవడంతో తమ గ్రామాన్ని వీడి ఇద్దరు కుమార్తెలతో వరంగల్ కాశిబుగ్గకు వలస వచ్చింది. అద్దె ఇంట్లో ఉంటూ, కూలి పనులకు వెళ్తూ ఇద్దరు కుమార్తెలను చదివిస్తోంది. పెద్ద కుమార్తె ఇంటర్ సెకండియర్, చిన్నకుమార్తె ఫస్టియర్ చదువుతున్నారు. ఫస్టియర్ చదువుతున్న బాలికకు అదే కాలేజీలో చదివే స్నేహితురాలి ద్వారా నర్సంపేట సమీపంలోని మాదన్నపేటకు చెందిన దూడల ప్రభాస్ (22)తో పరిచయం ఏర్పడింది. ప్రభాస్ ప్రేమ పేరిట బాలికకు మాయమాటలు చెప్పి నమ్మించాడు. స్నేహితురాలి సాయంతో బాలికను పలుమార్లు మాదన్నపేటకు రప్పించుకున్నాడు. పెళ్లి చేసుకుంటానంటూ లైంగిక దాడికి పాల్పడ్డాడు.

మాట్లాడుకుందాం రమ్మని చెప్పి..

ప్రభాస్ మంగళవారం ఉదయం మాట్లాడుకుందామని చెప్పి ఆ బాలికను మాదన్నపేటకు రప్పించాడు. ఇంట్లో బంధువులు ఉన్నారని, బయటికి వెళ్దామని చెప్పాడు. తన స్నేహితులు భరత్, బన్నిలను అడిగితే ఖిలా వరంగల్ శివార్లలోని దూపకుంట రోడ్డు వైపు నిర్మానుష్య ప్రదేశాలు ఉన్నాయని చెప్పారని.. అటు వెళ్దామని తీసుకెళ్లాడు. బైక్‌పై ఆ ప్రాంతానికి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. కాసేపటికే భరత్, బన్ని, మరో యువకుడు కలిసి ఒక బైక్‌పై ఆ ప్రాంతానికి చేరుకున్నారు. ఏం చేస్తున్నారని బెదిరిస్తున్నట్టుగా నటిస్తూ.. బాలిక సెల్‌ఫోన్ లాక్కున్నారు. 'కాళ్లు మొక్కుతా నన్ను వదిలేయండి'అని ప్రాధేయపడినా వినకుండా భరత్, బన్ని ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. మరో యువకుడు వారికి కాపలా ఉన్నాడు. బాలిక ఈ ఘటనతో షాక్‌లోకి వెళ్లి స్పృహ కోల్పోయింది. ఆమె తిరిగి లేచే వరకు ప్రభాస్ అక్కడే ఉన్నాడు. అత్యాచారం విషయాన్ని బాలిక తల్లికి చెప్తుందేమోనని భయపడి.. ఆమెను మాదన్నపేటలోని అతడి బావ అనిల్ ఇంటికి తీసుకెళ్లాడు. బాలిక తనపై జరిగిన దారుణాన్ని చెప్పడంతో అనిల్ ఆందోళనకు గురయ్యాడు. ప్రభాస్‌ను మందలించి.. బాలికను అద్దె కారులో తన ఇంటికి పంపించారు. తర్వాత బాలిక ఘటనను తల్లికి చెప్పగా.. బుధవారం మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు దారుణానికి పాల్పడ్డ ముగ్గురు యువకులతోపాటు వీరికి సహకరించిన మరో వ్యక్తిపై బెదిరింపు, దాడి, పోక్సో చట్టం సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నిందితులు పరారీలో ఉన్నారని, గాలిస్తున్నామని పోలీసులు చెప్తున్నారు. అయితే ఘటనకు సంబంధించి నలుగురిని అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం.

మనం మన సంబంధాన్ని అల్లాహ్‌తో బాగుచేసుకుంటే,
మిగతా అన్ని విషయాలనూ అల్లాహ్ మన కోసం బాగుచేస్తాడు.
– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, జనవరి, 27

పరిగణించదగ్గ 'పశ్చాత్తాపం'

గతానికీ, వర్తమానానికీ జరిగే అనంతమైన సంభాషణే చరిత్ర అంటాడు చరిత్రకారుడు ఇ.హెచ్ కార్. చరిత్రలో జరిగిన తప్పిదాలను మార్చలేం. ఆనాటి ఘటనలకు కొత్త రంగు పులమలేం. కానీ తప్పిదాలకు కారకులైన వ్యక్తులైనా, దేశాలైనా, సంస్థలైనా పశ్చాత్తాపపడి క్షమాపణ కోరటం నాగరిక లక్షణం. అమెరికాకు చెందిన జన్యు శాస్త్రవేత్తల బృందం రెండురోజుల క్రితం ఈ పనే చేసింది. తమ వల్లా, తమ మౌనం వల్లా చరిత్రలో జరిగిపోయిన ఘోర తప్పిదాలకు పశ్చాత్తాపపడింది. క్షమాపణ చెప్పింది. అమెరికన్ సొసైటీ ఆఫ్ హ్యూమన్ జెనెటిక్స్(ఏఎస్‌హెచ్‌జీ) జన్యు శాస్త్రవేత్తలకు సంబంధించి ప్రపంచంలోనే అతి పెద్ద సంస్థ. 8,000 మంది సభ్యులుండే ఈ సంస్థ విడుదల చేసిన 27 పేజీల నివేదిక చూస్తే దిగ్భ్రాంతి కలుగుతుంది. సంస్థ నియమించిన నిపుణుల కమిటీ ఈ నివేదికను రూపొందించింది. పాత రికార్డులను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, వివిధ సందర్భాల్లో సభ్యులు చేసిన ప్రకటనలనూ, కళ్ల ముందు ఘోరాలు జరుగుతున్నా తమ శాస్త్రవేత్తలు ఉదాసీనంగా ఉండిపోయిన వైనాన్నీ ఈ నివేదిక బయటపెట్టింది.

జంతువుల్లోనూ, ధాన్యాల్లోనూ మేలు జాతి రకాలున్నట్టే మనుషుల్లో కూడా వేర్వేరు తరగతుల వారుంటారని, జన్యుపరమైన ఎంపికల ద్వారా 'అధమ' రకం వారిని 'నిరోధిస్తే' 'శ్రేష్ఠ మానవజాతి' రూపొందుతుందని కొందరు ప్రబుద్ధులు 19వ శతాబ్దంలో ప్రతిపాదించారు. ప్రకృతిలో జరిగే పరిణామక్రమానికి 'సహజ ఎంపిక' అనే పద్ధతి ఉంటుందని, అన్ని రకాల పరిస్థితులనూ తట్టుకుని నిలబడగలిగే శక్తిమంతమైన జీవులు మాత్రమే మనుగడలో ఉంటాయని డార్విన్ చేసిన ప్రతిపాదన అలాంటివారికి ఆయుధమైంది. దీన్నుంచే శ్రేష్ఠ మానవాభివృద్ధి శాస్త్రం(యుజెనిక్స్) పుట్టుకొచ్చింది. బ్రిటన్‌లో బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరున్న ఫ్రాన్సిస్ గాల్టన్ 1883లో ఈ యుజెనిక్స్‌కు ఊపిరిపోశాడు. యూరోపియన్లలో ఆనాడు ప్రబలంగా ఉన్న ఆధిపత్య భావజాలంలో నుంచి, సాంస్కృతిక భయాందోళనల నుంచి ఈ సిద్ధాంతం పుట్టి ఆ రెండింటినీ మరిన్ని రెట్లు పెంచింది. వేరే జాతుల సంపర్కం తమ జాతి ఉన్నతిని దెబ్బతీస్తుందని శ్వేతజాతీయులు వణికిపోయారు. జన్యు శాస్త్రంలో వెల్లడవుతున్న అంశాల్లో తమకు అనుకూలమైనవి మాత్రమే వెల్లడిస్తూ, ప్రతికూల అంశాలను బయటకు రానీయకపోవడం ద్వారా శాస్త్రవేత్తలు సైతం దీనికి దోహదపడ్డారు.

అమెరికాలో నల్లజాతీయులను అధములుగా చిత్రించి, వారిని బానిసలుగా వినియోగించుకోవటానికీ, వారిపై దుర్మార్గాలను కొనసాగించటానికీ యుజెనిక్స్ దోహదపడింది. నాజీ జర్మనీలో దీన్ని అడ్డం పెట్టుకుని యూదులపై సాగించిన దౌష్ట్యం అంతా ఇంతా కాదు. అక్కడ వేలాదిమందికి సంతాన నిరోధ శస్త్రచికిత్సలు చేయించటం, లక్షలమంది ప్రాణాలు బలిగొనడం ప్రపంచాన్ని నివ్వెరపరిచింది. నిజానికి అంతకు చాలా ముందు నుంచే అమెరికాలోనూ ఈ మాదిరి ఉన్మాదమే ఉంది. వివిధ రాష్ట్రాల్లో వేలాదిమంది శ్వేతేతర జాతివారికి, మానసిక రోగులకూ, నేరస్థులకూ 'చట్టబద్ధం'గా బలవంతపు శస్త్రచికిత్సలు చేశారు. 1926లో ఆవిర్భవించిన ఏఎస్‌హెచ్‌జీ దీన్నంతటినీ సరిదిద్ది జన్యుశాస్త్రానికి విశ్వసనీయత కలిగించాల్సివుండగా అది గుడ్లప్పగించి చూస్తూ ఉండిపోయింది. కొన్నిసార్లు కళ్లముందు జరిగే దుర్మార్గాలను ప్రోత్సహించేలా మాట్లాడింది. జన్యు శాస్త్రంతో సంబంధంలేని సైకాలజిస్టు ఆర్థర్ జెన్సన్, భౌతిక శాస్త్రవేత్త విలియం షాక్‌లీ వంటివారు నల్లజాతీయులు తమ జన్యువుల వల్ల మేధాపరంగా అధములని చెప్పినా సంస్థ నోరెత్తలేదు. పరిశోధనల పేరుతో అనైతిక నిర్ధారణలు చేస్తున్నా మౌనంగా ఉండిపోయింది. తమ నిర్వాకం, నిర్వ్యాపకత్వం పెను తప్పిదమని ఏఎస్‌హెచ్‌జీ ఇప్పుడు అంగీకరించటం విశేషం. అంతేకాదు...శ్రేష్ఠ జాతి సిద్ధాంతం చాటున సంతాన నిరోధ శస్త్ర చికిత్సలు దండిగా ప్రోత్సహించిన విలియం అలన్ పేరిట ఉన్న అత్యున్నత పురస్కారం పేరును మార్చబోతున్నట్టు ప్రకటించింది. జన్యు శాస్త్రంలో విశేష కృషి చేసినవారికి ఏటా ఈ పురస్కారం ఇస్తున్నారు.

రెండు దశాబ్దాలనాడు మానవ జన్యు ప్రాజెక్టు ప్రపంచ జనాభాలో 99.9 శాతం మంది ఒకే రకమైన జన్యు పదార్థం కలిగివున్నారని తేల్చిచెప్పింది. అయినప్పటికీ జాతిపరమైన ఆధిపత్య భావజాలం ప్రపంచంలో ఇప్పటికీ ప్రబలంగానే ఉంది. మన దేశంలో కుల మతాల్లో అది వ్యక్తమవుతుండగా అమెరికా, యూరప్‌లలో రంగు ప్రాధాన్యం పొందుతోంది. 'మా బ్రీడ్ వేరు...మా బ్లడ్ వేరు' అంటూ విర్రవిగేవారికీ, మా మతం అత్యున్నతమైనదని భుజాలు చరుచుకునేవారికీ మన దగ్గర కొదవలేదు. తమది అగ్రవర్ణమని, ఇతరులు అధములనుకునే అజ్ఞానులు ఈనాటికీ దండిగా తారసపడుతుంటారు. ఆ సంగతలా ఉంచి శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించాల్సిన ఏఎస్‌హెచ్‌జీ వంటివి ఎందుకు విఫలమయ్యాయి? సంస్థాగత నిర్మాణాల్లో వైవిధ్యానికి చోటీయకపోవటమే ఈ దుర్గతికి కారణం. ఉదాహరణకు ఏఎస్‌హెచ్‌జీ డైరెక్టర్ల బోర్డులో మైనారిటీ జాతులవారు 2017 నాటికి కేవలం 5 శాతం మంది మాత్రమే. అనంతరకాలంలో ఆత్మవిమర్శ చేసుకున్నాక 2021నాటికి అది 40 శాతానికి పెరిగింది. ఆ తర్వాతే మైనారిటీ జాతుల శాస్త్రవేత్తలకు శిక్షణ కార్యక్రమాలు, సదస్సులు నిర్వహించటం మొదలైంది. మన దేశంలో ఉన్నతాధికారగణంలో, మీడియాలో ఇప్పటికీ ఆధిపత్య కులాలకే ప్రాధాన్యం ఉంటున్నదని ఇటీవల ఒక సర్వేలో వెల్లడైంది. ఇలాంటివి సరిదిద్దనంతకాలం వికృత పోకడలు కొనసాగుతూనే ఉంటాయి. అందుకే ఏఎస్‌హెచ్‌జీ పశ్చాత్తాప ప్రకటన అన్ని దేశాల్లోనివారికీ కనువిప్పు కావాలి.

ఆ పొత్తు చైనాకు తప్పదా?

విశ్లేషణ


యోగేశ్ గుప్తా

చైనా కమ్యూనిస్టు పార్టీ 20వ కాంగ్రెస్‌లో తిరుగులేని అధికారాన్ని చేజిక్కించుకున్నప్పటి నుంచి ఆ దేశాధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఇంటా బయటా సమస్యలనూ, విమర్శలనూ ఎదుర్కొంటున్నారు. అమెరికా నేతృత్వంలో చైనాపై ఆంక్షలు మరింత పెరగడం, ఆసియాలో తన బలమైన పోటీదారైన భారత్‌కు పాశ్చాత్య పెట్టుబడులు తరలిపోతుండటం జిన్‌పింగ్‌కి కొత్త తలనొప్పిని తెచ్చిపెట్టాయి. నూరు చైనా కంపెనీలకు మైక్రోచిప్‌ల ఎగుమతిపై అమెరికా, దాని మిత్రదేశాలు కొనసాగిస్తున్న ఆంక్షలు జిన్‌పింగ్‌ను కలతపెడుతున్నాయి. దీంతో పాలనా విధానాలు, సంస్కరణలపై తన వైఖరిని ఆయన సడలించుకుంటున్నారు. అమెరికాతో సంబంధాలను మెరుగుపర్చుకునే దిశగా అనేక చర్యలు తీసుకున్నారు.

జీరో–కోవిడ్ పాలసీకి వ్యతిరేకంగా నవంబర్‌లో చైనావ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తడంతో గత మూడు నెలలుగా చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ పేరు ప్రతిష్ఠలు దెబ్బతిన్నాయి. ప్రజానిరసనల తర్వాత జిన్‌పింగ్ తన పాలసీని వదిలేయవలసి వచ్చింది. దీంతో చైనాలో కోవిడ్-19 ఇన్ఫెక్షన్ల వేవ్స్ ఉధృతంగా వ్యాపించాయి. నూతన సంవత్సర వేళ తాను చేసిన ప్రసంగంలో, తన జీరో–కోవిడ్ పాలసీపై వెల్లువెత్తిన ప్రజా వ్యతిరేకత గురించి జిన్‌పింగ్ తప్పకుండా ప్రస్తావించాల్సి వచ్చింది. ''ఒక పెద్ద దేశంలో ఒకే సమస్యపై వివిధ రకాల ప్రజలు వివిధ రకాల అభిప్రాయాలను కలిగి ఉండటం సహజం'' అని పేర్కొన్నారు.

కోవిడ్ వల్ల జనాభాలో అత్యధిక శాతం మందికి ఇన్ఫెక్షన్లు సోకాయి. వృద్ధులు, ఇతర వ్యక్తులు పెద్ద సంఖ్యలో మరణించారు. అనేక ప్రాపర్టీ కంపెనీలు దివాలా తీయడంతో మధ్యతరగతి ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. అనేక కంపెనీలు మూసివేతకు గురవడంతో చాలామంది ఉద్యోగాలు కోల్పోయారు. దీంతో జిన్‌పింగ్ పాలనకు వ్యతిరేకంగా అసమ్మతి గణనీయంగా పెరిగిపోయింది. దేశీయ శాంతి, సుస్థిరత, పాలనా నిర్వహణ జిన్‌పింగ్‌కే కాకుండా చైనా కమ్యూనిస్టు పార్టీ పాలనకు కూడా అత్యంత ప్రాధాన్యం కలిగిన విషయం. దీంతో తన పాలసీలపై విమర్శను అడ్డుకోవడానికి జిన్‌పింగ్ అతి చురుకుగా పనిచేయాల్సి వచ్చింది.

ఆయన తన నూతన సంవత్సర ప్రసంగంలో అమెరికా, తదితర దేశాలకు చేరువ కావడం కోసం చైనా మాతృభూమితో తైవాన్ పునరేకీకరణ అనే ఊతపదాన్ని వదిలేసుకున్నారు. తైవాన్ జలసంధికి ఇరువైపులా ఉన్న ప్రజలు ఒకే కుటుంబ సభ్యులు అని చెప్పారు. శరవేగంగా చైనా జాతి శ్రేయస్సు సాధించడానికి తమ రెండు దేశాలూ కలిసి పనిచేస్తాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. స్వదేశంలోని విభిన్న గ్రూపులతో మాట్లాడుతున్న సమయంలో తన జీరో–కోవిడ్ పాలసీని జిన్‌పింగ్ సమర్థించుకున్నారు. ఇది దేశంలో కేసుల నిష్పత్తిని తగ్గించిందనీ, మరణాల రేటును అత్యంత తక్కువ శాతానికి తగ్గించివేసిందనీ చెప్పారు.

అయితే జిన్‌పింగ్‌ను దుర్వార్తలు వెంటాడుతున్నాయి. 2022లో చైనా జనాభా 8.5 లక్షల మేర పడిపోయిందని చైనా నేషనల్ బ్యూరో ఆఫ్ స్టాటిస్టిక్స్ జనవరి 17న ప్రకటించింది. వరదలు, కరవుల కారణంగా, మావో అమలుపర్చిన గొప్ప ముందంజ పారిశ్రామిక విధానం 1961లో కుప్పకూలిన తర్వాత చైనాలో జనాభా తగ్గిపోవడం ఇదే మొదటిసారి. దారిద్ర్యాన్ని వేగంగా అధిగమించడానికి ఒకే సంతానం పాలసీని దాని దీర్ఘకాలిక పర్యవసానాలపై అధ్యయనం చేయకుండానే అమలు చేయాలని 1979లో చైనా పాలకులు నిర్ణయించడంతో చైనా జనాభా తగ్గుతూ వస్తోంది.



అమెరికాకు చెందిన పరిశోధకుడు ప్రొఫెసర్ యి ఫుక్సియన్ ప్రకారం, చైనాలో సంతాన సాఫల్య రేటు 1.3 శాతానికి పడిపోయింది. (జనాభా భర్తీ రేటు 2.1 శాతం). దేశం తన సంతాన సాఫల్య రేటును 1.2 శాతం వద్ద స్థిరపర్చగలిగితే చైనా జనాభా 2050 నాటికి 1.07 బిలియన్లకు, 2100 నాటికి 48 కోట్లకు పడిపోతుంది. జనాభా తగ్గిపోవడం అంటే... ఉద్యోగుల సంఖ్య తగ్గిపోవటం, వృద్ధుల ఆరోగ్య సమస్యలపై ఖర్చు పెరగడం, సామాజిక సంక్షేమ అవసరాలు కుంచించుకుపోవడం, పొదుపు మొత్తాలు తగ్గిపోవడం, వీటికి మించి వస్తూత్పత్తి, ఎగుమతులు, ప్రభుత్వ ఆదాయాలు పడిపోవడం, ప్రజల కొనుగోలు శక్తి సన్నగిల్లిపోవడం, ఆర్థిక వృద్ధి పతనమవడం అని అర్థం.

పైగా దేశ వస్తూత్పత్తి రంగం, వ్యవసాయం, శ్రమశక్తి, సామగ్రి సరఫరా, ఆరోగ్య సంరక్షణ, విద్యుత్ తదితర రంగాల్లో మరింతగా రోబోలను దింపాలని చైనా పథకరచన చేసింది. అయితే ఇప్పటికే ప్రతి 10 వేలమంది ప్రజలకు 322 రోబోలను అందుబాటులో ఉంచిన చైనాపై తాజా పథకం చూపే ప్రభావం పెద్దగా ఉండదు. ప్రపంచ రోబోటిక్స్ రిపోర్ట్–2022 ప్రకారం రోబోల వినియోగంలో అమెరికాను చైనా అధిగమించడమే కాక, ప్రపంచంలో రోబోల వినియోగంలో అయిదో స్థానంలో నిలిచింది.

నూరు చైనా కంపెనీలకు మైక్రోచిప్‌ల ఎగుమతిపై అమెరికా, దాని మిత్రదేశాలు కొనసాగిస్తున్న ఆంక్షలకు సంబంధించిన వార్తలు కూడా జిన్‌పింగ్‌ను కలతపెడుతున్నాయి. దీనికి తోడు చైనాను 'కనీవినీ ఎరుగని వ్యూహాత్మక సవాలు'గా అభివర్ణించిన జపాన్ 2027 నాటికి జీడీపీలో రక్షణ బడ్జెట్ 2 శాతం పెంచాలని నిర్ణయించుకుంది. అంతేకాక చైనాకు, ఉత్తర కొరియాకు వ్యతిరేకంగా జపాన్ కొత్త క్షిపణులు, మానవ రహిత వ్యవస్థలకు చెందిన టెక్నాలజీలు, సైబర్ స్పేస్, అంతరిక్షం, ఎలక్ట్రో మాగ్నెటిక్ స్పెక్ట్రమ్, కృత్రిమ మేధ వంటి ఎదురుదాడి సామర్థ్యాలను మిక్కుటంగా సేకరించనుంది.

2046 నాటికి భారత ఆర్థిక వ్యవస్థ 26 లక్షల డాలర్లకు చేరుకుంటుందనీ, 2025 నాటికి చైనా నుంచి 25 శాతం అమెరికన్ సెల్‌ఫోన్ల ఉత్పత్తిని భారత్‌కు తరలించాలనీ అమెరికా సెల్‌ఫోన్ మాన్యుఫ్యాక్చరింగ్ సంస్థ యాపిల్ తీసుకున్న నిర్ణయానికి సంబంధించి ఎర్నెస్ట్ అండ్ యంగ్ ప్రకటించిన అంచనాలు జిన్‌పింగ్‌కి సంతోషం కలిగించవు. ఆసియా ప్రాంతంలో భారత్ పురోగతిని అడ్డుకుని తన ఆధిక్యాన్ని చాటుకోవాలని చైనా ఇప్పటికే లక్ష్యం పెట్టుకుంది. ఈ నేపథ్యంలో చైనా ఆర్థిక శక్తిని బలహీనపర్చడానికి భారత్ – అమెరికా పొత్తు పెట్టుకోవడం మరో ఉదాహరణగా జిన్‌పింగ్ అభిప్రాయపడవచ్చు.

ఈ అన్ని పరిణామాల వెలుగులో అమెరికాతో సంబంధాలను మెరుగుపర్చుకునే దిశగా జిన్‌పింగ్ అనేక చర్యలు తీసుకున్నారు. మొదటి చర్యగా అమెరికా ప్రభుత్వంపై వాడే తీవ్ర పదజాలాన్ని చైనా ప్రభుత్వం తగ్గించుకుంది. విదేశీ వ్యవహారాలు, జాతీయ భద్రత, ద్రవ్యవ్యవస్థ, పర్యావరణ మార్పు తదితర మంత్రిత్వ శాఖలతో భేటీకి చైనా అధ్యక్షుడు సమ్మతి తెలియజేశారు. చైనాకు వ్యతిరేకంగా అమెరికా తదితర దేశాలు చేసే చిన్న విమర్శలను కూడా తీవ్ర పదజాలంతో తిప్పికొట్టే ధోరణిని జిన్‌పింగ్ మంత్రులు ఇప్పుడు పక్కన పెట్టేశారు. తమ పట్ల అమెరికాకు మించి మరింత స్వతంత్ర వైఖరితో వ్యవహరిస్తున్న జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ దేశాలతో బలమైన సంబంధాలు ఏర్పరచుకోవడానికి కూడా చైనా తహతహలాడుతోంది.

గ్లోబల్ పెట్టుబడికీ, మార్కెట్ సంస్కరణలకూ తలుపులు తెరిచి మార్పునకు తాము సిద్ధమేనంటూ సంకేతాలు వెలువరించడంలో భాగంగా దావోస్‌లో ప్రపంచ ఆర్థిక సమాఖ్య వార్షిక సదస్సుకు చైనా ప్రతినిధిగా చైనా ఉప ప్రధాని, తన పూర్వ ఆర్థిక సలహాదారు అయిన లియూ హేని చైనా అధ్యక్షుడు పంపించారు. పాశ్చాత్య బడా కంపెనీలకు లియూ హే సుపరిచితుడు కావడం విశేషం. అయితే 2022 అక్టోబర్‌లో జరిగిన చైనా కమ్యూనిస్టు పార్టీ 20వ కాంగ్రెస్ సందర్భంగా లియూ హేని పొలిట్ బ్యూరో పదవి నుంచి జిన్‌పింగ్ తొలగించడం విశేషం.

అయితే చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అవలంబించిన లోపభూయిష్ఠ విధానాల కారణంగా అమెరికా, పలు యూరోపియన్, ఆసియా దేశాల, కంపెనీల విశ్వాసం దారుణంగా దెబ్బతింది. ప్రస్తుతం ఇబ్బందుల్లో ఉన్న ఆర్థిక వాతావరణం నుంచి బయటపడే ఎత్తుగడలో భాగంగా మాత్రమే జిన్‌పింగ్ విధానాల్లో వెనుకడుగు వేస్తున్నారనీ, తన వైఖరిని మార్చుకుంటున్నారనీ విదేశీ కంపెనీలు భావిస్తున్నాయి. చైనా ఆర్థిక ప్రగతిని బలహీనపరచడానికి ఆ దేశంపై తమ ఒత్తిడిని ఇవి కొనసాగించనున్నాయి. జిన్‌పింగ్ దూకుడునూ, ఆధిపత్యాన్నీ ప్రతిఘటించడానికి చైనా సాంకేతిక పురోగతిని దెబ్బతీయాలని కూడా ఇవి గతంలోనే నిర్ణయించుకున్నాయన్నది గమనార్హం.

వ్యాసకర్త మాజీ రాయబారి
('ది ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

నా ఇల్లు ఇండియా



పాకిస్తాన్ ఒకప్పుడు నా ఇల్లు. అమెరికా ఇప్పుడు నా తాత్కాలిక విడిది. కానీ ఇండియా ఇప్పటికీ నా ఇల్లే. ఇల్లు ఇల్లే కదా! గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు. సారీ అమెరికా... సారే జహా సే అచ్చా హిందూస్తాన్ హమారా!

– షాయన్ అలీ, స్వేచ్ఛావాది

గొప్ప రచయితకు గౌరవం



భారతదేశపు అతిగొప్ప నవలాకారుల్లో ఒకరైన ఎస్.ఎల్.భైరప్పను దశాబ్దాలుగా పక్కనపెట్టారు. కన్నడ సాహిత్యంలో ఆయనకు అందాల్సిన గుర్తింపు ఇప్పుడు వచ్చింది. ఆయనకు 'పద్మభూషణ్' వచ్చేలా చేసిన ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు చెప్పే కోట్లాది గర్వపూరిత కన్నడిగులతో నేనూ చేతులు కలుపుతున్నాను.

– తేజస్వీ సూర్య, బీజేపీ ఎంపీ

భారత స్ఫూర్తి



ఫలవంతమైన భారత రాజ్యాంగం ఇతర దేశాలకు స్ఫూర్తి. భారత ప్రజాస్వామ్యం మనుగడ సాగించడమే కాదు, వర్ధిల్లుతోంది. ప్రభుత్వానికీ, భారత ప్రజలకూ 74వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా మా హృదయ పూర్వక సత్కారాలు. భారత్‌కు శాంతి, పురోగతి, సంపద కలగాలని కోరుకుంటున్నాం.

– అబ్దుల్లా షాహిద్, మాల్దీవుల విదేశాంగ మంత్రి

ఏముందని చూస్తున్నారు?



'పఠాన్' సినిమాకు వస్తున్న స్పందన చూసిన తర్వాత, ఇండియాలోని మూర్ఖుల సంఖ్య మీద నా అంచనా 90 శాతం నుంచి 95 శాతానికి పెరిగింది.

– మార్కండేయ ఖట్జూ, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి

అన్నీ ఉన్నాయి



'పఠాన్'లో అన్నీ ఉన్నాయి. స్టార్ పవర్, స్టైల్, హంగు, ఆత్మ, విషయం, ఆశ్చర్యాలు, ఇంకా అన్నింటికంటే ముఖ్యంగా ప్రతీకారేచ్ఛతో వచ్చిన షారుక్ ఖాన్. 2023లో ఇదే మొదటి బ్లాక్ బస్టర్!

– తరణ్ ఆదర్శ్, సినీ విమర్శకుడు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

విశ్వసనీయతే అధికారానికి సోపానం

అభిప్రాయం


రఘురామ్ పురిఘళ్ళ

విశ్వసనీయత గల నాయకులకు అధికారం దగ్గరగా ఉంటుంది. అనేక మంది నాయకులు అనేక దశాబ్దాలుగా దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పరిపాలన సాగించారు. విశ్వసనీయత కోల్పోయినప్పుడు ప్రజలు వారిని గద్దె దించారు. ఉదాహరణకు ఏ సామాజిక మాధ్యమాలూ లేనటువంటి కాలంలోనే ఇందిరాగాంధీ తప్పు చేస్తే ప్రజలు ఓడించి, అధికారానికి దూరం చేశారు. అందుకే విశ్వసనీయత రాజకీయాల్లో చాలా అవసరం.

విశ్వసనీయతతో జ్యోతిబసు మూడు దశాబ్దాలు పరిపాలించారు. లాలూ 15 సంవత్సరాలు, ఒకప్పుడు బిజూ పట్నాయక్, ఇప్పుడు నవీన్ పట్నాయక్, కరుణానిధి, జయలలిత, వైఎస్, మమతా బెనర్జీ, ఎన్టీఆర్... ఇలా అనేక మందిని మనం చెప్పుకోవచ్చు. ఈ మధ్యకాలంలో కొత్తగా కేజ్రీవాల్ ఢిల్లీలోనూ విశ్వసనీయతతో గెలుస్తూ వస్తున్నారు.



నా విశ్లేషణ ప్రకారం భారతదేశ రాజకీయాల్లో అటల్ బిహారీ వాజ్‌పేయి తర్వాత అత్యంత విశ్వసనీయత కలిగిన నాయకుల్లో నరేంద్ర మోదీ మొదటి వరుసలో ఉంటారంటే అతిశయోక్తి లేదు. గుజరాత్‌లో మూడు సార్లు హ్యాట్రిక్ విజయం సాధించి, మరో మూడుసార్లు గుజరాత్‌ను బయట ఉండి గెలిపించిన నాయకుడిగా ఖ్యాతి చెందారు. అదే విధంగా 2014, 2019 పార్లమెంటు ఎన్నికల్లో దేశ ప్రధాని అభ్యర్థిగా ప్రజలు నరేంద్ర మోదీని నమ్మి భాజపాను గెలిపించారు. ఇప్పుడు హ్యాట్రిక్ దిశగా 2024 పార్లమెంటు ఎన్నికలకు సిద్ధమవుతున్నారు.

బెంగాల్‌లో కమ్యూనిస్టుల తర్వాత మమతా బెనర్జీ వరుసగా మూడుసార్లు ప్రజల అచంచల విశ్వాసంతో అధికారాన్ని చేపట్టారు. ఒరిస్సాలో నవీన్ పట్నాయక్ ప్రజల విశ్వాసాన్ని చూరగొని ఐదో సారి అధికారాన్ని నిలబెట్టుకుంటున్నారు. తమిళనాడు రాజకీయాల్లో కరుణానిధి, జయలలిత తమ ప్రభావాన్ని ప్రజల్లో నిలబెట్టుకున్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్.టి.రామారావు ప్రజల్లో విశ్వసనీయ నేతగా మన్ననలు పొందారు. ఒంటిచేత్తో అధికారాన్ని చేజిక్కించుకున్నారు. పేదప్రజల మనిషిగా సుస్థిర స్థానాన్ని పొందారు. అదేవిధంగా పార్టీలకు అతీతంగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రజల మన్నన, విశ్వాసాలు పొందారు.


అదే చంద్రబాబు నాయుడు విషయానికి వస్తే 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పరిపాలించినప్పటికీ, మరో 13 సంవత్సరాలు ప్రతిపక్ష నేతగా ఉన్నప్పటికీ ప్రతి ఎన్నికల్లోనూ ఎవరో ఒకరితో పొత్తుతోనే గెలుపొందారు. ఒంటరిగా ఎప్పుడు కూడా గెలవలేకపోయారు. 1999 ఎన్నికల్లో భాజపాతో జట్టుకట్టి గెలుపొందారు. 2004 ఎన్నికల్లో తిరిగి భాజపాతో జట్టుకట్టారు. 2009 ఎన్నికల్లో టీఆర్ఎస్, కమ్యూనిస్టులతో కలిసి ఎన్నికలకు వెళ్ళి ఓటమి పాలయ్యారు. 2014లో మళ్ళీ భాజపా, జనసేనతో జట్టుకట్టి విజయం సాధించారు. 2019లో తెలుగుదేశానికీ, ఎన్టీఆర్‌కూ బద్ధ శత్రువైన కాంగ్రెస్ పార్టీతో పొత్తుపెట్టుకొని పరువు పోగొట్టుకున్నారు. ఒకసారి అటల్ బిహారీ వాజ్‌పేయి చరిష్మాతో పొత్తులో విజయం సాధించారు. మరోసారి నరేంద్ర మోదీ హవాలో గెలుపొందారు. కానీ ఎన్నడూ ఒంటరిగా ఎన్నికలను ఎదుర్కోలేదు.

2024 ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అన్ని పార్టీలూ ఎన్నికలకు సిద్ధమౌతున్న నేపథ్యంలో చంద్రబాబు మాత్రం పొత్తుల కోసం తహతహలాడుతున్నారు. జనసేనతో కలవాలనీ, భాజపాతో కూడా కలిసి పనిచెయ్యాలనీ ఉవ్విళ్ళూరుతున్నారు. 2014 పొత్తులను మళ్ళీ పునరావృతం చెయ్యాలనే గట్టి ప్రయత్నాల్లో ఉన్నారు. మరోవైపు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మాత్రం ఒంటరి పోరుతోనే బరిలోకి దిగాలని నిశ్చయించారు. ఏది ఏమైనా రాబోయే ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు రసవత్తరంగా ఉండనున్నాయి.

వ్యాసకర్త బీజేపీ సీనియర్ నాయకులు, న్యూఢిల్లీ

చెయ్యి తోని చెయ్యి ఎప్పుడు గల్వుతరు?

అట్లుంటది


తెలిదేవర భానుమూర్తి

పొద్దు మీకింది. ఎప్పటి తీర్గనే చౌరస్తల ఉన్న పాన్ డబ్బ కాడ్కి బోయిన. పాన్ డబ్బ మా అడ్డ. దినాం పొద్దు మీకంగనే మా దోస్తు లందరు గాడ జమైతరు. నాత్రి తొమ్మిది గొట్టె దాంక ముచ్చట బెడ్తం. నేను బోకముందు మా దోస్తులు ఏం మాట్లాడుకుంట్రో నా కెర్క లేదు. గని నేను బోయినంక గీ తీర్గ ముచ్చట బెట్టింద్రు.

''మొన్న ఓటర్ల దినాన మా వాడ కట్టు ఓటర్లు మీటింగ్ బెట్టింద్రు'' అని యాద్గిరి అన్నడు.

''మీటింగ్ బెట్టి ఏం జేసింద్రు'' అని సత్నారి అడిగిండు.

''తీర్మానాలు జేసింద్రు''

''గయేంటియో జర జెప్పు''

''గ్యాస్ బండ దర బెంచింద్రు. బస్ చార్జిలు బెంచింద్రు. కరెంటు చార్జిలు గుడ్క బెంచింద్రు. మనం గుడ్క ఓటు దర బెంచాలె. ఓటును అగ్వ దరకు అమ్మే సవాల్ లేదు. ఉద్దెర నడ్వదు. అంత నగతే. గిట్ల నగతిస్తె గట్ల ఓటేస్త మనాలె. గుండు గుత్త ఓట్ల కోసం కుల పెద్దకు రూపాయలిచ్చినమని లీడర్లు జెప్తె నమ్మొద్దు. ఓటరు అంటె ఎవడు. దేవునసుంటోడు. దేవునికి ఏ తీర్గ పూజలు జేస్తరో గదే తీర్గ లీడర్లు ఓటర్కు పూజలు జెయ్యాలె'' అని యాద్గిరి ఇంకేమొ జెప్పబోతుంటె ఇస్తారి అడ్డం దల్గి –

''నోటుకు ఓటు గాకుంట ఇంకేమన్న తీర్మానాలు జేసింద్రా?'' అని అడిగిండు.

''చేసింద్రు. ఓటు ఏసెతందుకు బోయెటోల్లని మోటర్ల దీస్క బోవాలె. లైన్ల శానసేపు నిలబడే పనిబడ్తె కాల్లు నొవ్వకుంట తలా ఒక కుర్సి ఏసి కూసుండ బెట్టాలె. ఎండ దాకకుంట షామియానాలు ఎయ్యాలె. షామియాన ఏసేటి మోక లేకుంటె తలకొక ఛత్రి బట్టే సౌలత్ బెట్టాలె. ఎండ కాలంల ఓట్లేసే పని బడ్తె సల్లటి సోడలు తాపియ్యాలె. గదే సలికాలమైతె ఛాయ్, కాఫీ ఇయ్యాలె'' అని యాద్గిరి జెప్పిండు.

''కూట్లె రాయి దీయనోడు ఏట్లె రాయెట్ల దీస్తడు అని బీఆర్ఎస్ లీడర్లు అంటుంటరు. గని గాల్లే గురువింద ఇత్తు అసుంటోల్లన్న సంగతిని యాది మరుస్తున్నరు'' అని ఇస్తారి అన్నడు.

''గా సంగతేందో జెర జెప్పు'' అని సత్నారి అన్నడు.

''హుజూరాబాద్ బై ఎలచ్చన్ల ముంగట దలిత బందు పద్కం బెట్టింద్రు. ఎట్లన్న జేసి గెల్వాలని గా నియోజక వర్గంల అమలు జేసింద్రు. వాసాల మర్రిల 75 మంది దళితులకు గీ పద్కం కింద తలా పది లచ్చల రూపాయలిచ్చింద్రు. అటెంకల నియోజక వర్గంకు 500 మందికి దలిత బందు పద్కం కింద తలా పది లచ్చలు ఇస్తమన్నరు. మల్ల గిప్పుడు 200 మందికే ఇస్తమంటున్నరు. బడ్జెట్ బెట్టి యాడాదైంది. గని పోయిన పది నెలలల్ల ఒక్కడంటె ఒక్కనికి గుడ్క ఈ పద్కం కింద రూపాయలియ్య లేదు. బీఆర్ఎస్ సర్కారొస్తె దేసమంత దలిత బందు పద్కం బెడ్త మని కేసీఆర్ అన్నడు. రాష్ట్రంలనే అమలు జెయ్యనోడు దేసంల అమలెట్ల జేస్తడు'' అని ఇస్తారి అన్నడు.



''హాత్ సే హాత్ యాత్ర సంగతేంది?''

''వొచ్చె నెల ఆరో తారీకు కెల్లి రాష్ట్రంల హాత్ సే హాత్ జోడో యాత్ర జేస్తమని కాంగ్రెస్ లీడర్లు అంటున్నరు. ముందుగాల చబ్బీస్ జన్వరి కెల్లి గీ పాదయాత్ర జేద్దామనుకున్నరు. రాహుల్ గాంధి బారత్ జోడో పాదయాత్ర కశ్మీర్లకు బోయింది. గని జమ్ముల చబ్బీస్ జన్వరి దినాన గాకుంట ముప్పై తారీకు రాహుల్ జెండ ఎగిరేస్తడట. బారత్ జోడో కతమైన చబ్బీస్ జన్వరి దినాన్నే హాత్ సే హాత్ జోడో పాదయాత్ర షురువు జేద్దామని కాంగ్రెస్ లీడర్లు అనుకున్నరు. గని జమ్ముల రాహుల్ పబ్లిక్ మీటింగ్ వాయిద బడ బట్కె తెలంగానల పాదయాత్ర గుడ్క వాయిద బడ్డది. యథా లీడర్ తథా క్యాడర్.''

''హాత్ సే హాత్ జోడో అంటె చెయ్యితోని చెయ్యి గల్పుడు. చెయ్యి తోని చెయ్యి ఎప్పుడు గల్వుతరు. కుస్తీ పట్టేటి ముంగట గల్వుతరు. చెయ్యి తోని చెయ్యి గల్పుడు అంటె చెయ్యిచ్చుడు. గీ రొండిట్ల ఏం జేస్తమని కాంగ్రెస్ జెప్తున్నది'' అని సత్నారి అడిగిండు.

''కోడి గుడ్డు మీద బూరు బీక్తున్నవు. పస్కలొచ్చినోనికి దునియంత పచ్చగనే కండ్ల బడ్తదట'' అని ఇస్తారి అన్నడు.

''గాంది బవన్కు వొచ్చేటి సవాల్ లేదన్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి గీనడ్మ గాంది బవన్కు వొచ్చిండు. రేవంత్ రెడ్డిని గల్సిండు. ఇద్దరం గల్సి హాత్ సే హాత్ జోడో పాదయాత్ర జేద్దామన్నడు. మునుగోడు బై ఎలచ్చన్లప్పుడు కాంగ్రెస్ కిలాఫ్ మాట్లాడిన వెంకట్ రెడ్డి మీద డిసిప్లినరీ యాక్షన్ దీస్కోవాలెనని కొండా సురేక అంటున్నది. ముందుగాల్ల లీడర్ సే లీడర్ జోడో అయినంకనే హాత్ సే హాత్ జోడో అంటె బాగుంటది'' అని సత్నారి అన్నడు.

''ఆది శంకరాచార్య అందరి కన్న ఫస్టు కన్యాకుమారి కెల్లి కశ్మీర్ దాంక పాదయాత్ర జేసింద్రు. మల్ల గిప్పుడు శంకరాచార్య తీర్గనే రాహుల్ గాంధి గుడ్క కన్యాకుమారి కెల్లి కశ్మీర్ దాంక పాదయాత్ర జేసిండని కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా ఒక్క తీర్గ తారీఫ్ జేసిండు. గాయిన శంకరాచార్య అనంగనే రాహుల్‌కు ముగ్గురు దేవులల్ల ఒక్కడైన శంకరుడు యాది కొచ్చిండు. యాదికి రాంగనే గాయిన చెయ్యి సూబెట్టిండు. బారత్ జోడో యాత్ర అనేటి తపస్సు జేసిన. చేసినంకనే మీకు అరచెయ్యి అంటె అభయ ముద్ర సూబెడ్తున్న అని రాహుల్ గాంధి అన్నడు'' అని యాద్గిరి జెప్పిండు. నాత్రి తొమ్మిది గొట్టినంక ఎవలింటికి గాల్లు బోయినం.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్ । 99591 50491

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం,. తిథి: శు.షష్ఠి ప.3.26 వరకు, తదుపరి సప్తమి, నక్షత్రం: రేవతి రా.12.40 వరకు, తదుపరి అశ్విని, వర్జ్యం: ప.12.54 నుండి 2.30 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.53 నుండి 9.35 వరకు, తదుపరి ప.12.34 నుండి 1.21 వరకు, అమృతఘడియలు: రా.10.28 నుండి 11.32 వరకు ; రాహుకాలం: ఉ.10.30 నుండి 12.00 వరకు, యమగండం: ప.3.00 నుండి 4.30 వరకు, సూర్యోదయం: 6.38, సూర్యాస్తమయం: 5.48

బీజేపీలో రామచంద్ర చేరిక వాయిదా

- అనుచరులు, కార్యకర్తలతో బీజేపీ కార్యాలయానికి చేరుకున్న రాజనర్సింహ
- చివరి క్షణంలో రెండు రోజుల తర్వాత నిర్ణయమన్న పార్టీ నేతలు
- బాబూమోహన్ అభ్యంతరంతోనేనా?

సాక్షి, హైదరాబాద్: బీజేపీలో చేరికలు పూర్తిస్థాయిలో పుంజుకోవడం లేదు. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఇతర పార్టీల నుంచి వివిధస్థాయిల నాయకులు చేరేందుకు ముందుకొస్తున్నా కొన్నిచోట్ల బీజేపీ నేతలే అడ్డుపడుతున్నట్టు తెలుస్తోంది. తాజాగా కాంగ్రెస్‌నేత, మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహ సోదరుడు రామచంద్ర రాజనర్సింహ పార్టీలో చేరాలనుకోగా ఇలాంటి అనుభవమే ఎదురైంది. గురువారం బీజేపీలో చేరేందుకు ముహూర్తం ఫిక్స్ చేసుకోవడంతో పాటు తమ సన్నిహితులు, అనుచరులతో ఆయన జహీరాబాద్ నుంచి బీజేపీ ఆఫీసుకు వచ్చారు. ఈ చేరికకు సంబంధించిన ఫ్లెక్సీలను కూడా పార్టీ కార్యాలయం బయట ఏర్పాటు చేసుకున్నారు. పార్టీ అధ్యక్షుడు బండి సంజయ్‌ను కూడా కలుసుకున్నారు. అయితే ఈ చేరికపై బీజేపీనేత, మాజీ మంత్రి బాబూమోహన్ అభ్యంతరం తెలపడంతో ఇది వాయిదా పడ్డట్టు సమాచారం. రెండు, మూడురోజుల తర్వాత స్థానిక పార్టీ నేతలతో చర్చించాక దీనిపై నిర్ణయం తీసుకుంటామని బీజేపీ నాయకులు చెప్పినట్టు తెలిసింది.

ఆంథోల్ వద్దంటే వద్దని చెప్పినా: తాను ఆంథోల్ నుంచి పోటీ చేయనని కాగితం రాసి ఇచ్చేందుకు కూడా సిద్ధమని రామచంద్ర చెప్పినట్టు తెలుస్తోంది. బీజేపీకి చేసుకున్న దరఖాస్తులో జహీరాబాద్ లేదా చేవేళ్ల నుంచి పోటీకి అవకాశం కల్పించాలని ఆయన కోరినట్టు పార్టీవర్గాల సమాచారం. ఇదిలా ఉంటే..గతంలో దామోదర రాజనర్సింహ భార్య పద్మిని బీజేపీలో ఉదయం చేరి... సాయంత్రానికి రాజీనామా చేశారు.

కూకట్‌పల్లి నేతల చేరిక: గురువారం బండి సంజయ్ సమక్షంలో మేడ్చల్ అర్బన్ జిల్లా కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు వడ్డేపల్లి శ్రవణ్‌కుమార్, సునీల్‌కుమార్‌రెడ్డి, కూకట్‌పల్లి రెడ్డి సంఘం అధ్యక్షుడు సాధుప్రతాప్‌రెడ్డి బీజేపీలో చేరారు.

మార్చి 13 నుంచి టీఎస్‌సెట్ పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): అధ్యాపక ఉద్యోగాల అర్హతకు సంబంధించిన తెలంగాణ రాష్ట్ర అర్హత పరీక్ష (టీఎస్‌సెట్-2022)లను మార్చి 13, 14, 15 తేదీల్లో నిర్వహించనున్నట్లు మెంబర్ సెక్రటరీ మురళీకృష్ణ గురువారం తెలిపారు. ఈనెల 25న చివరి తేదీ గడువు ముగిసేనాటికి వివిధ సబ్జెక్టులకు 49 వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు వెల్లడించారు. రూ.1,500 అపరాధ రుసుముతో ఈనెల 30 వరకు, రూ.2,000 అపరాధ రుసుముతో ఫిబ్రవరి 5 వరకు, రూ.3,000 అపరాధ రుసుముతో 10 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఫిబ్రవరి చివరి వారం నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. తెలంగాణలో పది పరీక్షా కేంద్రాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, తిరుపతి, కర్నూలు, విజయవాడలో 4 ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలను టీఎస్‌సెట్-2022 వెబ్‌సైట్‌లో చూడవచ్చని తెలిపారు.

సింగరేణి టర్నోవర్ రూ.34 వేల కోట్లు

గణతంత్ర దినోత్సవంలో సీఎండీ శ్రీధర్

సాక్షి, హైదరాబాద్: సింగరేణి బొగ్గు గనుల సంస్థ గతేడాది రూ.26 వేల కోట్ల టర్నోవర్ సాధించిందని, ఈ ఏడాది రూ.34 వేల కోట్ల రూపాయల టర్నోవర్ సాధించే దిశగా దూసుకుపోతోందని సంస్థ సీఎండీ ఎన్.శ్రీధర్ వెల్లడించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆయన గురువారం సింగరేణి భవన్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించారు.

కొడుకు వేధింపులు తట్టుకోలేక తల్లి ఆత్మహత్య

చిట్యాల: కన్న కొడుకు వేధింపులు తట్టుకోలేక ఓ తల్లి బావిలో పడి ఆత్మహత్యకు పాల్పడింది. జయశంకర్‌భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగ గ్రామంలో గురువారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. చల్లగరిగ గ్రామానికి చెందిన పిసగాని రాజ్యలక్ష్మి (65)కి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. చిన్న కుమారుడు భావనరుషి మద్యానికి బానిసై డబ్బుల కోసం తల్లిని వేధించేవాడు. కుమారుడి వేధింపులు తట్టుకోలేక అదే గ్రామంలో ఉంటున్న కూతురు రుక్మిణి ఇంటి వద్దకు వెళ్లింది. గురువారం కుమారుడు భావనరుషి మద్యం మత్తులో తల్లి వద్దకు వెళ్లి గొడవ చేశాడు. దీంతో ఆమె మనస్తాపానికి గురై గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలికి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

'రాజ్యాంగ స్ఫూర్తితో ప్రజలకు మేలు కలిగేలా చూడాలి'

సాక్షి, హైదరాబాద్: రాజ్యాంగ స్ఫూర్తిని అందిపుచ్చుకుని ప్రజలకు మేలు కలిగేలా పనిచేయాలని ఇంజనీర్లకు మిషన్ భగీరథ ఈఎన్సీ కృపాకర్‌రెడ్డి సూచించారు. సీఎం కేసీఆర్ ప్రారంభించిన అభివృద్ధి యజ్ఞంలో ఇంజనీర్ల పాత్రే ప్రముఖంగా ఉందన్నారు. మిషన్ భగీరథ, కాళేశ్వరం, రహదారుల విషయంలో నేడు తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్‌గా ఉందని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరికి స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్న ప్రభుత్వ సంకల్పం సాకారమైందని తెలిపారు. గురువారం ఎర్రమంజిల్‌లోని పంచాయతీరాజ్, మిషన్ భగీరథ కేంద్ర కార్యాలయంలో 74వ భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా కృపాకర్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

నిద్రకూ ఒక లెక్కుంది!

18-60 ఏళ్ల మధ్యవారికి కనీసం 7 గంటల నిద్ర అవసరం

- టీనేజ్ వారు, పిల్లలకు మరింత ఎక్కువ సమయం కావాలి
- తగినంత నిద్రతో మంచి ఇమ్యూనిటీ.. జ్ఞాపకశక్తి, ఏకాగ్రత మెరుగుదల



- నిద్ర తగ్గితే ఊబకాయం, మధుమేహం, మానసిక సమస్యలు
- టీ, కాఫీలు, ఎలక్ట్రానిక్ పరికరాల వాడకం తగ్గించాలంటున్న నిపుణులు

చిన్నా పెద్దా అని తేడా లేదు.. చాలా మందికి నిద్రలేమి పెద్ద సమస్యగా మారింది.. పైకి తెలియకుండానే శారీరక, మానసిక సమస్యలకు కారణమవుతోంది. ఉద్యోగాలు, వృత్తులు, వ్యాపారాలు, విద్యాపరంగా ఒత్తిళ్లు, పోటీ ప్రపంచంలో కెరీర్‌పై ఫోకస్ పెరగడంతో నెలకొన్న ఒత్తిడి వంటివి ఒకవైపు అయితే.. విపరీతంగా స్క్రీన్ టైమ్ (ఫోన్లు, కంప్యూటర్ల వాడకం, టీవీ చూడటం వంటివి) పెరిగిపోవడం మరోవైపు దీనికి కారణమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. కోవిడ్ కారణంగా గత మూడేళ్లుగా నెలకొన్న పరిస్థితులు, రోజువారీ జీవన విధానంలో వచ్చిన మార్పులూ సమస్య పెరగడానికి దారి తీస్తున్నాయని అంటున్నారు. దీనికి సంబంధించి ప్రపంచవ్యాప్తంగా యూనివర్సిటీలు, వైద్య సంస్థలు అధ్యయనం చేసి.. నిద్ర లేమి కారణాలు, దీనివల్ల తలెత్తుతున్న సమస్యలపై నివేదికలు విడుదల చేశాయి. ఆ అంశాలపై ఓ లుక్కేద్దాం. – సాక్షి, హైదరాబాద్

7 నుంచి 9 గంటల నిద్ర వల్ల ప్రయోజనాలివీ..



- 18 నుంచి 60 ఏళ్ల మధ్య వయసు వారికి కనీసం 7 గంటల రాత్రి నిద్ర అవసరం.
- తగినంత నిద్రతో రోగ నిరోధక శక్తి ఉత్తేజితం అవుతుంది. అనారోగ్యం బారినపడే అవకాశాలు తగ్గుతాయి. ● ఒకవేళ ఏదైనా చిన్నపాటి అనారోగ్యం కలిగినా వేగంగా కోలుకోగలుగుతారు.
- 7 నుంచి 9 గంటల మధ్య నిద్రతో జ్ఞాపకశక్తి, సృజనాత్మకత మెరుగుపడుతుంది.
- ఏకాగ్రత కూడా పెరిగి సమస్యలను సులభంగా పరిష్కరించేందుకు తోడ్పడుతుంది.
- రోజువారీ వ్యక్తిగత జీవితం ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటుంది.

5, 6 గంటలు, అంతకంటే తక్కువ నిద్రతో సమస్యలివీ..



- ఐదారు గంటల కన్నా తక్కువ నిద్రతో రోగ నిరోధక శక్తి బలహీనంగా మారుతుంది.
- ఊబకాయం, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు, గుండెపోటు, కుంగుబాటు వంటివి తలెత్తే ప్రమాదం పెరుగుతుంది.
- 5 గంటలు, అంతకంటే తక్కువ నిద్రతో ఊబకాయం వచ్చే అవకాశాలు 20 శాతం పెరుగుతాయి.
- జ్ఞాపకశక్తి, ఏకాగ్రత తగ్గుతాయి. కొత్త అంశాలను నేర్చుకోవాలన్న జిజ్ఞాస 40%పైగా తగ్గిపోతుంది.
- దీర్ఘకాలం నిద్ర సమయం తక్కువగా ఉంటే మానసిక సమస్యలు తలెత్తుతాయి. చిన్న విషయానికే ఆందోళన పడటం, కుంగుబాటు, షార్ట్ టెంపర్, ప్రతీదానికి విసుక్కోవడం, వాహనాలు నడిపేప్పుడు ఏకాగ్రత కోల్పోవడం వంటివి జరుగుతాయి.
- చేసే పనుల్లో తరచూ తప్పులు దొర్లడం, పనివేగం తగ్గిపోవడం, మార్పులకు తగినట్టు సర్దుబాటుకాకపోవడం, భావోద్వేగాలపై నియంత్రణ కోల్పోవడం లాంటి సమస్యలు వస్తాయి.

సమస్యను అధిగమించేందుకు ఇలా చేయొచ్చు





- క్రమం తప్పకుండా రోజూ అరగంటకుపైగా వ్యాయామం, నడక
- రాత్రి మితంగా భోజనం చేయాలి. సాయంత్రాలు సిగరెట్లు, మద్యం, పొగాకు వంటివి తీసుకోవద్దు. ● వీకెండ్స్, ఆదివారాలు సహా అన్నిరోజుల్లో నిద్రపోయేందుకు, పొద్దున లేచేందుకు ఒకే సమయం పాటించాలి. ● బెడ్రూంలలో టీవీలు, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు, మొబైల్స్ వంటి ఎలక్ట్రానిక్, డిజిటల్ పరికరాలను వినియోగించొద్దు.
- నిద్రించే చోట తగిన ఉష్ణోగ్రత, తక్కువ వెలుతురు, శబ్దాలు ఎక్కువగా లేకుండా చూసుకోవాలి.

నిద్ర తగ్గితే శారీరక, మానసిక సమస్యలు



గత పదేళ్లలో భారతీయుల్లో నిద్ర అలవాట్లు, పద్ధతుల్లో బాగా మార్పులు జరిగాయి. నిద్ర అనేది కేవలం శరీరానికి విశ్రాంతి మాత్రమే కాదు. మెదడు పనితీరును మెరుగుపర్చుకునేందుకు, ఆ రోజంతా చేసిన పనులను ఒక క్రమపద్ధతుల్లో పెట్టుకోవడానికి, 'మెటబాలిక్ రియాక్షన్ రిథమ్'లో ఉండటానికి నిద్ర తోడ్పడుతుంది. అర్ధరాత్రి దాకా మేలుకుని ఉండటం, లేవడం వంటివాటి వల్ల 'సర్కాడియన్ సైకిల్' దెబ్బతింటుంది. ఐదు గంటల కంటే తక్కువ నిద్ర ఉంటే.. శారీరక, మానసిక సమస్యలు తలెత్తుతాయి.

– సి.వీరేందర్, సీనియర్ సైకాలజిస్ట్

ఐటీ ఉద్యోగుల్లో తీవ్రంగా సమస్య



మూడేళ్లుగా ఐటీ కంపెనీలు, ఇతర రంగాల ఉద్యోగులు అధికంగా వర్క్‌ఫ్రం హోం పద్ధతికి మారారు. ఇప్పటికీ ఈ విధానాన్ని కొనసాగిస్తున్న వారిలో సరైన నిద్రలేకపోవడం, గురక, మధ్యలో ఉలిక్కిపడి లేవడం, పొద్దున లేచాక ఫ్రెష్‌గా అనిపించకపోవడం వంటి లక్షణాలతో కూడిన 'అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ ఆప్నియా' సమస్య కనిపిస్తోంది. ఈ సమస్యలతో వస్తున్న ఐటీ ఉద్యోగులకు తగిన చికిత్స అందిస్తున్నాం. ఎట్టిపరిస్థితుల్లోనూ రోజుకు 7, 8 గంటల నిద్ర ఉండాలి. సాయంత్రం 5 తర్వాత టీ, కాఫీ తీసుకోకపోవడం, రాత్రి 9 తర్వాత ఎలక్ట్రానిక్ పరికరాల వాడకం ఆపేయడం మంచిది. నిద్రవచ్చినా, రాకపోయినా రాత్రి 9.30 గంటలకల్లా బెడ్‌పైకి వెళ్తే ఈ సమస్యను అధిగమించవచ్చు.

– వీవీ రమణప్రసాద్, పల్మనాలజీ, స్లీప్ డిజార్డర్స్ స్పెషలిస్ట్, కిమ్స్ ఆస్పత్రి

రోజూ ఏ వయసువారికి ఎంత నిద్ర అవసరం?

వయసు	నిద్ర సమయం	వయసు	నిద్ర సమయం
4-12 నెలల పిల్లలు	12-16 గంటలు	13-18 ఏళ్ల మధ్యవారు	8-10 గంటలు
1-2 ఏళ్ల మధ్యపిల్లలు	11-14 గంటలు	18 ఏళ్లు పైబడినవారు	కనీసం 7 గంటలు
3-5 ఏళ్ల మధ్యవారు	10-13 గంటలు		
6-12 ఏళ్ల మధ్యవారు	9-12 గంటలు		

(అమెరికన్ అకాడమీ ఆఫ్ స్లీప్ మెడిసిన్, స్లీప్ రిసెర్చ్ సొసైటీ సిఫార్సుల మేరకు..)



గురువారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుతో సమావేశమైన ఛత్రపతి శివాజీ వారసుడు శంభాజీ రాజె. చిత్రంలో ఎమ్మెల్సీ కవిత

తెలంగాణ నమూనా దేశవ్యాప్తం కావాలి

- ఛత్రపతి శివాజీ వారసుడు శంభాజీ రాజె
- ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌తో భేటీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో అమలవుతున్న ప్రగతి నమూనా మహారాష్ట్ర సహా దేశంలోని అన్ని రాష్ట్రాలకు విస్తరించాలని మాజీ ఎంపీ ఛత్రపతి శంభాజీ రాజే ఆకాంక్షించారు. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమ పథకాలు మహారాష్ట్రలో కూడా అమలు చేయాలనే ఆకాంక్షను వ్యక్తం చేశారు. మరాఠా వీరుడు ఛత్రపతి శివాజీ 13వ వారసుడు, సాహూ మహారాజ్ మనవడు, కొల్హాపూర్ సంస్థాన వారసుడు, స్వరాజ్ ఉద్యమ కారుడు అయిన శంభాజీ రాజె గురువారం ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావుతో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. కేసీఆర్ మధ్యాహ్న భోజనంతో శంభాజీ రాజెకు ఆతిథ్యం ఇచ్చారు. ఈ సందర్భంగా ఇద్దరూ పలు అంశాలపై చర్చించారు. తెలంగాణలో అమల వుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను, రైతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల పట్ల ప్రభుత్వ విధానాలను రాజె ఆరా తీశారు.

వినూత్న ఎజెండాతో ప్రజల ముందుకు

అభివృద్ధికి సంబంధించిన అంశాలతో పాటు దేశంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులపై కూడా కేసీఆర్, శంభాజీ రాజె నడుమ చర్చ జరిగింది. దేశ అభివృద్ధి, సమగ్రత, ప్రజా సంక్షేమం లక్ష్యంగా వినూత్న ఎజెండాతో ప్రజల్లోకి వెళ్లాల్సిన అవసరముందనే అభిప్రాయం ఈ భేటీలో వ్యక్తమైంది. సందర్భాన్ని బట్టి మరోమారు కలిసి మరిన్ని అంశాలపై చర్చించాలని నిర్ణయించారు. శంభాజీ రాజె పూర్వీకులు శివాజీ మహరాజ్ నుంచి సాహూ మహరాజ్ దాకా దేశానికి అందించిన సేవలను ఇరువురు స్మరించుకున్నారు. సమానత్వం, ప్రజా సంక్షేమం దిశగా వారందించిన పాలన దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోతుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా 'రాజర్షి సాహూ ఛత్రపతి' పుస్తకాన్ని కేసీఆర్‌కు శంభాజీ రాజె అందించారు. ఈ భేటీలో మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్సీలు కవిత, మధుసూదనాచారి, పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు శంభాజీ రాజెతో పాటు వచ్చిన ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇక్కడ వచ్చేది బీజేపీ ప్రభుత్వమే

- ప్రజల ఆకాంక్షలకనుగుణంగానే మేనిఫెస్టో
- మహిళామోర్చా భేటీలో బండి సంజయ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో క్షేత్ర స్థాయి పరిస్థితులు, సమస్యలు, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే ఎన్నికల మేనిఫెస్టోను రూపొందిస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ వెల్లడించారు. ఇతర రాజకీయ పార్టీల మాదిరిగా నాలుగు గోడల మధ్య కూర్చుని మేనిఫెస్టోను రూపొందించడం లేదన్నారు. ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యలను స్వయంగా పరిశీలించి వారు ఏం కోరుకుంటున్నారో చేసిన అధ్యయనంతోనే పక్కాగా మేనిఫెస్టోను రూపొందిస్తున్నామని చెప్పారు. బీఆర్ఎస్ పాలనలో మహిళలు పడుతున్న ఇబ్బందులతోపాటు వారి ఆర్థిక, ఆరోగ్య పరిస్థితుల గురించి మహిళా మోర్చా నాయకులు, కార్యకర్తలు అడిగి తెలుసుకోవాలని సూచించారు. గురువారం పార్టీ మహిళా విధానాలు, పరిశోధన విభాగం ఇంచార్జ్ కరుణా గోపాల్, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు గీతా మూర్తి, మహిళా మోర్చా నేతలతో సంజయ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాబోతోంది. మహిళలు ఏం కోరుకుంటున్నారు? వాళ్లు ఎదుర్కొంటున్న సమస్యలేమిటి? కేంద్రం మహిళల అభివృద్ధి, సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలు ఇక్కడ అందుతున్నాయా? లేదా? అసలు ఈ పథకాల గురించి మహిళలు ఏమనుకుంటున్నారనే అంశాలపై క్షేత్ర స్థాయికి వెళ్లండి''అని పిలుపునిచ్చారు.

ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిని సస్పెండ్‌చేయాలి: మహిళా మోర్చా అధ్యక్షురాలు గీతామూర్తి

గవర్నర్ డా.తమిళి సై సౌందరరాజన్‌ను ఉద్దేశించి అవమానకరంగా మాట్లాడిన ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని మహిళా మోర్చా అధ్యక్షురాలు గీతామూర్తి డిమాండ్ చేశారు. గురువారం కరుణా గోపాల్, ఇతర నేతలతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ నేతలు మహిళలను అగౌరపరుస్తున్నారని మండిపడ్డారు. ఇందుకు జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రావణి ఉదంతమే ఉదాహరణ అన్నారు. సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌కే భద్రత కరువైందంటే రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి అర్థం చేసుకోవచ్చన్నారు.

రైతు కుటుంబం ఆత్మహత్యాయత్నం

- యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఘటన
- తమ భూమిని స్థానికేతరులు పట్టా చేసుకోవాలని చూస్తున్నారని ఆరోపణ



ఆత్మహత్యాయత్నం చేస్తున్న వెంకటేష్ కుటుంబ సభ్యులను అడ్డుకుంటున్న పోలీసులు

మోటకొండూరు: గణతంత్ర వేడుకల వేళ ఓ రైతు కుటుంబం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యకు యత్నించింది. యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల కేంద్రంలో గురువారం ఈ ఘటన చోటు చేసుకుంది.మోటకొండూరుకు చెందిన భూమండ్ల వెంకటేశ్‌కు భువనగిరి మండలంలోని చీమలకొండూరు రెవెన్యూ పరిధిలో 2.26 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అయితే బంట్రోతు నాగరత్నం అనే స్థానికేతర మహిళ ఆ భూమి తమదేనని పట్టా చేసుకోవాలని చూస్తోందంటూ వెంకటేశ్, అతడి భార్య శోభ, కుమారుడు శ్రీకాంత్ గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించారు. దీంతో అక్కడే ఉన్న పోలీసులు వారిని అడ్డుకొని అదుపులోకి తీసుకున్నారు. మండల కేంద్రంలో నివాసం ఉండని నాగరత్నంకు స్థానిక రెవెన్యూ అధికారులు ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీ చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు.

రికార్డులు పరిశీలించాకే సర్టిఫికెట్ ఇచ్చాం: తహసీల్దార్ జ్యోతి

అక్కడే ఉన్న మోటకొండూరు తహసీల్దార్ జ్యోతి బాధిత రైతుతో మాట్లాడుతూ ఫ్యామిలీ సర్టిఫికెట్ కావాలని గత నెలలో నాగరత్నం అర్జీ పెట్టుకుందని, రికార్డులు పరిశీలించగా ఆమె తాత నర్సెట్టి వెంకటస్వామికి చీమలకొండూరులో 1985లో పట్టా భూమి ఉందని గుర్తించి ఆమెకు ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీ చేశామని పేర్కొన్నారు. ఆ భూమి భువనగిరి రెవెన్యూ పరిధిలో ఉన్నందున సమస్యను భువనగిరి తహసీల్దార్ కార్యాలయంలో పరిష్కరించుకోవాలని, అవసరమైతే ఆర్డీవోకు ఫిర్యాదు చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు.

విదేశాల్లోనూ గణతంత్రం



గూగుల్ గణతంత్ర దినోత్సవ డూడుల్

బీజింగ్/లండన్: భారత 74వ గణతంత్ర దినోత్సవాలు గురువారం ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో ఘనంగా జరిగాయి. వేడుకల్లో ప్రవాస భారతీయులు, అక్కడి భారత దౌత్యవేత్తలు, రాయబార కార్యాలయాల సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. రష్యా, ఇజ్రాయెల్, ఆస్ట్రేలియా, భూటాన్ తదితర దేశాల అధినేతలు శుభాకాంక్షలు తెలిపారు. చైనా, రష్యా, బ్రిటన్, ఇజ్రాయెల్, ఆస్ట్రేలియా, పాకిస్తాన్, నేపాల్, శ్రీలంక, యూఏఈ, మాల్దీవులు, న్యూజిలాండ్, బంగ్లాదేశ్‌ల్లో వేడుకలు జరిగాయి.

క్లుప్తంగా

కరోనా నాసికా టీకా 'ఇన్‌కొవాక్' విడుదల

ప్రపంచంలోనే తొలి నాసల్ వ్యాక్సిన్

న్యూఢిల్లీ: కరోనా నియంత్రణకు హైదరాబాద్‌కు చెందిన భారత్ బయోటెక్ సంస్థ అభివృద్ధి చేసిన నాసికా (నాసల్) టీకా ఇన్‌కొవాక్‌ను కేంద్ర మంత్రులు మన్‌సుఖ్ మాండవీయా, జితేంద్ర సింగ్ గురువారం విడుదల చేశారు. కరోనాకు ప్రపంచంలో తొలి నాసికా టీకా ఇదే. సూది అవసరం లేకుండా ముక్కు ద్వారా తీసుకోవడం దీని ప్రత్యేకత. కొన్ని షరతులతో దీని అత్యవసర వాడకానికి డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డీసీజీఐ) గత నవంబర్‌లో అనుమతి లభించింది. 18 ఏళ్లు నిండినవారికి బూస్టర్ డోసుగా ఇవ్వొచ్చని సూచించింది. దీని ధర ప్రైవేట్ ఆసుపత్రుల్లో రూ.800. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.325కు సరఫరా చేస్తామని సంస్థ గతంలో వెల్లడించింది.

'ఈడీ దర్యాప్తు పరిధి... మనీ లాండరింగ్ వరకే'

న్యూఢిల్లీ: ''ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి కేవలం నగదు అక్రమ ప్రవాహ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) సెక్షన్ 3లో పేర్కొన్న నిర్వచనం పరిధిలోకి వచ్చే మనీ లాండరింగ్ నేరాలపై విచారణ, దర్యాప్తు చేసే అధికారాలు మాత్రమే ఉన్నాయి. అంతే తప్ప సదరు నేరానికి సంబంధించిన ఇతర అభియోగాలు, అక్రమాలపై విచారణ జరిపే పరిధి ఈడీకి లేదు'' అని ఢిల్లీ హైకోర్టు పేర్కొంది. అలాంటి వాటిపై విచారణ జరపడం ఇతర అధీకృత సంస్థల బాధ్యత అని స్పష్టం చేసింది. తన విచారణలో భాగంగా అలాంటి ఇతర నేరాలకు సంబంధించి సాక్ష్యాధారాలు లభిస్తే దర్యాప్తు నిమిత్తం వాటిని సంబంధిత సంస్థలకు అందజేయాలని న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ తన తీర్పులో పేర్కొన్నారు.



ఢిల్లీ పరేడ్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచిన ఆకాశ్ క్షిపణులు



మంగళూరు సమీపంలోని మూడబిద్రిలో ఒక విద్యా సంస్థలో 'ఇండియా'గా నిలుచున్న విద్యార్థులు



వైమానిక దళానికి సారథ్యం వహిస్తున్న స్క్వాడ్రన్ లీడర్ సింధూ రెడ్డి

మన ఘన శక్తి

ఘనంగా 74వ గణతంత్ర వేడుకలు

న్యూఢిల్లీ: ఆత్మనిర్భరత స్ఫూర్తితో పరిపుష్టమైన సైనిక శక్తిని ప్రదర్శిస్తూ.. నారీశక్తిని చాటుతూ.. వైవిధ్యమైన, సుసంపన్నమైన దేశ సాంస్కృతిక వారసత్వాన్ని కళ్లకు కడుతూ 74వ గణతంత్ర వేడుకలు మువ్వన్నెల జెండాల రెపరెపలతో ఘనంగా జరిగాయి. రాజధాని ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ నిర్వహించిన వేడుకల్లో దేశ విదేశీ ప్రముఖులు, కేంద్ర మంత్రులు, త్రివిధ దళాల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు. ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దెల్ ఫతా అల్-సీసీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తొలుత జాతీయ యుద్ధ స్మారకం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి అమర జవాన్లకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సంప్రదాయం ప్రకారం కర్తవ్యపథ్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. జాతీయ గీతాలాపన తర్వాత సైనికులు లాంఛనంగా 21 గన్ సెల్యూట్ సమర్పించారు. రక్షణ రంగంలో స్వావలంబనకు సూచికగా పాతకాలపు విదేశీ 25-పౌండర్ గన్స్ స్థానంలో ఈసారి స్వదేశీ 105-ఎంఎం ఇండియన్ ఫీల్డ్ గన్స్ పేల్చడం విశేషం.

అబ్బురపర్చిన విన్యాసాలు

కర్తవ్యపథ్‌లో రిపబ్లిక్ డే పరేడ్ కన్నుల పండువగా సాగింది. వివిధ రాష్ట్రాలు, కేంద్ర శాఖల శకటాలు ఆకట్టుకున్నాయి. సైనికుల విన్యాసాలు అబ్బురపర్చాయి. మన ఆయుధ పాటవాన్ని, సైనిక శక్తిని తిలకించిన ఆహూతుల హృదయాలు గర్వంతో ఉప్పొంగాయి. మెకనైజ్డ్ ఇన్‌ఫాంట్రీ, డోగ్రా రెజిమెంట్, పంజాబ్ రెజిమెంట్, మరాఠా లైట్ ఇన్‌ఫాంట్రీ, బిహార్ రెజిమెంట్, గూర్ఖా బ్రిగేడ్ తదితర సేనలు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించాయి. దేశీయంగా తయారు చేసిన ఆయుధాలు, రక్షణ సామగ్రిని పరేడ్‌లో ప్రదర్శించారు. అర్జున్, నాగ్ మిస్సైల్ సిస్టమ్, కె-9 వజ్ర యుద్ధ ట్యాంకులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నావికాదళం నుంచి 9 మంది అగ్నివీరులు తొలిసారిగా పరేడ్‌లో పాల్గొన్నారు. వీరిలో ముగ్గురు యువతులున్నారు. వైమానిక విన్యాసాల్లో ఆధునిక మిగ్-29, ఎస్‌యూ-30 ఎంకేఐ, రఫేల్ ఫైటర్లు, సి-130 సూపర్ హెర్క్యులస్ యుద్ధ విమానాలతో పాటు సి-17 గ్లోబ్ గ్లోబ్‌మాస్టర్ రవాణా విమానాలు పాల్గొన్నాయి. నావికా దళానికి చెందిన ఐఎల్-38 యుద్ధ విమానం సైతం తొలిసారిగా పాలు పంచుకుంది. దట్టమైన పొగమంచు వల్ల యుద్ధ విమానాల విన్యాసాలను ప్రజలు పూర్తిస్థాయిలో ఆస్వాదించలేకపోయారు. 800 మీటర్ల ఎత్తులో ఎగురుతున్న విమానాలను కూడా కళ్లు చిట్లించుకొని చూడాల్సి వచ్చింది. వాటిని ఫోన్లలో చిత్రీకరించేందుకు ప్రయాస పడ్డారు.



సైనిక వందనం స్వీకరిస్తున్న రాజ్‌నాథ్, మోదీ, ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దెల్, ముర్ము, ధన్‌ఖడ్ దంపతులు



నావికాదళ బృందానికి సారథ్యం వహిస్తున్న లెఫ్టినెంట్ కమాండర్ దిశా అమృత్



25-పౌండర్ శతఘ్నులకు సెలవు

రిపబ్లిక్ డే వేడుకల్లో 21 గన్ సెల్యూట్‌లో భాగంగా 25-పౌండర్ గన్స్ పేల్చడం దశాబ్దాలుగా సంప్రదాయంగా కొనసాగుతోంది. ఇకపై వీటికి శాశ్వతంగా సెలవు ఇచ్చేసినట్టే. ఈసారి దేశీయంగా తయారు చేసిన 105-ఎంఎం ఇండియన్ ఫీల్డ్ గన్స్ పేల్చారు. ఈ వందనంలో మొత్తం ఏడు శతఘ్నులు పాల్గొన్నాయి. ఒక్కొక్కటి మూడుసార్లు పేల్చారు. రిపబ్లిక్ డే వేడుకల్లో స్వదేశీ శతఘ్నులతో వందనం సమర్పించడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. 2281 ఫీల్డ్ రెజిమెంట్‌కు చెందిన 25-పౌండర్ గన్స్ 1940 దశకం నాటివి. ఇవి యునైటెడ్ కింగ్‌డమ్‌లో తయారయ్యాయి. రెండో ప్రపంచ యుద్ధంలోనూ పాల్గొన్నాయి. 21 గన్ సెల్యూట్‌కు పట్టే సమయం 52 సెకండ్లు.

మహిళా యోధులే సారథులు

నారీశక్తిని ప్రతిబింబిస్తూ 'ఆకాశ్' ఆయుధ వ్యవస్థను లెఫ్టినెంట్ చేతన్ శర్మ నాయకత్వంలో ప్రదర్శించారు. 144 మంది జవాన్లు, నలుగురు అధికారులతో కూడిన భారత వైమానిక దళం(ఐఏఎఫ్) బృందానికి స్క్వాడ్రన్ లీడర్ సింధూరెడ్డి నేతృత్వం వహించారు. సెంట్రల్ రిజర్వ్ పోలీసు దళం(సీఆర్‌పీఎఫ్) నుంచి పూర్తిగా మహిళా సైనికులతో కూడిన బృందం పరేడ్‌లో పాల్గొంది. ఈ బృందానికి అసిస్టెంట్ కమాండెంట్‌పూనమ్ గుప్తా సారథ్యం వహించారు. ప్రపంచంలోనే మొట్టమొదటి మహిళా ఆర్మ్‌డ్ పోలీసు బెటాలియన్‌గా ఈ బృందానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. అలాగే ఢిల్లీ మహిళా పోలీసుల పైప్ బ్యాండ్ కూడా మొదటిసారిగా గణతంత్ర పరేడ్‌లో భాగస్వామిగా మారింది. 'ఢిల్లీ పోలీసు సాంగ్'ను వారు ఆలపించారు.

పరేడ్ సైడ్‌లైట్స్

- రాజ్‌పథ్ పేరును కర్తవ్యపథ్‌గా మార్చిన తర్వాత ఇవే తొలి గణతంత్ర వేడుకలు.
- ఈసారి 'నారీశక్తి' థీమ్‌తో వేడుకలు జరిగాయి.
- ఈజిప్ట్ సైనిక దళాలు, బ్యాండ్ తొలిసారిగా రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొన్నాయి.
- ప్రధాని మోదీ ధరించిన రంగుల తలపాగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.
- ముగ్గురు పరమవీర చక్ర గ్రహీతలు, ముగ్గురు అశోక చక్ర అవార్డు గ్రహీతలు పరేడ్‌లో పాల్గొన్నారు.
- బీఎస్ఎఫ్‌కు చెందిన ఒంటెల దళాన్ని తొలిసారిగా మహిళా సైనికులు నడిపించారు.
- మొత్తం 23 శకటాలను ప్రదర్శించారు. 17 రాష్ట్రాలవి కాగా 6 కేంద్ర శాఖలవి.
- ఢిల్లీ సెంట్రల్ విస్టా, కర్తవ్యపథ్, నూతన పార్లమెంట్ భవన నిర్మాణంలో పాల్గొన్న 'శ్రమయోగీల'తోపాటు పాలు, కూరగాయలు విక్రయించుకొనేవారిని, చిరు వ్యాపారులను గణతంత్ర వేడుకలకు ప్రత్యేకంగా ఆహ్వానించడం విశేషం.
- 2023ను అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని భారత వ్యవసాయ పరిశోధన మండలి(ఐసీఏఆర్) శకటంపై చిరుధాన్యాలను ప్రదర్శించారు. కనువిందుగా అలంకరించిన ఈ శకటం అందరి దృష్టిని ఆకర్షించింది.



కే-9 వజ్ర ట్యాంకుల పరేడ్

భూమిని ముద్దాడనున్న గ్రహశకలం!



కేప్ కెనావెరల్: బుల్లి గ్రహశకలమొకటి భూమికేసి అత్యంత వేగంగా దూసుకొస్తోంది. ఆ క్రమంలో మనకు అత్యంత సమీపానికి రానుందట. ఎంత దగ్గరికంటే, దక్షిణ అమెరికా దక్షిణాగ్రానికి ఏకంగా 3,600 కిలోమీటర్ల సమీపానికి! అంటే అంతరిక్షంలో తిరుగుతున్న మన సమాచార ఉపగ్రహాల కంటే కూడా భూమికి పదింతలు సమీపానికి వచ్చి పడుతుందన్నమాట!! ఇది జరిగేదెప్పుడో తెలుసా? శుక్రవారం ఉదయం 5 గంటలకు 57 నిమిషాలకు! అయితే ఈ గ్రహశకలం భూమిని ఢీకొట్టే ప్రమాదం దాదాపుగా లేనట్టేనని నాసా చెబుతోంది. ''ఎందుకంటే భూమి గురుత్వాకర్షణ శక్తి వల్ల దాని మార్గం బాగా మారిపోతుంది. ఒకవేళ అది భూ వాతావరణంలోకి ప్రవేశించినా దాదాపుగా గాల్లోనే మండిపోతుంది'' అంటోంది. మహా అయితే దాని ముక్కలు ప్రమాదరహితంగా భూమిపై పడితే పడొచ్చట. ఓ గ్రహశకలం భూమికి ఇంత సమీపానికి రావడం మనకు తెలిసి ఇదే తొలిసారని నాసా చెబుతోంది.

2024 చివరికల్లా...మానవసహిత గగన్‌యాన్

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): 2024 చివరికల్లా మానవసహిత గగన్‌యాన్ ప్రయోగం నిర్వహిస్తామని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ ప్రకటించారు. గురువారం శ్రీహరికోట స్పేస్ సెంట్రల్ స్కూల్ మైదానంలో గణతంత్ర వేడుకల అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గగన్‌యాన్‌కు సంబంధించి ఇప్పటికే పలు భూస్థిర పరీక్షలు నిర్వహించాం. మరో 30 రకాల పరీక్షలు, క్రూ మాడ్యూల్ ప్రయోగం జరుపుతాం. ముందుగా రెండు మానవరహిత ప్రయోగాలు, ఆ తర్వాత భారీ ఎల్‌వీఎం-3 రాకెట్ ద్వారా వ్యోమగాములను అంతరిక్షంలోకి తీసుకెళ్లే ప్రయోగం ఉంటాయి. 2023లో 11 ప్రయోగాలు చేపట్టనున్నాం. పీఎస్ఎల్‌వీ సిరీస్‌లో ఐదు రాకెట్లు, ఎల్‌వీఎం-3లో రెండు, జీఎస్ఎల్‌వీ సిరీస్‌లో రెండు, ఎస్ఎస్ఎల్‌వీ సిరీస్‌లో రెండు ప్రయోగాలుంటాయి. ఫిబ్రవరి మూడో వారంలో ఎస్ఎస్ఎల్‌వీ డీ2 ప్రయోగం, ఆ తర్వాత ఐదు పీఎస్ఎల్‌వీ రాకెట్ల ద్వారా వాణిజ్యపరంగా విదేశీ ఉపగ్రహాలతో పాటు సూర్యుడిపై పరిశోధనకు ఆదిత్య-ఎల్1 ఉపగ్రహాన్ని ప్రయోగించనున్నాం. ఎల్‌వీఎం-3 రాకెట్ల ద్వారా వన్‌వెబ్ కంపెనీకి చెందిన 36 ఉపగ్రహాలతో పాటు చంద్రయాన్-3 ప్రయోగానికి సన్నాహాలు చేస్తున్నాం'' అని చెప్పారు. ప్రైవేట్ ప్రయోగాలకు సిద్ధమన్నారు.

45 ఏళ్ల వయసులో 18 ఏళ్ల లుక్కు కోసం...
ఏటా రూ.16 కోట్ల ఖర్చు!

అమెరికాలో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ తాపత్రయం

కాలిఫోర్నియా: వయస్సు పెరిగే కొద్దీ తమ శరీరాన్ని జాగ్రత్తగా చూసుకోవడానికి, ఆరోగ్యాన్ని కాపాడుకోవటానికి రకరకాల జాగ్రత్తలు తీసుకుంటూంటారు. ఫిట్‌నెస్ తరగతులకు వెళ్లడం, ఆహార నియమాలను పాటించడం వంటివి చేస్తూంటారు. యవ్వనంగా కనిపించేందుకు కొందరు కాస్మెటిక్స్‌ను సైతం ఆశ్రయిస్తుంటారు. అమెరికాకు చెందిన 45 ఏళ్ల ఓ సంపన్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ బ్రియాన్ జాన్సన్ మాత్రం మరో అడుగు ముందుకు వేశారు. ఎల్లప్పుడూ నవ యవ్వనంతో ఉండేందుకు, వృద్ధాప్య ఛాయలు దరి చేరనీయరాదని వినూత్నమైన, ఖరీదైన దారిని ఎంచుకున్నారు. 45 ఏళ్ల వయస్సులో 18 ఏళ్ల యువకుడిలా కనిపించేందుకు ఏడాదికి రూ.16.30 కోట్లు ఖర్చు పెట్టేందుకు ఈయన సిద్ధమయ్యారని బ్లూమ్‌బర్గ్ కథనం తెలిపింది. 18 ఏళ్ల వయస్కుడికి ఉండే మెదడు, గుండె, ఊపిరితిత్తులు, లివర్, మూత్రపిండాలు, కండరాలు, దంతాలు, చర్మం, వెంట్రుకలు, బ్లాడర్, పురుషాంగం, పురీషనాళం వంటి కీలక అవయవాలు తనకు ఉండాలని కోరుకున్నారు. ఇందుకోసం పేరున్న ఆలివర్ జొల్మాన్(29) అనే రీజనరేటివ్ మెడిసిన్ ఫిజిషియన్‌ను సంప్రదించారు. ఇద్దరూ కలిసి వయస్సును తగ్గించి, ఆయుర్దాయాన్ని పెంచే అత్యాధునిక వైద్య విధానాలను అధ్యయనం చేశారు. చివరికి జొల్మాన్ నేతృత్వంలో 30 మంది వైద్యులు, నిపుణుల బృందాన్ని సిద్ధం చేశారు. వీరంతా కలిసి 18 ఏళ్ల యువకుడి మాదిరి శారీరక దృఢత్వం, ఊపిరితిత్తుల సామర్థ్యం, 37 ఏళ్ల వ్యక్తి గుండె, 28 ఏళ్ల యువకుడి ఆరోగ్యవంతమైన చర్మాన్ని బ్రియాన్ సొంతమయ్యేందుకు పాటించాల్సిన రోజువారీ ఆహార నియమాలను రూపొందించారు. బ్రియాన్‌పై వీటిని ప్రయోగించి, ఫలితాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తుంటారు. అతడి శరీరంలోని అన్ని అవయవాలు వయస్సు ప్రభావానికి లోనుకాకుండా, యవ్వనంతో ఉండేందుకు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకుంటారు. ఇందులో భాగంగా బ్రియాన్ కోసం ఖరీదైన మెడికల్ సూట్‌ను కూడా రూపొందించారు. బ్రియాన్‌కు ఈ మేరకు వైద్య చికిత్సలు ప్రారంభం అయినట్లు బ్లూమ్‌బర్గ్ పేర్కొంది.



ఎంపీల పర్యటనలు, లగ్జరీ కార్ల కొనుగోళ్లు బంద్...

పొదుపు చర్యలే శరణమంటున్న పాక్

ఇస్లామాబాద్: తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన పాకిస్తాన్ పొదుపు చర్యలపై దృష్టి పెట్టింది. ఎంపీల వేతనాల్లో 15 శాతం కోత పెట్టింది. వారి విదేశీ పర్యటనలు, లగ్జరీ వాహనాల కొనుగోలుపై నిషేధం విధించింది. గ్యాస్, విద్యుత్ ధరలు పెంచాలని నిర్ణయించినట్లు సమాచారం. నిఘా సంస్థలకు విచ్చలవిడిగా నిధులు విడుదల చేయరాదని తీర్మానించింది. చమురు దిగుమతులు గుదిబండగా మారిన నేపథ్యంలో అన్ని స్థాయిల్లో పెట్రోల్ వాడకాన్ని 30 శాతం తగ్గించుకోవాలని నిర్ణయానికొచ్చింది.

ట్రంప్ ఫేస్‌బుక్ ఖాతా పునరుద్ధరణ

ఇన్‌స్టా ఖాతా కూడా.. ప్రకటించిన మెటా

వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (76) ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం ఖాతాలను పునరుద్ధరించనున్నట్లు మెటా ప్రకటించింది. 2021 జనవరిలో క్యాపిటల్ హిల్‌పై ట్రంప్ మద్దతుదారులు దాడికి పాల్పడిన ఆరోపణల నేపథ్యంలో ట్రంప్ ఖాతాలను రద్దు చేయడం తెలిసిందే. అప్పటికి ట్రంప్‌కు ఫేస్‌బుక్‌లో 3.4 కోట్లు, ఇన్‌స్టాలో 2.3 కోట్ల ఫాలోవర్లున్నారు. నేతలు ఏం చెబుతున్నారో ప్రజలు వినగలిగినప్పుడే తమకిష్టమైన వాటిని ఎంపిక చేసుకోగలరని మెటా గ్లోబల్ ఎఫైర్స్ ప్రెసిడెంట్ నిక్ క్లెగ్ బుధవారం ప్రకటించారు. 2024 అధ్యక్ష ఎన్నికల బరిలో ఉంటానని ట్రంప్ ఇప్పటికే ప్రకటించడం తెలిసిందే. ప్రపంచంలోనే అతి పెద్ద సామాజిక మాధ్యమ వేదికైన ఫేస్‌బుక్ ట్రంప్ రాజకీయ ప్రచార నిధుల సేకరణకు కీలక వనరుగా ఉంది. ఈ నేపథ్యంలో, ''నన్ను ఫేస్‌బుక్, ఇన్‌స్టాల నుంచి తొలగించినందుకు మెటా లక్షలాది డాలర్ల ఆదాయం పోగొట్టుకుంది. అందుకే నా ఖాతాను పునరుద్ధరిస్తోంది'' అని ట్రంప్ తన సొంత సోషల్ సైట్ 'ట్రూత్ సోషల్'లో స్పందించారు.

ఢిల్లీ మేయర్ ఎన్నికపై సుప్రీంకోర్టుకు ఆప్

న్యూఢిల్లీ: ఢిల్లీ మేయర్ ఎన్నికను నిర్ణీత సమయంలోగా పూర్తి చేసేలా ఆదేశాలివ్వాలంటూ గురువారం ఆమ్ ఆద్మీ పార్టీ మేయర్ అభ్యర్థిని షెల్లీ ఒబెరాయ్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మేయర్ ఎన్నిక కోసం రెండోసారి మంగళవారం జరిగిన సమావేశం కూడా గందరగోళం కారణంగా వాయిదా పడిన విషయం తెలిసిందే. బీజేపీ సభ్యుల దౌర్జన్యం వల్లే మేయర్ ఎన్నిక ప్రక్రియ వాయిదా పడిందని ఆప్ ప్రతినిధి సౌరభ్ భరద్వాజ్ మీడియాతో అన్నారు. తమ పార్టీ నేతలు ముకేశ్ గోయెల్, షెల్లీ ఒబెరాయ్ సుప్రీంకోర్టులో వేసిన కేసు శుక్రవారం విచారణకు రానుందన్నారు. మేయర్ ఎన్నికలో నామినేట్ అయినసభ్యులు ఓటింగ్‌లో పాల్గొనకుండా అడ్డుకోవాలని కోరారని చెప్పారు. జనవరి 6వ తేదీన తొలి సమావేశంలో లెఫ్టినెంట్ గవర్నర్ నామినేట్ చేసిన సభ్యులకు ఓటింగ్‌లో పాల్గొనే అవకాశం కల్పించడంపై ఆప్ కౌన్సిలర్లు నిరసనకు దిగారు.

అప్పట్లో రోజుకు 19 గంటలే!

భూ భ్రమణ సమయం పెరుగుతోంది! • ఇన్నర్ కోర్ వేగంలో మార్పులే కారణం • పెకింగ్ యూనివర్సిటీ అధ్యయనం

ఎంతకూ రోజు గడవడం లేదని ఎప్పుడైనా అనిపించిందా?
ఒంటరిగా ఉన్నప్పుడో.. చేసేందుకు పనేమీ లేకపోయినప్పుడో...
24 గంటలు గడిచేదెప్పుడబ్బా అని ఒక్కసారైనా అనిపించి ఉంటుంది!
మరి రోజులో కేవలం 19 గంటలే ఉంటే?
అదెలా అంటారా? అయితే కచ్చితంగా ఇది చదవాల్సిందే...



భూమ్మీద రోజు నిడివి ఎన్నడూ స్థిరంగా లేదట. కోటానుకోట్ల ఏళ్ల కింద ఇప్పటి కంటే కనీసం ఆరు గంటలు తక్కువగా ఉండేదట! అంటే అప్పట్లో భూ భ్రమణానికి, అంటే తన చుట్టు తాను ఒకసారి తిరిగేందుకు 19 గంటలు మాత్రమే పట్టేదని చైనాలోని పెకింగ్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు అధ్యయనపూర్వకంగా చెబుతున్నారు. మరిప్పుడు రోజుకు 24 గంటలు ఎందుకైనట్టు? భూమి నిర్మాణం గురించి కొంచెం తెలుసుకుంటే దీనికి సమాధానమూ తెలుస్తుంది.

భూమి ఉల్లిపాయ మాదిరిగా పొరలుగా ఉంటుందని, ఈ పొరల సంఖ్య నాలుగని అని చిన్నప్పుడే చదువుకున్నాం. మనముండేది క్రస్ట్ అని పిలిచే పై పొరలో. దీనికింద మాంటిల్, ఔటర్ కోర్, చివరగా భూమి మధ్య భాగంలో ఇన్నర్ కోర్ ఉంటాయి. ఇన్నర్ కోర్ సుమారు 1,220 కిలోమీటర్ల పొడవుంటుంది. ఇది దాదాపుగా ఘనస్థితిలో ఉన్న ఇనుప ముద్ద. ఇది తిరిగే వేగం, పద్ధతుల్లో వచ్చే తేడాలను బట్టి రోజు తాలూకు నిడివిలోనూ హెచ్చుతగ్గులు ఏర్పడతాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇన్నర్ కోర్‌పైన ద్రవ స్థితిలో ఉండే ఔటర్ కోర్ ఉంటుంది. ఇది సృష్టించే అయస్కాంత క్షేత్రాన్ని బట్టి ఇన్నర్ కోర్ వేగం, దిశ ఆధారపడి ఉంటాయి. ఆశ్చర్యకరమైన అంశం ఏమిటంటే కోట్ల ఏళ్లుగా ఇన్నర్ కోర్ దిశ, వేగం తగ్గుతూ వస్తున్నాయి. దీని ప్రభావం వల్ల రోజు నిడివి పెరుగుతూ వస్తోంది. ఆ లెక్కన 140 కోట్ల ఏళ్ల క్రితం భూ భ్రమణానికి 19 గంటలే పట్టేదని అంచనా.

అధ్యయనం చేసిందిలా...

భూమి లోపలి పొరలన్నీ వేటికవే వేర్వేరు దిశ, వేగాల్లో తిరుగుతూంటాయి. కొన్ని కదలికలు అయస్కాంత క్షేత్రాన్ని ఏర్పరిస్తే ఇంకొన్ని పొరల గురుత్వాకర్షణ శక్తి ఆ క్షేత్ర ప్రభావాన్ని తగ్గిస్తూంటుంది. కచ్చితంగా ఎలా జరుగుతుందో తెలుసుకోవడం కష్టం కాబట్టి శాస్త్రవేత్తలు పరోక్ష పద్ధతుల ద్వారా భూమి లోపలి పొరల్లో ఏం జరుగుతోందో పరిశీలిస్తూంటారు. భూకంప తరంగాలు అన్ని పొరల ద్వారా ప్రయాణించగలవు. పొర మారినప్పుడల్లా వాటి వేగంలో మార్పులు వస్తూంటాయి. వాటి ఆధారంగానే ఆ ప్రాంతంలో ఏ రకమైన ఖనిజాలున్నాయి, ఉష్ణోగ్రత, సాంద్రత ఎంత వంటి వివరాలు తెలుస్తూంటాయి. అలాగే భూమి ఇన్నర్ కోర్ వేగం, దిశల్లో వచ్చిన మార్పులు కూడా! పెకింగ్ వర్సిటీ శాస్త్రవేత్తలు కొన్ని వేల భూకంపాల వివరాలను సేకరించి పరిశీలించారు. 1960ల నుంచి ఇప్పటిదాకా భూమి ఇన్నర్ కోర్‌ను దాటుకుంటూ వెళ్లిన భూకంప తరంగాల తీరును విశ్లేషించినప్పుడు ఆసక్తికరమైన అంశం బయటపడింది. 2009కి ముందు ఈ తరంగాలు ఇన్నర్ కోర్ గుండా వెళ్లేందుకు పట్టిన సమయంతో పాటు ఆ తరంగాల రూపురేఖల్లోనూ గణనీయమైన మార్పులొచ్చాయి. ఇక 2009లో భూకంప తరంగాల ప్రభావం ఇన్నర్ కోర్‌పై దాదాపు లేకుండా పోయింది. అంటే 2009లో ఇన్నర్ కోర్ కూడా భూమితో సమాన వేగంతో తిరుగుతున్నట్లు అంచనా కట్టారు. 2009 తర్వాత భూమి కంటే తక్కువ వేగంతో తిరుగుతున్నట్టు భూకంపాల తరంగాల పరిశీలనలో వెల్లడైంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

70 ఏళ్లకోసారి రివర్స్

ఈ అధ్యయనం ప్రకారం ఇన్నర్ కోర్ తిరిగే దిశ 70 ఏళ్లకోసారి మారుతూంటుంది. అలా చివరిసారి 1970 ప్రాంతంలో మారిందట. రోజు నిడివి, భూ అయస్కాంత క్షేత్రాల ద్వారా ఇది నిర్ధారణైంది కూడా. ఇలా ఇన్నర్ కోర్ తిరిగే దిశ, వేగంలో మార్పుల వల్ల భూ భ్రమణానికి పట్టే సమయంలోనూ తేడాలొచ్చినట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇన్నర్ కోర్ వేగం తగ్గినప్పుడు మాంటెల్ తాలూకూ గురుత్వాకర్షణ శక్తి పెరుగుతుందని, ఫలితంగా భూ భ్రమణ వేగం తగ్గుతుందని తెలిపారు. దీనివల్ల రోజు నిడివి పెరుగుతుందన్నమాట. ఎంతో తెలుసా? ఏడాదికి సెకనులో 74,000వ వంతు! అలా 140 కోట్ల ఏళ్ల క్రితం 19 గంటలుండే రోజు నిడివి ఇప్పుడు 24 గంటలకు పెరిగిందని వివరించారు.



అన్నట్టూ, భూమి ఇన్నర్ కోర్ ఆరేళ్ల సమయంలో ఒక మైలు దూరం అటు ఇటూ లోలకం మాదిరిగా ఊగుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.



గురువారం కోల్‌కతాలో వసంత పంచమి వేడుకల్లో గవర్నర్ ఆనంద్ బోస్‌కు అక్షరాభ్యాసం చేయిస్తున్న చిన్నారి! బెంగాలీ వర్ణమాలలోని మొదటి అక్షరాన్ని పలకపై రాసి చూపించింది. కేరళకు చెందిన గవర్నర్ ఆనంద్ బోస్ మాతృభాష మలయాళం. బెంగాలీ నేర్చుకుంటానని ఆయన ఇటీవలే ప్రకటించడం తెలిసిందే.



కలశాభిషేకం.. దీపాలంకరణ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం శ్రీవారికి, అమ్మవార్లకు సహస్ర కలశాభిషేకం నిర్వహించారు. 8లో▸



కొత్త సీపీ బాధ్యతల స్వీకరణ

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ కమిషనరేట్ నూతన పోలీసు కమిషనర్‌గా ఎల్.సుబ్బరాయుడు గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు.

గరిష్టం/కనిష్టం
31.0/14.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

తేనీటి విందులో స్వరమధురిమలు



కరీంనగర్ అర్బన్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ తేనీటి విందు ఆద్యంతం అలరించింది. కేబీ శర్మ నేతృత్వంలోని సంగీత విభావరి వీక్షకులను ఒలలాడించింది. గురువారం రాత్రి కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కార్యక్రమం జరగగా ఆపాత మధురాలు ఆకట్టుకున్నాయి. జిల్లా జడ్జి ప్రతిమ, అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్, జీవీ శ్యాంప్రసాద్‌లాల్, జడ్పీ సీఈవో ప్రియాంక కర్ణన్, సీపీ సుబ్బారాయుడు, డీఐజీ రమేశ్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నల్లగుంటపల్లి వాసికి డాక్టరేట్



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నల్లగుంటపల్లి గ్రామానికి చెందిన విలాసాగరం శ్రీనివాస్ జీవ రసాయన శాస్త్రంలో డాక్టరేట్ పట్టా పొందాడు. ప్రముఖ జాతీయ పోషకాహార సంస్థ(ఐసీఎంఆర్–ఎన్ఐఎన్) హైదరాబాద్‌లో ప్లాసెంటా (జరాయువు) యొక్క జీవక్రియ, యాంజియోనిక్ ఫంక్షన్లలో కొవ్వు ఆమ్లాలు, గ్లూకోజ్ పాత్ర, పిండం పెరుగుదల, అభివృద్ధికి చిక్కులు అనే విషయంపై డాక్టర్ సంజయ్‌బసక్ పర్యవేక్షణలో పరిశోధన చేశారు. అతను ప్రచురించిన అంతర్జాతీయ పరిశోధనల కథనాల ఆధారంగా రాసి ఉస్మానియా విశ్వవిద్యాలయానికి సమర్పించిన సిద్ధాంత గ్రంధానికి జీవ రసాయన శాస్త్రంలో డాక్టరేట్ ప్రకటించింది. గురువారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా సూపర్‌వైజర్, డైరెక్టర్ డాక్టర్ హేమలత చేతుల మీదుగా శ్రీనివాస్ డాక్టరేట్ పట్టా అందుకున్నాడు. డాక్టరేట్ రావడంపై తల్లిదండ్రులు విలాసాగరం కనుకమ్మ– ఓదయ్య, సోదరుడు మల్లేశ్, సర్పంచు వడ్లూరి సంతోషకిరణ్ హర్షం వ్యక్తం చేశారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



వర్షిత్



తిరుమలేశ్

కరీంనగర్‌స్పోర్ట్స్: తమిళనాడులోని తిరుచిరపల్లిలో ఈనెల 30 వరకు జరుగనున్న జాతీయ స్థాయి జూనియర్స్ హ్యాండ్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరు క్రీడాకారులు ఎంపికైనట్లు హ్యాండ్ బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వరరావు, బాసరవేణి లక్ష్మణ్ తెలిపారు. ఈ నెల 7 నుంచి 9 వరకు మంచిర్యాల జిల్లా మందమర్రిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించిన రామడుగుకు చెందిన గుర్రం తిరుమలేశ్, మానకొండూర్ గురుకుల కళాశాలకు చెందిన వర్షిత్ ఎంపికైనట్లు పేర్కొన్నారు.

'అక్రమ బదిలీలు రద్దు చేయాలి'

కరీంనగర్: అక్రమ బదిలీలు వెంటనే రద్దు చేసి కౌన్సెలింగ్ బదిలీలు చేపట్టాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మాడుగుల రాములు ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇప్పటికే 317 పేరుతో విచ్చలవిడిగా ఉపాధ్యాయులను వివిధ జిల్లాలకు విసిరిపడేసి, వారి వినతులను కూడా ఏమాత్రం పరిశీలించకుండా, తమ అనుయాయులకు మాత్రం అడ్డదారిలో అనుకున్న చోటుకి బదిలీ చేపట్టడం అనేది దుర్మార్గమన్నారు. ఉపాధ్యాయుల నుంచి తీవ్ర వ్యతిరేకత రాకముందే అక్రమ బదిలీలు రద్దుచేసి, 317 బాధితుల దరఖాస్తులు పరిశీలించి, వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

నిరాడంబరంగా
గణతంత్ర వేడుకలు



జెండా ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కర్ణన్



జెండా వందనం చేస్తున్న కలెక్టర్ కర్ణన్, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, అధికారులు తదితరులు

- కలెక్టరేట్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్
- ప్రసంగం లేకుండానే ముగింపు

కరీంనగర్ అర్బన్: భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను గురువారం సాదాసీదాగా నిర్వహించారు. కలెక్టరేట్ ఆవరణలో జిల్లా కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ జాతీయ పతాక ఆవిష్కరణ చేశారు. కలెక్టరేట్‌లో నిరాడంబరంగా వేడుకలను నిర్వహించారు. ఉదయం 10 గంటలకు కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ ముందుగా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అలాగే పోలీస్ కమిషనర్ వి.సత్యనారాయణ, అదనపు కలెక్టర్లు శ్యాం ప్రసాద్ లాల్, గరిమా అగర్వాల్ నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం సమర్పించారు. ఈ సందర్భంగా పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ప్రసంగం లేకుండా కార్యక్రమం ముగించారు. ట్రైనీ కలెక్టర్ లెనిన్, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో డా.కన్నం నారాయణ, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాలు లేవు.. వేడుకల్లేవు

ప్రతీ గణతంత్ర దినోత్సవం పరేడ్ మైదానంలో జరగడం పరిపాటి. దీంతోపాటు ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలివ్వడం, కల్చరల్ కార్యక్రమాలు, ఆస్తుల పంపిణీ, స్వాతంత్ర్య సమరయోధులకు సన్మానం, జిల్లా ప్రగతిపై ప్రసంగం జరిగేవి. కాగా గురువారం అలాంటివి ఏమీ లేవు. పరేడ్ మైదానంలో ఏర్పాట్లు లేకపోగా ఉత్తమ ఉద్యోగుల జాబితా లేదు. ప్రశంసాపత్రాలు ఇవ్వలేదు. ఈ విషయమై అధికారులను సంప్రదించగా రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి అని చెప్పుకొచ్చారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో..



తెలంగాణ భవన్‌లో జెండా ఆవిష్కరించి వందనం చేస్తున్న మంత్రి, మేయర్, ఎమ్మెల్యే తదితరులు

కరీంనగర్: తీగలగుట్టపల్లిలోని తెలంగాణభవన్‌లో రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ జెండా ఆవిష్కరించారు. అలాగే మీసేవా కార్యాలయంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. ఎందరో త్యాగధనుల వల్ల సిద్ధించిన స్వాతంత్ర్య ఫలాలను సామాన్యులకు అందజేయడమే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ వై.సునీల్‌రావు, జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, సుడా చైర్మన్ జీవీ రామక్రిష్ణారావు, గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మధు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు ఆరెపల్లి మోహన్, సత్యనారాయణ, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ కార్యాలయంలో...



జెడ్పీ కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, తదితరులు

గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా పరిషత్ కార్యాలయంలో చైర్‌పర్సన్ కనుమల్ల విజయ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులను ప్రజలకు అందివ్వడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు.

అద్దె గదులపై అశ్రద్ధ



ప్రభుత్వాసుపత్రిలోని పేయింగ్ రూమ్‌లు

- ఆదాయ వనరులపై పట్టింపు కరువు
- జిల్లా ఆసుపత్రి ఆదాయానికి గండి
- పట్టించుకోని అధికారులు

కరీంనగర్‌టౌన్: 'ఆసుపత్రికి ఆదాయ వనరులు పెంచుకునేందుకు ప్రయత్నించాలి. వచ్చిన ఆదాయాన్ని రిపేర్లు, ఇతర ఖర్చులకు ఉపయోగించాలి. ఆదాయ వనరులపై అశ్రద్ధ చేయవద్దు అని రాష్ట్ర పౌరసరఫరాలు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశాల్లో పలుమార్లు అధికారులకు సూచిస్తూనే ఉన్నారు. అయినా ఆదాయ వనరులపై పట్టింపులేకుండా పోయింది. అందుబాటులో ఉన్న పేయింగ్ రూంలను కూడా వినియోగించడం లేదు.'

అధికారుల నిర్లక్ష్యం

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో అద్దె గదులపై అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. అద్దె చెల్లించే స్తోమత ఉన్న రోగులకు ఇవ్వాల్సిన ప్రత్యేక గదులను పట్టించుకోకుండా వదిలేస్తున్నారు. ఆసుపత్రి మొదటి అంతస్తులోని 18 అద్దె గదులను ఉపయోగంలోకి తేకుండా గాలికి వదిలేశారు. అందులో ఒకటి జైలు నుంచి వచ్చే ఖైదీలకు, మరొకటి నర్సింగ్ స్టాఫ్ వాడుకుంటుండగా మిగతావన్నీ అద్దెలు సంపాదించే గదులే అయినా వాటిపై ఒక్క రూపాయి కూడా ఆదాయం రావడం లేదు. రోగులకు ఇస్తే ఒక్కో గదికి రోజుకు రూ.200 చొప్పున అద్దె చెల్లిస్తారు. అలా చేస్తే నెలకు రూ.లక్షకు పైగా ఆదాయం వచ్చే అవకాశం ఉంది. అయినా పట్టించుకోవడం మానేశారు.

గదులను వాడుతున్న సిబ్బంది

అద్దె గదులను పేషెంట్లకు ఇవ్వకుండా సిబ్బందే వాడుతుండడం గమనార్హం. అధికారం చలాయిస్తున్న కొంతమంది సిబ్బంది ఒక్కొక్కరు రెండేసి రూంలకు తాళాలు వేసుకొని జబర్దస్తీగా వాడుతున్నారనే, అందుకే పేషెంట్లు అడిగినా రూంల విషయం చెప్పకుండా దాటవేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అద్దె గదులను కేవలం రెస్ట్ రూంలుగా వాడుతుండడం వల్లే ఆసుపత్రికి ఆదాయం రాకుండా పోతోంది. ఆసుపత్రికి ఆదాయం పెరగాలంటే అద్దె గదులను సౌకర్యవంతంగా తీర్చిదిద్ది పేషెంట్లకు ఇవ్వాల్సి ఉంటుంది.

ఆదాయ వనరులకు అడ్డుకట్ట...

ఆసుపత్రికి ఆదాయం వచ్చే మార్గాలు పుష్కలంగా ఉన్నా అధికారులు ఆ వైపుగా ఆలోచించడం లేదు. అద్దె గదులు తీసుకునేందుకు పేషెంట్లు సిద్ధంగా ఉన్నప్పటికీ వారికి అద్దె గదుల విషయమే చెప్పడం లేదు. అద్దె గదుల్లో పేషెంట్లను ఉంచితే చికిత్స కోసం వైద్యులు, సిబ్బంది తిరగాల్సి వస్తుందనే కారణంతోనే అద్దె గదులను ప్రోత్సహించడం లేదని తెలుస్తోంది. ఇంకా ఎవరైనా అద్దె గదులు కావాలని అడిగినా ఫ్యాన్లు పనిచేయడం లేదని, వాటర్ సరిగా రావని భయపెట్టి అద్దె రూంల వైపు ఆలోచన లేకుండా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇదే విషయమై ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్‌ను వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా స్పందించలేదు.

బదిలీల కాలం

- ఉమ్మడి జిల్లాలో ఐపీఎస్‌ల స్థానచలనం
- త్వరలో భారీగా ఐఏఎస్‌ల ట్రాన్స్‌ఫర్లు
- ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బదిలీలు
- జాబితాలో కరీంనగర్ కలెక్టర్ దంపతులూ
- బదిలీపై ముందే వెల్లడించిన 'సాక్షి' కథనం





ఎల్.సుబ్బారాయుడు- సత్యనారాయణ





రెమా రాజేశ్వరి - చంద్రశేఖర్‌రెడ్డి





అఖిల్ మహాజన్ - రాహుల్ హెగ్డే





భాస్కర్- సింధూశర్మ

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు సమయాత్తమవుతోంది. ఈ ఏడాది అంతానికి ప్రభుత్వ కాలపరిమితి ముగుస్తున్న దరిమిలా.. ఎన్నికలకు సిద్ధమవుతోంది. ఈ మేరకు కీలకమైన పరిపాలన, శాంతిభద్రతలు, రెవెన్యూ అధికారుల బదిలీలు చేపట్టింది. ఇందులో భాగంగా బుధవారం అర్ధరాత్రి.. స్పష్టంగా చెప్పాలంటే గురువారం తెల్లవారుజామున జరిగిన ఐపీఎస్‌ల బదిలీలు ఉత్కంఠకు తెరదించాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో సమర్థులైన అధికారులను నియమించాలన్న ఆలోచనను ప్రభుత్వం ఇప్పుడే అమల్లో పెట్టింది. ఇదే క్రమంలో రెండుమూడు రోజుల్లో భారీగా ఐఏఎస్‌ల బదిలీల్లోనూ ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు అధికారులు బదిలీ అవుతారని ప్రచారం సాగుతోంది.

కొత్త బాసుల వివరాలు ఇవే..!

కరీంనగర్ సీపీ: సుబ్బారాయుడు, సీపీ, కరీంనగర్

గతంలో కరీంనగర్‌లో ఓఎస్డీగా పనిచేసిన అనుభవం ఉంది. అడ్మినిస్ట్రేషన్, నేర పరిశోధనలో మంచి ఆఫీసర్‌గా గుర్తింపు ఉంది. గతంలో ఉమ్మడి రాష్ట్రానికి గవర్నర్‌గా పనిచేసిన నరసింహన్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా పనచేశారు. రాష్ట్ర విభజన అనంతరం ఏపీ సీఎం చంద్రబాబు వద్ద సెక్యూరిటీ ఆఫీసర్‌గా పనిచేశారు. ఇటీవల ఐపీఎస్‌ల విభజనలో తెలంగాణకు వచ్చారు. నాన్ కేడర్ ఎస్పీగా ఉన్న సమయంలో 2021 డిసెంబరులో ఐపీఎస్‌గా పదోన్నతి పొందారు. అప్పటి నుంచి డీజీపీ కార్యాలయంలో సీఐడీ విభాగంలో ఎస్పీగా విధులు నిర్వహిస్తున్నారు. తాజా బదిలీతో కరీంనగర్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ స్థానంలో ఉన్న డీఐజీ సత్యనారాయణ రాచకొండ జాయింట్ కమిషనర్‌గా వెళ్లనున్నారు.

రెమా రాజేశ్వరి: డీఐజీ, రామగుండం సీపీ

ప్రస్తుతం నల్లగొండ ఎస్పీగా ఉన్న రెమా రాజేశ్వరి కేరళలోని మున్నార్‌లో జన్మించారు. 2009 ఐపీఎస్ బ్యాచ్ టాపర్. విధి నిర్వహణలో నిక్కచ్చిగా ఉంటారు. ఐపీఎస్‌ల విభజన సమయంలో తెలంగాణ ఆప్షన్ ఇచ్చుకున్నారు. టెక్నాలజీ, న్యాయశాస్త్రంపై పట్టున్న అధికారి. క్షేత్రస్థాయిలో ఇన్ఫర్మేషన్ సేకరించడంలో దిట్ట. 2016లో షాద్‌నగర్‌లో గ్యాంగ్‌స్టర్ నయీం ఎన్‌కౌంటర్ సమయంలో ఆమె మహబూబ్‌నగర్ ఎస్పీగా ఉండటం గమనార్హం. సోషల్ మీడియా ఫేక్‌న్యూస్ కట్టడిలో అందెవేసిన చేయి. కోవిడ్ సమయంలోనూ డీజీపీ ఆఫీసు ఆదేశాల మేరకు టీఎస్ఎస్‌పీ బెటాలియన్ నుంచి పలు స్పెషల్ ఆపరేషన్లను పర్యవేక్షించారు. 2021 డిసెంబరులో నల్లగొండ ఎస్పీగా నియమితులయ్యారు. ఆ సమయంలో నేరాలను తగ్గించారు. గంజాయి రవాణాదారులపై ఉక్కుపాదం మోపారు. త్వరలో రామగుండం సీపీగా బాధ్యతలు తీసుకుంటారు. అంతకుముందు ఆ స్థానంలో ఉన్న చంద్రశేఖర్‌రెడ్డి ఐజీగా పదోన్నతి పొందిన విషయం తెలిసిందే.

అఖిల్ మహాజన్, ఐపీఎస్: సిరిసిల్ల ఎస్పీ

2017 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన అఖిల్ మహాజన్ స్వస్థలం జమ్మూ–కశ్మీర్. హైదరాబాద్ జేఎన్‌టీయూలో ఇంజినీరింగ్ చదివారు. సర్దార్‌వల్లభ్ భాయ్ నేషనల్ పోలీస్ అకాడమీలో ఐపీఎస్ శిక్షణ పొందారు. కోవిడ్ తొలివేవ్ సమయంలో 2020లో రామగుండం కమిషనరేట్‌లో ట్రైనీ ఐపీఎస్‌గా చేరారు. తర్వాత కమిషనరేట్ అడ్మిన్‌గా, మంచిర్యాల డీసీపీగా బాధ్యతలు నిర్వహించారు. తాజాగా జరిగిన బదిలీల్లో సిరిసిల్ల ఎస్పీగా బాధ్యతలు చేపట్టబోతున్నారు. (ఆ స్థానంలో ఉన్న రాహుల్ హెగ్డే హైదరాబాద్ ట్రాఫిక్‌కి బదిలీ అయ్యారు) కోల్‌బెల్ట్ ప్రాంతంలో సమర్థుడైన అధికారిగా పేరు తెచ్చుకున్నారు. నేర పరిశోధన, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, గంజాయి రవాణా నిర్మూలన, భూ కబ్జాదారులకు కళ్లెం వేయడంలో అఖిల్‌కు ఈ ప్రాంతంలో మంచి మార్కులు పడ్డాయి.

భాస్కర్: జగిత్యాల ఎస్పీ

హైదరాబాద్‌లో ఇంటలిజెన్స్ విభాగంలో ఎస్పీగా ఉన్న భాస్కర్‌ను ప్రభుత్వం జగిత్యాల ఎస్పీగా బదిలీ చేసింది. సూర్యపేట జిల్లాకు చెందిన ఎగ్గిడి భాస్కర్ 2010 గ్రూప్ అధికారి. తొలి పోస్టింగ్ ఉమ్మడి రాష్ట్రంలోని గుంటూరు జిల్లాలో, రెండో పోస్టింగ్ కామారెడ్డి డీఎస్పీగా, మూడో పోస్టింగ్ ఆసిఫాబాద్ డీఎస్పీగా, నాల్గో పోస్టింగ్ మెదక్ జిల్లా తూప్రాన్ డీఎస్పీగా, ఇంటలిజెన్స్ ఎస్పీగా పనిచేశారు. ప్రస్తుత బదిలీల్లో జగిత్యాల జిల్లాకు ఎస్పీగా బదిలీ అయ్యారు. ఆ స్థానంలో ఉన్న సింధూశర్మను వరంగల్‌లోని టీఎస్ఎస్‌పీ మామూనురు క్యాంపునకు బదిలీ చేసిన విషయం తెలిసిందే.

బదిలీలపై ముందే చెప్పిన సాక్షి..!

ఉమ్మడి జిల్లాలో లాంగ్‌స్టాండింగ్‌గా ఉన్న ఐపీఎస్ అధికారులు సిరిసిల్ల రాహుల్‌హెగ్డే, జగిత్యాల ఎస్పీ సింధూశర్మ బదిలీ అవుతారని, కరీంనగర్ సీపీ సత్యనారాయణ సైతం ట్రాన్స్‌ఫర్ అవుతారని కూడా 'సాక్షి' ముందే చెప్పింది. వాస్తవానికి సీపీ సత్యనారాయణ బదిలీ ఆకస్మికంగా జరిగిందేమీ కాదు. కుటుంబానికి దూరంగా తానిక్కడ పనిచేయలేకపోతున్నానని, తనను బదిలీ చేయాలని ఆయనే స్వయంగా కోరినట్లు సమాచారం. అదే సమయంలో సత్యనారాయణ ఇక్కడ హుజూరాబాద్ ఉపఎన్నికతోపాటు ఎమ్మెల్సీ జనరల్ ఎలక్షన్ నిర్వహించారు. ఈ నేపథ్యంలో పోలీసు, రెవెన్యూ ఉన్నతాధికారులు ఏదైనా జిల్లాలో జనరల్ ఎలక్షన్ నిర్వహించినా, రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నా.. మరో జనరల్ ఎలక్షన్‌కు ఉండకూడదన్న నియమం కూడా ఉంది. ఎన్నికల సమయంలో ఇబ్బంది కాకుండా ప్రభుత్వం కూడా అయన బదిలీవైపే మొగ్గుచూపింది.

త్వరలో ఐఏఎస్‌ల బదిలీలు..!

- అదే సమయంలో కరీంనగర్‌లో కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్, జెడ్పీ సీఈవో ప్రియాంక, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌లకు పదోన్నతి మీద హైదరాబాద్‌కు వెళ్లనున్నారని సమాచారం. జెడ్పీ సీఈవోకు త్వరలోనే ఐఏఎస్ హోదా రానున్న విషయం తెలిసిందే. అదనపు కలెక్టర్ జీవీ శ్యాం ప్రసాద్ లాల్, ఆర్డీవో ఆనంద్ బదిలీ కానున్నారని తెలిసింది.
- సిరిసిల్ల కలెక్టర్ అనురాగ్ జయంతి, అడిషనల్ కలెక్టర్ సత్యప్రసాద్, అడిషనల్ కలెక్టర్ ఖీమ్యా నాయక్ కాస్త అటూఇటూగా ఏడాదిలోపే విధుల్లో చేరారు. ఆర్డీవో శ్రీనివాస్ మాత్రం మూడేళ్ల కింద వచ్చారు.
- జగిత్యాల కలెక్టర్ గుగులోత్ రవి బదిలీ అయ్యే అవకాశాలున్నాయి. అలాగే ఆర్డీవో మాధురి స్థానచలనం తప్పేలా లేదు.
- పెద్దపల్లి అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణకు బదిలీ అవకాశాలు ఉన్నాయి. డీసీపీ (అడ్మిన్) అఖిలేశ్, పెద్దపల్లి ఇన్‌ఛార్జి రూపేశ్ స్థానంలో సుధీర్ కేకన్, గైక్వాడ్ వైభవ్ వచ్చిన విషయం తెలిసిందే.

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

కరీంనగర్: కేంద్ర ప్రభుత్వం రైతు సాగు చట్టాల రద్దు సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ వివిధ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వర్ణ వెంకటరెడ్డి మాట్లాడుతూ, స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం రైతులు పెట్టిన పెట్టుబడికి 50శాతం కలిపి మద్దతు ధర నిర్ణయించే చట్టం చేయాలని, దీనికోసం రైతు సంఘాల ప్రతినిధులతో కూడిన కమిటీని నియమించాలన్నారు. రైతు రుణాలు రద్దు చేయడానికి పార్లమెంట్‌లో చట్టం చేయాలని, రుణ విమోచన చట్టం చేయాలని డిమాండ్ చేశారు. 60 ఏళ్లు దాటిన సన్న చిన్న, మధ్యతరగతి రైతులకు, వ్యవసాయ కూలీలు, కౌలు రైతులు, చేతి వృత్తిదారులకు రూ.5000 పెన్షన్ నిర్ణయించి అమలు చేయాలన్నారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం అర్హులందరికీ హక్కు పత్రాలు ఇవ్వాలని, కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలన్నారు. హామీలు అమలు చేసేవరకు రైతు సంఘాలను కలుపుకొని పోరాడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సమితి అధ్యక్షుడు బొయిని పటేల్, ప్రధాన కార్యదర్శి బండ రాజిరెడ్డి, మిల్కూరి వాసుదేవరెడ్డి, పైడిపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ నమోస్తుతే

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని పలు ఆలయాల్లో గురువారం వసంతపంచమి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి అభిషేక అర్చనలు, అలంకారాలు, హవనాలు, సామూహిక అక్షరాభ్యాసాలు, పుస్తక పూజలు, ఒడిబియ్యాల సమర్పణలు, ఆలయాల సందర్శన, శుభకార్యాలతో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. చైతన్యపురి మహాశక్తి ఆలయం విద్యార్థులు, వివిధ ప్రాంతాల భక్తజనంతో పోటెత్తింది. జిల్లా గ్రంథాలయంలో చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్ గౌడ్ సరస్వతీ దేవికి పూజ చేసిననంతరం విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.





వసంత పంచమి సందర్భంగా మహాశక్తి ఆలయంలో అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు

ఏఈపై దురుసుగా ప్రవర్తించిన ఎంపీపీ భర్త

మానకొండూర్‌రూరల్: మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ ముద్దసాని సులోచన భర్త శ్రీనివాస్‌రెడ్డి పంచాయతీరాజ్ ఏఈ తిరుపతిపై దురుసుగా ప్రవర్తించిన ఘటన మండలంలో చర్చనీయాంశమైంది. గురువారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా కార్యాలయంలో జెండా ఆవిష్కరణ అనంతరం అధికారులు, నాయకుల మాటామంతి సమయంలో ఏఈతో ఎంపీపీ భర్త మాట్లాడారు. లక్ష్మీపూర్‌లోని వెల్ది ప్రభుత్వాసుపత్రి భవన నిర్మాణ పనుల శంకుస్థాపన విషయమై చర్చించారు. విషయాన్ని దాటవేసే ధోరణిలో ఏఈ సమాధానం ఇవ్వడంతో ఒకింత అసహనానికి లోనైన శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేస్తూ అక్కడే ఉన్న వాటర్‌బాటిల్‌ను టేబుల్ మీదికి విసరడంతో వాతావరణం వేడెక్కింది. దీంతో ఏఈ పక్క గదిలోకి వెళ్లి కంటతడి పెట్టుకున్నారు. అధికారులు, నాయకులు సర్దిచెప్పడంతో గొడవ సద్దుమణిగింది.



వాటర్ బాటిల్ విసిరేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

క్లుప్తంగా

నిబంధనలు ఉల్లంఘించిన వ్యక్తికి జరిమానా



చలాన్ చూపిస్తున్న అధికారులు

సుల్తానాబాద్/ఓదెల: ఎక్సైజ్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై పీడీయాక్ట్ నమోదు చేస్తామని సుల్తానాబాద్ ఎక్సైజ్ సీఐ శ్యామల్ ఆనంద్‌రావు హెచ్చరించారు. ఓదెల గ్రామానికి చెందిన క్యాతం రమేష్ గుడుంబా, నాటు సారా అమ్మవద్దని గతంలో బైండోవర్ చేశామని, నిబంధనలు ఉల్లంఘించడంతో రూ.లక్ష జరిమానా విధించడం జరిగిందన్నారు. గుడుంబా తయారీ, విక్రయాలపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

జెండావిష్కరణలో నిబంధనల ఉల్లంఘన



కోనరావుపేట(వేములవాడ): మర్తనపేట ప్రా థమిక పాఠశాలలో జెండావిష్కరణలో నిబంధనలు ఉల్లంఘించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉదయం ఎగురవేసిన జెండాను సాయంత్రం 6 గంటల వరకు తీయకూడదు. కానీ పాఠశాలలో మధ్యాహ్నం 2 గంటలకే తొలగించి, వెళ్లిపోయారు. సీఆర్పీ రాజేశ్వర్‌రావు, ఎంఈవో రఘుపతిలను వివరణ కోరగా సాయంత్రం వేళలో మాత్రమే తీయాలని, అంతకుముందు తొలగించరాదని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముస్తాబాద్(సిరిసిల్ల): పది రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మోహినికుంటకు చెందిన మహ్మద్ చాంద్‌పాషా గురువారం ప్రాణాలు వదిలారు. చాంద్‌పాషా(52) ఈనెల 17న కూలీ పనులకు వెళ్తుండగా ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలైన చాంద్‌పాషా అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. సిద్దిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా.. పది రోజులపాటు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుని కి భార్య జుబేదా, కుమారులు షాదుల్, షారుక్ ఉన్నారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. మృతుని భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటకు చెందిన వివాహిత ఎలగందుల మమత(29) బుధవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు. ఎల్లారెడ్డిపేటకు చెందిన ఎలగందుల లక్ష్మీ–నర్సయ్యలకు ముగ్గురు కూతుళ్లు. వారి రెండో కుమార్తె ఎలగందుల మమత (29) వివాహం 2014లో దుబ్బాక మండలానికి చెందిన వ్యక్తితో జరిగింది. కాగా అతనితో విడాకులు అయ్యాయి. మళ్లీ పెళ్లి చేయడానికి సంబంధాలు చూస్తున్నప్పటికీ ఆమెకు నచ్చడం లేదు. విడాకుల విషయం తలుచుకుంటూ తరచూ బాధపడుతుండేది. ఈక్రమంలో బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో ఎల్లారెడ్డిపేట ఎస్సై శేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కలశాభిషేకం.. దీపాలంకరణ


ఆలయంలో భక్తుల సందడి


కలశాభిషేకం పూజ


కలెక్టర్ కుటుంబ సభ్యులకు అర్చకుల ఆశీర్వచనాలు

- హాజరైన మంత్రి గంగుల కమలాకర్
- ప్రత్యేక పూజలు చేసిన కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ కుటుంబ సభ్యులు

కరీంనగర్‌కల్చరల్: జిల్లా కేంద్రంలోని మార్కెట్ రోడ్డు శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో షష్ఠమ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉత్సవాల ప్రధాన నిర్వాహకుడు, రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో గురువారం శ్రీవారికి, అమ్మవార్లకు సహస్ర కలశాభిషేకం నిర్వహించారు. అంతకు ముందు ఆలయ వంశపారంపర్య చైర్మన్ స్వర్గీయ చకిలం సత్యలక్ష్మి–ఆగయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారులు, ప్రస్తుత ధర్మకర్తలు శ్రీనివాస్, గంగాధర్ నిర్మించిన నూతన కార్యాలయ సముదాయాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం సహస్ర కలశాభిషేక మంటపాన్ని సందర్శించి పూజా విధానం తెలుసుకున్నారు. కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్‌తో పాటు కుటుంబ సభ్యులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం శ్రీవారి సన్నిధిలో సహస్ర దీపాలంకరణ సేవను కన్నుల పండవగా నిర్వహించారు. అర్చకులు లక్ష్మీనారాయణాచార్యులు, నాగరాజాచార్యులు, ఈవో ఉడుతల వెంకన్న, ఉత్సవ కమిటీ బాధ్యులు గంప రమేశ్, గోగుల ప్రసాద్, ఆర్ భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

బ్రహ్మోతవాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గోగుల ప్రసాద్ నేతృత్వంలో శివరామకృష్ణ భజన మండలి, సాయిభక్త భజన మండలి భజనలు, జమున, లత, శ్రీనివాస్‌ల భక్తి కీర్తనలు, జయలక్ష్మి శిష్య బృందం శాస్త్రీయ నృత్యం, రతన్‌కుమార్ బృందం ఆంధ్ర నాట్యం, మహాలక్ష్మి, రసజ్ఞ, మనస్విని, వైశాలిల శాస్త్రీయ నృత్యం, వేంకటేశ్వర సురభి థియేటర్ వారి పాతాళభైరవి నాటక ప్రదర్శన ఆకట్టుకున్నాయి.

జగిత్యాల ఎమ్మెల్యేపై చర్య తీసుకోవాలి

- బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామచంద్రం


మాట్లాడుతున్న రామచంద్రం

కరీంనగర్‌కల్చరల్: జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ భోగ శ్రావణిని ఇబ్బందులకు గురిచేసి తన రాజీనామాకు కారణమైన ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌పై గవర్నర్ చర్య తీసుకోవాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన నిషాని రామచంద్రం డిమాండ్ చేశారు. బహుజన్ సమాజ్ పార్టీ కరీంనగర్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఒక మహిళ చైర్మన్‌ను వేధించడం నీచమైన చర్య అని, ఇది దొరల అహంకారానికి నిదర్శనమన్నారు. గవర్నర్ స్పందించి ఎమ్మెల్యేపై చర్య తీసుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు నల్లాల శ్రీనివాస్, కరీంనగర్ జోనల్ మహిళా కన్వీనర్ స్వరూప, జిల్లా కార్యదర్శులు బడుగు నరేష్, మంద రవీందర్, టౌన్ అధ్యక్షుడు ఆస్తపురం మధు, అసెంబ్లీ మహిళా కన్వీనర్ అల్లూరి అనురాధ, రామడుగు కుమార్, రోమాల రాజు, స్వామి, మంద బాలయ్య, బండపల్లి శ్రీకాంత్, విష్ణు తదితరులున్నారు.

దళిత్ శక్తి ప్రోగ్రాం ఆధ్వర్యంలో రాజ్యాంగ ప్రచారయాత్ర


యాత్ర నిర్వహిస్తున్న డీఎస్పీ నాయకులు

కరీంనగర్: దళిత్ శక్తి ప్రోగ్రాం (డీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు డా.విశారదన్ మహారాజ్ ఆదేశాల మేరకు ఐదేళ్లుగా డీఎస్పీ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజ్యాంగ రథయాత్ర నిర్వహిస్తున్నారు. అన్ని జిల్లాల వ్యాప్తంగా బాబా సాహెబ్ అంబేడ్కర్ రాసిన భారత రాజ్యాంగ విలువలను ప్రచారం చేస్తున్నారు. కాగా జిల్లా కేంద్రంలో కోర్టు చౌరస్తా నుంచి ప్రారంభించిన యాత్రను బస్టాండ్ వద్ద ముగించారు. డీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ ప్రసంగిస్తూ గణతంత్ర దినోత్సవానికి, భారత రాజ్యాంగానికి ప్రాణం పోసిన అంబేడ్కర్, రాజ్యాంగ ప్రతిమ, రాజ్యాంగ పీఠిక జెడా ఎగరవేసే ప్రతీ చోట ఉంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాకేష్, నరేష్, శ్రీకాంత్, రాజేంద్రప్రసాద్, రవికిరణ్, సదానందం, శ్రీనివాస్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు

- త్వరలో యాదాద్రికి కరీంనగర్ నుంచి స్పెషల్ బస్సులు
- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్


జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రయాణికుల సంక్షేమం, భద్రత కోసం పటిష్ట చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. గురువారం కరీంనగర్–2 డిపోలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా కొనుగోలు చేసిన సూపర్ లగ్జరీ బస్సులను మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కరీంనగర్ డిపోకు కొత్తగా 3 బస్సులు కేటాయించిందని వెల్లడించారు. ఫిబ్రవరి 1 నుంచి కరీంనగర్ నుంచి యాదాద్రికి రోజు 2 బస్సులు నడిపేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ వై.సునీల్‌రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, కార్పొరేటర్లు ఐలేందర్‌యాదవ్, దిండిగాల మధు, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు చల్ల హరిశంకర్, ఆర్టీసీ అధికారులు ఖుస్రో షా ఖాన్, చందర్‌రావు, శివకుమార్, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయ బాలలను సంరక్షించాలి

- అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్


భవనాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ తదితరులు

కరీంనగర్: జిల్లాలో నిరాశ్రయులుగా ఉన్న బాలలను అక్కున చేర్చుకొని సంరక్షించాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని 59వ డివిజన్‌లో ప్రభుత్వ, ప్రభుత్వేతర ఎన్‌జీఓలు సంయుక్తంగా నిర్వహించనున్న బాలుర ఓపెన్ షెల్టర్ భవనాన్ని జెడ్పీ సీఈఓ ప్రియాంక, ట్రెయినీ కలెక్టర్ లెనిన్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో తప్పిపోయిన, భిక్షాటన చేస్తున్న, నిరాశ్రయులుగా మిగిలిన 6 నుంచి 18 ఏళ్ల లోపు బాలికల కోసం ఇప్పటికే సంరక్షణ కేంద్రాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ, ఆప్తమిత్ర స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యంలో బాలలకు సంరక్షణ కేంద్రాన్ని గురువారం ప్రారంభించడం జరిగిందన్నారు. కేంద్ర సంరక్షణలో ఉన్న పిల్లల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలని, ఈ కేంద్రాలకు వచ్చే వారికి నాణ్యమైన విద్య, ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సంరక్షణ కేంద్రంలో జాతీయ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గందె మాధవి, జిల్లా సంక్షేమ అధికారి సబిత, జిల్లా వైద్యాధికారి డా.జువేరియా, ఆర్గనైజ్ నిర్వాహకుడు కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి


కొమ్ము రాజు(ఫైల్)


ఘటన స్థలంలో రాజు మృతదేహం

జూలపల్లి(పెద్దపల్లి): మండలంలోని వెంకట్రావుపల్లె గ్రామానికి చెందిన కొమ్ము రాజు(24)బుధవారం రాత్రి కాచాపూర్ నుంచి వడ్కాపూర్ వెళ్లే దారి పక్కన అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. మృతుడి తండ్రి కొమ్ము రాజేశం, పోలీసుల కథనం ప్రకారం.. బుధవారం సాయంత్రం 6.30 గంటలకు రాజు తన పల్సర్ బైక్ బయటకు వెళ్లి ఎంతకు తిరిగిరాలేదు. దీంతో రాజు తమ్ముడు సతీష్, తండ్రితో కలిసి వెదుకుతుండగా, కాచాపూర్ పెట్రోల్ బంకు సమీపంలో బైక్ పక్కన మృతిచెంది ఉన్నాడు. తన కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నట్లు తండ్రి పేర్కొన్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు.

హరితస్ఫూర్తి పురస్కారానికి రమేశ్ ఎంపిక




ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన దుంపెన రమేశ్ పర్యావరణ పరిరక్షణ హరిత స్ఫూర్తి పురస్కారానికి ఎంపికయ్యారు. హుస్నాబాద్‌కు చెందిన యువచైతన్య వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 29న పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

చందుర్తి(వేములవాడ): మర్రిగడ్డలోని పేకాట స్థావరంపై ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి దాడి చేయగా.. ఐదుగురు పట్టుబడ్డారు. వారి నుంచి రూ.8,300 స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

ప్రమాదమా.. ఆత్మహత్యా..?

- రైలు ఇంజిన్ ముందు భాగంలో చిక్కుకున్న వృద్ధుడి మృతదేహం
- కాజీపేట నుంచి జమ్మికుంటకు చేరిన వైనం
- జమ్మికుంట రైల్వే స్టేషన్ వద్ద తొలగింపు


జిరాక్స్ పేపర్‌లో 'నా చావుకు నేనే కారణం అని రాసి ఉన్న దృశ్యం


రైలు ఇంజిన్ ముందు భాగంలో మృతదేహం

జమ్మికుంట(హుజూరాబాద్): ప్రమాదమో లేదా ఆత్మహత్యకు పాల్పడ్డాడో తెలియదు గానీ.. ఓ వృద్ధుడు రైలు ఇంజిన్ ముందు భాగంలో చిక్కుకోగా, అతడి మృతదేహం కాజీపేట నుంచి జమ్మికుంటకు వచ్చే వరకు అలాగే ఉంది. వరంగల్, ఉప్పల్ రైల్వే స్టేషన్ మధ్య వేరే రైలు లోకో పైలెట్ గుర్తించి జమ్మికుంట రైల్వే మేనేజర్‌కు సమాచారం అందించారు. జమ్మికుంటలో రైలును నిలిపివేసి రెండు గంటల పాటు శ్రమించి మృతదేహాన్ని తొలగించారు. స్థానికులు, మృతదేహాన్ని తొలగించినవారు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా కేంద్రం నయీమ్‌నగర్‌కు చెందిన మున్సిపల్ రిటైర్డ్ ఉద్యోగి ఉప్పలయ్య (70) ప్రమాదమో లేదా ఆత్మహత్యకు పాల్పడ్డాడో తెలియదుగాని అండమాన్ ఎక్స్‌ప్రెస్ రైలు కాజీపేట నుంచి వస్తుండగా ఎస్ క్యాబిన్ వద్ద రైలు ముందుభాగంలో చిక్కుకొని మృతిచెందాడు. జమ్మికుంట వచ్చే వరకు (సుమారు 36 కిలో మీటర్లు) మృతదేహం అలాగే ఉండిపోయింది. జమ్మికుంటలో మృతదేహాన్ని తొలగించి అతడి వద్ద ఉన్న ఆధార్ కార్డు జిరాక్స్‌తో వివరాలు గుర్తించారు. అయితే ఆధార్ కార్డు జిరాక్స్ పేపర్ వెనుక భాగంలో నా చావుకు ఎవరూ కారణం కాదు అని రాసి ఉంది. మృతుడికి భార్య ఉపేంద్ర, కూతురు ఉన్నారు. ఈ ఘటనపై రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ తిరుపతిని అడుగగా, జరిగిన విషయం తెలిసిందని, సంఘటన స్థలానికి వస్తున్నట్లు తెలిపారు.

చేతబడి అనుమానంతో చంపేశారు..

- మల్లాపూర్ వృద్ధుడి హత్య కేసులో ముగ్గురి అరెస్టు
- వివరాలు వెల్లడించిన మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ


మాట్లాడుతున్న సీఐ లక్ష్మీనారాయణ

మల్లాపూర్(కోరుట్ల): మండల కేంద్రానికి చెందిన నూతికట్టు గంగారాం(62)ను చేతబడి చేస్తున్నాడన్న అనుమానంతో హత్య చేశారని మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ముగ్గురు నేరస్తులను అరెస్టు చేశామన్నారు. గురువారం మల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మల్లాపూర్‌కు చెందిన పిల్లి సత్యనారాయణ, ముద్దం నరేష్‌లు కొంత కాలంగా అనారోగ్యంతో ఆసుపత్రి పాలుకావడం, కుటుంబాల్లో అనేక సమస్యలకు గంగారాం చేతబడి చేయడమే కారణమని వారు అనుమానించారు. అతన్ని హత్య చేయాలని నిర్ణయించుకున్నారు. పథకం ప్రకారం ఈ నెల 16న అర్ధరాత్రి ఎల్లాల గోవర్ధన్‌తో కలిసి గంగారాం గొంతునులిమారు. చనిపోయాడని భావించి, బైక్‌పై గ్రామ శివారులోని కోపిగుట్ట వద్దకు తీసుకెళ్లారు. ఆ సమయంలో వృద్ధుడిలో కదలికను గమనించి, పెద్ద బండరాయితో ముఖంపై మోది, హత్య చేశారు. మృతదేహాన్ని ఉపాధిహామీ గుంతలో పూడ్చిపెట్టారు. పైపైన పూడ్చడంతో ఆ మృతదేహాన్ని ఈ నెల 21న అటుగా వెళ్తున్న స్థానికులు గుర్తించారు. వీఆర్ఏ ఎస్సై నవీన్‌కుమార్‌కు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి వెళ్లి, పరిశీలించారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు మృతదేహాన్ని బయటకు తీయగా గంగారాందేనని అతని తమ్ముడి కుమారుడు రవి గుర్తించాడు. హత్యకు గురైనట్లు తేల్చిన పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. ముగ్గురు అనుమానితులు సత్యనారాయణ, నరేష్, గోవర్ధన్‌లను అదుపులోకి తీసుకొని, విచారణ జరుపగా తామే హత్య చేసినట్లు ఒప్పుకున్నారు. దృశ్యం సినిమాలో మాదిరిగా వృద్ధుడి గంగారాం దుస్తులను నరేష్ తన ఇంటి వెనకాల కాల్చివేశామన్నారు. ఫోన్‌ను మెట్‌పల్లి బస్టాండ్‌లో నిజామాబాద్ వెళ్లే ఆర్టీసీ బస్సులో పడేశామని, తర్వాత తిరిగి మల్లాపూర్ వచ్చినట్లు పేర్కొన్నారు. ముగ్గురినీ అరెస్టు చేసి, హత్యకు వినియోగించిన ద్విచక్రవాహనం, బండరాయి, పారను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు. వారిని కోర్టులో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. సమావేశంలో కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఏఎల్పీలో కార్మికుడికి కరెంట్ షాక్


రామకృష్ణను పరామర్శిస్తున్న నాయకులు

రామగిరి(మంథని): సింగరేణి ఏపీఏ పరిధి అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్ట్(ఏఎల్పీ)లో గురువారం వై.రామకృష్ణ అనే ఎలక్ట్రీషియన్ విదుత్ షాక్‌కు గురయ్యాడు. స్థానిక కార్మికుల వివరాల ప్రకారం.. గనిలోని 89వ లెవల్‌లో స్విచ్ వద్ద విద్యుత్ కనెక్షన్ ఇస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు షాక్ తగలడంతో రామకృష్ణ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. గమనించిన తోటి కార్మికులు విద్యుత్ సరఫరా నిలిపివేసి రామకృష్ణను పరిశీలించగా అపస్మారక స్థితిలో ఉన్నాడు. హుటాహుటిన గనిపైకి తీసుకువచ్చి సెంటినరీకాలనీలోని సింగరేణి డిస్పెన్సరీకి తరలించారు. ప్రథమ చికిత్స పొందిన రామకృష్ణ స్పృహలోకి వచ్చాడు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గోదావరిఖనిలోని సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించారు. రామకృష్ణను టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య, ఏఎల్పీ ఫిట్ సెక్రటరీ దాసరి మల్లేశ్ పరామర్శించారు.

ఏఎల్పీలో తప్పిన పెను ప్రమాదం


కూలిపోయిన గ్యాలరీ షెడ్

రామగిరి(మంథని): సింగరేణి ఏపీఏ పరిధి అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్ట్(ఏఎల్పీ)లో గురువారం వేకువజామున పెను ప్రమాదం తప్పింది. గని ఆవరణలో సర్ఫేస్ చైర్ లిఫ్ట్ సమీపంలోని ఏ2 బెల్ట్ గ్యాలరీ షెడ్ ఒక్కసారిగా కూలిపోయింది. గ్యాలరీ షెడ్ కింది నుంచి నిత్యం వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. అయితే గ్యాలరీ షెడ్ కూలిన సమయంలో ఎలాంటి వాహనాలు రాకపోడంతో పెను ప్రమాదం తప్పినట్లయ్యింది. షెడ్ ఒక్కసారిగా కుప్పకూడంతో బొగ్గు రవాణాకు అంతరా యం కలిగి పెద్దఎత్తున నష్టం వాటిల్లినట్లు కార్మికులు వా పోతున్నారు. బొగ్గు ఉత్పత్తిపైన ఉన్న శ్రద్ధ రక్షణపై చూపించకపోవడం వల్లే గనిలో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, రక్షణ చర్యలు తీసుకోని సంబంధిత అధికారులపై యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు కోరుతున్నారు.

కాకతీయ కాలువలో యువకుడి మృతదేహం

- ఈ నెల 23న ప్రమాదవశాత్తు పడి మృతి
- ఉపాధి పనులపై సోషల్ ఆడిట్‌కు వీఆర్‌పీగా వచ్చిన రామకృష్ణాపూర్‌వాసి


సాయికుమార్ (ఫైల్)


మృతదేహంతో ధర్నా చేస్తున్న కుటుంబసభ్యులు

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): ఉపాధిహామీ పనులపై సోషల్ ఆడిట్ చేసేందుకు వీఆర్‌పీగా వచ్చిన మామిడి సాయికుమార్(21) ప్రమాదవశాత్తు కాలువలో పడి, మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. కొడిమ్యాల మండలంలోని రామకృష్ణాపూర్ గ్రామానికి చెందిన సాయికుమార్ ఈ నెల 21న ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయానికి వచ్చి, సోషల్ ఆడిట్ పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 23న మండల పరిషత్ కార్యాలయం వెనక వైపు కాకతీయ కాలువ వద్దకు బహిర్భూమికి వెళ్లి, ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. సాయికుమార్‌తో సోషల్ ఆడిట్‌కు వచ్చినవారు అతను కనిపించడం లేదని చుట్టుపక్కల వెతికారు. సాయికుమార్ తండ్రి నారాయణగౌడ్‌కు ఫోన్ చేస్తే ఇంటికి కూడా రాలేదని సమాధానం ఇచ్చారు. దీంతో ఉపాధిహామీ ఎస్ఆర్ మహేశ్వర్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. గురువారం తాటిపెల్లి వద్ద కాలువలో సాయికుమార్ మృతదేహం లభ్యమైంది. మృతుడి తండ్రి నారాయణ గౌడ్‌కు ఇద్దరు కుమారులు కాగా సాయికుమార్ పెద్ద కొడుకు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు.

మృతదేహంతో ఆందోళన

జగిత్యాల క్రైం: సాయికుమార్ మృతదేహానికి గురువారం పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం అతని కుటుంబసభ్యులు అప్పగించారు. దీంతో వారు మృతదేహాన్ని జగిత్యాల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో గల కరీంనగర్ రహదారిపై ఉంచి, ఆందోళన చేపట్టారు. బాధితులకు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముదుగంటి రవీందర్‌రెడ్డి మద్దతు ప్రకటించారు. విషయం తెలుసుకున్న జగిత్యాల పట్టణ ఎస్సై రహీం, ఇబ్రహీంపట్నం ఎస్సై ఉమాసాగర్‌లు బాధితులతో మాట్లాడారు. న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు శాంతించి, సాయికుమార్ మృతదేహాన్ని స్వగ్రామం తీసుకెళ్లారు.

క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న టీఎన్జీవో నాయకులు

కరీంనగర్ అర్బన్: తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా క్యాలెండర్‌ను టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు మారం జగదీశ్వర్, కార్యదర్శి దారం శ్రీనివాస్‌రెడ్డిలు గురువారం ఆవిష్కరించారు. అంతకుముందు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కోట రామస్వామి, కార్యదర్శి డి.నర్సింహారెడ్డి, జిల్లా సహాయ అధ్యక్షుడు టి.సోమయ్య, కోశాధికారి కొత్త కొండ లక్ష్మీరాజం, నగర శాఖ అధ్యక్షుడు పి.శ్రీనివాస్, కార్యదర్శి సతీశ్, నాయకులు భూమేశ్, ఫరీద, ఉమారాణి, శంకరయ్య, అశోక్, రమేశ్, కొమురయ్య, అంజయ్య, శోభ, రవి, మల్లయ్య, రాజలింగం, ఉస్మాన్‌అలీ, దేవేంద్ర, కిరణ్, దేవేందర్, గంగయ్య, బేగ్, మహబూబ్ అలీ, రాజేశ్వరీ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'కిమ్స్'లో డిగ్రీ పట్టాలు పంపిణీ



పట్టాలు పొందిన విద్యార్థులతో చైర్మన్, వైస్ చైర్మన్లు

కరీంనగర్: కిమ్స్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు డిగ్రీ పట్టాలను గురువారం కిమ్స్ విద్యా సంస్థల చైర్మన్ పెరియాల రవీందర్‌రావు, వైస్ చైర్మన్ పెరియాల సాకేత్‌రావులు అందజేశారు. ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎన్నో రంగాలున్నప్పటికీ హోటల్ మేనేజ్‌మెంట్ చాలా ప్రత్యేకత ఉందని ఈ రంగాన్ని ఎంచుకున్న విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ భూంపల్లి అనూష్‌రెడ్డి, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు విరాళాలు సేకరణ

రామడుగు: మండలంలోని వన్నారం గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు గురువారం విరాళాలు సేకరించారు. జవ్వాజీ నరేష్,జూపాక రమేష్‌ల జ్ఞాపకార్థం చిన్న అంజయ్య రూ. పదివేలు, జవ్వాజీ ప్రకాశ్ రూ. పదివేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జవ్వాజీ హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

జమ్మికుంట: మండలంలోని నగురం గ్రామానికి చెందిన కవ్వంపల్లి రాజేశ్వరి అనారోగ్యంతో బాధపడుతోంది. చికిత్స కోసం హుజూరాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి గెల్లు శ్రీనివాస్‌యాదవ్ బాధిత కుటుంబ సభ్యులకు గురువారం ఎల్‌వోసీ అందజేశారు. మెరుగైన చికిత్సకు ప్రభుత్వం రూ. 90 వేల ఎల్‌వోసీ మంజూరు చేసిందని శ్రీనివాస్ తెలిపారు.

'ఉనికి కోసమే ఆరోపణలు'

శంకరపట్నం: రాజకీయ ఉనికి కోసమే డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ ఆరోపణలు చేస్తున్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్ ఆరోపించారు. కేశవపట్నంలో గురువారం వైస్ఎంపీపీ రమేశ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు సంజీవరెడ్డితో కలిసి మాట్లాడారు. జెడ్పీటీసీ పుట్టిన రోజు వేడుకల్లో యువనాయకులు ఖడ్గం బహూకరించారని, కాంగ్రెస్ నాయకుడి కారు అద్దాలు ధ్వంసం కావడానికి బీఆర్ఎస్‌తో సంబంధం లేదని, రాజకీయ అనుభవం ఉన్నప్పటికీ చిల్లర విమర్శలు చేయడం సరికాదన్నారు. ప్రజల్లో ఎమ్మెల్యేకు వస్తున్న ఆదరణ చూసి తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారని, పద్ధతి మార్చుకోకుంటే కార్యకర్తలకు శిక్షణ ఇస్తామన్నారు.



కరీంనగర్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సుబ్బారాయుడు గురువారం రాష్ట్ర పౌరసరఫరాల, బీసీ సంక్షేమ మంత్రి శాఖ గంగుల కమలాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు.



కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గణతంత్ర వేడుకలు



అదనపు కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో..

మువ్వన్నెల రెపరెపలు

కరీంనగర్‌తో పాటు కరీంనగర్‌రూరల్, కొత్తపల్లి మండలాల్లో గురువారం 74వ గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యా సంస్థలు, సంఘాలు, ఆస్పత్రులు, వివిధ పార్టీల కార్యాలయాలు, గ్రామ పంచాయతీల్లో మువ్వన్నెల జెండాను ఎగురవేశారు. యువత దేశంపై భక్తిభావాలను పెంపొందించుకోవాలన్నారు. విద్యాసంస్థల్లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

– కరీంనగర్/కరీంనగర్‌టౌన్/కరీంనగర్‌సిటీ/సప్తగిరికాలనీ/విద్యానగర్/కరీంనగర్‌రూరల్/కొత్తపల్లి



పోలీస్ కమిషనరేట్ కేంద్రంలో..



నగర పాలక సంస్థ కార్యాలయంలో..



ఆర్టీసీ బస్టాండ్‌లో..



జిల్లా జైల్‌లో..



శాతవాహన యూనివర్సిటీలో..



ఎంపీ కార్యాలయంలో..



డీసీసీ కార్యాలయంలో..



వైఎస్సార్టీపీ ఆధ్వర్యంలో..



కొత్తపల్లి మున్సిపాలిటీలో..



కరీంనగర్ ఎంపీడీవో కార్యాలయంలో



కొత్తపల్లి మండల పరిషత్ కార్యాలయంలో..



మెడికవర్ ఆసుపత్రిలో..



రెనె ఆసుపత్రిలో..



పోచమ్మవాడలోని అంగన్‌వాడీ కేంద్రంలో..

విద్యాసంస్థల్లో..



మానేరు స్కూల్‌లో..



కరీంనగర్‌లోని అల్ఫోర్స్ జెన్‌నెక్స్ట్‌లో..



బిర్లా ఓపెన్‌మైండ్ స్కూల్‌లో..



గోపాల్‌పూర్‌లోని శాతవాహన స్కూల్‌లో..



రేకుర్తిలోని ప్యారడైజ్ స్కూల్‌లో..



భగవతి స్కూల్‌లో..



పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ స్కూల్‌లో..



అచీవర్స్ స్కూల్‌లో..



వాణినికేతన్ స్కూల్‌లో..



సిద్ధార్థ స్కూల్‌లో..



వసంత్‌వ్యాలీ స్కూల్‌లో..



వివేకానంద పాఠశాలలో..

వైభవంగా వసంత పంచమి ఉత్సవాలు



అల్ఫోర్స్ వసంతోత్సవ్-2023 పూజల్లో నరేందర్‌రెడ్డి



కొత్తపల్లి సెయింట్‌జార్జ్‌లో..



మానేరు విద్యాసంస్థల్లో..

కొత్తపల్లి: కరీంనగర్‌లోని అల్ఫోర్స్ ఈటెక్నో కళాశాలలో గురువారం వసంత పంచమి పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అల్ఫోర్స్ వసంతోత్సవ్-2023 పేరిట నిర్వహించిన వేడుకలను ఆ విద్యా సంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. శ్రీసరస్వతి దేవికి పూజలు నిర్వహించి విద్యార్థులకు ఆశీర్వచనాలు అందజేశారు. ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొత్తపల్లి సెయింట్‌జార్జ్‌లో..

కొత్తపల్లిలోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ (సీబీఎస్ఈ) స్కూల్‌లో సరస్వతీ దేవి చిత్రపటానికి పూలమాల సమర్పించిన ప్యారడైజ్, సెయింట్ జార్జ్ విద్యా సంస్థల చైర్మన్ డా.పోతిరెడ్డి ఫాతిమారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. విద్యార్థులకు అక్షరాభ్యాసం చేసి నూతన అడ్మిషన్లు తీసుకున్నారు. ప్రిన్సిపాల్స్ భార్గవ్, వసంత, నిరంజన్, అకాడమిక్ సీఈఓ ఉమాకాంత్, అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పారమిత హెరిటేజ్‌లో..

పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ స్కూల్‌లో సరస్వతీ పూజ, అక్షరాభ్యాసం నిర్వహించారు. వేడుకల్లో పారమిత విద్యా సంస్థల చైర్మన్ ఇ.ప్రసాదరావు, పాఠశాల డైరెక్టర్లు ప్రసూన, రశ్మిత, వినోద్ రావు, రాకేశ్, అనుకర్ రావు, వీయూఎం ప్రసాద్, హనుమంతరావు, ప్రిన్సిపాల్స్, వైస్ ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మానేరు విద్యాసంస్థల్లో..

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థల్లో సరస్వతీదేవి విగ్రహాన్ని పూలమాలతో అలంకరించి విద్యార్థులతో ప్రత్యేక పూజలు చేయించారు. పాఠశాల ఆవరణాన్ని అందంగా ముస్తాబు చేశారు. విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి, డైరెక్టర్లు సునీతరెడ్డి, కడారి కష్టారెడ్డి, కడారి శ్వేతారెడ్డిలతో పాటు ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కొనసాగుతున్న పునఃప్రతిష్ఠాపనోత్సవాలు

నగరంలోని మార్వాడీ మందిర్ పునఃప్రతిష్ఠాపనోత్సవాలు గురువారం వైభవంగా కొనసాగాయి. రాజస్థానీ సేవాసమాజ్, మార్వాడీ మందిర్ కమిటీ ఆధ్వర్యంలో నిర్మించిన రామ, శివ, హనుమాన్ ఆలయాల ప్రతిష్ఠలో భాగంగా రాజస్థాన్-జాలరియా పీఠాధిపతి ఘనశ్యామాచార్య స్వామిజీ ప్రత్యక్ష పర్యవేక్షణలో స్థాపిత దేవతా పూజలు, అగ్నిప్రతిష్ఠ, ధాన్య శయ్యాధివాసములు, స్వామీజీ పాదపూజ, హారతి నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు. – కరీంనగర్‌కల్చరల్

నిరుపేద కుటుంబానికి నీడ

గన్నేరువరం: మండలంలోని మాదాపూర్ గ్రామంలో యువజన సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఇంటి నిర్మాణం(రేకుల షెడ్డు)కు భూమిపూజ చేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన కొర్వి అజయ్‌కుమార్‌సంధ్య కొన్నేళ్లుగా పూరి గుడిసెలో నివసిస్తున్నారు. పేద కుటుంబాలకు ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యువజన సంఘాల నాయకులు అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, ముస్కు ఉపేందర్‌రెడ్డి, మార్గం మల్లేశం, చింతల శ్రీధర్‌రెడ్డి, కొమ్మెర రవీందర్‌రెడ్డి, తిప్పర్తి పరిపూర్ణచారి, కాంతాల మధుకర్‌రెడ్డి, కల్లెం మల్లారెడ్డి, అంజి, కాంతాల రఘుపతిరెడ్డి పాల్గొన్నారు.



భూమిపూజలో యువజన సంఘాల నాయకులు

పవర్‌కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: కరీంనగర్‌లో స్మార్ట్‌సిటీ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 11 కేవీ అల్కాపురి ఫీడర్ పరిధిలోని అల్కాపురి, కోతిరాంపూర్, హనుమాన్‌నగర్, గణేశ్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-2 ఏడీఈ ఎం.సుధీర్ కుమార్ తెలిపారు. అదేవిధంగా 33 కేవీ డబుల్ సర్క్యూట్ లైన్ పనులు జరుగుతున్నందున ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు 11 కేవీ ఇండస్ట్రియల్/పద్మనగర్ ఫీడర్ పరిధిలోని ముద్దసాని గార్డెన్, పద్మనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

వెల్‌కం సార్..




సప్తగిరికాలనీ: కరీంనగర్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సుబ్బారాయుడును గురువారం ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం బాధ్యులతో పాటు పలు క్రీడా సంఘాల బాధ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి జిల్లా క్రీడా రంగా అభివృద్ధికి తమవంతుగా సహాయ సహకారాలు అందించాలని, క్రీడారంగా అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. సీపీని కలిసిన వారిలో ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్యాట్రన్, మానేరు విద్యా సంస్థల అధినేత కడారి అనంతరెడ్డి, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి తెలంగాణ జూడో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఒలింపిక్ సంఘం ఉపాధ్యక్షులు తుమ్మల రమేశ్‌రెడ్డి, సీహెచ్.రమణాచారిలతో పాటు పలువురు ఉన్నారు.

రెండోసారి వరి నాట్లు

- తెగుళ్లతో రైతుల ప్రత్యామ్నాయ చర్యలు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని పలు గ్రామాల్లో యాసంగి సీజన్‌లో ముందస్తు వరి నాట్లేసిన రైతాంగానికి పలు రకాల తెగుళ్లు తీరని నష్టాన్ని కలిగిస్తున్నాయి. మొగిపురుగు, సల్ఫైడ్‌గాయం, జింక్‌లోపం తదితర తెగుళ్లు ఆశించడంతో మొక్క పెరిగే దశలోనే ఎర్రబడి చనిపోతున్నాయి. డిసెంబర్‌లో వరి నాట్లు వేసిన రైతుల పొలాలకు మొగిపురుగు తాకిడి ఎక్కువగా ఉంది. తెగుళ్ల నియంత్రణకు రసాయన మందులను వినియోగించినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో పలువురు రైతులు ఆశలు వదులుకుని పంటను దున్నేస్తున్నారు. మళ్లీ కొత్తగా నాట్లేస్తున్నారు. చెర్లభూత్కూర్‌లో 4 ఎకరాలు, మొగ్దుంపూర్‌లో 3, చామన్‌పల్లిలో 6, బహుదూర్‌ఖాన్‌పేటలో 2, ఇరుకుల్లలో 4 ఎకరాలు మిగితా గ్రామాల్లో దాదాపు 60 ఎకరాల వరకు రైతులు దున్నేసినట్లు ఏవో సత్యం తెలిపారు. ఈ నెలాఖరు వరకు నాట్లేసే అవకాశముండటంతో పలువురు రైతులు తెగుళ్లకు గురైన పొలాలను దున్నుతున్నారని వివరించారు.



చామన్‌పల్లిలో వరిపంటను దున్నుతున్న ట్రాక్టర్

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న సత్యనారాయణరావు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరు జెడ్పీ పాఠశాలకు నోబుల్ ఎడ్యుకేషన్ ఎంపవర్‌మెంట్ సొసైటీ ద్వారా సిమ్సన్ ఫార్మాలిమిటెడ్ అధినేత డాక్టర్ పెంచాల సత్యనారాయణరావు 10 కంప్యూటర్లు, 10 టేబుళ్లు, 20కుర్చీలను బహూకరించారు. గురువారం సత్యనారాయణరావు కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించి విద్యార్థులకు కంప్యూటర్ నేర్పించేందుకు వీలుగా రెండేళ్లపాటు ఇన్‌స్ట్రక్టర్‌ను ఏర్పాటు చేస్తానని తెలిపారు. తాను ఈ పాఠశాలలోనే ఏడో తరగతి వరకు చదువుకున్నానని, అనంతరం గురుకుల పాఠశాలకు ఎంపికై చదువుకుని ఉన్నతస్థాయికి వచ్చినట్లు వివరించారు. చదువుకున్న పాఠశాలకు కొంత సాయం చేయాలనే ఉద్దేశ్యంతో కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు, సొసైటీ చైర్మన్ సురేశ్‌కుమార్, తిరుమల డయాగ్నొస్టిక్ అధినేత జీవన్‌రెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ రాజు తదితరులు పాల్గొన్నారు.



కర్తవ్యపథ్‌లో అబ్బురపరిచిన కోనసీమ 'ప్రభ'

సాక్షి ,అమలాపురం: రిపబ్లిక్ డే వేడుకల్లో భాగంగా దేశ రాజధాని ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో జరిగిన పరేడ్‌లో ఏపీలోని కోనసీమ ప్రాంతంలోని ప్రబల తీర్థం శకటాన్ని ప్రదర్శించారు. కనుమ పండుగ రోజు జగన్న తోటలో జరిగే ప్రబల తీర్థంను శకటంగా రూపొందించారు. వేడుకల్లో మొత్తం 17 రాష్ట్రాలకు చెందిన శకటాలను ప్రదర్శించగా..అందులో ఏపీ నుంచి ప్రబలతీర్థం ఒకటి కావడం విశేషం.




'ఎట్ హోమ్' కార్యక్రమంలో గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ దంపతులు, సీఎం వైఎస్ జగన్, ఆయన సతీమణి వైఎస్ భారతి, హైకోర్టు సీజే జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, ఆయన సతీమణి సుచేత మిశ్రా

ఏపీ రాజ్‌భవన్‌లో సందడిగా 'ఎట్ హోమ్'

సాక్షి, అమరావతి: గణతంత్ర దినోత్సవం సందర్భంగా విజయవాడలోని రాజ్‌భవన్‌లో 'ఎట్ హోమ్' కార్యక్రమం గురువారం సందడిగా జరిగింది. ఏటా గణతంత్ర దినోత్సవం రోజున ప్రముఖులకు గవర్నర్ తేనీటి విందు ఇవ్వడం సంప్రదాయంగా వస్తోంది. దీన్ని అనుసరించి గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ రాజ్‌భవన్‌లో గురువారం 'ఎట్ హోమ్' కార్యక్రమం నిర్వహించారు. గవర్నర్ దంపతులు, సీఎం వైఎస్ జగన్, ఆయన సతీమణి వైఎస్ భారతి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, ఆయన సతీమణి సుచేత మిశ్రా ఒకే చోట ఆసీనులై రాజ్‌భవన్ ఆతిథ్యాన్ని స్వీకరించారు. పలు అంశాలపై వారు సరదాగా మాట్లాడుకోవడం అందరి దృష్టిని ఆకర్షించింది. ప్రతిపక్ష నేత చంద్రబాబు సహా టీడీపీ, బీజేపీ, జనసేన, వామపక్ష పార్టీల ప్రతినిధులు 'ఎట్ హోమ్' కార్యక్రమానికి గైర్హాజరయ్యారు.

ఎక్కడికక్కడ గొడవలకు దిగండి

- ఎలాగైనా సరే లోకేశ్ పాదయాత్రకు హైప్ తేవాలి
- వైసీపీ నేతలు, పోలీసులు, ట్రాఫిక్ ఆంక్షలు.. ఏదో ఓ కారణం
- 'సాక్షి' విలేకరులను కొట్టినా ఫర్వాలేదు మనకు కావాల్సింది మీడియా ఫోకస్
- సాదాసీదాగా సాగితే ఇతరులెవ్వరూ పట్టించుకోరు
- టీడీపీ శ్రేణులకు చంద్రబాబు సూచన



సాక్షి నెట్‌వర్క్ : 'లోకేశ్ బాబు పాదయాత్రకు పెద్దఎత్తున హైప్ తీసుకురావాలి. సాదాసీదాగా సాగిపోతే మన మీడియా తప్ప ఇతర ఎలక్ట్రానిక్ మీడియా కవరేజీ ఉండదు. వాళ్లు టీఆర్‌పీ రేటింగ్స్ చూసుకుంటారు. అందువల్ల ప్రతిచోటా ఇష్యూ చేయాలి. వైసీపీ వాళ్లు అడ్డుకుంటున్నారనో.. పోలీసులు జనాన్ని రాకుండా నియంత్రిస్తున్నారనో.. ట్రాఫిక్ క్రమబద్ధీకరించలేదనో.. సరైన రక్షణ కల్పించలేదనో.. ఏది వీలైతే దానిమీద గొడవలకు దిగండి.. మనకు కావాల్సింది మీడియా ఫోకస్..' అంటూ చంద్రబాబు చిత్తూరు జిల్లా టీడీపీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. శుక్రవారం ప్రారంభం కానున్న లోకేష్ పాదయాత్ర సందర్భంగా చంద్రబాబు గురువారం జిల్లాకు చెందిన ముఖ్యమైన టీడీపీ నాయకులతో టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా పలు ఆదేశాలు జారీ చేశారు. 'కవరేజ్ పేరుతో సాక్షి విలేకరులు వస్తే తరిమికొట్టండి. మన వ్యూహాలు, వ్యవహారాలు కనిపెట్టి బట్టబయలు చేస్తారు. వారి విషయంలో జాగ్రత్తగా ఉండాలి. బెదిరించండి.. కొట్టినా ఫర్వాలేదు.. విలేకరి అని తెలియదు.. అనుమానాస్పదంగా తిరుగుతుంటే పట్టుకొన్నాం.. అని తర్వాత చెప్పుకోవచ్చు' అని నాయకులకు సూచించినట్లు తెలిసింది.

నాయకులపై నమ్మకం లేకే..

లోకేశ్ పాదయాత్ర కోసమని కొన్ని కమిటీలు ఏర్పాటు చేసినప్పటికీ, కీలకంగా వ్యవహరించే ప్రత్యేక టీమ్ ఒకటి మూడు రోజుల క్రితమే చిత్తూరు జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో పర్యటించింది. దాదాపు 500 మంది సభ్యులున్న వీరు గురువారం కుప్పం చేరుకున్నారు. లోకేశ్ కీలక బాధ్యతలన్నీ చంద్రబాబు వారికే అప్పగిస్తుండటంతో స్థానిక నేతలు చిన్నబుచ్చుకున్నారు. తాము గొడ్డుచాకిరీ చేసి, గొడవలకు దిగి కేసుల్లో ఇరుక్కుంటుంటే.. బయట వాళ్లకు పెత్తనం ఇవ్వడమేమిటని అంతర్గతంగా వాపోతున్నారు. లోకేశ్ పాదయాత్ర రూట్‌మ్యాప్ ప్రకారం ముందస్తు ఏర్పాట్లు చేయటంతో పాటు ఎక్కడికక్కడ టీడీపీకి అనుకూలురను సమీకరించి.. నాటకీయ పరిణామాలను సృష్టించేందుకు ఈ టీమ్ ప్లాన్ చేస్తోంది. అయితే, ఆ వ్యవహారాలు ఏమిటనేది పార్టీ ముఖ్య నాయకులకు తప్ప ఇతరులకు తెలియకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు పార్టీ శ్రేణులు చెబుతున్నాయి.

నేడు బంగాళాఖాతంలో అల్పపీడనం!

- సముద్రంలో అధిక తేమ ఉండడమే కారణం
- 29, 30 తేదీల్లో దక్షిణ కోస్తాలో తేలికపాటి వర్షాలు

సాక్షి, విశాఖపట్నం: ఆగ్నేయ బంగాళాఖాతంలో తూర్పు భూమధ్య రేఖా ప్రాంతానికి ఆనుకుని ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో శుక్రవారం అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడనుంది. అనంతరం ఈ అల్పపీడనం పశ్చిమ వాయవ్య దిశగా మూడు రోజులపాటు నెమ్మదిగా పయనిస్తుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) గురువారం రాత్రి నివేదికలో తెలిపింది. ఫలితంగా ఈ నెల 29, 30 తేదీల్లో దక్షిణ కోస్తాంధ్రలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా జనవరి మొదటి వారం తర్వాత బంగాళాఖాతంలో అల్పపీడనాలు అరుదుగా ఏర్పడుతుంటాయి. అంతకుముందే ఈశాన్య రుతుపవనాలు కూడా నిష్క్రమిస్తాయి. దీంతో వర్షాలకు ఆస్కారం ఉండదు. కానీ, ప్రస్తుతం సముద్రంపై తేమ అధికంగా ఉండడం వల్ల ఉపరితల ఆవర్తనం, అల్పపీడనం ఏర్పడడానికి దోహదపడుతోందని విశాఖలోని తుపాను హెచ్చరికల కేంద్రం అధికారులు 'సాక్షి'కి తెలిపారు. మరోవైపు ఏపీలో కనిష్ఠ ఉష్ణోగ్రతల క్షీణత కొనసాగుతూనే ఉంది. కొద్దిరోజుల నుంచి ఏజెన్సీ ఏరియాతోపాటు రాయలసీమలో రాత్రి ఉష్ణోగ్రతలు అత్యల్పంగా నమోదవుతున్నాయి.

కాంగ్రెస్‌తోనే ప్రజాసంక్షేమం

- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి
- రాష్ట్రంలో తాగుబోతు పాలన సాగుతోందని ధ్వజం
- వికారాబాద్ జిల్లాలో హాథ్ సే హాథ్ జోడో యాత్ర ప్రారంభం
- రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వ్యవసాయానికి ఉచిత కరెంటు, రూ.2 లక్షల రుణమాఫీ, 2 లక్షల ఉద్యోగాలిస్తామని హామీ



యాత్రలో మహిళలతో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

బొంరాస్‌పేట/సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీతోనే ప్రజా సంక్షేమం సాధ్యమని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో తాగుబోతు పాలన కొనసాగుతోందని ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ధ్వజమెత్తారు. గురువారం ఆయన వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేట మండలం మదన్‌పల్లి నుంచి హాథ్‌సే హాథ్ జోడో యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఉచితంగా ఇందిరమ్మ ఇళ్లు, భార్యాభర్తలకు వృద్ధాప్య పింఛన్లు, వ్యవసాయానికి ఉచిత కరెంటు, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, 2 లక్షల ఉద్యోగాభర్తీ వంటి హామీలు ఇచ్చారు. ముఖ్యమంత్రి కేసీఆర్ బంగారు తెలంగాణ పేరుతో ధరలు పెంచి పేదలను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లను పదవుల నుంచి తప్పించాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని ప్రజలను కోరారు. వికారాబాద్ జిల్లాలో కొత్తగా ఏర్పడిన దుద్యాల మండల కేంద్రంలో కూడా రేవంత్ యాత్ర కొనసాగింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చారు.

పార్టీ ఫిరాయిస్తే ఉరి శిక్ష విధించాలి

బాబాసాహెబ్ అంబేడ్కర్ రూపకల్పన చేసిన రాజ్యాంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అపహాస్యం చేశాయని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఫిరాయింపులను ప్రోత్సహించి రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన 9 ప్రభుత్వాలను బీజేపీ కూలదోసిందని విమర్శించారు.గురువారం ఉదయం ఆయన గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని గాంధీభవన్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయిస్తే వారి సభ్యత్వాన్ని రద్దు చేయాలని అన్నారు. అవసరమైతే ఉరి వంటి కఠిన శిక్షలను అమలు చేసే విధానాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. గణతంత్ర దినోత్సవాన్ని ప్రగతిభవన్, రాజ్‌భవన్‌లకు పరిమితం చేసి.. సీఎం కేసీఆర్ ప్రజాస్వామ్యాన్ని నవ్వులపాలు చేశారని విమర్శించారు. గణతంత్ర దినోత్సవాన్ని జరపాలని హైకోర్టు, ప్రభుత్వానికి చెప్పాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ మాజీ చీఫ్ పొన్నాల, ఏఐసీసీ కార్యదర్శి నదీమ్ జావీద్, ఏఐసీసీ జాతీయ అధికార ప్రతినిధి పవన్ ఖేరా, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మిర్చి రైతులతో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

ప్రజాసమస్యలపై అసెంబ్లీలో నిలదీస్తా

'హాథ్ సే హాథ్ జోడో'లో భట్టి విక్రమార్క

ఎర్రుపాలెం: వచ్చే నెల 3వ తేదీ నుంచి జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తామని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం మామునూరు గ్రామంలో గురువారం రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పించి కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించిన ఆయన హాథ్ సే హాథ్ జోడో యాత్రను ప్రారంభించారు. గ్రామంలో కాలినడకన పర్యటిస్తూ మిర్చి రైతుల కష్టాలు, కూలీలు సమస్యలు వినడంతో పాటు ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈసందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రధాని మోదీ పాలనలో ప్రజల మధ్య ఆర్థిక అసమానతలు పెరిగిపోయాయని విమర్శించారు. ప్రధాని, కేంద్రమంత్రి అమిత్‌షా కలిసి దేశ సంపదను అంబానీ, అదానీలకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. ఏ కాయకష్టం చేయకుండానే అంబానీ, అదానీలు లక్షల కోట్లు ఎలా సంపాదించారో చెప్పాలని భట్టి ప్రశ్నించారు. ప్రజలకు మాయమాటలు చెప్పి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం లౌకిక వాదాన్ని పక్కకు పెట్టి మతం పేరిట ప్రజలను విడగొట్టి వైషమ్యాలను పెంచుతూ లబ్ధికి యత్నిస్తోందని ధ్వజమెత్తారు.

ఈటలకు ఆ విషయం ఆలస్యంగా అర్థమైంది

- మీడియాతో చిట్‌చాట్‌లో రేవంత్‌రెడ్డి
- పొంగులేటితో భట్టి మాట్లాడుతున్నారు
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎన్నికల్లో పోటీ వయసును తగ్గిస్తాం

సాక్షి, హైదరాబాద్: బీజేపీలో కూడా కేసీఆర్ కోవర్టులు ఉన్నారనే విషయం మాజీ మంత్రి ఈటల రాజేందర్‌కు కొంత ఆలస్యంగా అర్థమైందని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఏ లక్ష్యం కోసం రాజేందర్ బీజేపీలోకి వెళ్లారో అది అక్కడ నెరవేరడం లేదన్న విషయం ఆయన మాటల్లో స్పష్టమవుతోందని అన్నారు. గురువారం గాంధీభవన్‌లో జరిగిన రిపబ్లిక్ డే ఉత్సవాల్లో పాల్గొన్న అనంతరం ఆయన ఇతర నాయకులతో కలసి మీడియాతో చిట్‌చాట్ చేశారు. కేసీఆర్‌ను గద్దెదించాలన్న లక్ష్యంతో ఈటల రాజేందర్ బీజేపీలో చేరారని, కానీ బీజేపీలోకి వెళ్లాక ఈటలకు అక్కడ కూడా కేసీఆర్ కోవర్టులు ఉన్నారని అర్థమైందని, దీంతో తన లక్ష్యసాధన కోసం ప్రత్యామ్నాయ మార్గం వెతుక్కోవాల్సి పరిస్థితి వచ్చిందని అన్నారు. రాజేందర్‌కు ఇష్టం లేని పనులను కేసీఆర్ చేయిస్తున్నారన్నారు. లెఫ్టిస్ట్ అయిన రాజేందర్‌ను బీజేపీలోకి వెళ్లేలా చేశారని, హుజూరాబాద్‌లో డబ్బులు పంచేలా చేశారని పేర్కొన్నారు. రాజేందర్‌తో పాటు బీజేపీలో చేరిన నాయకులు ఇప్పుడు ఆ పార్టీలో సంతృప్తిగా లేరని అన్నారు. ఈటల, వివేక్, విశ్వేశ్వర్ రెడ్డి.. బీజేపీ సిద్ధాంతాలను విశ్వసించరని, కేవలం కేసీఆర్‌ను మాత్రమే వ్యతిరేకిస్తారని చెప్పారు. ఇప్పుడు ఎవరి దారి వారు చూసుకునే పరిస్థితి వచ్చిందని వ్యాఖ్యానించారు.

పొంగులేటితో చర్చలు..

ఖమ్మంలో పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో భట్టి విక్రమార్క మాట్లాడుతున్నారని, పార్టీ అధిష్టానం భట్టికి ఆ బాధ్యతను అప్పగించిందని రేవంత్‌రెడ్డి వెల్లడించారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని కఠినతరం చేస్తామని, శాసనసభకు పోటీ చేసే వయసును 25 సంవత్సరాల నుంచి 21కి తగ్గిస్తామని చెప్పారు. కాంగ్రెస్ నేతలు కోదండరెడ్డి, చెరుకు సుధాకర్ మాట్లాడుతూ, కమ్యూనిస్టులు కేసీఆర్‌కు కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. ఈటల ఇప్పుడు బాధపడి ప్రయోజనం లేదని అన్నారు.

15 రోజుల గడువు... 10 నెలలు గడిచింది!

- గిరిజన సంక్షేమ శాఖలో నిధుల గోల్‌మాల్‌పై ఏటూ తేల్చని త్రీమెన్ కమిటీ
- కంప్యూటర్ల మరమ్మతు, పరికరాల కొనుగోళ్లలో నిధుల మళ్లింపు
- ఒకే ఏజెన్సీకి రూ.20 లక్షలకుపైగా నిధుల బదిలీ
- విచారణకు ఆదేశించిన కమిషనరేట్.. పది నెలలు గడిచినా ఫలితం శూన్యం



సాక్షి, ఆసిఫాబాద్: గిరిజన సంక్షేమ శాఖలో కంప్యూటర్ పరికరాల కొనుగోలు, మరమ్మతుల పేరిట నిధుల గోల్‌మాల్ వ్యవహారంలో విచారణ పడకేసింది. 2016 నుంచి 2022 మార్చి మధ్య జరిగిన లావాదేవీల్లో అవకతవకలు వెలుగు చూడగా.. సుమారు రూ.20 లక్షలకుపైగా నిధులను శాఖకు చెందిన సిబ్బంది ప్రైవేటు ఖాతాలకు మళ్లించిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై కమిషనరేట్ ఉన్నతాధికారులు ఆరా తీసి ఐటీడీఏ పీవోను విచారణకు ఆదేశించారు. ఆయన త్రీమెన్ కమిటీని ఏర్పాటు చేసి 15 రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని స్పష్టం చేశారు. పది నెలలు గడుస్తున్నా అడుగు ముందుకు పడకపోవడంతో త్రీమెన్ కమిటీ, ఐటీడీవో ఉన్నతాధికారుల చిత్తశుద్ధిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా గిరిజన సంక్షేమశాఖలో చోటుచేసుకున్న నిధుల గోల్‌మాల్ వ్యవహారంపై విచారణ సాగేనా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. 2016- 2022 సంవత్సరాల మధ్య జిల్లాలో కంప్యూటర్ మరమ్మతులు, ఎలక్ట్రానిక్ పరికరాల కొనుగోలు పేరిట పెద్ద మొత్తంలో నిధులు ప్రైవేటు వ్యక్తుల ఖాతాలకు మళ్లించారు. ఈ ఘటన అప్పట్లో వెలుగులోకి రావడంతో నిధుల గోల్‌మాల్ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ విచారణకు ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారిని ఆదేశించారు. అయితే సంబంధిత బాధ్యులు పొంతలేని సమాధానాలు ఇవ్వడంతో కలెక్టర్ సమగ్ర విచారణ చేపట్టాలని నిర్ణయించారు. దీంతో ఐటీడీఏ పీవో గతేడాది మార్చి 29న త్రీమెన్ కమిటీని నియమించి 15 రోజుల్లోగా నిజాలు నిగ్గుతేల్చి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

త్రీమెన్ కమిటీ దాటవేత ధోరణి..

ముగ్గురు సభ్యులతో కూడిన విచారణ కమిటీలో ఐటీడీఏ అధికారులు షేక్ కరీం, పీవీ రమణ, రాంబాబు ఉన్నారు. పీవో ఆదేశానుసారం వీరు గతేడాది మార్చి 29 నుంచి ఏప్రిల్ 14 మధ్య విచారణ పూర్తిచేసి నివేదికను పీవోకు అందించాల్సి ఉంది. నాటి నుంచి నేటి వరకు త్రీమెన్ కమిటీ దాటవేత ధోరణి అనుసరించడం తప్ప ఇప్పటి వరకు విచారణకు సంబంధించి ఒక్క అడుగు కూడా ముందుకు వేయకపోవడం గమనార్హం.

అధికారుల చిత్తశుద్ధిపై అనుమానాలు

జిల్లా గిరిజన సంక్షేమ శాఖలో అవినీతి గుట్టురట్టు చేసే విషయంలో అధికారులు చిత్తశుద్ధిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మొక్కుబడిగా కమిటీని నియమించి కాలయాపన చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నారు. నిధుల గోల్‌మాల్ వ్యవహారం శాఖాధికారులకు సంబంధం ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. దీంతో కావాలనే విచారణను తొక్కి పెడుతున్నారన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.

గోల్‌మాల్ జరిగిందిలా..

కంప్యూటర్ మరమ్మతులు, పరికరాల కొనుగోళ్ల పేరిట సాగిన ఈ తతంగంలో లక్షలాది రూపాయలు స్వాహా అయ్యాయి. అందునా ఒకే ఏజెన్సీకి 2016 నుంచి 2022 వరకు దాదాపు రూ.20 లక్షలకుపైగా నిధులు ఇంటిగ్రేటెడ్ పేమెంట్ సిస్టం నుంచి బదిలీ చేయడం విశేషం. ఇందులో 0201 కోడ్ ద్వారా ఓ కంప్యూటర్ కేంద్రానికి చెందిన 34843233795 అనే అకౌంట్‌కు చెల్లింపులు జరిపారు. ఇందులో 2018–19 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.2.76 లక్షలను బదిలీ చేయగా.. 2019–20లో మరో రూ.4.61 లక్షలు.. 2020– 21లో ఏకంగా రూ.11.17 లక్షలు నిధులను బదిలీ చేశారు. అయితే ఇంత పెద్దమొత్తంలో నిధుల దుర్వినియోగం ఎలా జరిగింది అంటే ఎవరూ సమాధానం చెప్పడం లేదు. అడ్డగోలుగా సాగిన ఈ వ్యవహారంపై విచారణకు ఆదేశించినా నేటికీ నిజాలు వెలుగులోకి రాకపోవడం వెనుక అధికార పార్టీకి చెందిన ఓ నేత హస్తం ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అందువల్లే విచారణను తొక్కి పెట్టారని సమాచారం. కమిటీ సభ్యులు సైతం నేటికీ జిల్లా కేంద్రానికి రాకపోవడం కూడా ఇందుకు కారణమని ఆ శాఖ వర్గాలే బహిరంగంగా పేర్కొంటున్నాయి.

ప్రజాస్వామ్యం దారి తప్పితే అదుపు చేసేదే రాజ్యాంగం

- రాజ్యాంగ రచనలో అంబేడ్కర్ పాత్ర అనిర్వచనీయం
- నల్సార్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కరణం మురళి



మాట్లాడుతున్న నల్సార్ ప్రొఫెసర్ కరణం మురళి

కరీంనగర్‌కల్చరల్: భారతదేశ రాజ్యాంగం ప్రపంచానికే ఆదర్శమని, ప్రజాస్వామ్య ప్రభుత్వాలు దారితప్పినప్పుడు అదుపు చేసేదే రాజ్యాంగమని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ డాక్టర్ కరణం మురళి అన్నారు. తెలంగాణ రచయితల వేదిక- కరీంనగర్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ఫిలింభవన్‌లో 'రాజ్యాంగ రచన-అంబేడ్కర్ కృషి' పేరిట జరిగిన అవగాహన సదస్సులో ఆయన ప్రధానవక్తగా హాజరై మాట్లాడారు. కులం, నిచ్చెనమెట్ల వ్యవస్థ, అంటరానితనం, అణిచివేత లాంటివి అదుపు చేసేందుకు రాజ్యాంగంలో దూరదృష్టితో డాక్టర్ అంబేడ్కర్ పలుచట్టాలను పొందుపరిచారని అన్నారు. సమన్యాయం కోసం సగటు మనుషులకు రాజ్యాంగ ఫలాలు అందించేందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగ రచన కమిటీ చైర్మన్‌గా వ్యవహరించారని అన్నారు. సామాజిక రాజకీయార్థిక న్యాయం ఆనాదిగా స్వేచ్ఛ సమానత్వాలను కాంక్షించి అత్యుత్తమ రాజ్యాంగ పీఠికను అంబేడ్కర్ అందించారన్నారు. రిజర్వేషన్లు పాజిటివ్ హక్కులుగా ఆయన అభివర్ణించారు. తెరవే జిల్లా అధ్యక్షుడు కందుకూరి అంజయ్య అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు రఘుశంకర్‌రెడ్డి, వి.పెంటయ్య, సహాయచార్యులు కె.రామచంద్రం, కొడిముంజ శంకర్, జేవీవీ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, కఫిసో అధ్యక్షుడు రవిచంద్ర, రచయితలు అన్నవరం దేవేందర్, బూర్ల వెంకటేశ్వర్లు, సి.వి.కుమార్, కూకట్ల తిరుపతి, బుర్ర తిరుపతి, ఐలన్న పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో ఎన్టీపీసీ ప్రధాన భూమిక

- వార్షిక లక్ష్య సాధనలో ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు
- సమష్టి కృషితోనే ఉత్తమ ఫలితాలు సాధ్యం
- ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునీల్‌కుమార్



మాట్లాడుతున్న ఈడీ సునీల్‌కుమార్

జ్యోతినగర్: దేశ అభివృద్ధిలో ఎన్టీపీసీ సంస్థ ప్రధాన భూమిక పోషిస్తోందని రామగుండం ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. గురువారం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని మహాత్మగాంధీ క్రీడా మైదానంలో 74వ గణతంత్ర వేడుకల్లో భాగంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. సీఐఎస్ఎఫ్ సిబ్బంది, విద్యార్థుల గౌరవవందనం స్వీకరించారు. ఎన్టీపీసీ అద్భుతమైన చరిత్ర, దేశ అభివృద్ధిలో తనవంతు సహకారం అందిస్తోందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో సంస్థ కృషి అమోఘమన్నారు. ప్రాజెక్టు అభివృద్ధిలో ఉత్తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని, ఇందుకు అధికారులు, ఉద్యోగుల బృందాన్ని అభినందించారు. అత్యుత్తమ పనితీరు కనబరిచిన ఉద్యోగులకు బిజినెస్ యూనిట్ హెడ్ (బీయూహెచ్) మెరిటోరియస్ అవార్డులను అందజేశారు. పరేడ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి, ఉత్తమ బృందానికి బహుమతులు అందజేశారు. స్పోర్ట్స్ కౌన్సిల్ సభ్యులను అవార్డులతో ప్రోత్సహించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జనరల్ మేనేజర్లు ప్రసేంజిత్ పాల్, ఏజీఎం(హెచ్‌ఆర్)విజయలక్ష్మీ, ఎన్టీపీసీ ఉన్నతాధికారులు, సీఐఎస్ఎఫ్ అధికారులు, దీప్తి మహిళా సమితి సభ్యులు, ఉద్యోగ గుర్తింపు సంఘం, అధికారుల సంఘం, వివిధ యూనియన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

వివాహ వేడుకలో 'గణతంత్ర' సంబురం



జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న వధూవరులు, కుటుంబ సభ్యులు

ఆదిలాబాద్: సాధారణంగా స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవం వంటి జాతీయ పండుగలను విద్యాసంస్థలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తుంటారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రజాప్రతినిధి కుటుంబ వివాహ వేడుకలో గణతంత్ర దినోత్సవ వేడుకలను జరుపుకొని తమ దేశభక్తిని చాటుకున్నారు. ఆదిలాబాద్ మున్సిపల్ ఒకటో వార్డు కౌన్సిలర్ గంద్రత్ రేఖ-కేశవ్ దంపతుల కుమారులైన మహేందర్, నరేందర్‌ల వివాహం భవాని, సౌమ్యలతో గురువారం ఆదిలాబాద్‌లోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని వధూవరులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వివాహ సంబురాన్ని రెట్టింపు చేసుకున్నారు.

కొద్ది గంటల్లో పెళ్లి.. గుండెపోటుతో వరుడు మృతి



సత్యనారాయణచారి(ఫైల్)

ఉట్నూర్: ఆ ఇంట పెళ్లి సందడి మొదలైంది.. బంధువులతో హడావుడి నెలకొంది. మరికొన్ని గంటల్లో పెళ్లి పీటలు ఎక్కాల్సిన వరుడి గుండె ఒక్కసారిగా ఆగింది. తమ కుమారుడు ఓ ఇంటివాడు అవుతాడనే ఆనందంలో ఉన్న తల్లిదండ్రులకు తీరని దుఃఖం మిగిలింది. ఈ సంఘటన ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో గురువారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉట్నూర్ మండల కేంద్రంలోని అంగడిబజార్‌కు చెందిన రావుల శంకరాచారి, భూలక్ష్మి దంపతుల కుమారుడు సత్యనారాయణచారి బంగారం దుకాణంలో పని చేస్తుంటాడు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన ఓ యువతితో వివాహం నిశ్చయమైంది. ఈ నెల 27న పెళ్లి జరగాల్సి ఉంది. కొద్ది రోజుల నుంచే సత్యనారాయణచారి కుటుంబ సభ్యులు పెళ్లి పనులు చేస్తున్నారు. బంధుమిత్రులకు శుభలేఖలు పంపిణీ చేశారు. బుధవారం సాయంత్రం వరకు సత్యనారాయణచారి పెళ్లి పనుల్లో నిమగ్నమయ్యాడు. సత్యనారాయణకు గురువారం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు రెఫర్ చేశారు. అక్కడికి తరలించి చికిత్స అందించేలోపే సత్యనారాయణ(34) మృతిచెందాడు. కొన్ని గంటలు గడిస్తే పెళ్లి భాజాలు మోగాల్సి ఉండగా చావు డప్పు మోగింది. సత్యనారాయణచారి మృతితో విషాదం నెలకొంది.

ఆర్‌ఎఫ్‌సీఎల్ ఉత్పత్తిలో 50శాతం రాష్ట్రానికే..



మాట్లాడుతున్న ఆర్‌ఎఫ్‌సీఎల్ సీఈవో అలోక్ సింఘాల్

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి అవుతున్న యూరియాలో 50 శాతం తెలంగాణ రాష్ట్రానికే కేటాయిస్తున్నామని కర్మాగారం సీఈఓ అలోక్ సింఘాల్ అన్నారు. గురువారం కర్మాగారంలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో భాగంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఉద్యోగుల భద్రతతో కూడిన ఉత్పత్తి లక్ష్యంగా యాజమాన్యం పనిచేస్తోందన్నారు. కర్మాగారంలో ఉత్పత్తిలో 50 శాతం దేశంలోని ఇతర రాష్ట్రాలకు అందిస్తున్నామని వివరించారు. తెలంగాణలో రైతాంగానికి యూరియా కొరత లేకుండా చూస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం చిన్నారులు చేసిన సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎఫ్‌సీఎల్ సైట్ ఇన్‌చార్జి ఎస్‌.కె.ఝా, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సాక్షి యూనిట్ కార్యాలయంలో గణతంత్ర వేడుకలు



జెండా ఆవిష్కరిస్తున్న బ్రాంచి మేనేజర్ శ్రీనివాస్

తిమ్మాపూర్ (మానకొండూర్): మండల కేంద్రంలోని సాక్షి యూనిట్ కార్యాలయంలో 74వ గణతంత్ర వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. బ్రాంచిమేనేజర్ వైద శ్రీనివాస్ జెండా ఎగురవేశారు. సిబ్బందికి స్వీట్లు పంపిణీ చేశారు.

పద్మభూషణ్

సుమన్ కల్యాణ్‌పూర్, లత ఒక విధంగా
ఒకే మెట్టు మీద ఉండాలి.
లత అభిమానులు కూడా
సుమన్ కల్యాణ్‌పూర్ గొంతు లతాతో సమానం అంటారు.
కాని సుమన్‌కు చాలా కొద్ది పాటలు లభించాయి.
ఆమెను కొందరు ఎదగనివ్వలేదని అంటారు.
బిడియం, హుందాతనం ఉన్న సుమన్ కల్యాణ్‌పూర్
అవకాశాల కోసం కలబడకుండా తప్పకుని నిలబడింది.
కాని ఆమె పాటలు నిలబడే ఉన్నాయి.
బుధవారం తెల్లవారుజామున
ఆమె ఉండే అపార్ట్‌మెంట్ భవంతిలో
అగ్నిప్రమాదం. అదే రోజు పద్మభూషణ్ ప్రకటన.
జనవరి 28 ఆమె 87వ పుట్టినరోజు.
ఇన్ని సందర్భాలు ఆమెను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.
ఇన్నాళ్లకైనా తమ అభిమాన గాయనికి
గౌరవం దక్కినందుకు అభిమానులు
యూ ట్యూబ్‌లో ఆమె పాటల ప్లే బటన్ నొక్కుతున్నారు.
నా నా కర్‌తే ప్యార్ తుమ్హీసే కర్ బైఠే

• సుమన్ కల్యాణ్‌పూర్‌కు పద్మభూషణం

ఇన్నాళ్టికి కాసింత వెలుతురు


సుమన్ కల్యాణ్‌పూర్

న తుమ్ హమే జానో – న హమ్ తుమే జానే
మగర్ లగ్‌తా హై కుచ్ ఐసా
మేరా హమ్‌దమ్ మిల్‌గయా...

1962. 'బాత్ ఏక్ రాత్ కీ' సినిమాలో దేవ్ ఆనంద్– వహీదా రెహమాన్ మీద చిత్రించిన ఈ పాట పెద్ద హిట్ అయ్యింది. ఆ తర్వాత రేడియోలో శ్రోతలు తెగ ఫర్మాయిష్ చేయసాగారు... ఈ పాట ప్లే చేయమని. గాయకుడు హేమంత్ కుమార్ అందరికీ తెలుసు. గాయని లతా మంగేష్కర్... అని అందరూ అనుకున్నారు. కాదు. ఆ గొంతు సుమన్ కల్యాణ్‌పూర్‌ది. చెప్తే తప్ప తెలియదు. అదే మాధుర్యం. అదే తీపి. అదే పూలరెక్క సౌకుమార్యం. అదే అగరు పొగ ధూపం. అవునా... అని అందరూ నోరు తెరిచారు. లతాలా పాడుతున్న గాయని, లతా అంత బాగా పాడుతున్న గాయని సుమన్ కల్యాణ్‌పూర్ తెర మీదకు వచ్చిన సందర్భం అది.

దానికి కారణం లతానే.

అవును. 'బాత్ ఏక్ రాత్‌కీ'కి సంగీత దర్శకుడు ఎస్.డి.బర్మన్. ఆ సినిమా చేస్తున్నప్పుడు లతాకీ, బర్మన్‌కూ మాటలు లేవు. లతా లేకపోతే సినీ సంగీతమే లేదు అనుకుంటున్న రోజులు అవి. కాని బర్మన్‌కు పట్టుదల జాస్తి. సుమన్‌ను వెతికాడు. పాట చేశాడు. హిట్ కొట్టాడు. కాని లతా ఉండగా ఇతర గాయనులకు సంగీతమే ఉండదు అని మెల్లగా ఆ తర్వాత అర్థమైంది. సుమన్ పాట మీద ఎంత ప్రేమ ఉన్నా అది వినిపించక పోతే ఏమిటి చేయడం?

నా నా కర్తే ప్యార్ తుమ్హీసే కర్ బైఠే
కర్నా థా ఇన్‌కార్ మగర్ ఇక్‌రార్
తుమ్హీసే కర్ బైఠే (జబ్ జబ్ ఫూల్ ఖిలే)

సుమన్ కల్యాణ్‌పూర్‌ది బెంగాల్. వాళ్ల కుటుంబం ఆమె తండ్రి కాలంలో ఢాకా మీదుగా ముంబైకి చేరుకుంది. తండ్రి బ్యాంక్ ఉద్యోగి. ఐదుమంది అమ్మాయిల్లో సుమన్ పెద్దది. ఆ రోజుల్లో అమ్మాయిలను ఆ నాటి తల్లిదండ్రులు ఎలా పెంచారో అలానే సుమన్‌ను పెంచారు. దానికి సుమన్ స్వభావసిద్ధ సిగ్గు, బిడియం తోడైంది. అది ప్రవర్తనలోనే. కాని గొంతు విప్పితే పక్షి రెక్క విప్పినట్టు ఆమె పాట హాయిగా తరంగాలు సృష్టించేది.

తెహరియే హోష్‌మే ఆలూ
తొ చలే జాయియేగా...
ఆప్‌కో దిల్ మే బిఠావూ తో చలే జాయియేగా... (మొహబ్బత్ ఇస్‌కో కెహెతే హై)

ముంబైలో డిగ్రీ చదువుతున్నప్పుడు కాలేజీ వేదిక మీద ఒక పాట పాడితే ఆ వేడుకకు గెస్ట్‌గా హాజరైన తలత్ మెహమూద్ ఎంతో మెచ్చుకున్నాడు. అప్పుడు సుమన్ వయసు 16. అయినా సరే సుమన్‌ను హెచ్.ఎం.వి.కి రికమండ్ చేశాడు. ఆ తర్వాత సంగీత దర్శకుడు షఫీ ఆమెకు మొదటి అవకాశం ఇచ్చాడు. 1954లో వచ్చిన 'దర్వాజా' సుమన్ మొదటి సినిమా. కాని 1962లో 'న తుమ్ హమే జానో' పాటతో ఆమెకు గుర్తింపు వచ్చింది స్టార్ అయ్యింది.

కాని అప్పటికే లతా ఏకఛత్రాధిపత్యం సాధించింది. ఆశా భోంస్లే కూడా కూడదీసుకుంది. వీరిద్దరి కారణాన గీతా దత్, షంషాద్ బేగం... వంటి గాయనులే అవకాశాలు లేని స్థితికి చేరుకున్నారు. సుమన్ గొంతు లతా గొంతులా ఉండటంతో లతా దృష్టి ఈమె మీద ఎక్కువగా పడిందని అంటారు. సుమన్‌తో పాడిస్తే ఆ సంగీత దర్శకులకు లతా పాడటం కష్టం అయ్యేది. ఆ భయంతో సుమన్‌కు అవకాశాలు రాలేదు. కాని లతా మంగేష్కర్, రఫీలు రాయల్టీ విషయంలో భేదాభిప్రాయాలతో ఒకరికి మరొకరు పాడటం మానుకున్నారు. పాట ఒకసారి పాడి డబ్బు తీసుకున్నాక ఇక రాయల్టీ అవసరం లేదని రఫీ అభిప్రాయం. ఒక పాట తాలూకు రికార్డులు అమ్ముడయినంత కాలం గాయనీ గాయకులకు రాయల్టీ ఇవ్వాల్సిందేనని లతా అభిప్రాయం. ఈ తగాదా సుమన్‌కు కొద్దిగా లాభించింది. లతా పాడకపోవడం వల్ల రఫీ, సుమన్ కలిసి చాలా డ్యూయెట్లు పాడారు. షమ్మీ కపూర్ కోసం చేసిన ఈ పాటలు ఎంత పెద్ద హిట్టో అందరికీ తెలుసు.

ఆజ్ కల్ తేరె మేరె ప్యార్ కే చర్చే హర్ జబాన్ పర్
సబ్‌కో మాలూమ్ హై ఔర్ సబ్‌కో ఖబర్ హోగయి (బ్రహ్మచారి)
తుమ్ నే పుకారా ఔర్ హమ్ చలే ఆయే
దిల్ హథేలీ మే లే ఆయేరే (రాజ్ కుమార్)

అదొక్కటే కాదు... సుమన్‌కు చొరవ లేకపోవడం వల్ల తన సామర్థ్యానికి తగ్గ డిమాండ్ చేయలేకపోవడం వల్ల ఆమె 'పేదవాడి లత'గా మారింది. అంటే లతా మంగేష్కర్‌కు ఇచ్చేంత డబ్బు లేని వారు సుమన్ చేత పాడించేవారు. దాంతో చిన్న సినిమాలకు సుమన్ పాడాల్సి వచ్చేది. వాటిలో పాటలు ఎంత బాగా ఉన్నా ప్రచారం పొందేవి కావు. సుమన్‌కు 1958లో పెళ్లి అయ్యింది. ఆమె నేరుగా సంగీత దర్శకులతో, నిర్మాతలతో మాట్లాడేది కాదు. భర్త అవన్నీ చూసేవాడు. దాని వల్ల కూడా ఆమెకు సంగీత ప్రపంచంలో ఏమి జరుగుతున్నదో తెలియలేదు. కొన్నిసార్లు ఆమె బాగా పాడిన పాటలు సినిమాల్లో తొలగించబడేవి. లేదా అవే పాటలు మరొకరి గొంతులో వినిపించేవి. చాలా సున్నిత స్వభావం ఉన్న సుమన్ ఇదంతా నాకు అవసరమా అనుకుంది. కాని అభిమానులు మాత్రం ఆమె గొంతు అవసరమే అనుకున్నారు.

షరాబీ షరాబీ ఏ సావన్ కా మౌసమ్
ఖుదాకీ కసమ్ ఖూబ్‌సూరత్ న హోతా... (నూర్ జహాన్)

సుమన్‌కు ఒక కూతురు, ఒక కొడుకు. కొడుకు డాక్టరు. అందరూ ముంబై లోఖండ్ వాలాలోని ఒకే అపార్ట్‌మెంట్‌లో వేరు వేరు ఫ్లాట్‌లలో ఉంటారు. మొన్న బుధవారం ఆ బిల్డింగ్‌లో షార్ట్ సర్క్యూట్ అయితే అందరినీ తీసుకుని ఆమె రోడ్డు మీద గడపాల్సి వచ్చింది. కాని అదే రోజు ఆమెకు పద్మభూషణ్ ప్రకటన అందింది. జనవరి 28 ఆమె పుట్టినరోజు. ఇది ఒక అందమైన పుట్టినరోజు కానుక.

సుమన్ ఎంతో ప్రతిభావంతురాలు. ఎన్ని వందల పాటలో పాడి ఉండాలి. కాని ఆమె గొంతు మీద నీడ కదలాడుతూనే ఉండిపోయింది. ఇప్పుడు ఇది కొద్దిగా వెలుతురు. కాని తీరం చేరిపోయాక పడవకు దొరికిన ఓదార్పు. 'మమత' (1966)లో ఈ పాటను లతా పాడింది. చాలా ఫేమస్. కాని ఇదే పాటను రఫీతో (లతా పాడదు కనుక) సుమన్ కల్యాణ్‌పూర్ డ్యూయెట్‌గా పాడింది. లతా ఎంత మార్దవంగా పాడిందో సుమన్ కూడా. వినండి. ఈ పాట ఆ సిగ్గరి గొంతుకు బంగారు తొడుగు.

రహేనా రహే హమ్ మెహకా కరేంగే
బన్‌కే కలి బన్ కే సబా
బాగ్ ఏ వఫా మే....

ఫ్యాషన్

పెళ్లి కూతురు అలంకరణలో
రకరకాల మోడల్స్‌లో ఉన్న బ్రేస్‌లెట్ రింగ్స్
మెహెందీ చేతులను మరింత ఆకర్షణీయంగా మార్చేస్తాయి.
ఇక గెట్ టు గెదర్ వంటి వెస్టర్న్ వేడుకల్లో స్టైలిష్ డ్రెస్‌లకు
మరింత స్టైలిష్ లుక్‌నిస్తున్నాయి ఈ బ్రేస్‌లెట్ రింగ్స్.

బ్రేస్‌లెట్ రింగ్

అమ్మాయిల అలంకరణలో ప్రతిదీ ప్రత్యేకతను నింపుతుంది. అందమైన దుస్తులే కాదు ఆభరణాలూ అంతే ఘనంగా ఉండాలనుకుంటారు. ఏ వేడుక అయినా మెడలో హారాలు, కాళ్లకు పట్టీలు, చేతులకు గాజులు మ్యాచింగ్‌గా ఎంపిక చేసుకుంటుంటారు. బంగారు, వెండి లేదా ఫ్యాన్సీ ఆభరణాలను సందర్భానుసారం ఉపయోగిస్తుంటారు. వీటిలో బ్రేస్‌లెట్ రింగ్స్ ఇప్పుడు కీలకంగా మారాయి. ముంజేతిని చుట్టేసే బ్రేస్‌లెట్... దాని నుంచి వేలి ఉంగరానికి జత చేస్తూ ఉన్నట్టుగా ఉండే ఈ మోడల్స్ చేతులను మరింతగా హైలైట్ చేస్తున్నాయి.





పూసలు వరసలు... ఇవి సంప్రదాయ దుస్తుల మీదకు బాగా నప్పుతున్నాయి. అంటే, సంప్రదాయ వేడుకల సమయాల్లో వీటిని అలంకరించుకోవచ్చు, బ్లాక్‌బీడ్స్ వరసతో ఈ అల్లికను గమనించవచ్చు.

రత్నాల రాశులు... నవరత్నాలు, డైమండ్స్ పొదిగిన బ్రేస్‌లెట్ రింగ్స్ పెద్ద పెద్ద వేడుకల్లో మరింత గ్రాండ్‌గా వెలిగిపోతున్నాయి.

బంగారు హంగు... బంగారు తీగెలతో రూపుకట్టిన ఈ ఆభరణం ఇటు సంప్రదాయ, అటు స్టైలిష్ వేర్‌లా కూడా పార్టీకి తగిన హంగును తీసుకువస్తుంది.

వెండి జిలుగులు... వెండి జిలుగుకు పెద్ద పెద్ద స్టోన్స్ జత కలిసిన బ్రేస్‌లెట్ రింగ్స్ మోడర్న్ ఔట్‌ఫిట్స్‌కు స్టైలిష్ లుక్‌ని ఇస్తున్నాయి. ఇవి ఏ కాలమైనా యూత్‌ని మెప్పిస్తూనే ఉన్నాయి.

మార్కెట్‌లో టొమాటోలు నోరూరిస్తున్నాయి.
ఎప్పుడూ ఏదో ఒక కూరలో కలుపుకోవడమేనా?
టొమాటోల రుచిని అచ్చంగా ఆస్వాదించలేమా!
రెస్టారెంట్ మెనూని ఇంట్లోనే ట్రై చేద్దాం.
సూప్‌తో మొదలు పెట్టి పులావ్‌తో పూర్తి చేద్దాం.
ఈ వారం మన 'వంటిల్లు' టొమాటో కిచెన్.

టొమాటో కిచెన్

వంటిల్లు





టొమాటో సాస్

కావలసినవి: టొమాటోలు – 2 కేజీలు ; వెల్లుల్లి– 15 రేకలు ; అల్లం – మూడు అంగుళాల ముక్క ; ఎండు మిర్చి – 5 ; కిస్‌మిస్ – అర కప్పు ; యాపిల్ సిడర్ వినెగర్ లేదా వైట్ వినెగర్– అర కప్పు ; ఉప్పు– టేబుల్ స్పూన్ ; ఆర్గానిక్ షుగర్ – 6 టేబుల్ స్పూన్‌లు (ఆర్గానిక్ లేకపోతే మామూలు చక్కెర) ; సోడియమ్ బెన్‌జోయేట్ – పావు టీ స్పూన్ (టీ స్పూన్ వేడి నీటిలో కరిగించాలి).

తయారీ: ● చుక్కలు లేని చక్కటి టొమాటోలను శుభ్రంగా కడగాలి. మొదలు తీసేసి పెద్ద ముక్కలుగా తరిగి తొక్క తీసేయాలి. అల్లం, వెల్లుల్లి పొట్టు వలిచి తరగాలి. మిర్చిని నిలువుగా చీరి గింజలు తీసేయాలి. కిస్‌మిస్ కడిగి పక్కన ఉంచాలి. సాస్‌ను నిల్వ చేసే సీసాను శుభ్రం చేసి తేమ పోయే వరకు వేడి చేసి పక్కన ఉంచాలి. ● ప్రెషర్ కుక్కర్‌లో టొమాటో ముక్కలు, అల్లం, వెల్లుల్లి, మిర్చి, కిస్‌మిస్, వినెగర్, ఉప్పు, చక్కెర వేసి కలిపి మూత పెట్టి మీడియం మంట మీద నాలుగు విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి (కుక్కర్ వాడని వాళ్లు పెద్ద పాత్రలో వేసి నేరుగా స్టవ్ మీద పెట్టి అడుగు పట్టకుండా మధ్యలో కలుపుతూ ఉడికించవచ్చు). ● టొమాటో ముక్కలు చల్లారిన తర్వాత మిక్సీలో మెత్తగా గ్రైండ్ చేయాలి. మిశ్రమాన్ని పెద్ద చిల్లులున్న స్ట్రెయినర్‌లో వడపోయాలి. ఇందులో సోడియమ్ బెన్‌జోయేట్ కలిపిన నీటిని వేసి కలపాలి. ●ఈ టొమాటో సాస్ చల్లారిన తరవాత సీసాలో వేసి మూత పెట్టాలి. ఒకటి – రెండు రోజుల తర్వాత ఫ్రిజ్‌లో పెట్టాలి. ఇది ఆరు నెలల వరకు తాజాగా ఉంటుంది. దీనిని సైడ్ డిష్‌గా తీసుకోవచ్చు. ఆకలి వేయడానికి భోజనానికి ముందు ఒక స్పూన్ చప్పరించవచ్చు. అలాగే నాలుక చవి కోల్పోయినప్పుడు కూడా ఒక స్పూన్ చప్పరించవచ్చు.



టొమాటో సూప్

కావలసినవి: టొమాటోలు – అర కేజీ ; వెన్న – 2 టేబుల్ స్పూన్‌లు ; బిర్యానీ ఆకులు– 2 ; ఉల్లిపాయ ముక్కలు – ముప్పావు కప్పు ; వెల్లుల్లి తరుగు – అర టీ స్పూన్; మామూలు నీరు లేదా కూరగాయలు ఉడికించిన నీరు – 100 మి.లీ ; ఉప్పు– రుచికి తగినంత ; చక్కెర – టీ స్పూన్ ; మిరియాల పొడి– రుచికి తగినంత.

గార్నిష్ కోసం: బ్రెడ్ క్యూబ్‌లు– అర కప్పు ; ఆలివ్ ఆయిల్– టేబుల్ స్పూన్ ; ఉప్పు – తగినంత ; మిరియాల పొడి– చిటికెడు ; కొత్తిమీర తరుగు– టేబుల్ స్పూన్ ; మీగడ– 2 టేబుల్ స్పూన్‌లు.

తయారీ: ● టొమాటోలను కడిగి ముక్కలుగా తరగాలి. ● బాణలిలో వెన్న వేడి చేసి అందులో బిర్యానీ ఆకు, ఉల్లిపాయ ముక్కలు, ఉప్పు, వెల్లుల్లి తరుగు వేసి దోరగా వేయించాలి. ఇందులో టొమాటో ముక్కలు వేసి కలిపి, మంట తగ్గించి మూత పెట్టి ఏడెనిమిది నిమిషాల పాటు మగ్గనివ్వాలి. ముక్కలు మెత్తబడిన తరవాత దించేసి చల్లారనివ్వాలి. ● చల్లారిన తరవాత బిర్యానీ ఆకు తీసి వేసి మిగిలిన మిశ్రమాన్ని మెత్తగా గ్రైండ్ చేసి వడపోయాలి. ఇలా వడపోసిన ప్యూరీని ఒక పాత్రలో పోసి చక్కెర, కొద్దిగా నీరు పోసి వేడి చేయాలి. ఉడికే దశకు చేరేటప్పుడు మీగడ, మిరియాల పొడి వేసి దించేయాలి. బాగా కలిపి అవసరమైతే మరికొంత ఉప్పు, మిరియాల పొడి కలపాలి. ● బ్రెడ్ ముక్కల మీద ఆలివ్ నూనె, ఉప్పు, మిరియాల పొడి వేసి కలపాలి. నూనెను బ్రెడ్ ముక్కలు పీల్చుకున్న తర్వాత అవెన్‌లో 200 డిగ్రీల ఉష్ణోగ్రతలో నాలుగు నిమిషాల పాటు ఉంచితే కరకరలాడతాయి. ●కప్పులో టొమాటో సూప్ తీసుకుని పైన కొత్తిమీర తరుగు, మీగడ వేసి, పక్కన బ్రెడ్ ముక్కలు పెట్టి సర్వ్ చేయాలి. రెస్టారెంట్‌లో ఉన్నట్లే ఉంటుంది.



టొమాటో పులావ్

కావలసినవి: బాసుమతి బియ్యం – పావు కేజీ ; (మామూలు బియ్యం కూడా తీసుకోవచ్చు) ; టొమాటో ముక్కలు – 250 గ్రాములు ; ఉల్లిపాయ ముక్కలు – అర కప్పు ; అల్లం – అంగుళం ముక్క ; వెల్లుల్లి రేకలు – పది ; పచ్చిమిర్చి – నాలుగు ; కూరగాయల ముక్కలు – కప్పు (క్యారట్, బీన్స్, బఠాణి, పుట్టగొడుగులు, బంగాళ దుంప అన్నీ కలిపి); పసుపు – అర టీ స్పూన్ ; మిరప్పొడి– అర టీ స్పూన్ ; మిరియాల పొడి– అర టీ స్పూన్ ; తరిగిన కొత్తిమీర– ఒకటిన్నర కప్పు ; పుదీన ఆకులు – టేబుల్ స్పూన్ ; నూనె లేదా నెయ్యి – 2 టేబుల్ స్పూన్‌లు ; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి.

పోపు కోసం: దాల్చిన చెక్క – అంగుళం ముక్క ; లవంగాలు – 2 ; యాలకులు – 2 ; నక్షత్ర లవంగం – 1 ; బిర్యానీ ఆకు –1 ; షాజీర– టీ స్పూన్.

తయారీ: ● బియ్యాన్ని కడిగి ఇరవై నిమిషాల పాటు నానబెట్టి వడపోయాలి. అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చిలను కలిపి పేస్ట్ చేయాలి. ● ప్రెషర్ కుక్కర్ పాన్‌లో నెయ్యి వేడి చేసి పోపు కోసం తీసుకున్న దినుసులను వరుసగా వేయాలి. అవి వేగిన తరవాత ఉల్లిపాయ ముక్కలు వేసి దోరగా వేయించాలి. ఇప్పుడు అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చి పేస్టు, కొత్తిమీర (కప్పు), పుదీనా ఆకులు వేయాలి. అవి వేగిన తర్వాత కూరగాయల ముక్కలు, టొమాటో ముక్కలు వేసి కలిపి మీడియం మంట మీద మగ్గనివ్వాలి ● ఇప్పుడు పసుపు, మిరప్పొడి, మిరియాల పొడి బాగా కలిపి రెండు నిమిషాల పాటు మగ్గనివ్వాలి. తర్వాత నీటిని పోసి నానిన బియ్యం, ఉప్పు వేసి కలిపి మూత పెట్టాలి. మీడియం మంట మీద రెండు లేదా మూడు విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి ● కుక్కర్ వేడి తగ్గిన తరువాత మూత తీసి తరిగిన కొత్తిమీర (అర కప్పు)తో గార్నిష్ చేసి ఒక నిమిషం పాటు మళ్లీ మూత పెట్టాలి. ఘుమఘుమలాడే టొమాటో పులావ్‌లోకి పెరుగు పచ్చడి, స్పైసీ చికెన్ కర్రీ లేదా పనీర్ బటర్ మసాలా, కాజు బటర్ మసాలాలు బాగుంటాయి.



టొమాటో ఆమ్లెట్

కావలసినవి: శనగపిండి– కప్పు ; టొమాటో ముక్కలు – కప్పు (సన్నగా తరగాలి) ; ఉల్లిపాయలు– పావు కప్పు (సన్నగా తరగాలి) ; తరిగిన అల్లం – టీ స్పూన్ ; తరిగిన పచ్చిమిర్చి – టీ స్పూన్ ; తరిగిన కొత్తిమీర – 3 టేబుల్ స్పూన్‌లు ; పసుపు – పావు టీ స్పూన్ ; మిరప్పొడి– పావు టీ స్పూన్ ; ఇంగువ– చిటికెడు ; గరం మసాలా – చిటికెడు ; బేకింగ్ పౌడర్– పావు టీ స్పూన్ (ఇష్టమైతేనే) ; ఉప్పు – పావు టీ స్పూన్ లేదా రుచిని తగినంత ; నీరు– కప్పు లేదా మిశ్రమం చిక్కదనాన్ని బట్టి ; నూనె లేదా నెయ్యి– 2 టేబుల్ స్పూన్‌లు.

తయారీ: ● ఒక పాత్రలో శనగపిండి వేసి అందులో టొమాటో, ఉల్లిపాయ, పచ్చిమిర్చి, అల్లం, కొత్తిమీర, ఉప్పు వేసి బాగా కలపాలి. ఇప్పుడు ఇంగువ, పసుపు, మిరప్పొడి, బేకింగ్ పౌడర్, గరం మసాలా వేసి కలపాలి. ఇందులో నీటిని పోస్తూ బీటర్‌తో (ఉండలు లేకుండా) కలపాలి. ఈ మిశ్రమం దోసెల పిండిలాగ గరిటజారుడుగా ఉండాలి. ● ఆమ్లెట్‌ల పెనంలో రెండు టీ స్పూన్‌ల నెయ్యి వేడి చేసి ఒక గరిటెడు మిశ్రమాన్ని వేసి పెనం మీద సమంగా గరిటెతోనే సర్ది చుట్టూ కొద్దిగా నెయ్యి వేసి మూత పెట్టి మీడియం మంట మీద కాలనివ్వాలి. ఒకవైపు కాలిన తరవాత తిరగేసి మరొక టీ స్పూన్ నెయ్యి వేసి రెండో వైపు కూడా కాలిన తరవాత తీసేయాలి. ఇలాగే పిండినంతటినీ ఆమ్లెట్‌లు వేసుకోవడమే.

గమనిక: ఆమ్లెట్ మెత్తగా రావాలంటే మూత పెట్టి కాలనివ్వాలి. అంచులు కరకరలాడుతూ ఉండాలంటే మూత పెట్టకుండా కాల్చాలి. వెన్న రుచి ఇష్టపడే వాళ్లు వెన్నతో ఆమ్లెట్‌లు వేసుకోవచ్చు.

బ్యూటీ టిప్స్



- చర్మం చిట్లి బిరుసెక్కినట్లుగా ఉంటే శరీరానికి పెరుగు రాసి, అరగంట ఆగి స్నానం చేయండి. ఆ బాధ నుంచి విముక్తి కలుగుతుంది.
- చర్మం మీది ముడతలు పోవాలంటే కొద్ది రోజులపాటు ప్రతిరోజూ ఉదయం చేమంతి పూలతో సున్నితంగా మర్దన చేయాలి.
- జుట్టు నిగనిగలాడుతూ మెరవాలంటే కోడిగుడ్డు సొనను, అరటి పండును బాగా కలిపి, ఆ పేస్టును తలకు పట్టించి పావు గంట తర్వాత మైల్డ్ షాంపూతో శుభ్రంగా తలస్నానం చేయాలి.
- పెదవులు తరచు ఎండి పోవడం లేదా పగలడం జరుగుతుంటే పాలమీగడను, కుంకుమ పువ్వును బాగా కలిపి రాత్రిపూట పడుకునేటప్పుడు పెదవులకు పూయాలి. ఈ విధంగా వారం పదిరోజులు చేస్తే మీ పెదవులు గులాబీ రంగులోకి మారి అందంగా ఉంటాయి.
- పిల్లలకి స్నానం చేయించడానికి సబ్బుకు బదులుగా సున్నిపిండి వాడితే చర్మవ్యాధులు రాకుండా వుండడమే కాకుండా, శరీరంమీద వుండే నూగు లాంటి వెంట్రుకలు కూడా పోతాయి.
- జుట్టు బిరుసుగా ఉండి వెనకకు దువ్వడానికి వీలులేకుండా ఉంటే నీళ్ళలో కొంచం నిమ్మ రసం కలిపి తలకి రాసి దువ్వండి.
- తేనె, నిమ్మరసం, గ్లిసరిన్‌లో కలిపి రాత్రిపూట పడుకోబోయే ముందు పెదాలకి రాసి మర్దన చేస్తే పెదాల నల్లదనం పోతుంది. గులాబీ రంగులోకి మారి అందంగా కనిపిస్తాయి.
- ఒక భాగం ఆపిల్ జ్యూస్, మూడు భాగాల నీరు కలిపి తలకి రాసి ఆరిన తరువాత తల స్నానం చేస్తే ఎరుపు రంగులోని జుట్టు నల్లగా మారడమే కాకుండా వెంట్రుకలు రాలడం తగ్గుతుంది.
- పెదాలపైన మచ్చలు పోవాలంటే గ్లిసరిన్ లో కొంచం రోజ్ వాటర్ కలిపి దానిని పెదాలకు మర్దన చేయాలి.
- ఎండబెట్టిన పుదీనా ఆకుల్ని పొడి చేసి, తగినంత నీరు కలిపి బాగా కాచి, చల్లార్చిన కషాయాన్ని ప్రతిరోజూ పుక్కిలి బడితే నోటి దుర్వాసన, చిగుళ్ళ నుండి రక్తం కారటాన్ని నివారించవచ్చు.



జాగ్రెబ్ ఓపెన్ బరిలో బజరంగ్

ఒకవైపు భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడిపై లైంగిక వేధింపుల ఆరోపణలపై విచారణ కమిటీ ఏర్పాటు కాగా.. మరోవైపు ఈ ఏడాది తొలి అంతర్జాతీయ టోర్నీ జాగ్రెబ్ ఓపెన్ గ్రాండ్‌ప్రిలో బరిలోకి దిగేందుకు భారత అగ్రశ్రేణి రెజ్లర్లు సిద్ధమయ్యారు. ఫిబ్రవరి 1 నుంచి 5 వరకు క్రొయేషియాలో జరిగే ఈ టోర్నీలో టోక్యో ఒలింపిక్స్ పతక విజేతలు బజరంగ్, రవి కుమార్, దీపక్ పూనియాలతోపాటు మహిళా స్టార్ రెజ్లర్లు వినేశ్ ఫొగాట్, అన్షు మలిక్ పోటీపడనున్నారు.



అండర్-19 ప్రపంచకప్ ఫైనల్లో చోటు కోసం...

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ఆధ్వర్యంలో తొలిసారి నిర్వహిస్తున్న అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్ టోర్నీలో నేడు రెండు సెమీఫైనల్స్ జరగనున్నాయి. దక్షిణాఫ్రికా వేదికగా ఈ మెగా ఈవెంట్ జరుగుతోంది. షఫాలీ వర్మ నాయకత్వంలోని టీమిండియా ఈరోజు భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం గం. 1:30 నుంచి న్యూజిలాండ్ జట్టుతో జరిగే తొలి సెమీఫైనల్లో తలపడుతుంది. ఈ టోర్నీలో న్యూజిలాండ్ ఒక్క మ్యాచ్‌లోనూ ఓడిపోలేదు.


టి20ల్లో అమీతుమీకి 'సై'!

సీనియర్లు లేకుండా మరో టి20 సిరీస్... రోహిత్ శర్మ, కోహ్లి, కేఎల్ రాహుల్ విశ్రాంతి తీసుకోగా, వరల్డ్‌కప్ తర్వాత హార్దిక్ పాండ్యా కెప్టెన్‌గా వరుసగా మూడో సిరీస్... వన్డేల్లో న్యూజిలాండ్‌పై సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించిన టీమిండియా ఇప్పుడు టి20ల్లో కూడా అదే జోరును కొనసాగించేందుకు సిద్ధమైంది. ఈ ఏడాది వన్డే వరల్డ్‌కప్ ఉండటంతో టి20 ఫార్మాట్‌కు ప్రాధాన్యత తగ్గిన నేపథ్యంలో సీజన్‌లో చివరి టి20 ద్వైపాక్షిక పోరులో సత్తా చాటేందుకు యువ ఆటగాళ్లకు మరో అవకాశం దక్కింది. గత ప్రత్యర్థి శ్రీలంక తరహాలో కివీస్ కూడా కనీసం ఈ ఫార్మాట్‌లో అయినా పోటీనిస్తుందా లేదా అనేది చూడాలి.

- నేడు భారత్, న్యూజిలాండ్ తొలి మ్యాచ్
- జోరు మీదున్న టీమిండియా
- యువ ఆటగాళ్ల సత్తాకు పరీక్ష
- టూర్‌లో తొలి విజయంపై కివీస్ దృష్టి
- రాత్రి 7 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం

రాంచీ: దాదాపు ఏకపక్షంగా సాగిన వన్డే సిరీస్ తర్వాత టి20ల్లో అమీతుమీ తేల్చుకునేందుకు భారత్, న్యూజిలాండ్ సన్నద్ధమయ్యాయి. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా నేడు ఇరు జట్ల మధ్య తొలి టి20 పోరు జరగనుంది. అనుభవం, గణాంకాల దృష్ట్యా ప్రత్యర్థికంటే టీమిండియా ఎంతో బలంగా కనిపిస్తుండగా... కివీస్ తమ యువ ఆటగాళ్లతో సంచలనాన్ని ఆశిస్తోంది. ఇలాంటి స్థితిలో ఈ సిరీస్ అయినా పోటాపోటీగా సాగుతుందా లేక ఇదీ ఏకపక్షమవుతుందా అనేది ఆసక్తికరం. 2021 నవంబర్‌లో భారత్‌లో ఆడిన టి20 సిరీస్‌లో న్యూజిలాండ్ 0-3తో చిత్తయింది.

గిల్‌తోనే ఓపెనింగ్...


గిల్

దాదాపు ఇరవై రోజుల క్రితం భారత జట్టు తమ చివరి టి20 మ్యాచ్‌ను శ్రీలంకతో ఆడింది. స్వల్ప మార్పుల మినహా అదే జట్టు ఈసారి కూడా బరిలోకి దిగే అవకాశం ఉంది. ఒక ఓపెనర్‌గా ఇషాన్ కిషన్ ఖాయం కాగా... రెండో ఓపెనర్‌గా శుబ్‌మన్ గిల్ ఆడతాడని కెప్టెన్ హార్దిక్ చెప్పేశాడు. రుతురాజ్ గైక్వాడ్ గాయంతో సిరీస్‌కు దూరం కాగా, పృథ్వీ షా రూపంలో మరో ఓపెనర్ అందుబాటులో ఉన్నాడు. శ్రీలంకతో సిరీస్‌లోనే అరంగేట్రం చేసిన గిల్ టి20 రికార్డు అంత గొప్పగా ఏమీ లేదు. అయితే వన్డేల్లో అతని తాజా ఫామ్‌ను చూస్తే జట్టులో స్థానం ఇవ్వక తప్పదని కూడా హార్దిక్ వెల్లడించాడు. రాహుల్ త్రిపాఠి తన సత్తాను గత మ్యాచ్‌లో చూపించగా... నాలుగో స్థానంలో 'ఐసీసీ టి20 ప్లేయర్ ఆఫ్ ద ఇయర్' రూపంలో సూర్యకుమార్ సిద్ధంగా ఉన్నాడు. ఆల్‌రౌండర్‌గా దీపక్ హుడా బరిలోకి దిగనుండగా, పెళ్లి కారణంగా అక్షర్ పటేల్ ఈ సిరీస్‌కు దూరంగా ఉండటంతో వాషింగ్టన్ సుందర్‌కు చోటు ఖాయమైంది. సీనియర్ పేసర్లు ఎవరూ లేకపోవడంతో మరోసారి ఉమ్రాన్ మాలిక్, అర్ష్‌దీప్ సింగ్, శివమ్ మావిలపైనే జట్టు భారం ఉంది. ముస్ముందు అగ్రశ్రేణి బౌలర్లు వచ్చినా... తమ స్థానం నిలబెట్టుకోవాలంటే ఈ సిరీస్‌లో వీరు సత్తా చాటాల్సి ఉంది. మణికట్టు స్పిన్నర్ స్థానానికి సహజంగానే కుల్దీప్, చహల్ మధ్య పోటీ నెలకొంది.


న్యూజిలాండ్ కెప్టెన్ సాన్‌ట్నర్

ఇష్ సోధికి చోటు...

వన్డేలలాగే టి20 సిరీస్ నుంచి కూడా న్యూజిలాండ్ సీనియర్లు విలియమ్సన్, సౌతీ విశ్రాంతి తీసుకున్నారు. దాంతో సాన్‌ట్నర్ నాయకత్వంలో జట్టు బరిలోకి దిగుతోంది. కెప్టెన్‌గా సాన్‌ట్నర్ బలహీన జట్లు ఐర్లాండ్, స్కాట్లాండ్, నెదర్లాండ్స్ జట్లపై విజయాలు అందించాడు. టి20 వరల్డ్‌కప్ తొలి మ్యాచ్‌లో మెరుపు సెంచరీతో చెలరేగిన తర్వాత ఓపెనర్ ఫిన్ అలెన్ ఆడిన ఆరు టి20ల్లోనూ విఫలమయ్యాడు. తాజా వన్డే సిరీస్‌లో కూడా రెండుసార్లు డకౌట్ అయిన అతను ఇప్పుడైనా చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడాలని జట్టు కోరుకుంటోంది. ఆల్ ఫార్మాట్ బ్యాటర్‌గా తనకంటూ ఇప్పటికే గుర్తింపు తెచ్చుకొని చివరి వన్డేలో సెంచరీ బాదిన కాన్వే మరోసారి కీలకం కానుండగా... ముగ్గురు ఆల్‌రౌండర్లు మిచెల్, బ్రేస్‌వెల్, సాన్‌ట్నర్ రాణిస్తేనే జట్టుకు విజయావకాశాలు ఉంటాయి. పేస్ బౌలింగ్‌లో కివీస్ బాగా బలహీనంగా కనిపిస్తోంది. లిస్టర్, షిప్లీ ఇప్పటివరకు టి20లు ఆడకపోగా... టిక్నర్, డఫీ అనుభవం కూడా అంతంత మాత్రమే. దాంతో ఫెర్గూసన్‌పై అదనపు భారం పడింది. లిస్టర్ ఈ మ్యాచ్‌తో అరంగేట్రం చేసే అవకాశం ఉంది. అయితే గాయంతో వన్డేలు ఆడని ప్రధాన స్పిన్నర్ ఇష్ సోధి కోలుకోవడం జట్టుకు పెద్ద ఊరట. భారత గడ్డపై అతనికి మంచి రికార్డు ఉంది.

తుది జట్ల వివరాలు (అంచనా)

భారత్: హార్దిక్ (కెప్టెన్), గిల్, ఇషాన్ కిషన్, రాహుల్ త్రిపాఠి, సూర్యకుమార్, హుడా, సుందర్, మావి, ఉమ్రాన్, అర్ష్‌దీప్, కుల్దీప్/చహల్.

న్యూజిలాండ్: సాన్‌ట్నర్ (కెప్టెన్), అలెన్, కాన్వే, చాప్‌మన్, ఫిలిప్స్, మిచెల్, మైకేల్ బ్రేస్‌వెల్, టిక్నర్, సోధి, లిస్టర్, ఫెర్గూసన్.

పిచ్, వాతావరణం

బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండే సాధారణ వికెట్. ఛేదనలోనే అన్ని జట్లకు మెరుగైన రికార్డు ఉంది. ఇక్కడ ఆడిన 3 అంతర్జాతీయ టి20ల్లోనూ భారత్ గెలిచింది. మ్యాచ్ రోజు వర్షసూచన లేదు. మంచు ప్రభావం ఎక్కువ కాబట్టి టాస్ గెలిచిన జట్టు ఫీల్డింగ్ ఎంచుకోవడం ఖాయం.


భారత కెప్టెన్ హార్దిక్

22 భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య ఇప్పటివరకు 22 టి20 మ్యాచ్‌లు జరిగాయి. 10 మ్యాచ్‌ల్లో భారత్ గెలుపొందగా... 9 మ్యాచ్‌ల్లో న్యూజిలాండ్ విజయం సాధించింది. మూడు మ్యాచ్‌లు 'టై'గా ముగిశాయి. స్వదేశంలో న్యూజిలాండ్‌తో ఎనిమిది మ్యాచ్‌లు ఆడిన భారత్ ఐదింటిలో గెలిచి, మూడింటిలో ఓడిపోయింది.

ధోని కబుర్లు...



రాంచీలో మ్యాచ్ అంటే ఆడినా, ఆడకపోయినా మహేంద్ర సింగ్ ధోని ఉండాల్సిందే! తన రిటైర్మెంట్ తర్వాతి నుంచి ఎప్పుడు నగరంలో టీమిండియా ఆడినా వారిని కలిసే ధోని ఈసారి కూడా దానిని కొనసాగించాడు. మ్యాచ్ జరిగే జేఎస్‌సీఏ స్టేడియానికి వచ్చి పాండ్యా బృందంతో అతను ముచ్చటించాడు. జార్ఖండ్ టీమ్ డ్రెస్‌లో అప్పటి వరకు ప్రాక్టీస్ సాగించిన మాజీ కెప్టెన్... డ్రెస్సింగ్ రూమ్‌కు వచ్చి ఆటగాళ్లతో విభిన్న అంశాలపై మాట్లాడాడు. అతనితో కలిసి ఆడిన, ఆడని కొత్త ఆటగాళ్లు, సహాయక సిబ్బంది కూడా ఉత్సాహంగా ధోనిని కలిసి తమ ఆనందాన్ని ప్రదర్శించారు.



భారత్ 8 జపాన్ 0

- వర్గీకరణ పోరులో ఘన విజయం
- ప్రపంచకప్ హాకీ టోర్నీ

రూర్కెలా: న్యూజిలాండ్ చేతిలో ఓడి క్వార్టర్ ఫైనల్ అవకాశాలు కోల్పోయిన భారత హాకీ జట్టు ప్రపంచకప్ తర్వాతి మ్యాచ్‌లో భారీ విజయాన్ని నమోదు చేసింది. 9-16 స్థానాల కోసం నిర్వహిస్తున్న వర్గీకరణ పోరులో భాగంగా గురువారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 8-0 గోల్స్ తేడాతో జపాన్‌ను చిత్తు చేసింది. తొలి రెండు క్వార్టర్‌లలో ఒక్క గోల్ కూడా నమోదు చేయలేకపోయిన భారత్... తర్వాతి రెండు క్వార్టర్‌లలో చెరో 4 గోల్స్‌తో చెలరేగింది. భారత్ తరఫున అభిషేక్ (35వ, 43వ ని.లో), హర్మన్‌ప్రీత్ సింగ్ (45వ, 58వ ని.లో)రెండు గోల్స్ చొప్పున చేయగా... మన్‌దీప్ సింగ్ (32వ ని.లో), వివేక్ సాగర్ (39వ ని.లో), మన్‌ప్రీత్ సింగ్ (58వ ని.లో), సుఖ్‌జీత్ సింగ్ (59వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. వీటిలో 3 ఫీల్డ్ గోల్స్ కాగా, 5 గోల్స్ పెనాల్టీ కార్నర్‌ల ద్వారా వచ్చాయి. తొలి నాలుగు పెనాల్టీ కార్నర్‌లను గోల్‌గా మలచలేకపోయిన భారత్ ఎట్టకేలకు మూడో క్వార్టర్‌లో పెనాల్టీ ద్వారా ఖాతా తెరిచింది. మరో మూడు నిమిషాల తర్వాత వివేక్ ఇచ్చిన పాస్‌ను అభిషేక్ గోల్‌గా మలిచాడు. హర్మన్‌ప్రీత్ సహకారంతో ప్రసాద్ ప్రపంచకప్‌లో తన తొలి గోల్ నమోదు చేయగా, రివర్స్ షాట్‌తో గోల్ సాధించి అభిషేక్ జట్టును 4-0తో ఆధిక్యంలో నిలిపాడు. చివరి క్వార్టర్ ఆరంభంలోనే హర్మన్‌ప్రీత్ గోల్ చేయగా... ఆఖర్లో రెండు నిమిషాల వ్యవధిలో భారత్ మరో మూడు గోల్స్ సాధించింది. 9-12 స్థానాల కోసం శనివారం జరిగే మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాతో భారత్ తలపడుతుంది.

100 హాకీ ప్రపంచకప్‌లో భారత్‌కు ఇది 100వ మ్యాచ్

1 వరల్డ్‌కప్‌లో భారత్‌కు ఇదే పెద్ద విజయం. 1975లో ఘనాపై 7-0తో గెలిచింది.

సైనా పరాజయం

ఇండోనేసియా మాస్టర్స్ టోర్నీ



జకార్తా: ఈ ఏడాది ఆడుతున్న మూడో టోర్నమెంట్‌లోనూ భారత స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్ ప్రిక్వార్టర్ ఫైనల్ దశను దాటలేకపోయింది. మలేసియా ఓపెన్‌లో తొలి రౌండ్‌లో, ఇండియా ఓపెన్‌లో ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిన సైనా... తాజాగా ఇండోనేసియా మాస్టర్స్ సూపర్-500 టోర్నీలోనూ ప్రిక్వార్టర్ ఫైనల్లోనే నిష్క్రమించింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 28వ ర్యాంకర్ సైనా 15-21, 7-21తో ప్రపంచ 11వ ర్యాంకర్ హాన్ యు (చైనా) చేతిలో పరాజయం పాలైంది. కేవలం 29 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో సైనా ఏ దశలోనై చైనా ప్లేయర్‌కు పోటీనివ్వలేకపోయింది. తొలి గేమ్‌లోనైతే సైనా ఆరంభంలోనే వరుసగా 10 పాయింట్లు కోల్పోయి 0-10తో వెనుకబడిపోయింది. ఇక రెండో గేమ్‌లో సైనా తొలుత వరుసగా మూడు పాయింట్లు, అనంతరం వరుసగా ఎనిమిది పాయింట్లు సమర్పించుకొని కోలుకోలేకపోయింది. పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో లక్ష్య సేన్ 19-21, 21-8, 21-17తో ఎన్జీ జె యోంగ్ (మలేసియా)పై గెలుపొందాడు.

కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో మనిక



న్యూఢిల్లీ: భారత టేబుల్ టెన్నిస్ (టీటీ) స్టార్ క్రీడాకారిణి మనిక బత్రా అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ సమాఖ్య (ఐటీటీఎఫ్) ర్యాంకింగ్స్‌లో కెరీర్ బెస్ట్ ర్యాంక్‌ను అందుకుంది. గురువారం విడుదల చేసిన మహిళల సింగిల్స్ తాజా ర్యాంకింగ్స్‌లో మనిక మూడు స్థానాలు ఎగబాకి 33వ ర్యాంక్‌లో నిలిచింది. ఢిల్లీకి చెందిన 27 ఏళ్ల మనిక గత నవంబర్‌లో ఆసియా కప్‌లో కాంస్యం నెగ్గిన తొలి భారతీయ క్రీడాకారిణిగా గుర్తింపు పొందింది. గత వారం దోహా డబ్ల్యూటీటీ కంటెండర్ టోర్నీలో కాంస్యం గెలిచి 140 ర్యాంకింగ్ పాయింట్లు సంపాదించింది. తెలంగాణకు చెందిన జాతీయ చాంపియన్ ఆకుల శ్రీజ ఆరు స్థానాలు పడిపోయి 79వ ర్యాంక్‌కు చేరుకుంది. పురుషుల సింగిల్స్ విభాగంలో సత్యన్ జ్ఞానశేఖరన్ 41వ ర్యాంక్‌లో, ఆచంట శరత్ కమల్ 46వ ర్యాంక్‌లో ఉన్నారు. తెలంగాణకు చెందిన సూరావజ్జుల స్నేహిత్ మూడు స్థానాలు పడిపోయి 125వ ర్యాంక్‌లో నిలిచాడు.

సబలెంకా X రిబాకినా


సబలెంకా


రిబాకినా

- తొలిసారి ఆ్రస్టేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ ఫైనల్లోకి
- సెమీఫైనల్స్‌లో వరుస సెట్‌లలో విజయం

మెల్‌బోర్న్: ఈ ఏడాది ఆ్రస్టేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ విభాగంలో కొత్త చాంపియన్ అవతరించనుంది. గత ఏడాది వింబుల్డన్ టైటిల్ నెగ్గి వెలుగులోకి వచ్చిన కజకిస్తాన్ అమ్మాయి ఎలీనా రిబాకినా... కెరీర్‌లో తొలిసారి గ్రాండ్‌స్లామ్ ఫైనల్ చేరిన సబలెంకా (బెలారస్) మధ్య శనివారం ఆ్రస్టేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్ పోరు జరగనుంది. గురువారం జరిగిన రెండు సెమీఫైనల్స్‌లో 22వ సీడ్ రిబాకినా 7-6 (7/4), 6-3తో 2012, 2013 చాంపియన్, ప్రపంచ మాజీ నంబర్‌వన్ విక్టోరియా అజరెంకా (బెలారస్)ను ఓడించగా... ఐదో సీడ్ సబలెంకా 7-6 (7/1), 6-2తో అన్‌సీడెడ్ మగ్డా లీనెట్ (పోలాండ్)పై విజయం సాధించింది. కెరీర్‌లో 20వ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆడుతున్న సబలెంకాకిది తొలి గ్రాండ్‌స్లామ్ ఫైనల్ కానుండగా... రిబాకినా కెరీర్‌లో రెండో గ్రాండ్‌స్లామ్ టోర్నీలో తుది పోరుకు చేరింది.

అజరెంకాతో గంటా 41 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో రిబాకినా తొమ్మిది ఏస్‌లు, 30 విన్నర్స్ కొట్టి తన ఆధిపత్యాన్ని చాటుకుంది. మరోవైపు అజరెంకా మూడు ఏస్‌లు కొట్టి, ఆరు డబుల్ ఫాల్ట్‌లు, 27 అనవసర తప్పిదాలు చేసింది. అజరెంకా సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసిన రిబాకినా తన సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయింది.

తన కెరీర్‌లో 30వ ప్రయత్నంలో తొలిసారి గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీఫైనల్ చేరిన లీనెట్ కీలకపోరులో సబలెంకాకు సరైన సమాధానమివ్వలేకపోయింది. గంటా 33 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో లీనెట్ తొలి సెట్‌లో గట్టిపోటీనిచ్చినా రెండో సెట్‌లో డీలా పడింది. మ్యాచ్‌లో సబలెంకా ఆరు ఏస్‌లు సంధించడంతోపాటు ఏకంగా 33 విన్నర్స్ కొట్టింది. మూడుసార్లు లీనెట్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన సబలెంకా తన సర్వీస్‌ను ఒకసారి మాత్రమే చేజార్చుకుంది. గతంలో మూడుసార్లు గ్రాండ్‌స్లామ్ టోర్నీలలో సెమీఫైనల్ చేరి ఓడిపోయిన సబలెంకా నాలుగో ప్రయత్నంలో సఫలమై ఫైనల్ బెర్త్ దక్కించుకుంది. రిబాకినాతో గతంలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన సబలెంకా ఈసారీ గెలిస్తే తన కెరీర్‌లో తొలిసారి గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్‌ను సొంతం చేసుకుంటుంది.

నేడు జరిగే పురుషుల సింగిల్స్ సెమీఫైనల్స్‌లో ఖచనోవ్ (రష్యా)తో సిట్సిపాస్ (గ్రీస్)... టామీ పాల్ (అమెరికా)తో జొకోవిచ్ (సెర్బియా) ఆడతారు.

బాబర్ ఆజమ్‌కు ఐసీసీ పట్టం

'క్రికెటర్ ఆఫ్ ద ఇయర్'గా ఎంపిక



దుబాయ్: పాకిస్తాన్ కెప్టెన్ బాబర్ ఆజమ్ నిలకడైన ప్రదర్శనకు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) గుర్తింపు లభించింది. మూడు ఫార్మాట్‌లలో రాణించిన బాబర్‌ను ఐసీసీ 'క్రికెటర్ ఆఫ్ ద ఇయర్'గా ఎంపిక చేసింది. 2022లో ఓవరాల్‌గా 44 మ్యాచ్‌లు ఆడిన బాబర్ 54.12 సగటుతో 2598 పరుగులు చేశాడు. ఇందులో 8 సెంచరీలు, 17 అర్ధ సెంచరీలు ఉన్నాయి. దిగ్గజ క్రికెటర్ పేరిట ఏడాది ఉత్తమ ఆటగాడికి ఇచ్చే 'సర్ గార్‌ఫీల్డ్ సోబర్స్ ట్రోఫీ'ని బాబర్ అందుకుంటాడు. దీంతో పాటు బాబర్ 'వన్డే క్రికెటర్ ఆఫ్ ద ఇయర్'గా కూడా ఎంపిక కావడం విశేషం. వన్డే ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్‌గా కొనసాగుతున్న అతను... గత సంవత్సరం 9 వన్డేల్లో 84.87 సగటుతో 679 పరుగులు సాధించాడు.

2022 'టెస్టు క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' పురస్కారం ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్‌కు లభించింది. 15 టెస్టుల్లో స్టోక్స్ 870 పరుగులు చేసి 26 వికెట్లు కూడా పడగొట్టాడు. అతను సారథిగా వ్యవహరించిన 10 టెస్టుల్లో 9 మ్యాచ్‌లు ఇంగ్లండ్ గెలిచింది. ఇంగ్లండ్‌కే చెందిన మహిళా క్రికెటర్ నాట్ సివర్ 'ఉమెన్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డుతో పాటు 'ఉమెన్ వన్డే క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డుకు కూడా ఎంపికైంది. మూడు ఫార్మాట్‌లలో కలిపి ఆమె 1346 పరుగులు చేసి 22 వికెట్లు తీసింది.

జడేజాకు 7 వికెట్లు



చెన్నై: భారత జట్టులో పునరాగమనానికి సిద్ధమైన ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో తన సత్తాను ప్రదర్శించాడు. సౌరాష్ట్ర తరఫున ఆడుతున్న జడేజా బౌలింగ్ ధాటికి తమిళనాడు తమ రెండో ఇన్నింగ్స్‌లో 133 పరుగులకే కుప్పకూలింది. తొలి ఇన్నింగ్స్‌లో ఒకటే వికెట్ తీసిన జడేజా... రెండో ఇన్నింగ్స్‌లో 17.1 ఓవర్లు బౌలింగ్ చేసి 53 పరుగులకు 7 వికెట్లు పడగొట్టడం విశేషం. తొలి ఇన్నింగ్స్‌లో 132 పరుగుల ఆధిక్యం కోల్పోయిన సౌరాష్ట్ర ముందు 266 పరుగుల విజయలక్ష్యం నిలిచింది. మూడో రోజు ఆట ముగిసేసరికి వికెట్ నష్టానికి 4 పరుగులు చేసిన సౌరాష్ట్ర... గెలుపు కోసం శుక్రవారం మరో 262 పరుగులు చేయాల్సి ఉంది.

ఆంధ్ర అద్భుత విజయం

- చివరి మ్యాచ్‌లో అస్సాంపై ఇన్నింగ్స్ 95 పరుగులతో గెలుపు
- ముంబై, మహారాష్ట్ర మ్యాచ్ 'డ్రా' అయితే క్వార్టర్స్‌లో ఆంధ్ర


లలిత్ మోహన్


సాక్షి, విజయనగరం: రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్‌లో ఆంధ్ర జట్టు తమ లీగ్ దశను ఘనవిజయంతో ముగించింది. అస్సాం జట్టుతో మూడు రోజుల్లోనే ముగిసిన గ్రూప్ 'బి' చివరి లీగ్ మ్యాచ్‌లో హనుమ విహారి సారథ్యంలోని ఆంధ్ర జట్టు ఇన్నింగ్స్ 95 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ విజయంతో ఆంధ్ర జట్టుకు బోనస్ పాయింట్‌తో కలిపి ఏడు పాయింట్లు లభించాయి. ఆట మూడో రోజు ఓవర్‌నైట్ స్కోరు 62/5తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన అస్సాం మరో 91 పరుగులు జోడించి మిగతా ఐదు వికెట్లు కోల్పోయి 153 పరుగులవద్ద ఆలౌటైంది. స్పిన్నర్ లలిత్ మోహన్ 40 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టి ఆంధ్ర విజయంలో కీలకపాత్ర పోషించాడు. షోయబ్ ఖాన్, మాధవ్ రాయుడు రెండు వికెట్ల చొప్పున తీశారు. ఈ సీజన్‌లో ఆంధ్ర జట్టు ఏడు మ్యాచ్‌లు ఆడి మూడింటిలో గెలిచింది. మూడింటిలో ఓడి, మరో మ్యాచ్‌ను 'డ్రా' చేసుకుంది.

ఆంధ్ర క్వార్టర్స్ చేరాలంటే...

గ్రూప్ 'బి'లో తమ మ్యాచ్‌లను పూర్తి చేసుకున్న ఆంధ్ర జట్టు ప్రస్తుతం 26 పాయింట్లతో సౌరాష్ట్ర (26 పాయింట్లు)తో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉంది. మహారాష్ట్ర 25 పాయింట్లతో రెండో స్థానంలో, ముంబై 23 పాయింట్లతో మూడో స్థానంలో ఉన్నాయి. సౌరాష్ట్ర ఇప్పటికే క్వార్టర్ ఫైనల్ బెర్త్ ఖరారు చేసుకోగా... రెండో బెర్త్ కోసం ఆంధ్ర, మహారాష్ట్ర, ముంబై జట్లు రేసులో ఉన్నాయి. మహారాష్ట్ర, ముంబై మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో రెండు జట్లు తొలి ఇన్నింగ్స్‌లో 384 పరుగుల వద్దే ఆలౌట్ కావడంతో రెండు జట్లకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కలేదు. ఒకవేళ ఈరోజు మహారాష్ట్ర, ముంబై మ్యాచ్ ఫలితం తేలకుండా 'డ్రా' అయితే రెండు జట్లకు ఒక్కో పాయింట్ దక్కుతుంది. దాంతో మహారాష్ట్ర 26 పాయింట్లతో ఆంధ్రతో సమంగా నిలుస్తుంది. ముంబై జట్టు 24 పాయింట్లతో క్వార్టర్ ఫైనల్ రేసు నుంచి నిష్క్రమిస్తుంది. మహారాష్ట్ర, ఆంధ్ర మొత్తం పాయింట్లు సమమైతే సాధించిన బోనస్ పాయింట్ల విషయంలో మహారాష్ట్ర (0)ను వెనక్కి నెట్టి ఆంధ్ర (1) జట్టు క్వార్టర్ ఫైనల్ చేరుకుంటుంది. ఒకవేళ ముంబై, మహారాష్ట్ర మ్యాచ్‌లో ఫలితం వస్తే మాత్రం గెలిచిన జట్టు క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంటుంది.

ఓటమి దిశగా హైదరాబాద్

ఢిల్లీతో రంజీ ట్రోఫీ మ్యాచ్


ఆయుశ్

సాక్షి, హైదరాబాద్: ఏదైనా అద్భుతం జరిగితే తప్ప హైదరాబాద్ క్రికెట్ జట్టు వచ్చే ఏడాది రంజీ ట్రోఫీలో ప్లేట్ డివిజన్‌లో ఆడటం ఖాయమైంది. గ్రూప్ 'బి'లో భాగంగా ఢిల్లీ జట్టుతో ఉప్పల్ స్టేడియంలో జరుగుతున్న చివరి లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ ఓటమి దిశగా పయనిస్తోంది. ఆట మూడో రోజు ఓవర్‌నైట్ స్కోరు 223/5తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఢిల్లీ జట్టు 433 పరుగులకు ఆలౌటై 78 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన హైదరాబాద్ ఆట ముగిసే సమయానికి 5 వికెట్లు కోల్పోయి 90 పరుగులు చేసి కేవలం 12 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. ప్రస్తుతం హైదరాబాద్ కేవలం ఒక్క పాయింట్‌తో గ్రూప్ 'బి'లోనే కాకుండా ఎలైట్ లీగ్‌లోని నాలుగు గ్రూప్‌ల్లో కలిపి చివరి స్థానంలో ఉంది. నాగాలాండ్ జట్టు రెండు పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. ఎలైట్ గ్రూప్‌ల్లో ఓవరాల్‌గా చివరి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు వచ్చే సీజన్‌కు 'ప్లేట్' డివిజన్‌కు పడిపోతాయి.

ఆయుశ్ బదోని వీరోచిత సెంచరీ

మూడో రోజు ఆటలో ఒకదశలో ఢిల్లీ 277 పరుగులకు 8 వికెట్లు కోల్పోయి 300 పరుగుల్లోపే ఆలౌట్ అయ్యేలా కనిపించింది. అయితే ఆయుశ్ బదోని (191; 24 ఫోర్లు, 6 సిక్స్‌లు) అసాధారణరీతిలో ఆడి భారీ సెంచరీ సాధించాడు. పదో నంబర్ బ్యాటర్ హర్షిత్ రాణా (58; 8 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి ఆయుశ్ ఢిల్లీ జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని అందించాడు. ఆయుశ్, హర్షిత్ తొమ్మిదో వికెట్‌కు 122 పరుగులు జోడించారు. 'డబుల్ సెంచరీ'కి చేరువైన దశలో అనికేత్ రెడ్డి బౌలింగ్‌లో ఆయుశ్ బౌల్డయ్యాడు. ఆ తర్వాత దివిజ్ మెహ్రా (8 నాటౌట్)తో కలిసి హర్షిత్ చివరి వికెట్‌కు 34 పరుగులు జత చేశాడు. అజయ్‌దేవ్ గౌడ్ బౌలింగ్‌లో హర్షిత్ ఎల్బీగా వెనుదిరగడంతో ఢిల్లీ ఇన్నింగ్స్ ముగిసింది. హైదరాబాద్ బౌలర్లలో అనికేత్ రెడ్డి 143 పరుగులిచ్చి 5 వికెట్లు, అజయ్‌దేవ్ గౌడ్ 87 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టారు.

సాక్షి బిజినెస్
శుక్రవారం
27-1-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (బుధవారం ముగింపు)

	సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
	774	226
	60,205	17,892

విదేశీ సూచీలు (తెలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	11,415	△	106
డోజోన్స్	33,801	△	58
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,761	△	16
డాక్స్	15,133	△	51
షాంఘై (శుక్రవారం ముగింపు)	3,265	△	25
నికాయ్	27,363	▽	32


• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	80.85	82.52
£	బ్రిటన్ పౌండ్	87.51	90.58
€	యూరో	99.03	102.34
¥	జపాన్ ఎన్ (100)	61.61	63.63
AU$	ఆస్ట్రేలియా డాలర్	56.87	59.30
S$	సింగపూర్ డాలర్	60.99	63.00
SAR	సౌదీ రియాల్	20.76	22.43
UAE D	యూఏఈ దిర్హామ్	21.32	23.11
¥	చైనా యువాన్	10.90	12.98

ఎఫ్అండ్‌వోలో రిటైలర్లకు నష్టాలే

- 89 శాతం ట్రేడర్లకు షాక్
- 2021–22పై సెబీ నివేదిక



న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరం(2021–22) రిటైల్ ఇన్వెస్టర్లు చేపట్టిన ఈక్విటీ డెరివేటివ్(ఎఫ్ అండ్‌వో) లావాదేవీలలో 89 శాతం మందికి నష్టాలే మిగిలినట్లు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నివేదిక తాజాగా వెల్లడించింది. ప్రతీ 10 మంది రిటైల్ ఇన్వెస్టర్లలో 9 మంది ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ లావాదేవీలలో నష్టపోయినట్లు పేర్కొంది. దీంతో అటు స్టాక్ ఎక్స్ఛేంజీలు, ఇటు బ్రోకర్లు అదనపు రిస్కులపై సమాచారాన్ని అందించేలా త్వరలో మార్గదర్శకాలు జారీ చేయనున్నట్లు తెలియజేసింది. 2019–22 మధ్య కాలంలో టాప్–10 స్టాక్ బ్రోకర్ల వద్ద నమోదైన రిటైల్ ఇన్వెస్టర్ల గతేడాది ఎఫ్అండ్‌వో టర్నోవర్ ఆధారంగా అధ్యయనం చేపట్టింది. మొత్తం రిటైల్ క్లయింట్ల టర్నోవర్‌లో ఇది 67% వాటాకాగా.. 89 శాతం మందికి నష్టాలే మిగిలినట్లు వెల్లడించింది. అంటే ప్రతీ 10 మందిలో 9 మంది ఎఫ్అండ్‌వో లావాదేవీల ద్వారా సగటున రూ. 1.1 లక్షలు నష్టపోయినట్లు తెలియజేసింది. 90% యాక్టివ్ ట్రేడర్లను పరిగణిస్తే ఈ నష్టం రూ. 1.25 లక్షలుగా నమోదైనట్లు వెల్లడించింది. వెరసి డెరివేటివ్ విభాగంలో 11% మంది రిటైలర్లు మాత్రమే లాభాలు ఆర్జించారు. సగటున రూ. 1.5 లక్షల లాభం నమోదైంది.

ఆతిథ్య రంగానికి ఇన్‌ఫ్రా హోదా ఇవ్వాలి

- దీనివల్ల నిధుల లభ్యత పెరుగుతుంది
- హోటల్స్ యాజమాన్యాల డిమాండ్



న్యూఢిల్లీ: ఆతిథ్య రంగం (హోటల్స్) తమకు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (మౌలిక రంగం) హోదా ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. దీనివల్ల ఆర్‌బీఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లెండింగ్ నిబంధనల కింద దీర్ఘకాలానికి నిధులను పొందే వెసులుబాటు లభిస్తుందని పేర్కొంది. పర్యాటకం, హాస్పిటాలిటీకి (ఆతిథ్యం) పరిశ్రమ హోదాను పలు రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించినప్పటికీ.. కావాల్సిన ప్రోత్సాహకాలు, అధికారాలు ఈ రంగానికి రావడం లేదని ఫెడరేషన్ ఆఫ్ హోటల్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌హెచ్‌ఆర్‌ఏఐ) ఆవేదన వ్యక్తం చేసింది. ఆర్‌బీఐ నిబంధనల కింద దీర్ఘకాలిక రుణాలు పొందేందుకు పరిశ్రమకు భారత ప్రభుత్వం ద్వారా మౌలిక రంగం హోదా కావాలని ఎఫ్‌హెచ్‌ఆర్‌ఏఐ సెక్రటరీ జనరల్ జైసన్ చాకో పేర్కొన్నారు. దీనివల్ల నాణ్యమైన వసతి సదుపాయాల సరఫరా పెరుగుతుందని, దేశీ, అంతర్జాతీయ పర్యాటకుల డిమాండ్‌ను పెంచుతుందని చాకో అభిప్రాయపడ్డారు. పర్యాటకాన్ని జాతీయ ఏజెండాగా మార్చేందుకు రాజ్యాంగంలోని ఉమ్మడి జాబితాలో ఆతిథ్యాన్ని చేర్చాలని పరిశ్రమ కోరింది. దేశంలో ఆతిథ్య పరిశ్రమ సమగ్రాభివృద్ధికి వీలుగా ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులు, అమలుకు గాను కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య మెరుగైన సమన్వయం అవసరమని అభిప్రాయపడింది. వచ్చే బడ్జెట్‌లో కనీస ప్రత్యామ్నాయ పన్ను విషయంలో 2023 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు వెసులుబాటు కల్పించాలని పశ్చిమ భారత్ హోటల్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రదీప్ షెట్టీ డిమాండ్ చేశారు. దీనివల్ల పన్నుల భారం తగ్గి, హోటల్ పరిశ్రమకు కొంత ఉపశమనం లభిస్తుందన్నారు.

జ్యోతి ల్యాబ్స్ లాభం హైజంప్

క్యూ3లో రూ. 674 కోట్లు



న్యూఢిల్లీ: ఎఫ్‌ఎంసీజీ కంపెనీ జ్యోతీ ల్యాబ్స్ ఈ ఆర్థిక సంవత్సరం (2022–23) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్ (క్యూ3)లో నికర లాభం 77% పైగా జంప్‌చేసి రూ. 674 కోట్లను తాకింది. గతేడాది ఇదే కాలంలో రూ. 380 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 5,390 కోట్ల నుంచి రూ. 6,127 కోట్లకు ఎగసింది. అధిక కమోడిటీ ధరలు వినియోగాన్ని దెబ్బతీసినప్పటికీ పటిష్ట బిజినెస్‌ను సాధించగలిగినట్లు కంపెనీ పేర్కొంది. నూతన ప్రొడక్టులు, మెరుగైన పంపిణీ, కొత్త ప్రాంతాలకు విస్తరించడం వంటి వ్యూహాలను అమలు చేయడం ద్వారా మార్కెట్ వాటాను పెంచుకునే ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు కంపెనీ ఎండీ ఎంఆర్ జ్యోతి పేర్కొన్నారు.

హిండెన్‌బర్గ్ కుట్రను చట్టపరంగా ఎదుర్కొంటాం

అదానీ గ్రూప్ స్పష్టీకరణ



న్యూఢిల్లీ: ఖాతాల్లో, షేర్లలో అవకతవకలకు పాల్పడుతోందంటూ తమ గ్రూప్ సంస్థలపై అమెరికన్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ చేసిన ఆరోపణలపై అదానీ గ్రూప్ తీవ్రంగా స్పందించింది. తమ సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు హిండెన్‌బర్గ్ కుట్ర చేసిందని ఆరోపించింది. తాము తలపెట్టిన షేర్ల విక్రయాన్ని దెబ్బతీసేందుకే 'నిర్లక్ష్యపూరితంగా' వ్యవహరించినందుకు గాను హిండెన్‌బర్గ్‌ను చట్టపరంగా ఎదుర్కోనున్నట్లు వ్యాఖ్యానించింది. 'ఎటువంటి పరిశోధన లేకుండా హిండెన్‌బర్గ్ రూపొందించిన దురుద్దేశపూరితమైన నివేదిక .. అదానీ గ్రూప్, మా షేర్‌హోల్డర్లు, ఇన్వెస్టర్లపై ప్రతికూల ప్రభావం చూపింది. నివేదిక వల్ల భారతీయ స్టాక్ మార్కెట్లలో తలెత్తిన ఒడిదుడుకులు ఆందోళన కలిగించాయి' అని గ్రూప్ లీడ్ హెడ్ జతిన్ జలుంధ్‌వాలా ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్వెస్టర్లను, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు, అదానీ గ్రూప్ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు, ఫాలో ఆన్ ఇష్యూ (ఎఫ్‌పీవో)ను నాశనం చేసేందుకు ఒక విదేశీ సంస్థ నిర్లక్ష్యపూరితంగా వ్యవహరించిన తీరు తీవ్రంగా కలవరపర్చిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో భారత్, అమెరికా చట్టాల ప్రకారం హిండెన్‌బర్గ్‌పై తగు చర్యలు తీసుకునే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. అదానీ గ్రూప్ ఖాతాల్లో అవకతవకలు జరుగుతున్నాయంటూ హిండెన్‌బర్గ్ ఇచ్చిన నివేదికతో గ్రూప్ కంపెనీల షేర్లు బుధవారం భారీగా పతనమైన సంగతి తెలిసిందే. అదానీ గ్రూప్ రూ. 20,000 కోట్ల ఎఫ్‌పీవోకు వస్తున్న తరుణంలో నివేదిక విడుదల కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

'హల్వా' రుచులతో బడ్జెట్ షురూ!

- నార్త్‌బ్లాక్‌లో సంప్రదాయ వేడుక
- 2022లో 'కరోనా' బ్రేక్ తర్వాత తిరిగి ప్రారంభం

న్యూఢిల్లీ: ఆర్థికశాఖ నార్త్‌బ్లాక్ బేస్‌మెంట్‌లో సంప్రదాయ 'హల్వా రుచుల' ఆస్వాదనతో 2023–24 వార్షిక బడ్జెట్ ముద్రణ ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. ఫిబ్రవరి 1వ తేదీన లోక్‌సభలో తన ఐదవ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఈ కార్యక్రమంలో పాల్గొని లాంఛనంగా 'కడాయి'ని కదిలించారు. అనంతరం సీతారామన్‌సహా ఆర్థికశాఖలోని సీనియర్ అధికారులు, సిబ్బంది హల్వా రుచులను ఆస్వాదించారు. కేంద్ర బడ్జెట్‌లో తుది దశ అయిన ముద్రణ కార్యక్రమం ఈ సాంప్రదాయక వేడుకతో ప్రారంభమవుతుంది. అయితే 2022లో కరోనా కారణంగా ఈ కార్యక్రమం జరగలేదు. అధికారులు కేవలం స్వీట్స్ పంచుకోవడం ద్వారా గత ఏడాది బడ్జెట్ ముద్రణ ప్రక్రియను ప్రారంభించారు. గణతంత్ర దినోత్సవ వేడుకలూ కలిసివచ్చేట్లు గురువారం ఈ వేడుక జరగడం గమనార్హం. 'హల్వా' వేడుకలో, ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రెస్‌లో కూడా పర్యటించారు. సంబంధిత అధికారులకు ఆమె శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు ముద్రణ సన్నాహాలను సమీక్షించారు.



'హల్వా' వేడుక కార్యక్రమంలో ఆర్థిక శాఖ సహాయ మంత్రులు భగవత్ కిషన్‌రావ్ కరాడ్, పంకజ్ చౌదరి తదితర సీనియర్ అధికారులతో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

యాప్, వెబ్‌సైట్స్‌లో బడ్జెట్...

నార్త్ బ్లాక్ బేస్‌మెంట్‌లో బడ్జెట్ పత్రాలను ముద్రించడానికి సాంప్రదాయకంగా ఉపయోగించే ప్రింటింగ్ ప్రెస్ ఉంది. 1980 నుండి 2020 వరకు 40 సంవత్సరాల పాటు భారీ స్థాయిలో ఈ ముద్రణా కార్యక్రమం జరిగింది. అయితే అటు తర్వాత బడ్జెట్ డిజిటల్‌గా మారింది. గత రెండేళ్లలో కనీస అవసర పత్రాల ముద్రణ మాత్రమే జరుగుతోంది. బడ్జెట్ మొబైల్ యాప్ లేదా వెబ్‌సైట్‌లో పంపిణీ జరుగుతోంది. ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగం పూర్తయిన తర్వాత బడ్జెట్ పత్రాలు యాప్‌లో అందుబాటులో ఉంటాయని ఆర్థికశాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. యాప్ ద్విభాషా (ఇంగ్లీష్, హిందీ) అలాగే ఆండ్రాయిడ్, ఐఓఎస్ ప్లాట్‌ఫారమ్‌లలో అందుబాటులో ఉంటుంది. కేంద్ర బడ్జెట్ వెబ్ పోర్టల్ www.indiabudget.gov.in నుంచి కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆర్థికశాఖ పేర్కొంది.

హల్వా కార్యక్రమం ప్రత్యేకత ఇది..

కీలక హల్వా కార్యక్రమం అనంతరం బడ్జెట్ ముద్రణ ప్రక్రియతో సంబంధమున్న ముఖ్య అధికారులు అందరికీ... 'ఆర్థికమంత్రి పార్లమెంటులో బడ్జెట్‌ను సమర్పించేంతవరకూ' బాహ్య ప్రపంచంతో సంబంధాలు పూర్తిగా తెగిపోతాయి. ఈ కార్యక్రమం అనంతరం మంత్రులు, అతికొద్ది మంది ఉన్నత స్థాయి ఆర్థిక శాఖ అధికారులకు మాత్రమే ఇళ్లకు వెళ్లడానికి అనుమతి ఉంటుంది. మిగిలినవారికి కనీసం వారి ఆప్తులతో సైతం ఫోనులోగానీ, ఈ–మెయిల్‌తోగానీ మరే రకంగానూ మాట్లాడ్డానికి వీలుండదు. ఎంతో పకడ్బందీగా తయారయ్యే ఈ బడ్జెట్ గనక ముందే బయటకు తెలిసిపోతే... బడ్జెట్‌ను కొన్ని వర్గాలు ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది. కాబట్టి... బడ్జెట్ తయారీని అత్యంత గోప్యంగా ఉంచుతారు. డిజిటల్‌గా మారడం వల్ల ఉద్యోగుల 'లాక్–ఇన్ వ్యవధి' మునుపటి రెండు వారాల నుంచి ప్రస్తుతం కేవలం ఐదు రోజులకు తగ్గింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

27-1-2023	
విశాఖ	500–00
చిత్తూరు	513–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	590–00
విజయవాడ	590–00
రిటైల్ ధర (డజను)	72.00
26-1-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	490–00
వరంగల్	492–00
రిటైల్ ధర	5.50

సినిమా



• శైలేష్ కొలను, నవాజుద్దీన్, వెంకటేశ్, వెంకట్ బోయనపల్లి

సైంధవ్ షురూ

వెంకటేశ్ హీరోగా నటిస్తున్న 75వ చిత్రం 'సైంధవ్'. శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్నారు. వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని బుధవారం ప్రకటించి, గ్లింప్స్ విడుదల చేశారు. కాగా గురువారం ఈ సినిమా ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో జరిగింది. తొలి సన్నివేశానికి నిర్మాత 'దిల్' రాజు కెమెరా స్విచ్చాన్ చేయగా, డైరెక్టర్ కె. రాఘవేంద్రరావు క్లాప్ ఇచ్చారు. డైరెక్టర్ అనిల్ రావిపూడి గౌరవ దర్శకత్వం వహించగా, హీరోలు నాగచైతన్య, రానా, నిర్మాత సురేష్‌బాబు స్క్రిప్ట్‌ను మేకర్స్‌కి అందించారు. బాలీవుడ్ నటుడు నవాజుద్దీన్ సిద్ధిఖీ ఈ చిత్రంలో కీలక పాత్ర చేస్తున్నారు. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ త్వరలో ప్రారంభం కానుంది.

కొత్త జీవితానికి శ్రీకారం

జీవితంలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు శర్వానంద్. మైనేని రత్నగిరి వరప్రసాద్ రావు, వసుంధరా దేవి కుమారుడైన శర్వానంద్‌కు, హైకోర్టు లాయర్ పసునూరు మధుసూదన్ రెడ్డి, సుధారెడ్డిల కుమార్తె రక్షితా రెడ్డికి నిశ్చితార్థం జరిగింది. త్వరలోనే శర్వా, రక్షితల వివాహ తేదీని ప్రకటించనున్నారు. ''ఈ అందమైన అమ్మాయితో (రక్షితను ఉద్దేశించి) జీవితంలో ఓ పెద్ద అడుగు వేస్తున్నాను. మీ అందరి ఆశీర్వాదాలు కావాలి'' అన్నారు శర్వానంద్. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా చేస్తున్నారు రక్షిత. హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ హోటల్‌లోజరిగిన ఈ నిశ్చితార్థ వేడుకకు చిరంజీవి–సురేఖ, నాగార్జున– అమల, రామ్‌చరణ్–ఉపాసన, అఖిల్, రానా, సిద్ధార్థ్, నితిన్, శ్రీకాంత్, నవీన్, రవిశంకర్, నాగవంశీ, సుప్రియ, స్వప్నా దత్, వంశీ, విక్రమ్, క్రిష్, దేవ కట్టా, చందూ మొండేటి తదితర ప్రముఖులు హాజరై, శుభాకాంక్షలు తెలియజేశారు.



• శర్వానంద్, రక్షిత

యాక్షన్ రావణాసుర



• రవితేజ

రవితేజ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ థ్రిల్లర్ 'రావణాసుర'. ఈ చిత్రంలో అనూ ఇమ్మాన్యుయేల్, మేఘా ఆకాష్, ఫరియా అబ్దుల్లా, దక్షా నగార్కర్, పూజిత పొన్నాడ హీరోయిన్లుగా నటిస్తున్నారు. సుధీర్ వర్మ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో సుశాంత్ ఓ కీలక పాత్రధారి. ఆర్‌టీ టీమ్ వర్క్స్, అభిషేక్ పిక్చర్స్ పతాకాలపై రవితేజ, అభిషేక్ నామా నిర్మిస్తున్న సినిమా ఇది. జనవరి 26 (గురువారం) రవితేజ బర్త్ డే. ఈ సందర్భంగా 'రావణాసుర' సినిమా నుంచి కొత్త వీడియోను రిలీజ్ చేశారు. రెండు షేడ్స్ ఉన్న క్యారెక్టర్‌లో రవితేజ నటిస్తుండటం, అమ్మాయిలు హత్యకు గురికావడం వంటి అంశాలు విడుదలైన వీడియోలో ఉన్నాయి. రావు రమేష్, మురళీ శర్మ, సంపత్ రాజ్ కీలక పాత్రలు చేస్తున్న ఈ సినిమా ఏప్రిల్ 7న విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, భీమ్స్.

సోదర సోదరీమణులారా...



• కమల్, అపర్ణ

కమల్ కామరాజు, అపర్ణాదేవి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'సోదర సోదరీమణులారా...'. 'సిస్టర్స్ అండ్ బ్రదర్స్' అన్నది ట్యాగ్ లైన్. రఘుపతి రెడ్డిని దర్శకునిగా పరిచయం చేస్తూ, 9ఈఎం ఎంటర్‌టైన్మెంట్స్, ఐఆర్ మూవీస్ పతాకాలపై విజయ్ కుమార్ పైండ్ల నిర్మించారు. గురువారం ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ''హార్ట్ టచింగ్ ఫ్యామిలీ డ్రామాగా రూపొందిన చిత్రమిది. మదీన్ ఎస్కే చక్కని సంగీతం అందించారు.. ఈ చిత్రంలోని మూడు పాటలు సందర్భానుసారంగా వస్తాయి. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. వేసవిలో ఈ చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నాం'' అని చిత్రబృందం పేర్కొంది. 'బాహుబలి' ప్రభాకర్, పృథ్వీరాజ్ ఇతర పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి కెమెరా: మోహన్ చారి.

క్రైమ్ జీబ్రా

సత్యదేవ్, డాలీ ధనుంజయ హీరోలుగా నటిస్తున్న యాక్షన్ క్రైమ్ ఎంటర్‌టైనర్‌కు 'జీబ్రా' అనే టైటిల్‌ను ఫిక్స్ చేశారు. 'లక్ ఫేవర్స్ ది బ్రేవ్' అనేది ఉపశీర్షిక. ఈ చిత్రంలో ప్రియా భవానీ శంకర్, జెన్నిఫర్ పిచినెటో కథానాయికలుగా నటిస్తున్నారు. ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వంలో ఎస్ఎన్ రెడ్డి, బాలసుందరం, దినేష్ సుందరం నిర్మిస్తున్న చిత్రం ఇది. గురువారం ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించారు. ''తొలి షెడ్యూల్‌ను 50 రోజులపాటు జరిపాం. బ్యాలెన్స్ షూటింగ్‌ను హైదరాబాద్, కోల్‌కతా, ముంబై లొకేషన్స్‌లో ప్లాన్ చేశాం. 'కేజీఎఫ్' ఫేమ్ రవిబస్రూర్ సంగీతం ఈ సినిమాను మరో స్థాయికి తీసుకుని వెళుతుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానున్న ఈ చిత్రానికి కెమెరా– సహనిర్మాత: సుమన్ ప్రసార బాగే.



• సత్యదేవ్

హీరోగా సునీత తనయుడు

ప్రముఖ గాయని సునీత తనయుడు ఆకాష్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'సర్కారు నౌకరి'. గంగనమోని శేఖర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ద్వారా భావనా వళపండల్ హీరోయిన్‌గా పరిచయమవుతున్నారు. ఆర్కే టెలీ షో బ్యానర్‌పై దర్శకుడు కె. రాఘవేంద్రరావు నిర్మిస్తున్న ఈ చిత్రం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. దేవుని పటాలపై తీసిన ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత ప్రసాద్ నిమ్మకాయల కెమెరా స్విచ్చాన్ చేయగా, కె. రాఘవేంద్రరావు క్లాప్ ఇచ్చారు. మ్యాంగో మీడియా అధినేత, సునీత భర్త రామ్ వీరపనేని గౌరవ దర్శకత్వం వహించారు. అనంతరం హీరోహీరోయిన్లపై తీసిన సీన్‌కి గాయని సునీత కెమెరా స్విచ్చాన్ చేయగా, రాఘవేంద్రరావు క్లాప్ ఇవ్వడంతో పాటు దర్శకత్వం వహించారు. ఫిబ్రవరి 6న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఆరంభిస్తాం. ఈ చిత్రానికి సంగీతం: శాండిల్య, నిర్మాణం: ఆర్కే టెలీషో ప్రైవేట్ లిమిటెడ్, కెమెరా, రచన, దర్శకత్వం: గంగనమోని శేఖర్.



• సునీత, గంగనమోని శేఖర్, రాఘవేంద్రరావు, రామ్

ట్రైలర్ ఆసక్తిగా ఉంది - ఎన్. శంకర్

''కాలా బార్ బేరియన్' ట్రైలర్ ఆసక్తిగా ఉంది. ప్రజ్ఞన్ బాగా నటించాడని తెలుస్తోంది. ఈ సినిమా తెలుగులోనూ మంచి సక్సెస్ కావాలి'' అని దర్శకుడు ఎన్. శంకర్ అన్నారు. ప్రజ్ఞన్, వరుణ్ సింగ్ రాజ్‌పుత్, స్తుతి చయనిక ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'కాలా బార్ బేరియన్'(చాప్టర్ 1). జింటో చాకో శామ్యూల్ దర్శకత్వంలో పూణే ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందిన కొందరు విద్యార్థులు హిందీ, తెలుగులో ఈ చిత్రాన్ని నిర్మించారు. పరుపాటి శ్రీనివాస రెడ్డి ఈ మూవీని తెలుగులో విడుదల చేయనున్నారు. ఈ సినిమా ట్రైలర్‌ను ఎన్. శంకర్ రిలీజ్ చేశారు ''ఈ సినిమాలో ఒక సైకో, మల్టీ పర్సనాలిటీ... ఇలా చాలా వేరియషన్స్ ఉన్న పాత్రలు చేశాను'' అన్నారు ప్రజ్ఞన్.



• ప్రజ్ఞన్, ప్రసన్నకుమార్, ఎన్. శంకర్

నీ ఆలోచనలే నీ శత్రువులు

'పలాస 1978' ఫేమ్ అట్లూరి రక్షిత్ హీరోగా నటించిన తాజా చిత్రానికి 'ఆపరేషన్ రావణ్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. 'నీ ఆలోచనలే నీ శత్రువులు' అనేది ఉపశీర్షిక. వెంకట సత్య దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ న్యూ ఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్‌లో సంకీర్తన విపిన్ హీరోయిన్‌గా నటించారు. ధ్యాన్ అట్లూరి నిర్మించిన ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేగా – ఒమేగా విద్యా సంస్థల వైస్ చైర్‌పర్సన్ మాలతి విడుదల చేశారు. రాధికా శరత్‌కుమార్, చరణ్‌రాజ్, విద్యా సాగర్ నటించిన ఈ చిత్రానికి సంగీతం: శరవణ వాసుదేవన్, కెమెరా: నాని చమిడిశెట్టి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: శ్రీపాల్ చొల్లేటి.



• రక్షిత్

ఫైట్ మాస్టర్ జూడో రత్నం మృతి



సీనియర్ ఫైట్‌మాస్టర్ జూడో కేకే రత్నం (92) వృద్ధాప్యం కారణంగా గురువారం తుది శ్వాస విడిచారు. 1930 ఆగస్టు 8న జన్మించిన జూడో రత్నం 1959లో తమిళ చిత్రం 'తామరై కుళం' ద్వారా నటుడిగా ప్రయాణం ప్రారంభించారు. 1966లో 'వల్లవన్ ఒరువన్' చిత్రంతో ఫైట్ మాస్టర్‌గా మారారు. ఎంజీఆర్, శివాజీగణేశన్, జయశంకర్, రజనీకాంత్, కమల్‌హాసన్, విజయకాంత్ వంటి ప్రముఖ హీరోలకు ఫైట్‌మాస్టర్‌గా చేశారు. తమిళ, తెలుగు, హిందీ భాషల్లో దాదాపు 1500 చిత్రాలకుపైగా ఆయన ఫైట్ మాస్టర్‌గా చేశారు. సుందర్ సి. హీరోగా నటించిన 'తలై నగరం'(2006) జూడో రత్నం నటించిన చివరి చిత్రం. ఆ తర్వాత సినిమాలకు స్వస్తి చెప్పి స్వగ్రామం గుడియాత్తంలో స్థిరపడ్డారాయన. ప్రస్తుతం ప్రముఖ ఫైట్ మాస్టర్‌లుగా కొనసాగుతున్న జాగ్వార్ తంగం, సూపర్ సుబ్బరాయన్ వంటివారు జూడో రత్నం వద్ద పనిచేశారు.

ఆ విషయంలో అనుమానమే లేదు - సుహాస్

''రైటర్ పద్మభూషణ్' ఎగ్జయిటింగ్‌గా ఉంటుంది. క్లైమాక్స్‌కి అందరూ కనెక్ట్ అవుతారు. మా సినిమా చూసిన ప్రేక్షకులు మంచి సినిమా చేశారని అభినందిస్తారు. ఆ విషయంలో అనుమానమే లేదు'' అని హీరో సుహాస్ అన్నారు. షణ్ముఖ ప్రశాంత్ దర్శకత్వంలో సుహాస్, టీనా శిల్పరాజ్ జంటగా తెరకెక్కిన చిత్రం 'రైటర్ పద్మ భూషణ్'. జి. మనోహర్ సమర్పణలో అనురాగ్ రెడ్డి, శరత్ చంద్ర, చంద్రు మనోహర్ నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 3న రిలీజవుతోంది. సుహాస్ మాట్లాడుతూ– ''ఈ సినిమాలోని ట్విస్టులను ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తారు. ప్రస్తుతం గీతా ఆర్ట్స్ 2లో నేను నటిస్తున్న సినిమా పూర్తయింది. అలాగే 'ఆనందరావు అడ్వంచర్స్' అనే మరో సినిమా చేస్తున్నాను'' అన్నారు.



క్లుప్తంగా...



ఇటీవల నిశ్చితార్థమైన ముఖేశ్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ, రాధికా మర్చెంట్‌లు గురువారం తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్నారు.

చైర్మన్ శ్రావణిని అవమానించిన ఎమ్మెల్యేను సస్పెండ్ చేయాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల



సాక్షి, హైదరాబాద్: బీసీ సామాజిక వర్గానికి చెందిన జగిత్యాల మున్సిపల్ చైర్మన్ భోగ శ్రావణిని రాజకీయంగా వేధించి, అవమానపరిచిన ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను బీఆర్ఎస్ పార్టీ నుంచి వెంటనే సస్పెండ్ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఒక మహిళ మీడియా సమక్షంలో తనను వేధిస్తున్నారని కన్నీరు పెట్టుకోవడం బాధాకరమని, మహిళా చైర్మన్‌ను రాజకీయంగా అణచివేయడమంటే మొత్తం బీసీ సమాజాన్ని అణచివేయడమే అవుతుందని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ పార్టీలో బీసీ మహిళలు అడుగడుగునా అవమానాలు ఎదుర్కొంటున్నారని, ఇటీవల హైదరాబాద్‌లోని చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి కూడా స్థానిక ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి వేధింపులు తాళలేక కన్నీరు పెట్టుకుందని గుర్తుచేశారు. బీఆర్ఎస్ పార్టీలో ఉన్న ఎమ్మెల్యేలకు బీసీలను కించపర్చడం కొత్తేం కాదన్నారు. గతంలో బీసీ లేదు గోసీలేదని మంత్రి మల్లారెడ్డి అన్నారని, రిజర్వేషన్లు ఎత్తేయాలని జనగాం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి బహిరంగంగా వ్యాఖ్యానించారని జాజుల తెలిపారు. మరోవైపు బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు ఎత్తేస్తే దేనికీ పనికిరారని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సభలో మాట్లాడిన మాటలే నిదర్శనమన్నారు. ఇలాంటి వాటిపై సీఎం జోక్యం చేసుకోవాలని కోరారు. జగిత్యాల ఎమ్మెల్యేను వెంటనే సస్పెండ్ చేయాలని, బీసీలకు క్షమాపణ చెప్పాలని జాజుల డిమాండ్ చేశారు.

రథసప్తమికి టీఎస్ఆర్టీసీ 80 ప్రత్యేక బస్సులు

సాక్షి, హైదరాబాద్: రథసప్తమిని పురస్కరించుకొని ఈ నెల 28న భక్తుల సౌకర్యార్థం రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలకు 80 ప్రత్యేక బస్సులను నడపాలని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీఎస్ఆర్టీసీ) నిర్ణయించింది. హైదరాబాద్‌తో సహా జిల్లా కేంద్రాల నుంచి వేములవాడ, ధర్మపురి, యాదగిరిగుట్ట, మన్నెంకొండ, గూడెంకు ఈ ప్రత్యేక బస్సులను సంస్థ నడపనుంది. కరీంనగర్ నుంచి వేములవాడకు 10, ధర్మపురికి 10, నల్లగొండ నుంచి యాదగిరిగుట్టకు 10, మహబూబ్‌నగర్ నుంచి మన్నెంకొండకు 10, ఆదిలాబాద్ నుంచి గూడెంకు 5, హైదరాబాద్ కేపీహెచ్‌బీ నుంచి అనంతగిరికి 5 ప్రత్యేక బస్సులను టీఎస్ఆర్టీసీ ఏర్పాటు చేసింది. అలాగే, హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి, చిలుకూరు బాలాజీ, సికింద్రాబాద్ మహంకాళి, హిమాయత్‌నగర్ బాలాజీ దేవాలయం తదితర ఆలయాలకు ప్రధాన ప్రాంతాల నుంచి 20 ప్రత్యేక బస్సులను నడుపనుంది. భక్తుల రద్దీ మేరకు అవసరమైతే మరిన్ని బస్సులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించినట్లు టీఎస్ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు.



కంచర్ల యాదగిరిరెడ్డి

చాట్ జీపీటీ

మనిషిలాంటి మాటకారి


తెరపైకి సరికొత్త కృత్రిమ మేధ సాఫ్ట్‌వేర్

- కథల నుంచి కంప్యూటర్ ప్రోగ్రాముల దాకా రాసే సామర్థ్యం
- ప్రశ్నకు తగినట్టుగా అవసరమైన డేటా మాత్రమే ఇచ్చేలా అభివృద్ధి
- తప్పుడు సమాచారమిచ్చి ఉంటే.. 'సారీ'చెప్పే స్థాయిలో కృత్రిమ మేధ
- కొద్దిరోజుల కింద ఆన్‌లైన్‌లోకి తెచ్చిన ఓపెన్ ఏఐ సంస్థ
- ఇప్పటికీ పలు లోపాలు ఉన్నాయంటున్న నిపుణులు

ఆవకాయ పెట్టడం ఎలాగో అడిగితే గూగుల్ చెప్పగలదేమోగానీ..
సొంతంగా ఓ సినిమా కథ రాయమంటే మాత్రం చేతులెత్తేస్తుంది!
మనమేది అడిగినా అవసరమైనదానితో పాటు సంబంధం లేని ఎన్నో విషయాలనూ గూగుల్ ఇస్తుంది. ఎందుకంటే.. ఎక్కడెక్కడి సమాచారాన్నో సేకరించి ఇవ్వడమే గూగుల్ చేయగలిగిన పని.
సొంతంగా ఆలోచించడం దానికి సాధ్యం కాదు.

.. అయితే మారుతున్న టెక్నాలజీతో ఈ పరిస్థితి మారిపోతోంది. గత ఏడాది నవంబర్‌లో విడుదలైన కృత్రిమ మేధ సాఫ్ట్‌వేర్ 'చాట్ జీపీటీ'ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపుతోంది. అడిగిన సమాచారమేంటో కచ్చితంగా ఇస్తోంది. తప్పుగా అడిగితే తప్పనీ చెప్తోంది. విద్యార్థుల సందేహాలు తీరుస్తోంది. పిల్లల కథల నుంచి సాఫ్ట్‌వేర్ కోడ్‌ల దాకా రాసిపెడుతోంది. మరి ఏమిటీ చాట్ జీపీటీ? ఎలా పనిచేస్తుంది? ప్రయోజనం, ప్రభావాలేమిటి? ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ చూసినా ఇదే చర్చ.

అచ్చం మనిషిలా ఆలోచించి, స్పందించే కృత్రిమ మేధ కోసం జరుగుతున్న ప్రయత్నాల్లో చాట్ జీపీటీ తాజా అవతారం. గతేడాది నవంబర్‌లోనే విడుదలైంది. దీనిపై ఎవ రికీ హక్కుల్లే కపోవడం విశేషం. ఓపెన్ఏఐ.కామ్ అన్న వెబ్‌సైట్లో రిజిస్టర్ చేసుకుని మీరూ దీంతో సంభాషించవచ్చు. ఆవకాయ నుంచి అణ్వాస్త్రాల వరకు, స్టాక్ మార్కెట్ నుంచి ఖగోళపు అంచుల వరకూ ఏ అంశంపైనైనా మాట్లాడవచ్చు. సినిమా స్క్రిప్ట్ రాయాలని రామ్‌గోపాల్ వర్మ అడిగితే.. మూడే సెకన్లలో రాసేసింది. ఇదంతా బాగానే ఉందికానీ.. ఏమిటీ చాట్ జీపీటీ? ఒక్క ముక్కలో చెప్పాలంటే చాటింగ్ చేయగల కృత్రిమ మేధ రోబో అనాలి! కాకపోతే యాంత్రికంగా కాకుండా మనలా ఆలోచించి చేస్తుందన్నమాట. ఈ-కామర్స్ సహా వివిధ రంగాల కంపెనీల వెబ్‌సైట్లలోనూ చాటింగ్ కోసం రోబోలను వాడుతున్నారు. కానీ వాటి స్పందనలు చాలా పరిమితం. కంపెనీకి లేదా సైట్‌కు సంబంధించిన అంశాలపై మాత్రమే వివరాలు ఉంటాయి. చాట్ జీపీటీ దీనికి భిన్నం. ఇది చేయగల పనులకు అంతం లేదని చెప్పవచ్చు.



అంతా బాగున్నట్టేనా?

చాట్ జీపీటీకి కూడా ఎన్నో పరిమితులు ఉన్నాయి. ప్రస్తుతానికి ఇది ప్రయోగాత్మకంగా విడుదల చేసిన బీటా వెర్షన్ మాత్రమే. అయితే ఇన్‌స్ట్రక్ట్ జీపీటీ పేరుతో సిద్ధం చేసిన ఏఐ సాఫ్ట్‌వేర్‌ను ఆధునీకరించడంతో.. దీనిద్వారా వచ్చే ప్రమాదకరమైన, మోసపూరితమైన సమాధానాలు తగ్గాయని నిపుణులు చెప్తున్నారు. ఇక జాతి విద్వేషాలు, ఉగ్రవాదం వంటి అంశాలకు సంబంధించిన సమాచారం చాట్‌జీపీటీకి దక్కకుండా ఓపెన్ ఏఐ సంస్థ జాగ్రత్తలు తీసుకుంటోంది. చాట్ జీపీటీ కొన్నిసార్లు తిక్క సమాధానాలు ఇస్తుందని.. అది దాని పరిమితి అని చెప్తోంది. పైగా 2022 డిసెంబర్ వరకూ చాట్ జీపీటీ రాజకీయాలపై వ్యాఖ్యలు చేయకుండా సాఫ్ట్‌వేర్‌లోనే పరిమితులు చేశారు. మొత్తంగా చాట్ జీపీటీ ద్వారా తప్పుడు సమాచారం లేదా తప్పుదోవ పట్టించే సమాచారం అందకుండా చూసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

తప్పదారి పట్టిస్తే.. పట్టేస్తుంది

కంప్యూటర్ ప్రోగ్రాములు రాయడం, వాటిలోని తప్పులను (బగ్స్)ను గుర్తించి తొలగించడం కూడా చాట్ జీపీటీ చేయగలదు. సంగీతాన్ని పొందుపరచడం, టెలివిజన్ నాటకాలు, కల్పిత కథలు రాయడం వంటివీ అలవోకగా చేసేస్తుంది. విద్యార్థులకు వ్యాసాలు రాయడమే కాకుండా పరీక్షల్లో ప్రశ్నలకూ జవాబులిస్తుంది. పాటలు రాయడం, కంప్యూటర్ ఆపరేటింగ్ సిస్టమ్ డేటా అనలిటిక్స్‌ను తయారు చేయడం, చాట్ రూమ్‌ను రూపొందించడం, టిక్-టాక్-టో వంటి ఆటలాడటం కూడా చేయగలదు. ఇలాంటి పనులు ఇతర రోబోలతోగానీ, గూగుల్‌తో కానీ అస్సలు సాధ్యం కాదని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఈ చాట్‌జీపీటీ ఎంత తెలివైందంటే ఎప్పుడో వందల ఏళ్ల కింద అమెరికాను కనిపెట్టిన.. 'క్రిస్టోఫర్ కొలంబస్ 2015లో అమెరికాకు వచ్చినప్పుడు ఏమైందో చెప్పు'అని అడిగామనుకోండి. మనం పక్కదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్న విషయాన్ని గుర్తిస్తుంది. ప్రశ్నలో ఉన్నట్టుగా క్రిస్టోఫర్ ఒకవేళ 2015లో అమెరికాకు వచ్చి ఉంటే ఏమై ఉండేదో ఊహించుకుని సమాధానం సిద్ధం చేస్తుంది. కొలంబస్ గతంలో చేసిన పనులపై ఇప్పుడు మనుషులేం అనుకుంటున్నారో కూడా పరిగణించి సమాధానాలిస్తుంది.

ఈ మధ్య మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల మన దేశానికి వచ్చినప్పుడు ఓ ఆసక్తికరమైన ఘటన చోటు చేసుకుంది. చాట్ జీపీటీతో మాట్లాడుతూ ఆయన ఓ ప్రశ్న వేశారు. దక్షిణ భారతదేశంలో టిఫిన్ల రుచిని బట్టి ఓ జాబితా తయారు చేయమన్నారు. చాట్ జీపీటీ జాబితా తయారు చేసిందిగానీ.. అందులో బిర్యానీని కూడా చేర్చేసింది. ఆయనకు చిర్రెత్తుకొచ్చి.. బిర్యానీని టిఫిన్ అంటావా? నాలాంటి హైదరాబాదీని అవమానిస్తావా? అని కోపగించారు! మామూలు సాఫ్ట్‌వేర్ అయితే సంభాషణ ఇక్కడితో ఆగిపోయేదేమో! కానీ అది చాట్ జీపీటీ. వెంటనే 'సారీ'చెప్పేసింది. పొరబాటుపడ్డానని ఒప్పేసుకుంది.



సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ ఇటీవలే చాట్ జీపీటీతో చాటింగ్ చేశారు. చాలా అంశాలపై అవగాహన ఉన్న ఆయన.. త్వరగానే దాని సామర్థ్యాన్ని గుర్తించారు. వరుసగా కనీసం 17 ట్వీట్ల ద్వారా చాట్ జీపీటీతో జరిపిన సంభాషణలను దృష్టిలో ఉంచుకుని.. దాని ద్వారా భవిష్యత్తులో జరిగే పరిణామాలను అంచనా వేశారు.

చాట్ జీపీటీ విశేషాలు, ప్రత్యేకతలెన్నో..

నార్తర్న్ మిషిగన్ యూనివర్సిటీలో బుర్ఖా నిషేధంపై ఓ వ్యాసం రాయాల్సిందిగా ప్రొఫెసర్ ఆంటోని ఔమన్ విద్యార్థులను కోరారు. ఒక విద్యార్థి నుంచి విస్పష్టమైన ఆలోచనలతో సమాధానపత్రం అందింది. నిషేధం, నైతికత వంటి అంశాలన్నీ అందులో ఉన్నాయి. వ్యాసం అద్భుతంగా ఉందని అంటూనే.. సదరు విద్యార్థిని నువ్వే రాశావా అని ప్రొఫెసర్ నిలదీశారు. దీనితో అసలు విషయం బయటపడింది. ఆ వ్యాసం రాసింది చాట్ జీపీటీ. ఈ ఉదంతం తర్వాత వ్యాసరచన నిర్వహించే పద్ధతుల్లో మార్పులు చేయాలని ప్రొఫెసర్ నిర్ణయం తీసుకున్నారు. అమెరికాలోని పలు వర్సిటీల అధ్యాపకులుకూడా ఇదే ఆలోచనలో ఉండటం గమనార్హం.

ఓపెన్ ఏఐ కంపెనీ అభివృద్ధి చేసిన మరో కృత్రిమమేధ సాఫ్ట్‌వేర్ డాల్-ఈ2. కేవలం కొన్ని వివరాలిస్తే చాలు. ఇది వాటి ఆధారంగా బొమ్మలు గీస్తుంది.

చాట్ జీపీటీని పరిశీలించిన తర్వాత చాలా పాఠశాలల్లో చాట్‌బోట్లను క్లాస్‌రూమ్‌లలో వాడే విషయంపై మల్లగుల్లాలు పడుతున్నారు. సియాటెల్‌లోని కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నిషేధం విధించారు కూడా.

2900 కోట్ల డాలర్లు

ఓపెన్ఏఐ మార్కెట్ విలువ చాట్ జీపీటీ-3 విడుదల తరువాత ఏకంగా 2900 కోట్ల డాలర్లకు చేరుకుంది. త్వరలోనే మరింత మెరుగైన జీపీటీ-4ను విడుదల చేసే ఆలోచనలో కంపెనీ ఉంది.

గూగుల్ కూడా ల్యామ్డా పేరుతో ఓ చాట్‌బోట్‌ను తయారు చేయగా.. మైక్రోసాఫ్ట్ చాట్ జీపీటీనే తన అజ్యూర్ క్లౌడ్ సర్వర్‌లో ఏర్పాటు చేస్తోంది. అంతేకాకుండా ఓపెన్ ఏఐ కంపెనీలో సుమారు 1,000 కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమవుతోంది.

కొంతమంది విద్యార్థులు చాట్‌జీపీటీతో తమకు ఎంతో మేలు జరుగుతుందని విశ్వసిస్తున్నారు. కొంతమంది తమ సాఫ్ట్‌వేర్ కోడ్‌లలో తప్పులు వెతికేందుకు దీన్ని ఉపయోగిస్తున్నారు.

57.8 కోట్లు — టిక్‌టాక్‌లో చాట్‌జీపీటీ హ్యాష్‌ట్యాగ్‌కు నమోదైన వ్యూస్

ఎలా పని చేస్తుంది?

చిన్నపిల్లలకు మనం ఏ అంశమైనా ఎలా నేర్పిస్తాం? అక్షరాలైతే ఒకటికి వందసార్లు చెప్పించడం, రాయించడం చేస్తాం. అలాగే సమాచారమిచ్చి చదవడం అలవాటు చేస్తాం. చాట్‌జీపీటీ శిక్షణా ఇలాగే జరుగుతుంది. బులెటిన్ బోర్డ్ సిస్టమ్, పైథాన్ వంటి ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌లు, యూనిక్స్ ఆపరేటింగ్ సిస్టమ్‌లో వాడే 'మ్యాన్ పేజెస్'వంటివి ఉంటాయి. టీచర్ల మాదిరిగా కొంతమంది సాఫ్ట్‌వేర్ డెవలపర్లు చాట్‌జీపీటీకి పలు విషయాలను నేర్పించడంతోపాటు నేర్చుకుంటున్న విషయాలను గమనిస్తూ వాటిలో మార్పులు, చేర్పులు చేస్తూ వచ్చారు. పదే పదే రాయడం, లేదా వల్లె వేయడం ద్వారా మనం నేర్చుకున్నట్టే.. చాట్‌జీపీటీకి పలు విషయాలను నేర్పారు. చాట్‌జీపీటీ స్పందనలను ర్యాంక్ చేయడం ద్వారా అది తన తప్పొప్పులను తెలుసుకునేలా చేశారు. మంచి ర్యాంకులివ్వడం ద్వారా ఫలానా అంశం నేర్చుకుంటే లాభమన్న భావన కల్పించారు. దీనికితోడు చాట్‌జీపీటీ ఇంటర్నెట్ ద్వారా ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరించి తాను నేర్చుకున్న అంశాలకు మెరుగులు దిద్దుకుంటుంది. ఈ క్రమంలో మనం చాట్ జీపీటీతో జరిపిన సంభాషణలనూ వాడుకుంటుంది. చాట్ జీపీటీ స్పందనలకు మన అభిప్రాయాలను అప్‌వోట్ లేదా డౌన్‌వోట్ ద్వారా తెలియజేస్తే దాని ఆధారంగా తప్పులు దిద్దుకోవడమూ చేస్తుంది.

స్పౌజ్ టీచర్లకు గ్రీన్ సిగ్నల్

రిలీవ్ చేయాలని ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: స్పౌజ్ టీచర్లకు శుభవార్త. ఎట్టకేలకు వారి ఆకాంక్ష నెరవేరనుంది. జీవో 317 అమలులో భాగంగా వేర్వేరు ప్రాంతాలకు బదిలీ అయిన భార్యభర్తల(స్పౌజ్)ను ఒకచోటుకు చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో 615 మంది దంపతులకు ప్రయోజనం కలగనుంది. ఇప్పటికే అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులు స్పౌజ్ టీచర్లను ప్రస్తుతం పనిచేస్తున్న ప్రాంతాల నుంచి రిలీవ్ చేస్తూ ఆదేశాలిచ్చారు. గతేడాది పరస్పర బదిలీలకు ఆస్కారం ఇచ్చినప్పటికీ 13 జిల్లాల్లో బదిలీలను నిషేధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ కారణంగా ఏడాదికాలంగా ఈ సమస్య పరిష్కారం కాలేదు. విద్యాశాఖ తాజాగా రాష్ట్రవ్యాప్తంగా బదిలీలు చేపడుతున్న నేపథ్యంలో ఖాళీల భర్తీల్లో వారికి కూడా అవకాశం కల్పించేందుకు వీలు కల్పించింది. అయితే కొన్ని కారణాల రీత్యా సూర్యాపేట స్పౌజ్ విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సి ఉందని తెలిసింది.

30న ఢిల్లీలో కోదండరాం దీక్ష

విజయవంతం చేయాలని పల్లె వినయ్‌కుమార్ పిలుపు

నాగోలు: కృష్ణా నదీ జలాల పంపిణీలో న్యాయమైన వాటా సాధన కోసం తెలంగాణ జన సమితి (టీజేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం ఈ నెల 30న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద దీక్ష చేయనున్నారు. ఈ మేరకు ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పల్లె విజయ్ కుమార్ గురువారం విలేకరులకు తెలిపారు. దీక్షతోపాటు మరుసటిరోజు కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలన అభివృద్ధి వాస్తవాలపై నిర్వహించనున్న సెమినార్‌ను కూడా విజయవంతం చేయాలని ఆయన కోరారు. కొత్తపేట చౌరస్తాలో చలో ఢిల్లీ దీక్ష పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ... కృష్ణా జలాల సమాన వాటాకు, రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టుల సాధనకు కేంద్ర ప్రభుత్వం కృష్ణానదిపై ఇచ్చిన గెజిట్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి దంపతులు

బాసరలో ఘనంగా వసంత పంచమి వేడుకలు

అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు.. అమ్మవారి దర్శనానికి 4 గంటలు, అక్షరాభ్యాసానికి 8 గంటల సమయం
- గంటలతరబడి క్యూలైన్లలో ఉండాల్సి రావడంతో ఇబ్బందులు పడ్డ చిన్నారులు, వృద్ధులు



రాత్రి నుంచి క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

భైంసా: నిర్మల్ జిల్లా బాసరలో జ్ఞాన సరస్వతి అమ్మవారి జన్మదిన వేడుకలను వైభవంగా నిర్వహించారు. మాఘశుద్ధ పంచమి రోజున సరస్వతీక్షేత్రంలో వసంత పంచమి జరుపుకొన్నారు. బుధవారం అర్ధ రాత్రి దాటిన తర్వాత 2 గంటల నుంచే ఆలయంలో పూజలు జరిగాయి. గురువారం దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి అల్లోల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. సరస్వతి అమ్మవారి జన్మదినం సందర్భంగా వేలాదిగా భక్తులు బాసరకు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున అక్షరాభ్యాస పూజలు జరిపించారు. వెంకటేశ్వర సేవాసమితి సభ్యులు, అఖిల భారత పద్మశాలి సంఘంతోపాటు పలువురు వ్యక్తులు బాసర వచ్చిన భక్తులకు ఉచిత అన్నదానం ఏర్పాటు చేశారు. బాసర ట్రిపుల్‌ఐటీకి చెందిన 50 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా ఆలయంలో సేవలు అందించారు. ఉదయం నుంచి రాత్రి వరకు బాసర భక్తజనంతో కిటకిటలాడింది. అమ్మవారి దర్శనానికి 4 గంటలు, అక్షరాభ్యాసానికి ఏడు నుంచి ఎనిమిది గంటల సమయం పట్టింది. గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండాల్సి రావడంతో వృద్ధులు, చిన్న పిల్లలు ఇబ్బందిపడ్డారు.

జోగుళాంబదేవి నిజరూప దర్శనం



జోగుళాంబ అమ్మవారికి అభిషేకం

అలంపూర్/జోగుళాంబ శక్తిపీఠం: ఐదో శక్తిపీఠం జోగుళాంబ అమ్మవారి సహస్ర ఘటాభిషేకం జరిగింది. గద్వాల జిల్లా అలంపూర్ క్షేత్రంలో కొలువుదీరిన జోగుళాంబ అమ్మవారి 18వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు జోగుళాంబ మాత నిజరూప దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు అమ్మవారికి పాలు, పెరుగు, నెయ్యి, తేనె, చక్కెర, పండ్ల రసాలు, కుంకుమ, పసుపు, భస్మం, గంధం, పన్నీరుతో అభిషేకించారు. అనంతరం జోగుళాంబ మాతకు పట్టువస్త్రాలు, పూలమాలలు, నిమ్మకాయల హారాలు, స్వర్ణాభరణాలతో అలంకరించారు. ఉత్సవాల ముగింపులో భాగంగా జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి వారి శాంతి కల్యాణోత్సవం నిర్వహించారు.

పూర్వగిరిలో నేటి నుంచి అధ్యయనోత్సవాలు

31 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

యాదగిరిగుట్ట: యాదాద్రి అనుబంధ ఆలయమైన పాతగుట్ట (పూర్వగిరి) లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో శుక్రవారం నుంచి అధ్యయనోత్సవాలు నిర్వహించనున్నారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ అధ్యయనోత్సవాల్లో మొదటి రోజు 27వ తేదీ ఉదయం తిరుమంజనం, సాయంత్రం తొలక్కము, 28న తిరుమంజనం, సాయంత్రం దివ్య ప్రబంధ సేవాకాలం, 29న తిరుమంజనం, సాయంత్రం పరమపద ఉత్సవం, చివరి రోజున ఉదయం సూత్తాందారి చాత్మరా జరిపించనున్నట్లు ఆచార్యులు వెల్లడించారు. అదేవిధంగా ఆలయంలో ఈ నెల 31వ తేదీ నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. 31వ తేదీన ఉదయం స్వస్తివాచనంతో ఉత్సవాలు ప్రారంభమై 6వ తేదీన అష్టోత్తర శతఘటాభిషేకం, మహాదాశీర్వచనంతో ముగుస్తాయి. ఇక 3వ తేదీ రాత్రి జరిగే శ్రీస్వామి అమ్మవార్ల తిరు కల్యాణోత్సవంలో పాల్గొనే భక్తులు రూ.600 చెల్లించి టికెట్ పొందాలని ఆలయ అధికారులు సూచించారు.

ప్రారంభమైన సైదులు ఉర్సు

నేడు గంధోత్సవం



బాబా సమాధులపై గంధం సమర్పిస్తున్న ముజావర్ జాని

పాలకవీడు(సూర్యాపేట): సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలోని జాన్ పహాడ్ సైదులు దర్గా ఉర్సు గురువారం ప్రారంభమైంది. ఉదయం గుసుల్ షరీఫ్ సందర్భంగా బాబా సమాధులను శుభ్రం చేసి గంధం, దట్టీలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ముజావర్లు ప్రత్యేక ప్రార్థనలు చేయగా మహిళలు కొవ్వొత్తులు వెలిగించి వేడుకలకు శ్రీకారం చుట్టారు. ఉత్సవాలు మూడు రోజుల పాటు జరగనున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఇదిలా ఉండగా శుక్రవారం గంధోత్సవం నిర్వహించనున్నారు.

టీచర్ల బదిలీలకు రేపట్నుంచి దరఖాస్తులు

నేడు ఖాళీలు, సీనియారిటీ జాబితా

- మార్చి 4తో ప్రక్రియ పూర్తి
- అప్పీల్‌కు మరో 15 రోజుల గడువు
- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం
- హెచ్‌ఎంల బదిలీలకు సర్వం సిద్ధం



సాక్షి, హైదరాబాద్: టీచర్ల ఎదురుచూపులకు ఎట్టకేలకు తెరపడనుంది. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ శనివారం నుంచి మొదలుకానుంది. ఈ ప్రక్రియ మార్చి 4వ తేదీ వరకు కొనసాగనుంది. అధికారులు నేడు ఖాళీలు, సీనియారిటీ జాబితాను విడుదల చేయనున్నారు. అర్హులైన టీచర్లు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు గురువారం పాఠశాల విద్య డైరెక్టర్ దేవసేన ఉత్తర్వులు జారీచేశారు. బదిలీల కోసం వెబ్ కౌన్సెలింగ్, పదోన్నతులకు ప్రత్యక్ష కౌన్సెలింగ్ అనుసరిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇప్పటికే మల్టీజోన్ పరిధిలోకి వచ్చే ప్రధానోపాధ్యాయుల ఖాళీల వివరాలపై అధికారులు స్పష్టత ఇచ్చారు. జోన్-1లో 1,096, జోన్-2లో 906.. మొత్తం 2,002 పోస్టులు ఖాళీగా ఉన్నట్టు తేల్చారు. వీటిని స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతి కల్పించడం ద్వారా భర్తీ చేస్తారు. అయితే స్కూల్ అసిస్టెంట్ల ఖాళీల వివరాలు ప్రకటించాల్సి ఉంది. మరోవైపు స్కూల్ అసిస్టెంట్ల ఖాళీల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లకు పదోన్నతులు కల్పించడం ద్వారా 70 శాతం మేర భర్తీ చేస్తారు. టీచర్ల సీనియారిటీ జాబితా, ఖాళీల సంఖ్య విడుదలైతే దీనిపై స్పష్టత వస్తుంది. బదిలీల కోసం 28 నుంచి 30వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇందుకు సంబంధించిన టీచర్ల డాక్యుమెంట్లను హెచ్‌ఎంలు ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 2 వరకూ డీఈవోలకు సమర్పించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

పట్టణాల వైపే చూపు: ఎక్కువమంది టీచర్లు పట్టణాలు, నగర ప్రాంతాల వైపే మొగ్గుచూపుతున్నారు. ఇప్పటికే ఈ ప్రాంతాల్లో ఉన్నవాళ్లు సమీపంలోని స్కూళ్లను మొదటి అవకాశంగా ఎంచుకునే అవకాశముంది. బదిలీల్లో జీరో సర్వీసుకు అవకాశం ఇవ్వకపోవడం వల్ల ఇప్పటికే 317 జీవో కారణంగా స్థానికేతర జిల్లాల్లో మారుమూల ప్రాంతాలకు వెళ్లిన టీచర్లు బదిలీ అవకాశం కోల్పోతున్నారు. అప్పట్లో ఈ జీవో అమలు సందర్భంగా పట్టణ ప్రాంతాల్లో ఖాళీలను అధికారులు బ్లాక్ చేశారు. ప్రధానోపాధ్యాయులు సంబంధిత స్కూల్‌లో ఐదేళ్లకు బదులు 8 ఏళ్లు ఉంటేనే బదిలీకి అర్హులని మార్పు చేయడం వల్ల మరికొంత కాలం ఎక్కువమంది హెచ్‌ఎంలు తమ తమ స్థానాల్లోనే ఉండే అవకాశం ఏర్పడింది.

తప్పుడు ధ్రువపత్రాలతో తంటా

బదిలీల్లో దీర్ఘకాలిక వ్యాధులు, 70 శాతం వైకల్యం ఉన్న దివ్యాంగులకు ప్రాధాన్యం ఉంటుంది. జీవిత భాగస్వామి సహా కుటుంబంలో ఎవరికైనా కేన్సర్, బోన్ టీబీ, బైపాస్ సర్జరీ, కిడ్నీ, లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్, న్యూరో సర్జరీలతోపాటు కొత్తగా మస్క్యులర్ డిస్ట్రోఫీ, డయాలసిస్ ఉంటే బదిలీల్లో ప్రత్యేక కేటగిరీ ఇస్తున్నారు. దీన్ని అడ్డంపెట్టుకుని తప్పుడు ధ్రువీకరణపత్రాలతో కొంతమంది ప్రయోజనం పొందుతున్నారనే విమర్శలొస్తున్నాయి. 317 జీవో అమలులోనూ ఇలాంటి ఫిర్యాదులు అనేకం వచ్చాయి. దర్యాప్తులోనూ ఇవి నిజమని తేలాయి. ఈసారి దీన్ని కట్టడి చేయడానికి సరైన యంత్రాంగంలేదని పలువురు టీచర్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వాళ్లకు అన్యాయమేనా?

ఇప్పటికే 317 జీవో ద్వారా బలవంతంగా వేలాదిమంది టీచర్లను స్థానికేతరులుగా పంపారు. 13 జిల్లాల్లో బదిలీలు నిలిపివేసి స్పౌజ్‌లకు అన్యాయం చేశారు. రెండేళ్ల సర్వీస్ రూల్ తేవడం వల్ల మళ్లీ వాళ్లు నష్టపోవాల్సిందేనా? జీరో సర్వీస్ అమలు చేయాల్సిందే.

-ముత్యాల రవీందర్, టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి


బోగస్ సర్టిఫికెట్ల సంగతేంటి?

గతంలో జరిగిన బదిలీల్లో బోగస్ మెడికల్ సర్టిఫికెట్లతో ప్రయోజనం పొందినవారిపై ఫిర్యాదులొచ్చినా పట్టించుకోలేదు. వాళ్ల సంగతేంటో చెప్పాలి. ఇప్పుడూ అలాంటి పరిస్థితి రాకుండా జీవోలో ఎలాంటి కట్టడి మార్గాలూ సూచించలేదు. దీనివల్ల కొంతమంది నష్టపోయే ప్రమాదం ఉంది.

- చందూరి రాజిరెడ్డి టీఎస్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

రోబో బాబా

చింతపల్లి షిర్డీ సాయిబాబా ఆలయంలో ప్రతిష్ఠ



చింతపల్లి : నల్లగొండ జిల్లా చింతపల్లి షిర్డీ సాయిబాబా ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన రోబోటిక్ సాయిబాబా విగ్రహం ఆకట్టుకుంటోంది. రవీంద్ర ఆర్ట్స్ గ్యాలరీలో తయారు చేసిన ఈ విగ్రహాన్ని గురువారం ప్రతిష్ఠించారు. విగ్రహం మెడ నుంచి తల, నోరు కదులుతుండటంతో భక్తులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. నోటి నుంచి సూక్తులు వినిపిస్తున్నాయి. రెండు కళ్లు తెరవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రోబోటిక్ సాయిబాబాను దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ దర్శించుకున్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.